ఆంధ్రప్రదేశ్

సంక్రాంతి ప్రత్యేక సంచిక




పల్లె సంక్రాంతి చిత్రకారుడు : శ్రీ వెల్లటూరి పూర్ణానందశర్మ

సంక్రాంతి శుభాకాంక్షలు


Vol. IV
No. 3

* పుష్యము 1881 శక *

జనవరి
1960



గోదావరి ఉత్తర కాలువ ప్రాజెక్టు పనిలో ఒక భాగమైన 37 నెంబరు పంట కాలువత్రవ్వకం దృశ్యం. ఈ పనిని భారత సేవక్ సమాజ్, ఆదిలాబాద్ బ్రాంచివారు చేస్తున్నారు. హోంశాఖా మంత్రి శ్రీ మందుముల నరసింగరావు గారు పనిని చూస్తున్నారు.



ప్రజల విరాళం:— కృష్ణా జిల్లా గురజ గ్రామంలో శ్రీ అల్లూరి జానకి రామయ్య బోర్డు ఎలిమెంటరీ స్కూలు భవనం. స్థానిక అభివృద్ధి పనుల కార్యక్రమం క్రింద ఆ జిల్లాలో కట్టబడ్డ ఎలిమెంటరీ స్కూలు భవనాలలో ఇది అన్నిటి కంటె పెద్దది. ఈ భవన నిర్మాణానికి మొత్తం రూ. 25,000/-లు ఖర్చు కాగా అందుకుగాను ఆ గ్రామ కాపరస్తులు శ్రీ అల్లూరి జానకి రామయ్య రూ. 15,000/-లు విరాళంగా ఇచ్చారు. మిగిలిన సొమ్మును ఇప్పుడు రద్దు అయిన జిలా బోర్డు వారు, మోటూరు పంచాయతీ సమితి వారు, గురజ గ్రామ పంచాయతీ వారు భరించారు.

ఆంధ్ర ప్రదేశ్

సంపుటి 4 | జనవరి, 1960 | సంచిక 3

పుష్యం, శకము—1881

విషయసూచిక

1. ఆకాంక్ష (శ్రీ శ్రీనివాస సోదరులు, శతావధానులు) 1
2. ఆంధ్రము, తెలుఁగు, తెనుఁగు (డా. దివాకర్ల వేంకటావధాని ఎం.ఏ. (ఆనర్స్) పి.హెచ్.డి.) 3
3. హిమకామిని (శ్రీ దాశరథి) 8
4. శ్రీ సంజీవరెడ్డి (కవి సామ్రాట్ పైడిపాడి సుబ్బారామశాస్త్రి) 10
5. సంక్రాంతి ('మహతి') 11
6. ధన్యజీవి డాక్టరు పట్టాభి సీతారామయ్య పంతులు గారు (శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులు) 15
7. సంక్రాంతి సూర్యుడు ('కులపతి') 20
8. భద్రాచలం వంతెన 22
9. భోగి పండ్లు ('మధుర సంక్రాంతి' నుండి) 24
10. అల్లుడి ఔదార్యం (శ్రీ ఓగేటి శివరామ కృష్ణ) 25
11. సంక్రాంతి పేట (శ్రీ ఓలేటి శేషాచార్యులు) 36
12. గాజు పరిశ్రమ (శ్రీ ప్రతాప ప్రభాకరరావు) 38
13. పల్లెలలో సంక్రాంతి (శ్రీ ఉత్పల సత్యనారాయణాచార్య) 40
14. కలిసి బ్రతుకుదాం (నాటకం) (శ్రీ రెడ్డి చినవెంకటరెడ్డి) 41
15. ప్రశ్నోత్తరావళి 54
16. వచ్చె సంక్రాంతి (శ్రీ అన్నాప్రగడ శ్రీరామమూర్తి) 56
17. వలపుల తలపుల మలుపులు (హాస్య రచన) (శ్రీ యస్వీ. సీతారామమూర్తి) 58
18. విన్నపం ("మురారి") 62
19. పాలు పితకడం పాపమనుకునే గిరిజనులు 64
20. ప్రపంచ వ్యవసాయ ప్రదర్శన 72
21. జిల్లాల వార్తలు 79
22. ఆంధ్ర మహా విష్ణువు (శ్రీ జూలూరి హనుమంతరావు) 86
23. చిన్న మొత్తాల పొదుపు ఉద్యమం 96
24. ముఖ్య వార్తలు 99

చందా వివరాలు :

సంవత్సరానికి ... 2 రూపాయల 16 నయాపైసలు.

విడిప్రతి వెల ... 18 నయాపైసలు,

Edited and Published by the Director of Information and Public Relations, Hyderabad
Printed at: Vir Milap Press, Mukaramjahi Road, Hyderabad.

ముఖ చిత్రం:

"స్వర్ణ సంక్రాంతి": (చిత్రకారుడు: శ్రీ వెల్లటూరి పూర్ణానంద శర్మ)

ఆకాంక్ష

శ్రీ శ్రీనివాస సోదరులు, శతావధానులు

కొనలేని తల్లి దండ్రిని వేపుకొని తిని
పెద్ద చీరలు కొనిపించు కూతు,
రత్తవారింటికి నరుదెంచుటకె హిర
ణ్యాక్ష వరమ్ముల నడుగు నల్లు
డిరుగమ్మలందు హెచ్చరితనమ్ములకు నై
కొంప గుండము చేసికొనెడి తల్లి,
దొరకినంతవఱకు తోడుకొనుచు వచ్చి
మెప్పుకాల కెగిరి రొప్పు తండ్రి,
తర తరాలనుండి తలమోచికొని వచ్చు
చున్న అంధతమస మోసరిల్లి
చంద్రునెక్కి తిరుగు సంక్రాంతి పర్వాన
భావములను క్రాంతి పదసుపడుత!

౨

చలిని వెఱపించు బూచిగా చఱుముకొన్న
పంగనామాలతో హరీ రంగ యనుచు
విభుని పిడికెడు బియ్యపు వెలకు నమ్మ
దాసరులు లేని క్రాంతి మా ధరణి కనుత!

౩

ఎఱ్ఱ బంతిలోని యెల పౌరుషము గ్రోలి
పచ్చ బంతిలోని పసిడి విలిచి
తెల్ల బంతిలోని తేట కీర్తులు చిమ్మి
బంతి తీర్చుగాక బాలజగతి!

అప్పనెల్లెంద్రు వాకిళులందు తీర్చి
నట్టి సంక్రాంతి రథములయందు నిలిచి
సవ్యసాచులై భీములై చక్రపాణు
లై యువకు లూగెదరుగాక యరులకనుల!

పాలు వలచు రాజనాల పొంగలి తోడ
ఉక్కు రైతు కండ నిక్కవొడిచి
కుండ పొదుగు గోవు కంచాలు పితుక సం
క్రాంతి "క్రాంతి క్రాంతి క్రాంతి" యగుత!

ఓం క్రాంతిః క్రాంతిః క్రాంతిః.

పట్టుదలను ధర్మాచరణముతో సంబంధించిన ముఖ్యాంశములలోఁజూపుట యావశ్యకమును, కర్తవ్యమునే యైనను, ధర్మ భంగములేని యల్పాంశములలోఁ జూపుట యనాదరణీయమును, మూర్ఖత్వమును నగును. నీతికిని, సత్యమునకును, ధర్మమునకును భంగము కలుగని విషయములలో నెల్లను బహుజనవాక్యమును మాననీయముగా భావించి తదనుసారముగా పెద్దలకు లోఁబడి నడచుట కర్తవ్యము.

— కందుకూరి వీరేశలింగము.

ఆంధ్రము, తెలుఁగు, తెనుఁగు

డా. దివాకర్ల వేంకటావధాని, ఎం.ఏ. (ఆనర్సు) పి.హెచ్.డి.

ఆంధ్రము తెలుఁగు తెనుఁగు అను పదము లిప్పుడు జాతి దేశ భాషాపరములై పర్యాయ పదములుగా వాడఁబడుచున్నవి. వీనిలో మిక్కిలి ప్రాచీనమైనది ఆంధ్ర పదము ఇది మొదట 'అంధ్ర' అను రూపముతో వాడఁబడి, తరువాత క్రమముగా 'ఆంధ్ర' అను రూపమును బొందినది. ప్రాచీన శాసనము లందును, తాళ పత్ర గ్రంథము లందును అంధ్ర అను రూపమే కానిపించును. అంధ్రి పదము మొదట ఋగ్వేదమునకుఁ జెందిన ఐతరేయ బ్రాహ్మణములో జాతిపరముగా వాడఁబడినది. విశ్వామిత్రుడు తన యాజ్ఞనతిక్రమించిన యేఁబది మంది కుమారులను దత్సంతతి వారార్యభూముల సరిహద్దులలో నివసించునట్లు శాసించెననియు, వారే ఆంధ్రులు, పుండ్రులు, శబరులు, పుళిందులు. మూతిబులు అను నామములతో నార్యసీమల కావల (ఉదంత్యాః) నివసించిరనియు నందుఁ జెప్పఁబడినది. సంస్కృత రామాయణ భారతములందాంధ్రుల ప్రశంస కలదు. మౌర్య చంద్రగుప్తుని యాస్థానమునకు గ్రీకు రాయబారిగా వచ్చిన మెగస్తనీసప్పుడాంధ్రులు బల విషయమున మౌర్యుల తరువాత నెన్నఁదగియుండిరని చెప్పియున్నాడు. అశోకుని శాసనము లందును, బౌద్ధ జాతకము లందును ఆంధ్రుల నామము కనఁబడుచున్నది. శ్రీకృష్ణుఁడు చాణూరుఁడను నాంధ్ర మల్లుని సంహరించినట్లు భాగవత హరివంశములు తెల్పుచున్నవి. ప్లినీ యను చరిత్రకారుడు (క్రీ. శ. 77) ఆందర జాతిని బేర్కొని తద్బలసంపదను వర్ణించియున్నాడు. క్రీ. శ. ఆఱవ శతాబ్ది యందలి మౌఖరి వంశజుల యొక శాసనములో ఆంధ్ర పదము జాతిపరముగా వాడఁబడినది. ఈ విధముగా నాంధ్ర జాతిని బేర్కొన్న శాసనము లింకను బెక్కు గలవు.

క్రీస్తు పూర్వ మాంధ్ర పదమునకు దేశీ పదముగా వ్యవహార ముండినట్లు కానరాదు. శాతవాహన రాజు లాంధ్రులయ్యుఁ దాము పాలించిన దేశ మాంధ్ర దేశమని యెచ్చటను బేర్కొని యుండలేదు. క్రీ. శ. 151వ సంవత్సరము నందలి రుద్రదాముని జూనాగడ్ శాసనములో "దక్షిణాపథ పతేః శాతకర్ణేః" అను పదములున్నవి. ఇందు శాతకర్ణి పాలించిన దాంధ్ర దేశమని కాక దక్షిణాపథమని చెప్పఁబడియున్నది. పల్లవ యువరాజైన శివస్కంధవర్మ క్రీ. శ. 234వ సంవత్సరమున వేయించిన మైదవోలు తామ్ర శాసనములో ''అంధాపథీయో గామో విరిపరమ్" అను నెడ ఆంధ్రపథ ప్రశంస కలదు. ఆంధ్ర పదము దేశీపరముగా వాడఁబడినందుకు మొదటి శాసనాధారమీ మైదవోలు శాసనమే. క్రీ. శ. 340వ సంవత్సరమున మల్లదేవ నందివర్మ వేయించిన దాన శాసనములో (ఆంధ్ర మండలే ద్వాదశ గ్రామ సంపాదిత సప్తార్ధ లక్ష విషయాధి పతేః) అనుచోట ఆంధ్ర మండలము పేర్కొనబడినది. క్రీ.శ. 7వ శతాబ్దిలో భారతదేశమున సంచరించిన చైనా యాత్రికుఁడగు హ్యూన్ త్సాంగ్ వ్రాఁతలందాంధ్ర దేశ ప్రసక్తికూడఁ గొంత యున్నది. క్రీ. శ. పండ్రెండవ శతాబ్దిలో సముద్ర తీరస్థాంధ్రదేశమును బాలించిన వెలనాటి దుర్జయులు వేయించిన యొక శాసనములో నాంధ్ర విషయము "పూర్వాంభోనిధి కాలహస్తి శిఖరి శ్రీమన్మహేంద్రాచల శ్రీశైలములచే" వలయీకృతమని యప్పటి యాంధ్ర దేశపు టెల్లలు చెప్పఁబడినవి. తరువాత ఆంధ్ర దేశమను మాట శాసనములందే కాక గ్రంథములందును బలుచోట్ల వాడఁబడినది. ఈరీతిగా నాంధ్ర పదము మొదట జాతిపరముగాను, తరువాత దేశీ పరము గాను బ్రచారమున కెక్కినట్లు కనఁబడుచున్నది.

ఆంధ్ర పదమును భాషాపరముగా వాడినవారిలో నన్నయభట్టే ప్రథముఁడని తోచుచున్నది. నందపూడి శాసనమున

నతఁడు నారాయణభట్టును ప్రశంసించుచు "యస్సంస్కృత కర్ణాట ప్రాకృత పైశాచి కాంధ్ర భాషాసు. కవిరాజ శేఖర ఇతి ప్రథితః సుకవిత్వ విభవేన" అని యాతడాంధ్ర భాషలో గూడ మహాకవి యని చెప్పియుండెను. ఔత్తరాహులగు నాంధ్రులు దక్షిణమునందలి కృష్ణా, గోదావరీ మధ్యప్రదేశము నాక్రమించి యంతకుఁ బూర్వమునుండియు నట నివసించు చుండిన దేశీయులతోఁ గలసి వారి భాష నవలంబించి దానికిని వారికిని ఆ దేశమునకును గూడ నాంధ్ర యను తమ నామము నొసంగియుందురు. జాతి సంస్కృతి ప్రాభవములలోఁ దమకుండిన ప్రాధాన్యమునుఁబట్టి వారట్లు చేయుట కవకాశము కలిగియుండును. వారు వచ్చుటకు ముందచ్చట నివసించుచుండిన దేశీయులు నాగులు, తెలాంగులు మొదలగు ద్రావిడ జాతులకుఁ జెందినవారై యుందురని తలంప వచ్చును. ఆంధ్రులును, దెనుగు దేశమున మొదటనుండియు నివసించుచుండిన తెలుఁగు వారును గలసి యాంధ్రులైరనియు, నాంధ్ర భాష మాత్రమట్లు రెండుభాషల కలయికచే నేర్పడినది కాదనియు, తెనుఁగే యాంధ్రులీ దేశము నాక్రమించుకొన్న పిమ్మట నాంధ్రమని పిలువఁబడెననియు శ్రీ కోరాడ రామకృష్ణయ్య గారు తెల్పియున్నారు.

ఆంధ్రమునకుఁ బర్యాయములుగా వాడఁబడుచున్న తెనుఁగు తెలుఁగు శబ్దము లెప్పటి నుండి ప్రచారము వడసి యుండెనో చెప్పుటకుఁ దగిన యాధారములు లేవు. ఆ రెంటిలో నొకటి మఱియొక దాని నుండి యేర్పడిన రూపాంతర మనుటకు మాత్రము సందేహింప నవసరము లేదు. నన్నయ భారతావతారికలో "తెనుఁగున రచియింపు మధిక ధీయుక్తి మెయిన్" అనియు, "తెనుంగు నన్ మహాభారత సంహితారచన బంధురుఁడయ్యె" ననియు తెనుఁగు శబ్దమునే వాడి యున్నాడు. ఇందు మొదటిది 'న' కారము ప్రాసగాఁ గల కంద పద్యము నందలి భాగము. తిక్కనయు "తెనుఁగు భాష నినిర్మింపఁ దివురుటరయ" అని తెనుఁగు శబ్దమునే వాడెను తిక్కనకుఁ బూర్వుఁడైన పాల్కురికి సోమనాథుఁడును, అతనికి సమకాలికుఁడైన కేతనయు, అర్వాచీనుఁడైన (1650) బాల సరస్వతియు తెలుఁగు శబ్దమును ప్రాస ఘటితముగా వాడి యుండిరి. ఇట్లు తెలుఁగు తెనుఁగు శబ్దములు రెండును గ్రంథస్థములై గోచరించుచున్నను నన్నయ వాడిన మొదటి ప్రయోగమున నకార మధ్యమమైన రూపమే కనవచ్చుచున్నది. క్రీ.శ. 985 నుండి 1014 వఱకును పాలించిన రాజరాజునకు తెలింగకులకాల యను బిరుదముండెననియు, నతని సేనాని 'తెలుంగర్'ను ఓడించెననియు, క్రీ. శ. 1012 నందలి యొక శాసనము వలనఁ దెలియుచున్నది. ఇంద్రవర్మ పుర్లీ తామ్ర శాసనమున (1027) "తిరిలింగ వాస్తవ్యాయ" అని తిరిలింగ పదము వాడఁబడినది. ఈ శబ్దము దేశవాచి యనియు, త్రిలింగ శబ్ద భవమనియు శాసన సంపాదకులు తెల్పియున్నారు. తరువాత తెలింగ, తిలింగ తైలంగ శబ్దములు పెక్కు శాసనములలోఁ గానిపించుచున్నవి. దీనిని బట్టి క్రీ. శ. 10,11. శతాబ్దులలో తెలుఁగు శబ్దము వాడుకలో నుండెననుట స్పష్టము. నన్నయ తిక్కనలు తెనుఁగు శబ్దమునే కాక ఆంధ్ర* శబ్దమును గూడ వాడి యుండుటయు, క్రీ. శ. 10వ శతాబ్ది యందలి శాసనములందే కాక సోమనాథ కేతనల గ్రంథము లందును తెలుఁగు శబ్దము వాడఁబడి యుండుటయుఁ జూడనంతకుఁ బూర్వము నుండియు నీ మూడు శబ్దములు సమానార్థకములుగా వ్యవహరింపఁ బడుచుండెనని వ్యక్తమగుచున్నది.

తెలుఁగు తెనుఁగు శబ్దముల పౌర్వాపర్యమును గూర్చి వాదోపవాదము లున్నవి. టోలెమీ (క్రీ.శ. 150) త్రిగ్లిప్టాను (Triglypton) త్రిలింగాను (Trilingan) పదములను వాడి యుండెను. టిబెట్టు దేశీయుఁడైన తారానాథుఁడను గ్రంథకర్త తెలుఁగు దేశమును త్రిలింగ మనియు, కళింగపురము రాజధానిగాఁ గల కళింగ మా దేశమునందలి యొక భాగమనియుఁ దెల్పి యుండినట్లును. పురాణ కాలమునకు ముందే టోలెమీ గారికి త్రిలింగ నామము పరిచితమై యుండినట్లును కాల్డ్వెల్ గారు తమ ద్రావిడ భాషా వ్యాకరణమున వ్రాసి యున్నారు. "త్రిలింగ రూపేణ్యవసన్ త్రిద్వారేషు గణైర్వృతః" అను బ్రహ్మాండ పురాణ శ్లోకమున త్రిలింగ పదము వాడఁబడినది. దీనినిబట్టి త్రిలింగ పదము క్రీస్తుశకారంభము నుండియు వ్యవహారమందుండి నట్లూహింప వచ్చును. కీ. శే. కొమ

* యస్సంస్కృత కర్ణాట ప్రాకృత పైశాచికాంధ్ర భాషాసు. (నన్న)
ఆంధ్ర కవిత్వ విశారదుండు; ఆంధ్రావళి మోదముంబొరయ. (తిక్కన)

ట్టాజు వేంకట లక్ష్మణరావు పంతులు గారు తమ వ్యాసావళిలో తెలుఁగు శబ్దమే ప్రాచీనమనియు, దాని ననుసరించి త్రిలింగ శబ్దము కృతకముగా సృజింపఁబడినదనియు నొక యభిప్రాయమును వ్యక్తము చేసియున్నారు. చూడాగ్రామము, కమలాకర నగరము, తామ్రపురి మొదలగు నామములు వరుసగా ముడియనూరు, కొలను, చేంబ్రోలు అను తెలుఁగు నామములకు సంస్కృతీకరణములుగా నేర్పడిన సంగతి సుప్రసిద్ధమే. అందుచే తెలుఁగు శబ్దమే ప్రాచీనమనియు నందుండి తెనుఁగు శబ్దము కాలక్రమమున నేర్పడెననియు నీ వాదముయొక్క సారాంశము. లకార నకారములు రెండు నేకస్థానజన్యములగుటచే (దంత్యములు) పరస్పరము మార్పు చెందుటలో వైరుధ్యము లేదు. లాంగల శబ్దమునుండి నాఁగలి శబ్దమేర్పడుట యిందుకు నిదర్శనము.

తెనుఁగు తెలుఁగు శబ్దములలో తెనుఁగే నన్నయ భారతావతారికలో మొదట గ్రంథస్థమై కానవచ్చుటచే నదియే ప్రాచీన రూపమనియు నందుండి తరువాత తెలుఁగు శబ్ద మేర్పడెననియుఁ గొందఱి యభిప్రాయము. మునుఁగు మునగ, పనవు, సెనగ, శబ్దములు వరుసగా ములుగు, ములగ పలవు, సెలగ అను రూపములతో వ్యవహరింపఁబడు చుండుట యీ యభిప్రాయమునకు బలము చేకూర్చు చున్నది. కాని శ్రీ వజ్ఝల చిన సీతారామస్వామి శాస్త్రిగారు "కొందఱు తెనుఁగు శబ్దము మొదటిదని వేఱు విధముగ వ్రాయుదురు. లకారము నకారముగఁ బరిణమించును గాని లకారము నకారముగ బరిణమింప" దని వ్రాసియున్నారు. వ్యవహారమున లకారము నకారముగ మాఱిన రూపములు కలవనుటకుఁ బై రూపములే తార్కాణము. టోలెమీ గారి త్రిలింగాన్ రూపము నంగీకరించిన పక్షమున త్రిలింగ, తెలుగు పదములే ప్రాచీన తరములని చెప్పవలసి వచ్చును.

వ్యుత్పత్తి

ఆంధ్ర శబ్దమునకు సిద్ధమైన యుత్పత్తి యేదియు లేదు. ''అంధాన్ రాతి ఇతి అంధ్రః—ఆంధ్ర ఏవ ఆంధ్రః" అని కొందఱు చెప్పుదురు. ఈ యుత్పత్తి వ్యాకరణానుగుణము గనే యున్నది. కాని యర్థము మాత్రము సమంజసముగా లేదు. అంధులను (కు) ఇచ్చు వాఁడని దాని కర్థము. బౌద్ధ జాతకములలో అంధకులను భిక్షుల ప్రశంస కలదు. అందుచే అంధ—ఆంధ్ర శబ్దములకేదో సంబంధ మున్నదని తోఁచును. కాని యీ సంబంధ మెట్టిదో చెప్పజాలము.

మగధ దేశాధిపతియైన బలిరాజు కుమారు లార్వురిలో నొకఁడైన యాంధ్రుఁడును, దత్సోదరులును తమతమ పేర్లతో నాఱు విషయముల నేర్పరచిన వృత్తాంతము భాగవతములో నున్నది. ఆంధ్రుఁడేర్పరచిన విషయమాంధ్రము; తద్విషయ వాసు లాంధ్రులు.

తెలుఁగు శబ్దము త్రిలింగ శబ్దభవమని పలువురి తలంపు. శ్రీశైల కాళేశ్వర, ద్రాక్షారామ క్షేత్రము లందలి లింగములకుఁ ద్రిలింగములని పేరనియు, నా త్రిలింగము లుండుటచే నాంధ్రదేశము త్రిలింగాఖ్య మయ్యెననియు దాని తద్భవము తెలుఁగనియు, దానినే తరువాతఁ గొందఱు తెనుఁగందు రనియు అప్పకవి తెల్పియున్నాడు. (క్రీ.శ 1650). క్రీ.శ. 14వ శతాబ్ది యందలి విన్నకోట పెద్దనకూడ కావ్యాలంకార చూడామణిలో పై విధముగనే వ్రాసియున్నాఁడు తమ నాటికిఁ బ్రసిద్ధమైయుండిన వ్యవహారమును బట్టి వారట్లు చెప్పియుందురు. అప్పకవికి సుమారు 350 ఏండ్లు పూర్వ మందుండిన విద్యానాథుఁడు త్రిలింగముల వలననే యీ దేశమునకు త్రిలింగ సంజ్ఞ కలిగినదని ''యైర్ధత్తె త్రిభిరేష యాతి మహతీం ఖ్యాతిం త్రిలింగాఖ్యయా'' అను శ్లోకమునఁ జెప్పియున్నాడు. కాకతీయులు శైవ మతావలంబకు లగుటచే వారి యాస్థానమందుండిన విద్యానాథుఁడు త్రిలింగ పదమునకుఁ బైని సుచివిన విధమున శివలింగ పరముగా నర్థము చెప్పియుండును. అంతకు బూర్వమే క్రీ. శ. 1169లో వెలనాటి వీర రాజేంద్రుని శాసనమున ఆంధ్రదేశమునకు తూర్పు సముద్రము, కాళహస్తి, శ్రీశైలము, మహేంద్రాచలము ఎల్లలుగాఁ జెప్పఁబడినవి. ఇంద్రవర్మ పుర్లీ తామ్రశాసనము (1027) ''త్రిలింగ వాస్తవ్యాయ'' అను పదము వాడఁబడినదని ముందే చెప్పఁబడినది. త్రిలింగ శబ్దము నుండి తెలుఁగు శబ్ద మేర్పడుట కెట్టి యాక్షేపమును లేదు.

తెలుఁగు శబ్దమే ప్రాచీన తరమనియు నది సంస్కృతీకరింపఁబడి త్రిలింగ మయ్యెననియు శ్రీ లక్ష్మణరావు పంతులు గారు తెల్పిన యభిప్రాయ మింతకు ముందు సూచింపఁబడినది. తెలుఁగు శబ్దము వ్యవహారమున నుండగాఁ బండితులు దానికిని త్రిలింగ శబ్దమునకును గల రూప సామ్యమును బట్టియు, నాంధ్ర దేశమునఁ బైని పేర్కొనఁబడిన మూఁడు లింగములు నుండుటనుఁ బట్టియు నేర్పుతో దానికి

త్రిలింగమని సంస్కృతీకరణము కావించిరని వారి యభిప్రాయము. అప్పుడు తెలుఁగు శబ్దమునకు వేఱు వ్యుత్పత్తి నూహింపవలయును.

కీ. శే. చిలుకూరి వీరభద్రరావు గారును, ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహ కర్తలైన శ్రీ కల్లూరి వేంకట నారాయణరావు గారును తెళుగన్నడ పదమే తెలుగయ్యెనని తెల్పి యున్నారు. తెళుగన్నడ మనగాఁ దేటయైన కన్నడమని యర్థము. ఇందేక దేశమగు తెళుగును గ్రహించి యందుండి "తేటయైన భాష" యను నర్థమున తెలుగను రూప మేర్పడినదని చెప్పవచ్చును గాని యప్పుడు మిగిలిన "అన్నడ" అను భాగమేమైనదను ప్రశ్నకుఁ గాని, దాని యర్థమేమను ప్రశ్నకుఁ గాని సమాధాన ముండదు. తెళుగన్నడ శబ్దమునుండి భాషా శాస్త్రము ననుసరించి తెలుఁగు శబ్దము పుట్టుట కవకాశము లేదు. మఱియు దానిని తెళు + కన్నడ మనునట్లుగా విడఁదీయుట యుక్తము కాని తెళుగు + అన్నడ మని విడఁదీయుట యుక్తము కాదు. అదిగాక యీ శబ్దము వాడుకలో నుండె ననుటకుఁ బ్రమాణములు కానరావు. అందుచే నీ వ్యుత్పత్తి నంగీకరించుటకు వీలు లేదు.

కొందఱు (కాంబెలు దొర) తెలుఁగు శబ్దమును త్రికళింగ శబ్దము నుండి వ్యుత్పన్నము కావించుచున్నారు. గోదావరీ మహా నదులకు మధ్య నున్న ప్రదేశము పూర్వము కళింగ సంజ్ఞితమై యుండెను. పాండురంగ మహాత్మ్యమున పిఠాపురము కళింగ దేశాభరణమని వర్ణింపఁ బడినది. ఈ కళింగ మప్పుడు ఉత్తర కళింగము (ఉత్కళింగము) మధ్య కళింగము (మధు కళింగము) దక్షిణ కళింగము అని మూఁడు భాగములుగా నుండెను. అందుచే దీనికి త్రికళింగ నామము సార్థకమాయెను. క్రీ. శ. 11 వ శతాబ్దియందలి శాసనములలో "త్రికళింగాధిపతేః, త్రికళింగ మండల పతేః" అను ప్రయోగములు కనవచ్చుచున్నవి. త్రికళింగ-తిఅలింగ-తెలింగ-తెలుఁగు అని త్రికళింగ శబ్దము నుండి తెలుఁగు శబ్దమును బరిణమింపఁజేయవచ్చును. ఈ వ్యుత్పత్తి సహజమును, భాషా శాస్త్ర సమ్మతమునై యలరారుచున్నది.

కళింగులకును, తెలింగులకును జిరకాలము నుండి సన్నిహిత సంబంధమున్నది. కళింగ శబ్దమునకు జలమయ ప్రదేశమను నర్థ మిప్పటికిని వాడుకలో నున్నది. సాగర తీరమున నివసించు వారగుటచే కళింగులకాపేరు కలిగియుండును. జల తీరమున నుండినవారు కళింగులు కాఁగా (స్థల) తలమున (పీఠ భూమియందు) నుండినవారు తలింగులు, లేక తిలింగులు అయి యుందురు. అదే క్రమముగా తెలుంగు అను రూపము నొంది యుండును.

తెలుఁగు శబ్దమున కింకను మఱికొన్ని వ్యుత్పత్తులు కలవు. తెళి (తేట) అగునది తెళుంగు. కన్నడమున తెలుఁగు తేలె అను సామెతయున్నది. ** తిలలవంటి గోవు లెచ్చట వేలకొలఁదిగ నుండునో యా దేశమునకు తిలగు అను పేరని ఆంధ్ర వాఙ్మయ చరిత్ర సంగ్రహమునఁ దెల్పఁబడి యున్నవి. తేల్ నదీ ప్రాంతమునఁ జాల కాల ముండిన వారగుటచే తెలుఁగువారి కాపేరు కల్గినదని కొందఱి యభిప్రాయము. కాని వారచ్చట నివసించిరనుటకీ నామ సామ్యము తప్ప మఱే యాధారములును గనిపించుట లేదు.

తేనె అగు భాష తెనుగని గ్రియర్సను గారు తెల్పి యున్నారు. పండిత మండలిలోఁ గూడ నీ వ్యుత్పత్తి ప్రచారమున నున్నది. కాని దీనికిఁ బ్రమాణము కనఁబడదు. తెనుఁగు తియ్యని భాష యైనందున శబ్ద సామ్యమును బట్టి పండితులా వ్యుత్పత్తిని గల్పించి యుందురు.

త్రిలింగ శబ్దము నుండి తెలుఁగు పుట్టినట్లే త్రినగ శబ్దము నుండి తెనుఁగు పుట్టి యుండునని కొందఱి యభిప్రాయము. శ్రీ శైల, కాళహస్తి, మహేంద్రా చలములు మూఁడును ఆ త్రినగములనియు, వానివలన నాంధ్ర దేశమునకు త్రినగ మను పేరు గలిగె ననియు, అందుండి తెనుఁగు శబ్ద మేర్పడె ననియు వారి యుద్దేశము. తెనుఁగు శబ్దమునఁ గల యర్ధ బిందువునకు మూలము త్రినగ శబ్దమున లేమిచే నా రెండింటికి జన్య జనక భావము నంగీకరించుటకు వీలు లేదని కొందఱందురు కాని యీ విషయ మంత యాక్షేపణీయము కాదు. ప్రకృతి యనుస్వార విరహితమైనను వికృతిలో నది కానుపించుటకు వేసఁగి (వైశాఖ) మున్నగు శబ్దములు నిదర్శనములు. కాని యీ త్రినగ శబ్దమునకు ప్రాచీన వ్యవహారము కాని ప్రామాణ్యముగాని యంతగాఁ గానిపింపదు.

** "సరసాస్తిలవద్గావో యత్ర సంతి సహస్రశః స దేశ స్తిలగుర్నామ."

కొందఱు తెనుఁగులోని తెన్ దక్షిణ దిగ్వాచి యనియు దక్షిణా పథమున నున్న ప్రజల కందుచే తెనుఁగు వారనియు దేశమునకు తెనుఁగు దేశమనియుఁ బేరు లేర్పడెననియుఁ జెప్పుదురు. దిక్కులను బట్టి దేశములకు సంజ్ఞ లేర్పడు చుండుట సహజమే. కుడగు. (పడమట నున్న దేశము) మొదలైన దేశనామము లిట్లేర్పడినవే. ద్రావిడ భాషలందు దక్షిణమునకు 'తెన్' అని పేరు. తెనుఁగున దానికిప్పుడు వ్యస్తముగాఁ బ్రయోగము లేకున్నను తెమ్మెర మున్నగు సమస్త పదములందది వాడఁబడుచునే యున్నది. తెనుఁగు దేశమునకు దక్షిణా పథమను వ్యవహారము శాసనములలో గనవచ్చుచున్నది. (దక్షిణా పథపతేః శాతకర్ణేః). మన మిప్పుడు తమిళులను దక్షిణాది వారని యందుము. వారును దాము దక్షిణాది వారమేయని చెప్పుకొందురు. మొదట సార్థక సంజ్ఞలుగా నేర్పడిన మాటలు కాలక్రమమున సంజ్ఞా మాత్రములై వాడఁబడుట పలుచోట్లఁ గానవచ్చు చుండును. ఆంధ్రులుత్తరము నుండి వచ్చినవా రగుటచే తెనుఁగుదేశము నందలి జనులను దక్షిణపు వారని పిల్చి యుందురనియు, నది సామాన్య సంజ్ఞగాఁ బరిణమించి తెనుఁగు వారను పర్యాయపద మేర్పడుటకుఁ దావొసంగె ననియు నూహింపవచ్చును. ఈ విధముగా తెనుఁగు శబ్దము "తెన్" అను దక్షిణ దిగ్వాచకమునుండి యేర్పడినదనుట సమంజసము గానే యున్నది.

తెలుఁగు, తెనుఁగు శబ్దములకు బహుళములైన వ్యుత్పత్తులు చెప్పుట కవకాశమున్నను తెలుఁగు శబ్దము త్రిలింగ, త్రికళింగ శబ్దములలో నొక దానినుండి యేర్పడెననియు, తెనుఁగు దక్షిణార్థకమైన తెన్ నుండి యేర్పడెననియు జెప్పుట యుక్తముగా నుండును.

తాత్సారం చెయ్యడంవల్ల మనం కష్టపడి సంపాదించిన స్వాతంత్ర్యం సార్థకం కాజాలదు. స్వాతంత్ర్య పోరాట సమయంలో మనం ఎలాంటి పట్టుదలతో ధైర్య సాహసాలతో వ్యవహరించామో ఇప్పుడూ అలాంటి పట్టుదలతోనే వళ్లు వంచి పాటు పడవలసి వున్నది. వైవిధ్యంలో ఏకత్వాన్ని చూడడం మన చిరంతన సంప్రదాయాలలో ఒకటి. ఈ సంప్రదాయం నేటికీ అవిచ్ఛిన్నంగా పాటింపబడుతున్నదని భారతీయులందరు సకల ప్రపంచానికీ ఋజువు చేయవలసి వున్నది. మనం సాధించుకున్న స్వాతంత్ర్యాన్ని సుస్థిరం చేసుకోవలసి వున్నది. ఈ సమయంలో రాష్ట్రీయ తత్వాలకు, కుల, మత, వర్గ సంకుచిత భావాలకు తావులేదు. అందరూ కలిసి దేశ పునర్నిర్మాణ కార్యకలాపాలను పూర్తి చెయ్యడానికి సంయుక్తంగా పాటుపడవలసి వున్నది.

— సర్దార్ పటేల్.

హిమకామిని

— శ్రీ దాశరథి

వెచ్చదనమ్ము కోరి పరువెత్తితి నీకయి, కాని పారగా
జొచ్చె హిమాంబు వాహినులు సుందరి ! నీ వరుదెంచు దారిలో!
విచ్చిన గుండెతో ప్రణయ వీధి ప్రయాణము సేయు నాకు నీ
విచ్చెదవే భయంకర హిమేరిత బాహుయుగోప గూహమున్ ?

పొగమంచు ముసుగుతో నగుపించు నీలోన
సెగలు పొగలెక్కడివొ చెప్పవే హిమరాజ్ఞి !

మనసులోపల వెచ్చదనముతో నరుదెంచి
నినుకవుంగిట చేర్చికొని శీతునిన్ ద్రుంచి
చలికి చలి కలిగించి వడకించి వడకించి
తెలిమంచుతో చేసితిని కృశాను విపంచి

గగన గంగ దాటి వచ్చి సొగసు కనులలోన విచ్చి
కనక తామరసప్రసూన గణము జగతి కొసగె కాంతి.
గగన సౌధములను దాటి కమనీయ వినీల జలద
పంక్తి వచ్చినీ చికుర గ్రామమ్మున విడిసె శాంతి
రెల్లో అంచలో కలువలో మల్లెలో మొల్లలో సకలమొ
చేలములై చోలములై చేరనీ శరీరమ్మున

ఎడదనే మలచి ఉయ్యేల సేసితిని తెమ్మ
అడుగులకు బాధ కానటుల పరతు ఉరమ్ము
నడిచిరా నడిచిరా అడుగు తడబడకుండ
విడిచిరా హేమంత విషభరనిశాంతమ్ము

నీవుంచిన ఆకురాల నేరదు తరుశాఖ నుండి
నీవు తాకినంత మ్రోడు నిలుచును సూనముల నిండి,
మ్రోడు వడిన ఎడదలపై మోపుము నీపాదతలము
నేడే నవవసంతాల నిండునులే భూమి తలము

పొంగిన నీ ఎదయే నా కంగార శకటిక
క్రుంగిన నా హృదయమునకు కుసుమ బాణగుళిక
హిమాచలము సిగ మీదకు నెగసి పోదులేవే
ఉమాపతిని దరిసించెగ నురికి యురికి రావే

అతి కోమల బాలభాను హస్తమ్ముల నాశ్రయించి
నుతిమెత్తని నీ బాహుల శోభలపై చూపులుంచి
మంచు సంకెలలనుతెగ్గించి మహీధ్ర శీర్షముల వంచి
గీతమ్ములు వాయించెద వీతి హోత్రనవవిపంచి
నెలలు నెలలు వెనుక బడిన అల వసంతుడతిరయమున
పరుగు వెట్టి అరుగుదెంచి పాట వినగ మ్రోయింతును

పెదవులనే చీలగొట్టి హృదయాలను చెదరగొట్టి
బెదరగొట్టి అదరగొట్టి బెంబేలొనరించి నట్టి
హేమంతుడు పరుగు పెట్ట నిదిగో నే వాయింతును

కదలనట్టి మహీజమును మెదలనట్టి మహీధ్రమును
నటుల వోలె నాగులవలె నానాగతి నాడింతును
మూగవోయి కూర్చుండిన మొండి వడిన బండరాళ్ల
గొంతు ముడులు విప్పి విప్పి సంతసమున పాడింతును

హిమరమణీ ! భవద్ హృదయమే నవయౌవన వహ్ని కీలికా
సముదయ మోహనంబయిన చాలు హిమ ప్రళయంబులే సమూ
హములయి వచ్చివచ్చి నను హత్య యొనర్పగ జూచినన్ సఖా
గ్రమున జయింతు నీకటి కరంబున నుండిన చాలు, పైదలీ !

పవిత్రత, పరిశుద్ధత మనలక్ష్యమై వుండాలి; అయితే నిరర్థకమూ, నిర్జీవమూ, నిరాశాజనకమైన పవిత్రత కాదు.

— అరవింద మహర్షి

శ్రీ సంజీవరెడ్డి

కవిసామ్రాట్ పైడిపాటి సుబ్బరామశాస్త్రి.

నీలం సంజీవ
రెడ్డీ! తుమ్మి
పూలను శివపూజ
చేసితి వోయీ,

ప్రప్రథమ ఆంధ్ర
ప్రదేశ ప్రధాని!

నాగార్జునుని పేర
సాగరమ్ము వచ్చె
భూదేవి నిను చూచి
పొంగిపోయేనోయ్

తనపైన కదలు సం
తానమ్ము చూచి
నిజముగ దీవించు
బెజవాడ కృష్ణ

చిన్నవయసున, తల
కున్నది భారమ్ము
సాగిపోయేవోయి
జాగరూకతను.

నీ కార్యదీక్షయె
నీకు పెనురక్ష
పెద్దలందున భక్తి
వృద్ధికి భిక్ష.

నీలం సంజీవ
రెడ్డీ! తుమ్మి
పూలను శివపూజ
చేసితివోయీ.

ఆంధ్ర ప్రదేశ్

సంక్రాంతి

— "మహతి"

వైజ్ఞానిక పురోభివృద్ధి కారణంగా యిప్పుడన్ని విషయాల లోను మనకి ఆదర్శంగా చెప్పబడుతూన్న పాశ్చాత్య దేశాల సంస్కృతికీ, మన సంస్కృతికీ మధ్య ప్రాధమిక మయిన భేదమున్నది. పాశ్చాత్య సంస్కృతికి పుట్టినిల్లు పట్టణాలు కాగా భారతీయ సంస్కృతికి జన్మస్థలం తపో వనాలు. వారి సంస్కృతిలో మానవుడు ప్రకృతి కంటె భిన్నుడనని, అధికుడనని, తదధినేతనని భావిస్తాడు. మన సంస్కృతిలో ఈ అహంభావం లేదు. మానవుడు ప్రకృతితో తాదాత్మ్యాన్ని పొందుతాడు. అతనికి అది చుట్టము. చెలి. దైవము. సూర్య చంద్రులు పాశ్చాత్యులకు వలె మనకు కేవలం గ్రహాలు కాదు, ప్రత్యక్ష దైవాలు.

ద్విజులు సూర్యోదయ సమయాన సుస్నాతులై ఆ మహా భాగునకు అర్ఘ్యమిచ్చే ఆచారం మనకి వుంది. ప్రతినిత్యము ఆరంభంలో ఆయన రథానికి మందేహులనే రాక్షసులు అడ్డు పడుతారట. మంత్ర ప్రోక్షిత జలంతో వారిని నిర్వీర్యులను జేసి సూర్య రథ గమనానికి దోహదం చేయటానికే యీ అర్ఘ్య ప్రదానం యేర్పడిందిట. ఎంత పొద్దెక్కినా ముఖ ప్రక్షాళనానంతరం సూర్య భగవానునికి నమస్కరించనిదే ముద్దయెత్తే రైతులు ఆంధ్ర దేశంలో అరుదు. తెలుగు నాట ఆబాల గోపాలాన్నీ ఆనంద డోలికలనూచే సంక్రాంతి సప్తాశ్వుని గమనానికి సంబంధించిన పండుగ.


జ్యోతిశ్శాస్త్రం ప్రకారం సూర్యుడు క్రమంగా ప్రతి నెలా మేషాది పన్నెండు నక్షత్ర రాసులందు ప్రవేశిస్తూ వుంటాడు.

'తత్ర మేషాదిషు ద్వాదశరాశిషు క్రమేణ సంచరితః
సూర్యస్యపూర్వ స్మాద్రాశే రుత్తర రాశౌ
సంక్రమణ ప్రవేశః సంక్రాంతిః'

అనగా సూర్యుడు క్రమముగా మేషాది ద్వాదశ రాసు లందు సంచరించుచు పూర్వ రాశి నుండి ఉత్తర దిక్కు మొగమై ప్రవేశించునప్పుడు సంక్రాంతి.

అని జయసింహ కల్ప ద్రుమంలో పేర్కొనబడినట్టు కీ. శే. సురవరం ప్రతాపరెడ్డి గారు తమ 'హిందువుల పండుగలు' లో వివరించారు. ఈ సంక్రమణాలలో విశిష్ట మయినది మకర సంక్రమణం. మన ఉత్తరాయణ, దక్షి ణాయనాలు సౌరచలన సూచితాలనే విషయం సర్వ విదితం. ఆదిత్యుడు జ్యేష్ఠంలో కర్కాటక సంక్రమణమాది ఆరు నెలలు దక్షిణాభిముఖుడై చరించి మకర రాశిలో ప్రవే శిస్తాడు. తదాది తిరిగి కర్కాటక సంక్రమణం వరకు ఆరు నెలలు ఉత్తరాభిముఖుడై చరిస్తాడు. ఆయన యీ దక్షిణాభి ముఖ, ఉత్తరాభిముఖ ప్రయాణాలు దక్షిణాయన ఉత్తరాయ ణాలుగా ప్రసిద్ధికెక్కాయి.

ఉత్తరాయణానికి నాంది అయిన మకర సంక్రమణం పుణ్య కాలంగా యెంచబడుతున్నది. ఇట్టి సంక్రమణాలు నెలకొకటి జరుగుతుండగా దీనికే యింత ప్రాముఖ్యమేమిః అన్న సంశయం కలుగుతుంది సహజంగా. దక్షిణాయనం ఆరు నెలలు అనారోగ్యకరమయినవని. ఆదిత్యుని మకర సంక్రమణంతో 'గడ్డు' కాలం గడిచినట్టు కనుక అప్పుడు మానవాళి ఆనందోత్సాహాలతో పండుగ చేసుకుంటారని పెద్దల వాక్యం. దక్షిణాయనంలో దక్షిణ ద్వారం తెరచి వుంటుందనీ, దక్షిణ దిశాధిపతి యముడు కాబట్టి ఆకాలంలో ఆయన భీషణ దృష్టి ప్రజలపై ప్రసరిస్తుందనీ కూడా ఒక నమ్మకం వుంది. అపైన దక్షిణాయనం పితృ దేవతలకు ముఖ్యమయినదని కాన అది కీడు కాలమన్నీ, ఉత్తరాయణం దేవతలకు ప్రీతికరమయినదని కాన అది శుభకరమని, దక్షి ణాయనంలో అస్తంగతులయిన వారికి పుణ్యలోక ప్రాప్తి కలుగదని, ఉత్తరాయణంలో గతించిన వారికి ఉత్తమ



సంక్రాంతి పండుగ రోజుల్లో ఇండ్లముందు రంగ వల్లికలు.

గతులు కలుగుతాయనీ కూడ విశ్వసింపబడుతున్నది. ఈ విశ్వాసం యెంత ప్రాచీనమయినదో, యెంత గాఢమయినదో భీష్మాచార్యుని అంపశయ్య గాథ వివరిస్తుంది. కార్తీక శుద్ధ ఏకాదశి రోజున అర్జున శరాఘాతుడయిన కురు వృద్ధుడు తండ్రి యిచ్చిన స్వచ్ఛంద మరణ వరప్రభావంచే ప్రాణాలు నిలుపుకుని ఉత్తరాయణ పుణ్యకాలాన్ని యెదురు చూస్తూ అంపశయ్యపై శయనించి అసిధారా వ్రతం సలుపుతాడు.

అంపశయ్యను కొన్ని నాళ్లధివసించి
కన్నులారగ నొకమాఱు కాంచి నిన్ను
ప్రాణములు వీడఁదలచె మా బ్రహ్మచారి
ఎంత ధన్యవె చెల్లెలా, యింతులందు!

అని శ్రీ దేవులపల్లి రామానుజరావు హృద్యంగా వర్ణించారు, దీనిని.

2

పండుగలలో దేని ప్రత్యేకత దానిదే అయినా యీ సంక్రాంతికొక విశిష్టత వుంది ఇది రైతు యింటికి కొత్త ధాన్యలక్ష్మిని, అత్తవారింటికి కొత్త అల్లుళ్లను. పుట్టింటికి అత్తవారింట్లో వున్న ఆడపడచుల్ని వెంటబెట్టుకు వస్తుంది. 'సంక్రాంతికి సంకెళ్లలో నున్న వారినేనా విడిచిపెడతారు.' అని తెలుగులో సామెత వుంది. ఒకప్పుడు యిది కారాగారాలలో మగ్గే అభాగ్యుల్ని కూడా స్వగృహాలకి తీసుకు వచ్చేదేమో మరి!

పేరుకు మూడు రోజుల పండుగ అయినా యిది నెల్లాళ్ల పండుగ. పట్నవాసాలలో ప్రజలు దీనిని చేసుకోక పోరుకాని దీని వైభవం పల్లెటూళ్లలోనే దర్శనమిస్తుంది. ఈ నెల్లాళ్లు పెల్లలు ఓడికలాది గృహాలంకరణ పనులతో, సంబారాలు సమకూర్చుకొనడంతో పల్లెటూరి గృహిణులకు

పెళ్లి సందడిగా వుంటుంది. విశేషించి యిది ముగ్గుల పండుగ. ఈ నెల్లాళ్లూ ముంగిళ్లను రంగవల్లులతో అలంకరించడం గృహిణులకొక పవిత్ర కర్తవ్యం. ఆ ముగ్గులలో గొబ్బిళ్లను పెట్టి, పసుపు కుంకాలతో, గుమ్మడి పూవులతో పూజించి

'తామర పువ్వంటి తమ్ముణ్ణియ్యావే
చేమంతి పువ్వంటి చెల్లెల్నియ్యావే
మొగలి పువ్వంటి మొగుణ్ణియ్యావే'

అని చెక్కిళ్ల కెంపుదేర ప్రార్థించడం. గోమయంతో గోగు పిడకలు చేసి భోగి మంటకు దండలు గుచ్చటం కన్యల కొక ఆనందం. పొలాలనుంచి తాటి, ఈత దుంగలాది కలపను తెచ్చి భోగిమంటకి వీధులలో లాటు వేయడం రైతుల కొక కాలక్షేపం. గృహస్థులు అదమరుపున దొడ్డిలో విడిచిన కలపను, కొయ్య సామానును యెత్తుకుపోయి భోగిమంట లాటుకు చేర్చడం యువకుల కొక తమాషా.

'ఎయ్యండమ్మ చేతిడూ యేడాదికో పండుగా'
అని పాడుకుంటూ యింటింటికి వెళ్లి పిడకలు దండిగా భోగిమంటకు ఉడతా భక్తి సేవ చేయుటం బాలులకొక ఆట.

ధనుర్మాస పూజలతో విష్ణ్వాలయాలు ప్రతిధ్వనిస్తూ వుంటాయి. ధాన్యలక్ష్మి వచ్చిన సమయం కనుక వూళ్లో 'నాలుగు గింజలు' సంతరించుకుందికి యాచకులకు యిదే తరుణం. బుడ బుడక్కల వాడి దగ్గరనుంచి సాతాని జియ్యరు వరకు గల యాచకులతో వూరు కోలాహలంగా వుంటుంది. భోగి రేపనగా యీ రాత్రి ఒంటిగంటకే వీధి వీధినా భోగిమంటలు లేచి సూర్యభగవానుడు అకాలంలో భూమినుంచి పలుచోట్ల వుద్భవిస్తున్నాడా అన్న భ్రాంతి కలుగ చేస్తాయి. భోగిమంట పేరు చెబితే పిల్లలకి యెక్కడ చలి అక్కడికి పారిపోతుంది. అమ్మ చెప్పినట్టు విని బుద్ధిగా తలంటుకొని కొత్త బట్టలు కట్టుకొని రూపొందిన ఆనందంతో గోగు దండలతో భోగిమంటను సేవిస్తారు.

భోగిపళ్లతో, బొమ్మల కొలువులతో, కోడి పందేలతో పండుగ సంబరం పతాకస్థాయి చేరుతుంది. మధ్య మధ్య కొత్త అల్లుళ్ల అలకలు అత్తవారికి పానకంలో మిరియపు పొడిని చవి చూపిస్తూ వుంటాయి. బహుశా యిది నివారించటానికే కాబోలు

'అత్తవారింటి విందులటన్న భార్య
నాలుగుజాపు కోపులెరాని, వారు పెట్టు
పంచభక్ష్యమ్ములను కొని భ్రాంతి పడకు'

అని బుద్ధులు చెప్పి మరీ పంపిస్తారు పింగళి-కాటూరి కవిద్వయం కొత్త పెళ్లి కొడుకుని అత్తవారింటికి.

3

కొంచెం సూక్ష్మంగా పరిశీలిస్తే యీ పండుగకు పితృదేవతలకు సంబంధం వుందేమో అనిపిస్తుంది. ఈ పండుగ మూడవ రోజుకి కనుము అని పేరు. ఒక వ్యక్తి మరణించిన మరు రోజుకి కనుము అను పేరు నేటికీ వాడుకలో ఉంది. ఇది ప్రయాణానికి శుభకరం కాదనే విశ్వాసం కూడా వుంది. పట్న వాసాలలో యీ పట్టింపు అంతగా ఉండకపోవచ్చు కాని పల్లెటూళ్లలో కనుము నేటికీ ప్రయాణాలకు నిషిద్ధం. కనుము పండుగ, ఆ మరునాడు ముక్కనుము కూడ ప్రయాణానికి నిషిద్ధాలు కావటం గమనార్హం. కనుము నాడు శిరస్స్నానము, మినప గారెల వంటకం సంప్రదాయమూ కూడ పై అభిప్రాయాన్ని ధృవపరుస్తున్నాయి. సంక్రాంతి నెల పట్టిన దాది కనుము వరకు తెరచివున్న స్వర్గ ద్వారాలు ఆనాటితో మూసుకుపోతాయని చెబుతారు. ఈ విషయం నాలుగు పూజారాలుగల సంక్రాంతి ముగ్గు సూచిస్తుంది. విశేషమేమంటే ముక్కనుమునాడు యీ సంక్రాంతి ముగ్గు నుంచి ఒక ముగ్గు కర్రను ఆరంభించి యింటి ఆవరణ నుంచి సాధ్యమైనంత దూరంగా యీడ్చి ఒదిలేస్తారు. ఇందులో మరొక చిత్రముంది, అలా యీడ్చే ముగ్గు కర్ర పీనుగకి సంకేతం. ఆ ముగ్గు కర్రను అలా యీడ్వకపోతే తమ వాకిట్లో పీనుగ వుండిపోతుందని ప్రజలు నమ్ముతారు.

ధృవ ప్రాంతాలలో ఆరునెలలు రాత్రి, ఆరునెలలు పగలు అన్న విషయం వున్నది గదా. ఉత్తర ధృవ ప్రాంతం ప్రజలకు దక్షిణాయనం ఆరు నెలలు చీకటి కాలమయి అప్పుడు చనిపోయిన వారికి ఉత్తర క్రియలు జరుపుటకు వీలుండక వెలుగు ప్రసరించిన ఉత్తరాయణారంభంలో అవి జరిగి వుండవచ్చు. ఈ పండుగ తొలిరోజున వేసే భోగి

మంటకు దీనికి సంబంధం వుంటే వుండవచ్చు. కొన్ని వర్గాల ప్రజలు పెద్ద పండుగ రోజున పెద్దల పేరున బ్రాహ్మణ తృప్తి చేస్తారు. ఉత్తర హిందూస్థానంలో యీ పండుగ సందర్భంలో నువ్వులు, నేయి దానమిచ్చే ఆచారం వుందిట. ఈ రెండు వస్తువులు కూడా పితృ కార్యాలకి ముఖ్యమయినవే కదా. ఒకప్పుడు పరిస్థితుల ఒత్తిడి వల్ల తప్పనిసరి అయిన పనులు కాల క్రమీణా ఆ అవసరం తీరినా కేవలం సంప్రదాయాలుగా నిలిచి పోయినవేమో.

4

ప్రతి యేటా వస్తూన్నా నిత్య నూతనమై విలసిల్లుతూ ప్రజా హృదయాన్ని ఉత్సాహంతో ఉర్రూతలూగిస్తూ కవుల కలాలకు, చిత్రకారుల కుంచెలకు పని కల్పిస్తూనే వుంది సంక్రాంతి.

'రండు మాయింటికీరు పేరంటమునకు
బొమ్మలెత్తును మా పిల్ల యమ్మలార!'

అని తోటి ముత్తైదువలను పిలుస్తూ

'నగు మొగమ్ములతోడ గన్యకలు నీకు
నర్చ లొనగగ నిలిచి, నీ వరుగునపుడు
వచ్చి పోవమ్మ మాయింటి పజ్జకీవు,
పరమ కళ్యాణి, మాతల్లి, పౌష్యలక్ష్మి!'

అని కవి ద్వయంగళంతో ప్రతి తెలుగు గృహిణీ ఆ దేవిని ఆహ్వానిస్తూనే వుంటుంది.

సర్వే జనాస్సుఖినోభవంతు

ధన్యజీవి డాక్టరు పట్టాభి సీతారామయ్య పంతులు గారు

శ్రీ ఆత్మకూరి గోవిందాచార్యులు


శ్రీ పటాభిగారు నేటి పశ్చిమ గోదావరి జిల్లా వారు. ఏలూరు తాలూకా గుండుగొలను గ్రామం వీరి జన్మస్థానం. విక్రమ సంవత్సర కార్తీక బహుళ సప్తమీ బుధవారం రాత్రి 62-13 ఘడియలకు వీరి జననం. మఖనక్షత్ర తృతీయ చరణ యుక్త కర్కాటక లగ్నమున వీరు జన్మించిరి; అనగా క్రీ శ. 1880 సంవత్సరం నవంబరు 24వ తేదీ రాత్రి 2-54 గంటలకు పుట్టిరి. 17-12-59 వ సంవత్సరం ఉదయం 9 గంటలకు పరమ పదించిరి. అవి పునర్వసు నక్షత్రాంత్య ఘడియలు.

వీరు సిరిసంపదలు రెంటిని గలవారు. ఎం.బి బి.యస్. డాక్టరు పరీక్ష యందు త్తీర్ణులై బందరులో వైద్య వృత్తిని ప్రారంభించిరి. సుమారు పదిఏండ్లు మాత్ర మే వృత్తిని నిర్వహించిరి. దేశ సేవా నిరతులై స్వతంత్ర వృత్తియగు వైద్య వృత్తిని గూడ త్యజించిరి. ఈ వృత్తి నవలంబించిన కాలమున గల వీరి స్వార్జితమే, వీరి జీవిత మూలాధారము.

ఆంధ్ర దేశమునందు 19వ శతాబ్దపు దేశభక్తి నిరతులలో ఎన్నిక గన్న గంజాం వేంకటరత్నం పంతులుగారు వీరి మామ గారు. వీరికిరువురు కుమారులు, మనుమను లు గలరు. సిరిసంపదలు గలిగి-సహస్రమాస జీవియై-విఖ్యాతులై-పరిపూర్ణ జీవిత యాత్రను-పరి పూర్తిగావించుకొనియే కాల ధర్మము నొందిరి. వీరికి పూర్వమే వీరి సతీమణి కీర్తి శేషురాలైనది. పుట్టిన పని తీరినది. "జాతస్య మరణం ధృవం" అనే అచంచల విశ్వాసముతో, పరమేశ్వరుని పిలుపునకై, ఎదురు చూచుచు, ప్రశాంతముగ, భౌతిక దేహమును విసర్జింప గలిగిన పట్టాభిగారు కారణ జన్ములు. ఉదయ భాస్కరుడస్తాద్రిని జేరు సమయ మాసన్నమైనది. ఎప్పుడో మాత్రమెరుకలేదుగాని, త్వరితగతిని, అస్తమయ కాల మాసన్నము కానున్న"దని గత మూడు సంవత్సరముల నుండియు తలంచుచున్నారు. సర్వేశ్వరాజ్ఞ నెదురు చూచుచున్నారు. ఈ భవిష్యత్ జ్ఞానముననే కాబోలు, సంసార విషయములన్నియు చక్కగ సరిజేసికొనిరి. కలదాని నంతయు కుమారులకు సక్రమంగా వారే కొంత కాలము క్రిందనే పంచి పెట్టిరి. "నాపేర చిల్లి గవ్వఅయినా లేదు, ఇది యేకదా ఆస్తేయము". అని ఛలోక్తిగ మా సంభాషణయందొకనాడనిరి. "అనా యాసేన మరణం, వినా దైన్యేన జీవితం" ఈ రెండును యీ కారణ జన్మునికి లభించినవి. ఏ విధమగు అన్యాయత్త చిత్తమును లేక, ప్రశాంతముగ కాల ధర్మము నొంద గలిగిన యీ కారణ జన్ముడు ధన్యజీవి. వీరే, వీరి జీవితమును బాల్యమునుండియు ఆంగ్లమున, ఆంధ్రమున గూడ వ్రాసియున్నారు. వ్రాత ప్రతులు వారి కుమారుల యొద్ద నున్నవి. త్వరలో, వీరి కుమారులు, వీరి జీవిత చరిత్రను అచ్చు వేయించెదరని విశ్వసింపవచ్చును.

సర్వతోముఖ విద్యా విశారదుడు

వీరే స్వయముగ తమ లేఖిని నుండి ప్రవహింపజేసిన వీరి ధన్య జీవిత గాథ 19, 20వ శతాబ్దముల భారతీయ వీర



కీ॥ శే॥ డాక్టర్ పట్టాభి సీతారామయ్యగారు

చరిత్ర గాథగను, ఆంధ్రుల పరిణామావస్థల దర్పణముగను విలసిల్లు ననుటలో సంశయింప బనిలేదు. వీరు సర్వతో ముఖ విద్యా పారంగతులు. బాల్యమునందభ్యసించినది వైద్య విద్య. ఎట్లు ఎప్పుడు, ఆర్థిక, చారిత్రక, శాస్త్ర పరిజ్ఞానము నందారితేరిరో? వీరి అర్థ శాస్త్ర పరిజ్ఞాన మపారము. చారిత్రక విజ్ఞాన మసామాన్యము. అన్నింటి కంటె నిత్య జీవితానుభవ పరిపాక మసదృశము. వైద్య వృత్తి యందెన్నిక గాంచుటయే కాదు. రాజ్యాంగ వ్యవహారముల ననుపమానముగ నవగాహన మొనరించుకొనిన ప్రతిభాశాలియే కాదు; సంస్కృతాంధ్ర సాహిత్యముల యందు కూడ విశేష ప్రతిభావంతులు. బి. ఏ., పరీక్ష సంస్కృత భాషా వ్యాసమునందు ఉత్తీర్ణులైరి. అంతమాత్రమున సంతృప్తులు కాలేదు. స్వయంకృషి వలన ఆంగ్ల, సంస్కృత, ఆంధ్ర భాషల మూడింటి యందున విశేషముగ సమానాధికారము గలిగిన వారు. ఉపన్యాస వేదికపైన, కాగితము మీద, పరస్పర సంభాషణమున మూడింటిలోను, ఉత్తమ

భాషా వేతృత్వమున సమానాధికార ప్రజ్ఞాధురంధరులు. సంస్కృతమున, కాళిదాసు మహా కవి శాకుంతల నాటకము వీరి యభిమాన గ్రంథము. ఆంధ్రమున భారతము, అందు ముఖ్యముగ విరాట, శాంతి, అనుశాసనిక పర్వములు వీరి కతి ప్రియములు.

అనుపమాన ప్రజ్ఞ

ఒక మారు చదివిన మరల మరచు వారు కారు. ఎప్పుడైనను, ఎంత కాలమైనను మరల ఆ విషయమును, సాంగోపాంగముగ ఏకరువు పెట్టగలిగెడి వారు. "మరపు" అనుట యెట్టిదో, కలనైన గనియుండరు. అన్నది, కన్నది, విన్నది, చదివినది సందర్భ శుద్ధిగ పవిత్రంగా ఝరీ ప్రవాహమువలె లుటదభంగ తరంగ మృదంగ నిస్వనమున సభావేదికపై పలుకాడెడి వారు. పరస్పర సంభాషణముల సామెతల రూపమున హితోపదేశము నందిమిడ్చెడి వారు. వ్యాసముల నుత్తేజకరముగ వ్రాసెడి వారు.

ఏనాడో బ్రిటిషు ప్రభుత్వాధికారము కరుడుగట్టియున్న కాలమున, అప్రతిమానమై ప్రకాశించుచున్న కాలమున-దేశ సేవకై నడుముగట్టిన దేశభక్తుడు. ఈ దేశ సేవారంగమున వీరు కాలిడి జయప్రదముగ, అనుపమానముగ నిర్వహించని రంగమే లేదు. విద్యారంగమున-సాహిత్యవేత్త-వక్త-గ్రంథకర్త-వ్యాసకర్త-పత్రికా సంపాదకుడు. గాంధీ మహాత్ముడు భారత రాజకీయ రంగము నందవతరించక పూర్వమే, బందరులో జాతీయ కళాశాలను స్థాపించిన వారిలో వీరొకరు. ఆంధ్రావని నల్దిశల వీరి గంభీరోపన్యాసములు-అందలి విషయ పరిజ్ఞానము-మారుమ్రోగెను కదా! గ్రంథ రచనా విషయమున వీరికి వీరే సాటి. వీరి కాంగ్రెస్ చరిత్ర ఆచంద్ర తారార్కము, సజీవముగా నుండగల మహోత్కృష్ట గ్రంథ రాజము. ప్రపంచ భూభాగమున భారతదేశ చిత్రపట మున్నంత కాలము-భారతీయ-దాస్యగతి చరిత్ర ప్రపంచ చరిత యందున్నంత కాలము వీరి కాంగ్రెస్ చరిత్ర సువర్ణాక్షరములతో విరాజిల్లగలదు. పత్రికా సంపాదకత్వమన్ననో, వీరికి నల్లేరుపై బండి నడక. కృష్ణా పత్రికా స్థాపకుల్లో వీరొకరు. ఆంధ్రుల మొదలు-ఆంధ్రుల ప్రతిభ-యితర రాష్ట్రములలో అంధకార బంధురమైయున్న కాలమున, ఆంగ్లేయ భాషలో, జన్మభూమి పత్రికను స్థాపించి చాలకాలము నడిపిరి. ఈ పత్రికకై వీరెంతయో త్యాగమొనర్చిరి. ఈ పత్రిక యందలి రచనలు యావద్భారత దృక్పథము నాకర్షింప గలిగినవి. రాజకీయవేత్తలకీ పత్రిక యొక సింహ స్వప్నము. మదరాసులో ఆంగ్లేయ దిన పత్రికను గూడ ఆంధ్రాభివృద్ధికై స్థాపింపగలిగిరి. అయితే ఆంధ్రుల దురదృష్టము వలన యీ దినపత్రిక చిరంజీవి కాలేదు. ఈయన వ్యాసము నర్థించని ఆంగ్లేయ పత్రిక భారత వర్షమున లేనే లేదని చెప్పవచ్చును. ఏదో ఒక పత్రికకు-ఏదో ఒక విషయమై నిరంతరము వ్యాసములను వ్రాయుచునే యుండెడి వారు. ఆర్థిక రంగమున వీరాంధ్ర భూమి కొనర్చిన యనుపమాన సేవయే, వీరి జీవితమునకు స్మారక చిహ్నము-ఆంధ్రా ఇన్సూరెన్సు కంపెనీ, ఆంధ్రా బ్యాంకు, భారత లక్ష్మీ బ్యాంకు-వీరు స్థాపించినవే. నేటికిని విజయవంతముగ నిర్వహింపబడుచున్నవి. సహకారోద్యమ రంగమునకూడ నాది యందు వీరే సారధ్యము వహించిరి.

ఆంధ్రోద్యమ రంగమున వీరి కార్య దీక్ష, ఆది నుండి తుది వరకు చరిత్రాత్మకము. ప్రత్యేకాంధ్ర రాష్ట్రమును గూర్చి, ఆంధ్రోద్యమ ప్రారంభ కాలమున వీరొనంగిన ఉపన్యాస పరంపర లింకను, అస్మదాదుల చెవులలో గింగురు మనుచునే యున్నవి. హృదయ స్పందన మూలముగ నున్నవి. ''ఆంధ్ర మాత శ్రీ సమేత, అనుపమ ప్రభూత చరిత, అఖిల భక్త పారిజాత, అనుప మంగళమ్'' అని యాంధ్రావని యెల్లయు, సంకీర్తన మొనరించునట్లు జేసిన ఆంధ్ర దేశ భక్తుల యాది పురుషులలో వీరు ముఖ్యులు. ఆంధ్ర రాష్ట్ర సంపాదనకు వలయు కార్యకలాపమును దీర్చి దిద్దిన వారు వీరే! శ్రీ బాగు ఒడంబడికకు మూలకారకులు. రాయలసీమ వారి సఖ్యత నర్థించి, సంపాదింప గలిగిన కృతార్థులు. చిట్టచివరకు మద్రాసు నగరమందలి హక్కును గూడ త్యజించి, అరవలతో అనవసర కలహము లేకుండ ఆంధ్ర రాష్ట్ర నిర్మాణమును చేయగలిగిన దూరదృష్టి గలిగిన వారు. అలనాడు మదరాసును త్యజింపక పోయినచో యీ నాటికి ఆంధ్ర రాష్ట్రము లభించెడిది కాదు. చక్కని హైదరాబాద్ ఆంధ్రుల ముఖ్య పట్టణముగా నవతరించెడిది కాదు; విశాలాంధ్ర స్థాపనకు సావకాశమే యుండెడిది కాదు. ఆంధ్రోద్యమము సృష్టించి.

వ్యాపింపజేసి, పోషించి విశాలాంధ్ర రాష్ట్ర రాజధాని నగర నివాసియై యానందింపగల్గిన ధన్య జీవి పట్టాభి.

విశాల దేశ సేవా రంగమున, యింతటి విఖ్యాత వంతు డాంధ్రులలో మరియొకరు లేనే లేరు. బుద్ధికి బృహస్పతి వంటి వాడని గాంధీ మహాత్ముని విశ్వాసము చూరగొన గల్గిన నాయక శిరోమణి. అఖిల భారత కాంగ్రెస్ సంఘమున, కార్య నిర్వాహక వర్గమున, సభ్యులుగ వీరున్నంత కాల మేయితర ఆంధ్ర దేశ భక్తులును లేరు. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి, పట్టాభి ఓటమి తన ఓటమి గానే మహాత్ముడు ప్రకటించినాడు. తుట్టతుదకు పట్టాభి కాంగ్రెస్ అధ్యక్ష స్థానము వహింపగలిగిన వాడు. ఆంధ్రులలో గవర్నర్ పదవి నధిష్ఠించిన వారిలో తొలి వాడు.

స్వరాజ్య పునర్నిర్మాణ రంగమున, స్వరాజ్య సంపాదనా రంగము నందు వలెనే అత్యుత్తమ స్థానము వహింపగల్గిరి. దూరదృష్టితో స్వదేశ సంస్థానముల ప్రజలలో సంచలనము కలిగించుటకు వీరే కారకులు. సంస్థాన ప్రజల కాంగ్రెస్‌న కధ్యక్షత వహించి స్వరాజ్య పునర్నిర్మాణమునకు పునాదులు వేసిరి. ఈ పునాదుల పైననే శ్రీ సర్దారు వల్లభాయి పటేలు యావద్భారత స్వరాజ్య సౌధమును నిర్మింప గలిగినాడు. స్వరాజ్య సమస్యలో అతి భీకరమై మహా ప్రతిబంధకముగా వ్యవహరించిన యీ సంస్థానములను రూపుమాపగలిగినాడు, భారత ప్రభుత్వము నందైక్య మొనరింప గలిగినాడు-సంస్థానములతో గూడిన స్వరాజ్య సౌధ నిర్మాణమున కభినందన లర్పించ వలసిన వారిలో పట్టాభి గారే ప్రధానులు.

ఆదర్శప్రాయుడు—ఆచరణదక్షుడు

పట్టాభి గారు సిద్ధాంతములను చెప్పు వారు మాత్రమే కారు. నిర్వచించు వారు మాత్రమే గాదు, వారు విశ్వసించు సిద్ధాంతములను స్వీయానుభవ సారములను మాత్రమే మిత్ర కోటి కుపదేశించెడి వారు. ఏ పనినైనను సంకల్పించుచో అది సఫలీకృత మగువరకు తమ మేధా సంపత్తి నంతయు వినియోగించెడి వారు. వీరు కార్యాచరణదక్షులు. వీరు సూక్ష్మగ్రాహి. ఇతరుల మనో ప్రవృత్తుల నతి త్వరితగతి నవగాహన మొనరించుకొనెడి వారు. వారి చిత్తవృత్తుల నితరులకు ప్రస్ఫుటముగ విదరించెడి వారు. మౌన ముద్ర వీరెఱుంగరు. వీరి కాగ్రహము వచ్చినదా? అనుగ్రహము వచ్చినదా? అను విషయమెవరికైనను సునాయాసముగ తెలిసెడిది. వీరాశ్రిత పక్షపాతి. ఎవరైనను అర్థించుట తడవుగా వారి కుపకార మొనర్చెడి వారు. మిత్రకోటి ఎంతటి తప్పొనరించినను ఆంతరంగికముగ వారిని మందలించుచు, బహిరంగముగ వారి కుపకృతి గావించెడి వారు. ఈ దయార్ద్ర హృదయము వల్లనే, ఆశ్రిత పక్షపాతము వల్లనే చాల మంది అనర్హులు ఆంధ్ర రాజకీయ రంగము నందనుపమాన స్థానము వహింపగల్గిరి. అపరోక్షముగ వీరి యాశ్రిత పక్షపాతము, వైపరీత్య కారణమైనను, వీరి ఆశ్రిత పక్షపాతము, దయ, పరోపకార పరాయణత వెల్లడించును. ఈ ఉత్కృష్ట సద్గుణమే వీరి ఆశ్రిత పక్షపాతమున గ్రహింపదగినది.

నా పరిచయము—స్వీయానుభవములు

వీరితో నాకు గత నాలుగు దశాబ్దముల సన్నిహిత పరిచయము కలదు. మొట్టమొదట 1917 వ సంవత్సరమున వీరి సందర్శనము లభించినది. 1920 వ సంవత్సరము నుండియు విజృంభించి, అసహాయోద్యమ కాలము నుండి నేటి వరకు బహు రంగములలో వీరి సన్నిహిత సహవాస భాగ్యము పొందితిని. పలుమార్లు వీరికా తిథ్య మిచ్చు మహదానందము లభించినది. వీరి యాతిథ్యమును పొందు భాగ్యము కూడ లభించినది. వీరితో అసహాయోద్యమ సమావేశములలోను, ఉపన్యాసవేదికలపైన కలియుటయే కాక, వ్యక్తిగత, సన్నిహిత, ఆంతరంగిక సంభాషణము లనేకమారులు గావించు తరుణములు కూడ నెన్నియో లభించినవి. 1930-32వ సంవత్సరములలో రాజమహేంద్రవరము—రాయవెల్లూరు—తిరుచునాపల్లి—కారాగృహములలో కలిసిమెలిసి A క్లాసులో వారితోపాటు నెలల తరబడి యుండెడి సదవకాశము లభించినది. అనుదినమును వారి సన్నిధినే నిత్యకృత్యముగ మధ్యాహ్న కాలమున సాయం సమయము వరకు గడుపుచుండెడి వాడను. ఒకప్పుడు సంస్కృత నాటకములను చదివెడి వారము. శాకుంతలము వారి కతిప్రియమైన గ్రంథము. మరొకప్పుడు భారత కాలక్షేపము చేసెడి వారము. భీష్ముని నీతులు వారి నెంతయో ఆకర్షించెడివి. 1930-32 కారాగృహ వాసమున వారి సహచర్యమే నాకు లభించక పోయినచో నేను కారాగృహముననే ఆ కాలముననే పోయియుండెడి వాడను. వీరి వైద్య నిపు

ణత్వమున, వ్యాధి నిరూపణా కౌశలమున, నన్ను హృదయ శూలనుండి సంరక్షించి బ్రతికించిరి. వీరితోపాటు కారాగృహమున నివసించు సావకాశముననే, వీరి ప్రోత్సాహముననే నేనార్థిక చరిత్ర వ్రాయ ప్రారంభించితిని. అందులకు వలయు పుస్తకమాలను వారే జైలులో నా కొసంగిరి. తదుపరి ఆ పుస్తకమునకు వారే దయతో పీఠికను వ్రాసిరి. పిమ్మట నేను వ్రాసిన భారత రాజ్యాంగ చరిత్రను వారి కంకిత మిచ్చు సంకల్ప మెట్లో యీడేర్చుకొన గలిగితిని. ఆర్థిక చరిత్రను గూడ వారికే అంకితమీయ దలచినను నాడు కృతకృత్యుడను కాజాలక పోతిని.

ఈయన ఒక గురుకులం

మరల నేను మూడు సంవత్సరముల క్రితము హైదరాబాదు నివాస మొనరింప వచ్చితిని. తరువాత కొంత కాలమునకే వీరును హైదరాబాదు నివాసులైరి. ఇది నా అదృష్ట మనుకొంటిని. కొంచె మించు మించుగ అనుదినం సాయం సమయములలో యీ మూడేండ్లు వారి సన్నిధి యందే కాలక్షేపమొనరించుచుంటిని. సుమారు రెండు గంటల కాలమైనను కలిసియుండెడి వారము. ఇట్లు వారితో గడుప గలిగిన యీ కాలమంతయు నొక గురుకులవాసమైనది. ఒక్కొక్క క్షణమైనను రిక్త భాషణములలో వృధాకాలేదు. వారేది మాట్లాడినను, ఒక అనుభూతి, ఒక క్రొత్త చారిత్రక విషయము లేక ఒక నీతిదాయక కథ-వినిపించెడిది. ఒక సరి క్రొత్త అనుభూతి కలిగించెడిది. ఆర్థిక విషయ సంభాషణములలో తమ బాల్య విద్యార్థి దశయందలి అనుభూతియే వీరి కష్టెదుట తాండవమాడు చుండెడిది. ఈ జీవితానుభూతితో కలిసిన బుద్ధి విశేషముననే మిత్రులకు సలహాల నిచ్చుచుండెడి వారు. వీరు ఆరు పదుల కాలము దేశ సేవా ధురంధరులైనను, తదితర దేశ భక్తుల వలె నేల విడిచి సాము చేసిన వారు కారు. దేశ సేవా నిరతిలో సర్వస్వము కోల్పోయిన హితులను గురించి పరిమిత తాపత్రయము బడెడి వారు. వారికెట్లయిననూ ఏదో రీతిగ ఆర్థిక సహాయమును కల్పించెడి వారు. పలుపురకు, గోవింద వల్లభ పంతు గారికి వ్రాసి ఆర్థిక సహాయ మొనర్చినారు. దేశ సేవకు లడుగుట తడవుగ వారి నాదరించి, ఎవరికైనను సిఫారసు ఉత్తరములను వ్రాసి యిచ్చెడి వారు. నేను సహజముగ నా వ్యవహారము లన్నింటి పట్ల వీరి సలహా, సానుభూతులను సాదరముగ చాలకాలము నుండి పొందుచునే యుంటిని ఈయన కీర్తిశేషులగుట దేశమునకు తీరని కొఱత యనుట నిశ్చయము.

ఆంధ్ర దేశము నందింతవరకు ఇట్టి సర్వతోముఖ విద్యా పారంగతుడు, కార్యదీక్షానిరతుడు, వాత్సల్యపరుడు, వక్త, రచయిత—నిర్మాణాత్మక దేశ సేవా ధురంధరుడు జనించి యుండ లేదు. వీరికి వీరే సాటి. ఈయన ఒక సంచార గ్రంథాలయం. ఈ వ్యక్తియే ఒక గురుకులం- మిత్రునిగ, సహచరునిగ నాపట్ల వీరు చూపించిన అభిమానము, ఆదరణ-వాత్సల్యములు నాకు మరపురానివి.

కడపటిసారి.

14 వ తేదీ (14-12-59) సాయంత్రం 5 గంటలకు వీరితో కడపటిసారి కలిసియుంటిని. ఎంతమాత్రమును శ్రమ లేకయే నాతోటి, అప్పుడు వచ్చిన యితరులతోటికూడ సంభాషించిరి. ఆ రాత్రియే వెన్నులో బాధ హెచ్చినదని, 8 గంటలకు వేరొక మిత్రుడు టెలిఫోనుద్వారా తెలిపినాడు. వెంటనే వారి ఇంటికి టెలిఫోను చేయగా వారే ఫోను దగ్గరకు వచ్చినారు. ఈ క్రింద చెప్పిన మాటలే వారు కడసారి నాకు తెలిపిన మాటలు:

"విశేషం సుస్తీ ఏమీ లేదు. మామూలుగా వెన్నులో నొప్పి మాత్రం చాలా హెచ్చుగా బాధించుచున్నది. వచ్చిన పని తీరినది. ఇక జీవిత యాత్ర ముగింపు అగుటే వాంఛితము. మీరేమో ఇంకా ఆయువు కలదనుచున్నారు. నాకు మాత్రము త్వరితగతిని సర్వేశ్వరుని యాజ్ఞ రాగలదనే తలంపు గలిగినది, మీరు కంగారు పడ రావలదు. నేనే రేపు సాయంత్రం మీ యింటికి వచ్చెదను" అనిరి. ఇంతలో 15, 16లు ముగిసినవి. మరణావస్థ అనునది ఎంత మాత్రం రాకుండగనే పరమపదించిరి. ''అనాయాసేన మరణం— వినాదైన్యేన జీవితం'' అను సామెత వీరికి వర్తించి పరిపూర్ణ జీవియై ధన్య జీవియై తరించి పరమపదించిన వీరికిదే నా అశ్రు తర్పణం.

సర్వేశ్వరుడు వీరి ఆత్మకు శాంతి ప్రసాదించు గాక!

ఓం శాంతిః - ఓం శాంతిః - ఓం శాంతిః

సంక్రాంతి సూర్యుడు

— "కులపతి"

అత్తవారింటికి వెళ్ళే కొత్త పెండ్లి కొడుకు లా
అప్పుడే పొడిచాడు సూర్యుడు,
ప్రభాతం వెండి నౌక మీద నీలగగనం వీరధిలో
నీటుగా నడిచాడు సూర్యుడు.

హేమంత కాంత సీమంత సీమలో
వ్రేలాడుతున్న ముత్యాల వరుసలా
ప్రతి చెట్టు మీద ప్రతి గుట్ట మీద
పరుచుకున్నది దళసరి మంచు.

కురుచై పోయిన పగళ్ళు
పెదవుల మీద ప్రారంభమైన పగుళ్ళు
ఎముకలు కొరికే చలి
అమ్మో! పుష్యమాసం పులి!

ప్రొద్దున్నే నిద్దుర లేచి కుంపటి ముందు కూచున్నట్లు
సంక్రాంతి సూర్యుడి ఆగమనంతో
సర్వత్రా వెచ్చరేగింది
గాదెలు నిండే ధాన్య రాసిని
రైతులోకం మెచ్చ సాగింది.

సాగిన బంగారు తీగల్లాంటి అసంఖ్యాక సూర్యకిరణాలు
నూరుస్తున్న వరి కుప్పల మీద
కారుస్తున్నవి కాంతి పుంజాలు
ఫలించిన కష్టాన్ని పంట కుప్ప రూపంలో చూసి
మిల మిలా మెరుస్తున్నట్లు ఆనందాశ్రు పూర్ణాక్షులు
కళకళలాడే కళ్లాల మీద
కిలకిల లాడినై పక్షులు.

చుక్క పొడిచినప్పుడు లేచి
చక్కా వూరంతా తిరిగి
సమయాని కందుకున్నాడు సాతాని జియ్యరుదాసు.
తెనుగు దేశపు పల్లె రైతుల ఔదార్యం ప్రాకినట్లు
మాగాణి పుష్కలంగా పండింది.
పొర్లిపోయే అక్షయ పాత్ర పోగా, జియ్యరు భుజం మీద
వ్రేలాడే గుడ్డ సంచీ ఒక్కచోటే నిండింది!

పసుపు కుంకుమలతో అలంకరించి బసవన్నలను ప్రీతితో
తమ గుండెల్లో దాచుకుంటారు రైతులు
చిటికెల మీద తీరిపోతున్న నోటు పద్దులు చింపేసి
కొత్త వూపిరి పీల్చుకుంటారు రైతులు.

ఉదయం రాముల వారి గుడిలో వినిపించే సన్నాయి పాటలా
హాయిగా సాగిపోతుంది సంక్రాంతి.
చీకటి పడి చివరింటి ముందు 'శీతామ్మ వారి పెండ్లి' చేసే
గంగిరెద్దు నృత్యంలా గడిచి పోతుంది సంక్రాంతి.

కుప్ప నూర్చే కూలీల జానపద గీతాల శైలిలా
జల్సాగా సాగి పోతుంది సంక్రాంతి.
విచ్చిన బంతిపూల అందాన్ని మెచ్చే కబరీ భరంలా
కొత్త కొత్త ఆశల మీద
మెత్తగా నడిచి పోతుంది సంక్రాంతి.

తెనుగు కన్నెల గొబ్బిళ్ళు, గోరంటాకుల వంబరంతో
ముది వగ్గులకు సైతం ఓపిక తెచ్చే
రంగు రంగుల ముగ్గులతో
జీవితంలో కళాభిజ్ఞత చేర్చి కూర్చిన పాటగా
కాలం మార్పు సూచించే
సూర్యదేవుని కొత్త బాటగా

అందంగా, హాయిగా
ఆనందానికి స్థాయిగా
సాగిపోతుంది సంక్రాంతి !

——O*O——

భద్రాచలం వంతెన


1957 ఏప్రియల్ నెలలో జరిగిన ఘోరమైన పడవ ప్రమాదంలో అసువులు బాసిన రెండు వందల మంది యాత్రికుల స్మారకార్థమో అన్నట్లు భద్రాచలం వద్ద గోదావరిమీద నిర్మిస్తున్న వంతెనకు యీ సంవత్సరం డిసెంబర్ 16 వ తేదీ నుండి రాష్ట్ర ముఖ్యమంత్రి శంఖు స్థాపన చేశారు. భద్రాచలంలో ఏటేటా జరిగే ఉత్సవాలను సందర్శించి తిరిగి వస్తున్న యాత్రికులు ఆనాడు ఘోర ప్రమాదానికి గురి అయినారు. ఈనాడు నిర్మిస్తున్న వంతెన వారికి తెనుగుదేశం సమర్పించుకుంటున్న స్మృత్యంజలి. ఈ వంతెన నిర్మాణానికి రు. 57 లక్షలు ఖర్చు అవుతుంది. భద్రాచలానికి ఖమ్మం జిల్లాతో యీ వంతెన మీదుగా రహదారి ఏర్పడుతుంది.

అంతేకాక భద్రాచల సమీపంలోని గిరిజన ప్రాంతాలకు దీని ద్వారా రాకపోకల సౌకర్యాలు అధికంగా సమకూర్చి నట్లవుతుంది. పైగా తెలంగాణా ప్రాంతానికి మధ్యప్రదేశ్, ఒరిస్సా మొదలైన పొరుగు రాష్ట్రాలతో సంబంధం ఏర్పడుతుంది.

స్వాగతోపన్యాసంలో ఆంధ్రప్రదేశ్ హైవేస్ చీఫ్ ఇంజనీరు యీ వంతెన ప్రాశస్త్యాన్ని గురించి విపరంగా ప్రస్తావించారు.

"ముఖ్యమంత్రి మహాశయా: యీ వంతెన గోదావరి పై నిర్మించబడుతున్న రెండవ వంతెన. మొదటి వంతెన బలమూరు వద్ద నిర్మించబడింది. దానికి మీరే ప్రారంభోత్సవం చేశారు. సిద్ధాంతం వద్ద మునుముందు నిర్మించబోయే మూడవ వంతెనకు కూడా ప్రారంభోత్సవం చేయటానికి మీరు దయతో అంగీకరించినందుకు కృతజ్ఞులము. ఈ వంతెనవల్ల భద్రాచలం ఏజెన్సీ ప్రాంతాలకు రాకపోకల సౌకర్యం ఏర్పడటమే కాక, మన రాష్ట్రంలోని తెలంగాణా ప్రాంతానికి, యిరుగు పొరుగు రాష్ట్రాలైన మధ్య ప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాలతో సంబంధం స్థిరపడుతుంది. భద్రాచలం, నాగూరు తాలూకాలను ఖమ్మం జిల్లాకు కలపటం జరిగింది. కాని యీ రెండు తాలూకాలకూ, ఖమ్మం జిల్లాకు మధ్య పాపికొండలు, శబరి నది అడ్డంగా వున్నాయి. మారేడుమిల్లి నుంచి చింతూరుకు, అక్కడి నుండి భద్రాచలానికి పాపికొండలలో గుండా, రంపచోడవరం తాలూకా అడవులలో గుండా రోడ్డు నిర్మాణం జరుగుతున్నది. ఈ రోడ్డుకు తోడు శబరి నది మీద వంతెన కూడా పూర్తి అయితే, తూర్పు కోస్తాలోని కాకినాడ రేవు వరకు నిరాఘాటంగా మార్గం ఏర్పడుతుంది. కూనవరానికీ, పూర్వపు బస్తర్ రాజ్యపు సరిహద్దులోని లొట్టిపిట్ట గండికీ, మధ్యగల ఏజెన్సీ ప్రాంతమునకు యీ విధంగా తూర్పు కోస్తాతో రాకపోకల సంబంధం కలుగుతుంది. యీ వంతెన ద్వారా అదే విధంగా ఖమ్మం, హైదరాబాద్ ప్రాంతాలకు రహదారి ఏర్పడుతుంది. ఈ వంతెన నిర్మాణం పూర్తి అయిన తర్వాత అటు రాజధాని నగరానికీ, యిటు తూర్పు కోస్తాకూ కూడా ఏజెన్సీ ప్రాంతాలలోని సరుకులు ధారాళంగా రవాణా అవుతూ వుంటాయి. యీ ప్రాంతంలో గోదావరి మీద వంతెన నిర్మించాలనే ఆలోచన చాలా కాలంగా వుంది. అది నేటికి మీ నాయకత్వంలో కార్యరూపం దాల్చటం ప్రశంసనీయం.

"ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో మీ మార్గదర్శకత్వం క్రింద ఏజెన్సీప్రాంతాల అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించబడి, తర్వాత ఆంధ్రలోనూ, ఆంధ్రప్రదేశ్‌లోనూ కొనసాగించబడుతున్నాయి. 255 మైళ్ల పొడవున రూ. 177.75 లక్షల వ్యయంతో రోడ్డు మార్గాల నిర్మాణానికీ, మరొక వంద లక్షల ఖర్చుతో వంతెనలు, తూములు నిర్మాణానికీ ఆ పథకంలో అవకాశం కల్పించబడింది. 1956 మార్చితో అంతమైన ప్రథమ పంచవర్ష ప్రణాళిక కాలంలో రు. 29.87 లక్షల ఖర్చు జరిగింది. ఏజెన్సీ ప్రాంతాల రోడ్ల నిర్మాణానికి రెండవ ప్రణాళికలో, మొదట్లో రు. 38.46 లక్షలు



వంతెన కట్టే స్థలం.

కేటాయించబడినవి. యీ మొత్తం మొదటి రెండు సంవత్సరాల్లోనే ఖర్చు చేయబడి కేటాయింపు రు. 71.08లక్షలకు పెంచబడింది. యీ సంవత్సరంతో యీ మొత్తం కూడా ఖర్చు అవుతుంది. ప్రణాళిక చివరి సంవత్సరంలో ఖర్చు చేయటానికి యింకా కొంత కేటాయింపు అవసరమవుతున్నది. మొదటి ప్రణాళికలో కంటే, రెండో ప్రణాళికలో మూడింతలు ఎక్కువ వేగంగా పనులు జరిగాయి. యిది ప్రశంసనీయమైన విషయం. రోడ్ల నిర్మాణంలో జరిగిన కృషిని పరిశీలించాలంటే చింతపల్లి, పాడేరు, హుకుంపేట ప్రాంతాలను సందర్శిస్తే తెలుస్తుంది. ఒకనాడు క్రూర మృగాల భీకరారావాలతో నిండిన యీ ప్రాంతమంతా నేడు జన సంచారంతో జీవితం తొణికిసలాడుతున్నట్లుంది. ఈ ప్రాంతాలయెడ పక్షపాతం వహించి ప్రకృతి మాత తన సహజ సౌందర్యమంతా యిక్కడే ప్రదర్శించింది. అందువల్ల యీ ప్రాంతాలు ఎంత త్వరగా అభివృద్ధి చెందితే అంత మంచిది. యీ రంగంలో ఫలితాలు సాధించడానికి హైవేస్ శాఖ వారు తీవ్రంగా కృషి చేయగలరని నేను మీకు హామీ యిస్తున్నాను.

"బాగా లోతైన ప్రాంతాలలో కూడా గట్టి రాతి పొరలు వుండే విధంగా పరిశీలనలు జరిపి వంతెన నిర్మాణపు స్థలం నిర్ణయించబడింది.

"3934 అడుగుల పొడవుగల యీ వంతెన రాష్ట్ర ప్రణాళిక క్రింద రు. 57 లక్షల ఖర్చు అంచనాతో నిర్మించబడుతున్నది. ఇందులో కేంద్ర ప్రభుత్వం నుండి రు. 20 లక్షల గ్రాంటు లభిస్తుంది.

"వంతెన అడుగు భాగం ఎత్తు 192.00, అంటే 1953 సంవత్సరంలో వచ్చినంత వరద వచ్చినా యీ వంతెన మునగదు. 3600 అడుగుల మేర నీరు ప్రవహించే మార్గం ఏర్పాటు చేయబడింది.

"యీ వంతెన కాంక్రీటుతో నిర్మించబడుతుంది. యిందుకవసరమైన హై టెన్సైల్ ఉక్కు గనుక లభిస్తే అనతి కాలంలో నిర్మాణం పూర్తి చేయవచ్చు. దానిని సాధించటానికి తగు ప్రయత్నాలు చేస్తాము.

"రెండు మూడు సంవత్సరాల్లో, అంటే సుమారు 1962 సంవత్సరం జూన్ నెల నాటికి వంతెన పూర్తి అవుతుందని అంచనా"

భోగి పండ్లు

భోగి పండుగనాడు
పోసెదరు నీకు
రేగి పండ్లవి కావు
రా! భోగి పండ్లు.

జరజరా తల నుండి
జారేను—పాప!
బిరబిరా బిరబిరా
ఏరుకొన బోకు.

భోగి పండుగ నాడు
భోగివే! నీవు;
నాణెంపు నీ యొడలు
నాణెములు రాలు.

ముత్తైదువులు నీకు
ఎత్తి హారతులు;
మంగళము పలికేరు
సింగార మొలికి.

పాపాయి! నీ పీడ
పరిహార మయ్యె;
నికరమై వెలుగు, మా
మకర భానుడవు.

భోగి పండుగనాడు
పోసినవి తలను—
రేగి పండ్లను కోకు
రా! భోగి పండ్లు.

—('మధుర సంక్రాంతి' నుండి)

అల్లుడి ఔదార్యం

— శ్రీ ఓగేటి శివరామకృష్ణ

ఆ మధ్యాహ్నం రెండు గంటల వేళ………….

ఆఫీసులో యేర్పడిన విశ్రాంతి వ్యవధిలో, తన సీటులో వంటరిగా కూర్చుని యేవో కాగితాలు చూసుకుంటున్న శంకరరావు దగ్గరకు వచ్చి, పోస్టుమేన్ ఓ కవరునిచ్చి నిష్క్రమించాడు. కవరుపై ముద్రలూ,చిరునామా పరిశీలిస్తూ శంకరరావు వుత్తరం చించి యిలా చదువుకొన్నాడు.

విశాఖపట్టణం,
8-1-60

ప్రియమైన అల్లుడు శంకరరావును,

నీ మామ వెంకట్రామయ్య దీవించి వ్రాసేది. నీభార్య చి॥ శారదా, రామూ కులాసాగా యిక్కడికి చేరుకున్నారు. సంక్రాంతి సెలవులు యేలాగూ మూడు రోజులు కలిసి వస్తున్నాయి కనుక, ముందుగా సెలవు పడేసి, అమ్మాయితో కలిసి వస్తావని నేవూహించాను. అలా చెప్పమని రామూతో కూడా చెప్పాను. కానీ అలా జరగలేదు.

అయినా-మించిపోయింది లేదుకనుకా, వుద్యోగరీత్యా నాకు సెలవులేకపోవటంవల్లా యిప్పుడే వుత్తరం వ్రాస్తున్నాను. నీ వివాహమయింతరువాత నిన్ను మేం సంక్రాంతి పండుగలకు తీసుకువచ్చిందిలేదు. ఎంతసామాన్యసంసారులమైనా పండుగలు పండుగలేకదా….యెవరి శక్తిననుసరించి వాళ్ళు పండుగలు జరుపుకుంటూండటం, యింటి అల్లుళ్ళను ఆహ్వానించటం లోకంలో వున్న విషయమేకదా! మీదంపతులిద్దరూ మానట్టింట ఆ రెండురోజులూ కలసి తిరుగుతూంటే-ఆనందించటంకంటె పెద్దవాళ్ళమయిన మాకేం కావాలీ?

అన్నట్లు యీ పండుగ సందర్భంలో నువ్వు అలకపాన్పు మీద కోరుకున్న రేడియో నేతప్పకుండా కొనియిద్దామని ప్రయత్నించుతున్నాను. ఆపైన భగవంతుడి దయ!

అన్నీ తెలిసికొని-ప్రాజ్ఞుడవై వున్న నీకు యింతకంటె వివరంగా వ్రాయనవసరంలేదనుకుంటాను. దయ వుంచి, నాకు నేను వచ్చి ఆహ్వానించినట్లుగా భావించి, మా దంపతులకూ, ముఖ్యంగా నీ అర్ధాంగి చి॥ సౌ॥ శారదకూ నిరాశ కల్గించకుండా పండుగకు ముందుగానే వచ్చి ఆనందపర్చగలవని నమ్ముతాను.

ఇట్లు నీ మామ,
వెంకటామయ్య

ఆ వుత్తరాన్ని చదువుకొన్న అల్లుడు శంకరరావు కళ్ళు యెందుకో చమర్చాయి. "పాపం….మామగారు లేనిపోని శ్రమ పడుతున్నారు"-అనుకొన్నాడతను. ఆమామగారి మీద అతడికి వున్న సానుభూతే-ఓసారి గతం జ్ఞాపకం చేసింది. అతడి వయస్సు యిరవైరెండు సంవత్సరాలకు మించదు; ఎర్రటి ముఖం, పుష్టిఅయిన శరీరం-గల అతడ్ని చూట్టంతోటే-ప్రతీ వాళ్ళకళ్ళ దృష్టీ అతడిమీదే పడుతుంది.

'అవును'….శంకరరావు తనలో తాను గతాన్ని గురించి అనుకోవటం సాగించాడు. నిజంగా తానెంతో పూర్వపుణ్యం చేసుకొని వుండటంవల్లా, అదృష్టం కలిగి వుండటంవల్లా-అటువంటి అత్తమామలు తనకు లభించారు. ఆయన చేసేది విశాఖపట్టణం హైస్కూల్లో బి. ఇ. డి బడిపంతులు వుద్యోగమే అయినా-వెనుక యెటువంటి ఆస్తిపాస్తులూ లేకపోయినా- ముచ్చటలు తీర్చటం తన మామగారికి మహాయిష్టం! అందువల్లనే తనకు, తనవాళ్లుకోరిన అయిదువేల రూపాయల కట్నంగాక, మరి మూడు వేలు ముట్టచెప్పాడు. అది ఆయన చేతిలో డబ్బుకాదు. ఆసంగతి తనకు తెలుసు!

మంచితనంగా అక్కడా, అక్కడా నోట్లు వ్రాసితెచ్చింది!

అయిదువేలకూ, మరో మూడు వేలు ముట్టచెప్పినా తన వాళ్ళకు-ముఖ్యంగా తన తల్లికీ, అక్కదుర్గకూ తృప్తిలేక పోయింది. ఉద్యోగం లేకపోయినా-యేదో యింత ఆస్తి గడించి వుంచిన తన తండ్రి, పెద్దమనిషితరహాలో యీడబ్బు సందర్భాల్లో దూరంగా వున్నా అవకాశం లభించినప్పుడే రాబట్టాలనే ధోరణిలో వున్నవాళ్లు మాత్రం లేనిపోని అలుకలు పోబోయారు. పాపం! ఓర్మితో తన అత్తమామలు వాళ్ళ అన్ని అలుకలూ తీర్చారు. పెళ్ళికొడుకయిన తనకు మామగారు పడుతున్న శ్రమా, డబ్బుగురించి పడుతున్న యిబ్బందులూ చూస్తూంటే నిజంగా కళ్ళ నీళ్లు తిరిగాయి. యేదో బాధ తనలో బయలుదేరి-యేమిటో అనిపించబోయింది. కానీ తమ వాళ్ళమీదుండే గౌరవం కొద్దీ అన్నీ చూస్తూ, నోరు మూసుకుపూరుకోవటం తప్పనిసరైంది.

తన పెళ్ళిలో-అలక పాన్పు సందర్భంలోనయినా తన తల్లికానీ, తన అక్క దుర్గకానీ తమ, తమ ప్రత్యేకతల్ని వదులుకోలేకపోయారు. తన అక్క దుర్గకు అహంభావం యెక్కువ; ఆమెకు తనకంటె ముందుగానే వివాహమయింది. తమకుటుంబానికామె యేకైక స్త్రీ సంతానమవటంవల్ల-తన తండ్రి యింతవున్న మంచి సంబంధంచూసి పెళ్ళిచేశాడు. తానూ ఏకైకకుమారుడే అయినా తనతల్లికి అక్కమీద మమకారం హెచ్చు; అందువల్ల ఆవిడ దానిమీద యీగనయినా వాలనివ్వదు.

తనకు తాను లాంఛనంగా అలక పాన్పు మీద ఓమారు కూర్చుని, మంచితరహాలో లేచి పోయి-మామగారియందు తనకున్న గౌరవం ప్రదర్శించబోయాడు. కానీ తన వాళ్లు తన్నుకదలనిస్తేకదా! 'ఉండరా! నీ మామగారు వాగ్దానం యివ్వకుండానే లేచిపోతావేమిటి?-'అని తన్ను అటకాయించారు. కాళ్ళూ,చేతులూ బంధింపబడ్డ వ్యక్తిలాగ-తాను తన మామగారికేసి: 'మీరన్యథా భావించకండి....నాయందు దయవుంచండి-' అన్న ధోరణిలో చూశాడు. కానీ ఆయన మందహాసంతో-(అప్పటికే తన మీద కొన్ని వేల తీర్చవలసిన అప్పులబరువున్నా....యింకా వివాహం చేయాల్సిన పిల్లలున్నా) తనకేసి చూసి;' ఏంకావాలో కోరుకోవోయ్"-అన్నాడు. తానుఅవ్యక్తమైన బాధతో "నాకు కావలసినవన్నీ మీరింతక్రితమే యిచ్చేశారు. మరేంఅవసరంలేదు''—అన్నాడు! ఆయన ముఖంలో కాంతి కనిపించింది. తన బాధను మామగారర్థం చేసుకొన్నందుకు తాను తృటికాలం తృప్తి ననుభవించాడు. కానీ తన వాళ్ళు మాత్రం వదల్లేదు. తానన్నమాటలకు చిలవలూ, పలవలూ సృష్టిచేసి "వాడి అచ్చట ముచ్చటలేవీ తిన్నగా తీర్చకపోటంవల్ల బాధతో వాడావిధంగా అంటున్నాడు-" అని తనమీద ఓ అభాండాన్ని పడేశారు. దాంతోటి ఆయనముసి, ముసినవ్వుతూ నీబాధనే గుర్తించాను నాయనా అనే ధోరణిలో చూస్తూ:'' నేనేం యిబ్బంది పడను నాయనా! ఈ అలక పాన్పు యింటి అల్లుళ్ళకోరికలు తీర్చటంకోసమే ప్రవేశపెట్టబడింది........ మామలు మీ కోరికలు యెప్పటికైనా తీర్చినా, తీర్చకపోయినా....ధర్మం'' అన్నాడు.

"ఊ....చెప్పరా-"అని తన్ను తల్లి నిర్బంధించగా....తాను అయోమయంగా మామగారివంక చూస్తూండగా—"మాతమ్ముడికి రేడియో అంటే యిష్టం అండీ! రేడియో పాటలంటే మావాడు చెవికోసుకుంటాడు....కోరాడుకదా అని యేదో చవకబారు రేడియో అనుకొనేరు....అయిదు వందల రూపాయల కిమ్మత్తు చేసే పెద్ద సెట్టు....ఏరా"-అంటూ, అక్కదుర్గ తనకేసి చూసింది. అసలే నలిగి పోయిన ఆయన మీద అక్క అంత పెద్దమొత్తం రుద్దటం తనకు నిజంగా బాధకలిగించింది. తన తల్లి తండ్రులు యింత కలిగి వున్నవాళ్ళవటంవల్ల అక్కబావల ముచ్చట్లు బాగా తీర్చారు; తీరుస్తున్నారు. వాళ్ళతో పోటీగా-తనవాళ్ళ దగ్గర యిప్పుడు గుంజటానికి వీళ్ల ప్రయత్నించారు. అందువల్ల అప్పటి కప్పుడే ''మీరనవసరంగా బాధపడకండి మామగారూ''—అని తానేమిటేమిటో సానుభూతితో చెబుదామనుకొన్నాడు.కానీ తాననేలోగానే చిరునవ్వు నవ్వుతూ "ఓ! నీకు మంచి రేడియో కావాలన్నమాట! దానికేం అలాగే యిద్దాం....అంతేనా....''-అన్నాడాయన తేలికగా గాలి వదలుతూ! చదువూ, సంస్కారం కలిగివున్న తమబోటి వాళ్లు ప్రవర్తించవలసిన విధం అదికాకపోటంవల్ల-ఆ కార్యక్రమానంతరం, తన మామగార్ని తానుయేకాంతంగా కలుసుకొని! "నన్ను మీరు దయతో క్షమించాలి! ఇప్పటికే మీచేత మావాళ్లు చాలా ఖర్చుచేయించారు; నాకేబహుమానం అక్కర్లేదు! మీ భవిష్యత్తూ, మీపిల్లల భవిష్యత్తూ కొంచెం

ఆలోచించుకోండి. బహుమానాలకేం''-అన్నాడు. ఆయన భారంగా గాలివదలి, ముసి ముసి నవ్వుతూ ''నేనిన్ను మొదటినుంచీ పరిశీలించుతూనే వున్నాను నాయనా! నాకష్ట సుఖాలు గుర్తించే అల్లుడు లభ్యమయినందుకు నేనిజంగా గర్విస్తున్నాను....అల్లుడిగారి కామూ తం-ఆనందం కలిగించే వస్తువు ముట్టచెప్పకపోతే యేలాగ? ఏమైనా....వెంటనే యివ్వలేనులేబాబూ-''అని ఆయన మాట తప్పించాడు.

వివాహమయిన కొద్ది మాసాలకే తన కార్యం అయిపోయింది. శారదను వెంటనే కాపురానికి తీసుకొచ్చారు కూడాను. శారద యింట్లో అడుగుపెట్టిన వారం రోజులకే-తనకు స్వగ్రామంలోనే....యీ వుద్యోగం లభించింది. ''కోడలు అడుగు పెట్టినవేళ అటువంటిది''—అని అంతా మురిసిపోయారు. శారద గూడా-తన తల్లిదండ్రులగుణాలే పుణికి పుచ్చుకుంది. అందుకనే తానిప్పటికీ గర్విస్తూంటాడు. చదువు సంస్కారాలతోపాటు, రూపం,దానితోపాటు వినయ విధేయతలూ ఆమెలో నిలబడ్డాయి. ఇంతవరకూ తమ యింట్లో బయలుదేరే రభసల్లో-లోపల బాధవున్నా వాళ్ళ మధ్య బయటకు దాన్ని వెడలగ్రక్కకపోవటమే దానికి నిదర్శనం!

తన వివాహం అయిన తరువాత-యిదే మొదటి సంక్రాంతి. మామగారింటికి పండుగ పేర్లతో తానింత క్రితం భార్యా సమేతంగా రెండుమార్లు వెళ్ళాడు. మొదటిమారు, తమతో తన వాళ్ళంతా వచ్చారు. పండుగలూ, పూర్వ పద్ధతులూ, తనకిష్టంవున్నా, తిరిగి మామగారిని యిరుకుల్లో పెట్టడం యిష్టంలేక సౌమ్యంగా తానూరుకుండిపోయాడు. అయినా తనవాళ్ళందరూ కొత్తబట్టలు సంపాదించుకొన్నారు తృప్తిగా రెండురోజులు కాలక్షేపం చేశారు. ''మామగారి చేత పండుగపేరుతో తిరిగి ఖర్చుచేయించామే-''అని తాను విచారించగా-అక్క దుర్గ తనకు లేనిబాధను బయట పెట్టింది. ''మాతమ్ముడు సూటులూ, బుష్షర్టులూ తొడుక్కుంటాడని తెలిసికూడా...జరీజామారు పెట్టారు! అది వాడెప్పుడయినా కట్టుకొని యేడుస్తేకదా? పెట్లోనే పడి వుంటుందండి'' ఈమాటలు విన్న తన తండ్రి, మంచి తరహాలో, ''ఏదో వాళ్ళశక్తి ననుసరించి ముచ్చటలు తీర్చుకొన్నా''రన్నాడు. తల్లీ, అక్కా వూరుకోలేదు. ''అదృష్టం అంటే యిదే! అచ్చట, ముచ్చటలు తీర్చుకొనే రేఖవుండి యేడుస్తేకదా''-తల్లి విసురుగా అనగా, తానభిమానంతో అనేశాడు. ''జామారుకేం! చాలాబాగుంది''-అని. అక్క వ్యంగ్యంగా, ఆమాటలు తిరిగి అనగా,తనతల్లి ఉక్రోషంతో అనేసింది! ''బాగుంటుందమ్మా! బాగుంటుంది...అడ్డాలనాడు బిడ్డలుగానీ...గడ్డాలొచ్చాక బిడ్డలా అని వూరికే అన్నారా? తల్లి విషమాయె; పెళ్ళాము బెల్లమాయె''-అనే సామ్యం వూరికే పుట్టిందా?అందుకనే ముచ్చటగా కోరుకున్న అలక రేడియో బహుమానం వెనక్కు వెళ్ళింద-''ని. ఈ మాటలు తన మనస్సును చివుక్కుమని పించాయ్! ఇంత వరకూ ఆయన చేసిన లోటేమిటీ ? కట్నంగా అనుకొన్న మొత్తం కంటె యెక్కువ ముట్ట చెప్పటమా ? లేక ప్రతీ సందర్భలోనూ. 'ఆడపిల్ల నిచ్చాం కదా' అనే దృష్టితో అణిగి, మణిగి వుండటమా ? ఏదో సమాధానం చెప్పాలనే అభిలాష తనకు బయలు దేరింది. కానీ మంచితనానికి వూరు కొన్నాడు. ఈ మాటలు తన మామగారు వింటే యెంతో బాధ పడతాడని తాను భయపడ్డాడు. కానీ అదృష్టవశాత్తు ఆయన చెవినపడలేదు, ఆ మాటలు విన్న శారద మాత్రం ''చూశారా'' అన్నట్లుగా బిక్క మొఖం పెట్టి తన కేసి చూసింది. ''వాళ్ళు డబ్బు మనుషులు! అదృష్టవశాత్తూ వాళ్ళ కింత సమకూడింది. వాళ్ళ యిష్టం వొచ్చినట్టు వాళ్ళను కుంటారు. నేనీవాడనయివుండగా....నువ్వు వ్యధపడటం దేనికే పిచ్చి పిల్లా? అసలే యిబ్బందుల్లో పడికొట్టు కొంటున్న ఆయన చేత నాకు ప్రస్తుతం రేడియో కొనిపించటం యిష్టం లేకనే యిదంతా....నాకు మంచి చెడ్డలు తెలియవు కనుకనా.... ఈ వేళా రేపూ....వీళ్ళు కూస్తారు....ఎల్లుండీ మామూలు ధోరణిలోకి వస్తారు....ఏమైనా మనకు అన్నం పెట్టకపోరు గదా....'' అని తాను భార్యను వూరడించాడు. ఏలాగయితేనేం ఆ పండుగ వెళ్ళిపోయింది....

మరునటి పండుగ దసరా.... పండుగలకు ముందుగానే తమ యింటికి వచ్చిన దుర్గ శారదను తెగవేళా కోళం చేసింది తనతో కూడా: ''ఏరా తమ్ముా! ఈ పండుగ కయినా రేడియో తెచ్చుకుంటారా? ఏ కంపెనీది? మీ కేనయంరా! ముచ్చటలు తీర్చే మామగారు దొరికారు....'' అని, రెచ్చకొట్ట బోయింది. శారద అమాయకురాలవటం వల్లా, కల్మషంతో మాట్లాడటం చేత కాకపోటం

వల్లా బిక్కగా ముఖం పెట్టి ఆమె తనకేసి చూడటం కంటే చేయ కలిగిందేమీ లేక పోయింది. మాయదారి రేడియో కోసం —— అర్థంలేని అల్లరి పట్టం. చిన్నగా చూడబట్టం ఆమె కిష్టంలేదు. తండ్రి కున్న అప్పుల్లో యిదిమరో అప్పవుతుందని ఆమెవుద్దేశం. రేడియో వస్తే ఈ పండుగ దెప్పులుండవని తలంపు. కానీ తానా తలంపులకు వ్యతిరేకి. అందు వల్ల తనకు తాను "ఎందుకు తెచ్చుకోం? మా మామగారికి మంచి చెడ్డలు తెలుసు.... ఆయన మీలాంటి వాడు కాదు....బహు సరస మైన మనిషి"—అని తమాషాగా మాట్లాడి, అక్కను మాట్లాడ కుండా చేశాడు. తాము దశరా పండుగలకు— మామూలు ధోరణిలో విశాఖపట్నం వెళ్ళారు. తిరిగి వచ్చారు: శారద తన తల్లి తండ్రులతో రేడియో గురించి నిజంగా చెప్పబోయింది. తాను మందలించగా వూరుకుంది అందువల్ల—వెళ్ళినట్లుగానే తిరిగి వచ్చిన తమ కెదురుగా దుర్గ అక్కయ్య వచ్చి, రేడియో ఏదని అడిగింది. తల్లి యెదురుగా వస్తూంటే, తన భార్య శారద వెల, వెల బోయే ముఖంతో యేమిటో సమాధానం యివ్వబోతూంటే తనకు తానే అనేశాడు: ''మాకు నచ్చిన సెట్టుదొరక లేదు. సంక్రాంతి వస్తూందిగా....అప్పుడే తెచ్చుకోవచ్చనే దృష్టిలో వచ్చేశాం''-అని. అక్క, తల్లీ యెందుకో ముసి ముసి నవ్వుకొన్నారు. తన గదిలోకి ప్రవేశించిన శారద ఉక్రోషం తో ''చూశారా'' అంటూ కళ్ళ నీళ్ళు పెట్టుకుంది. ''మాయ దారి రేడియో రాక పోదులే! నువ్వనవసరంగా బాధ పడతా వెందుకూ?''....అని తానామెను వూరుకో పెట్టాడు: రావల సిన విషయాల్లో —పండుగ సందర్భాల్లో తన వాళ్ళు-శారదను వేళాకోళం చేసినా- దైనందినవ్యవహారాల్లో కలసి కటు గావ్య వహరించుతూండటం వల్ల....తనకిదో పెద్ద సమస్య కూడా కాకుండా పోయింది.

ఏమయితేనేం....తిరిగి సంక్రాంతి పండుగ దగ్గరపడింది. అప్పుడే యిళ్ళకు వెల్లలు వేయటం, గుమ్మాలకు వార్నీషులు పూయించటం జరుగుతోంది. మామూలు ధోరణిలోనే తన మామగారు తమ దంపతుల్ని పండుగలకు ముందుగానే కలసి రావలసిందంటూ వుత్తరం వ్రాశాడు. దసరా పండుగకు వచ్చిన అక్క దుర్గ యింకా యిక్కడేవుంది. ఆవిడతో బాటే భర్తగారూను.

ఉత్తరం వచ్చిన రెండు రోజులకేతన బావమరిది రామూ పని కట్టుకు విశాఖ పట్టణం నుంచి వచ్చాడు: రామూ కిప్పుడు పదమూడో యేడు: వాడిప్పుడు ఫిఫ్తుఫారం చదువుతున్నాడు. రెండు రోజులుండి తమ యిద్దర్నీ తీసుకువెడదామని వాడి వుద్దేశం: తాను రామూకు ముచ్చటగా-వచ్చినందుకుగాను లాగూ, చొక్కా కుట్టించాడు. అది చూసిన తన అక్క: ''తమ్ముడుగారు అపసవ్యంగా నడుస్తున్నారే: వాళ్ళు మీకు పెట్టడం ఆచారంకానీ....మీరు వాళ్ళకు పెట్టం యెక్కడా చూడ లేదు'' -అని, వేళాకోళం చేసింది. శారద తన ముఖాన్ని చిన్న బుచ్చుకోగా ''మా కందరు సమానమే''-అని తానప్పటికి మాట తప్పించాడు.

రామూ, తమ యింట్లో వున్న ఆ రెండు రోజుల్లోనూ, తన తల్లీ, అక్కగారూ-తమ రేడియో గురించి అపసవ్యంగా చాలా యోగక్షేమం చేశారు. వాడు చదువు కొన్న వాడవడం వల్ల బింకంగా; ''మా యింట్లోనూ....యిక్కడిలాగ కరెంటు వుందిగా: రెండు రేడియోలూ ఓసారే తెప్పిద్దాం అనుకుంటున్నాడు మా నాన్న''- అని వాళ్ళ నోళ్ళు మూసి పారేశాడు:

ఏమయితేనేం-తాను శారదను రామూతో విశాఖ పట్టణం పంపించాడు; తన ప్రయాణం గురించి వాడితో సర్ది చెప్పాడు కూడా: శారద వెళ్ళే ముందు, గదిలో వున్న తన దగ్గరకు వంటరిగా వచ్చి; ''పండుగలకు ముందుగా మీరు తప్పకుండా వస్తారు కదూ?-అని అడిగింది." ''నే రావటం గొడవ యిప్పుడెందుకులే.... సెలవులకు యింకా రోజులు గడవాలిగా....'' అని తాను మాట తప్పించ బోయాడు." అలా కాదు ... మీరు తప్పకుండా రావాలి: అంతే కాదు.... ఈ సారి మా నాన్ననడిగి రేడియో తెచ్చుకోవాలి''-అందరి బాధతో. తానప్పటికి 'వూ' కొట్టి ఆమెను విశాఖ పట్టణం పంపించాడు.

ఈ వేళ యీ ఉత్తరం వచ్చింది. పండుగలింకా నాలుగు రోజులున్నాయి. మామయ్య గారు రేడియో గురించి కూడా వుత్తరంలో వ్రాశారు. తండ్రి కష్ట సుఖాలు అర్థం చేసుకుంటున్న తన భార్య బహుశా యిక్కడి పరిస్థితులక్కడ చెప్పక పోవచ్చు; కానీ రామూ అంతా బయట పెట్టి వుంటాడు. అందుకనే రేడియో గొడవ వుత్తరంలో వచ్చి వుంటుంది. తానిప్పుడేం చేయటం?

అసలే-అప్పుల చిక్కుల్లో పడి కొట్టుకుంటున్న మామగార్ని అల్లుడుగా తాను వెళ్ళి-తన కోర్కెలూ, వాంఛలూ తీర్చుకుంటూ మరిన్ని చిక్కుల్లో పడత్రోయటమా? లేక తాను పండుగకు వెళ్ళకుండా యింటిదగ్గరే వుండిపోవటమా?

పండుగ సందర్భంలో అత్తవారింటికి తాను వెళ్ళకుంటే బ్రతుకగలడా? తాను వెళ్ళకుంటే "రమ్మని వుత్తరం వ్రాయలేదేమో" నని తన తల్లీ, అక్కా వాళ్ళనాడిపోయరూ? అహంభావంతో మసులుతున్న తన అక్క యీ మధ్య తన యిష్టం వచ్చినట్లుగా మాట్లాడుతోంది. తన తల్లి కూతురుమీద ప్రేమకొద్దీ దాన్నే వెనకవేసుకు వస్తూంటుంది. అంతెందుకూ....? తన భార్య విశాఖపట్టణం వెళ్ళినప్పటి నుంచీ "పోరా తమ్ముడూ! మీ అత్తారి పండుగ కానుకలేమిటీ? జరీ జామారూ.. దాంతో పాటు... ఏ కంపెనీ రేడియో? పనిలో పని రికార్డు ప్లేయరూ.... పది బాల సరస్వతి రికార్డులూ పట్టుకురా! అవంటే నాకు యిష్టం" అని తన్ను వేళాకోళం చేయటం లేదూ? మొగవాడయి వున్న తానే దానికి సమాధానం చెప్పటానికి తడబడుతూంటే ఆడది... అందులోనూ అమాయక శారద చెప్పగలదా? "ఓ అలాగే! నువ్వు కోరుకున్న వాటితో పాటు ఓ అరడజను డాన్సు రికార్డులు గూడా తెస్తా... కాళీగా వున్నారు కాబట్టి నువ్వూ మీ ఆయనా రికార్డు పెట్టుకొని డాన్సు చేయచ్చు" అని మాటకు మాట సమాధానం యిస్తున్న తాను వెళ్ళకుంటే అల్లరయిపోదూ?

అయితే ప్రస్తుతం తాను చేయవలసిందేమిటీ?

తాను వెళ్ళటమో, మానటమో నిర్ణయించుకోవటం, తర్వాత జరిగినా-ముందు తన మామ గారు రేడియో కొనకుండా వుండే యేర్పాటు చేయాలి. వెన్నపూసవంటి హృదయం, నిర్మలమైన మనస్సూ కలిగివున్న ఆయన వుత్తరం వ్రాస్తూనే రేడియో గురించో, డబ్బు గురించో ప్రయత్నం చేయవచ్చు. తాను వెంటనే తన అభ్యంతరం తెలియ చేయకుంటే-రేడియో కొనేయటమే జరుగవచ్చు కూడా! ఆయన యెటువంటి యిబ్బందుల్లో కొట్లాడుతున్నారో-తనకు వివాహం జరిగినప్పటి నుంచీ తెలుసు! ఇంట్లో ఆడవాళ్ళనుకొనే తేలిక మాటలకు లేనిపోని విలువ యిస్తూ ఆయన కర్థం లేని వత్తిడి-చదువుకొన్న తాను కల్పించటంలో యేం న్యాయం వుంది? ప్రస్తుతం మామగారికి వత్తిడి కల్గించకుండా వుండటం ఒక్కటే తనకు కావలసింది.

ఈలా దీర్ఘకాలం ఒంటరిగా తలబోసి ఓ నిర్ణయానికి వచ్చిన శంకర్‌రావు జేబులోంచి పోస్టు కార్డు తీశాడు. దాని మీద యోగక్షేమాలు వ్రాసిన అనంతరం "నాకు కావలసిన రేడియో... నాకు నేను చూసుకొని, యెన్నుకొని కొనుక్కుందామనుకొంటున్నాను. లెఖ్ఖ ఆ తరువాత మీరే యివ్వవచ్చు... మీరు మాత్రం వెంటనే దాన్ని కొనకండి..." అని వ్రాసి, దాన్ని ఎక్స్‌ప్రెస్ డెలివరీకి వీలుగా వెంటనే, పోస్టు చేశాడు.

*   *   *

ఆ రాత్రి...

ఎనిమిది గంటల వేళ...

ఇంట్లో శంకరరావు భోజనం చేస్తున్నాడు. అతని తండ్రి అంత క్రితమే భోజనం ముగించి, క్లబ్‌కు వెళ్ళి వుండటం వల్ల అతడొక్కడే భోజనానికి కూర్చోటం జరిగింది...దుర్గ భర్తగూడా ప్రస్తుతం యిక్కడ లేడు. తల్లి అవసర వంటకాలు. వడ్డిస్తూండగా, శంకరరావు మౌనంగా భోజనం సాగిస్తూంటే, అతడి కెదురుగా-పీట వేసుకు కూర్చున్న దుర్గ యోగక్షేమం చేయటం సాగించింది. అనేక విషయాల అనంతరం "ఏరా తమ్ముడూ... ఈ సంక్రాంతి పండుగలకు అత్తారింటి కెళ్ళదలచ లేదా?" అని దుర్గ అడగటం తడవుగా తల పైకెత్తిన శంకరరావు "ఏం" అన్నాడు!

అబ్బాయిగారిలో యెక్కడా హడావిడి కనిపించటంలేదు. "ఇంతకీ మీ మామగారు ఆహ్వానం పంపాడా?" అక్క వ్యంగ్య ధోరణిలో అంటూంటే, శంకరరావు తల్లి నవ్వుతూ అంది. "ఆహ్వానం పంపటం యేం ఖర్మమే! ఆయన కాయన అల్లుడ్ని వచ్చి తీసుకుపోటానికి సిద్ధంగా వుంటే"

శంకరరావు భోజనం చేయటం ఆపుచేసి అన్నాడు. "నా సంగతి ఆలా వుంచండి! ముందు మీ అల్లుడుగారి కాహ్వానం వెళ్లిందా? లేక..."

తమ్ముడీ ప్రశ్న వేయటంతోటే దుర్గ మనస్సు చివుక్కుమంది. తల్లి కుమారుడి వైపు రుస రుస చూసింది. "ఆయన ఏలాగూ వస్తార్లే" ఆలోచించి దుర్గ యీ సమాధానం యివ్వటంతోటే,

శంకరరావు నవ్వి అన్నాడు. "ఆహ్వానం పంపక పోయినా". అప్పటికతడు భోజనం చేయటం పూర్తయింది కూడా!

''మధ్య అతడి గొడవ నీకెందుకురా? అతడింటి అల్లుడు; అందువల్ల రావాలని వున్నప్పుడు వస్తాడు.... వెళ్ళాలని వున్నప్పుడు వెడతాడు. కావాలన్నవి కోరి తెచ్చుకుంటాడు. నీలాగ యెవరూ వుండరు...'' తల్లి యీలా కూతురి మీద అభిమానం చేత అంటూంటే ''నా సంగతీ అంతే'' అంటూ శంకరరావు చేయి కడుక్కోటానికి లేచి పోయాడు. ఆ సమాధానానికి తల్లీ, కూతురు తెల్లబోవటం కంటె చేయకలిగిందేమీ లేక పోయింది.

* * *

తర్వాత మూడు రోజులు గడిచాయి....

ఆ మధ్యాహ్నం రెండు గంటల వేళ... కాశీ వ్యవధిలో ఆఫీసులో కూర్చుని వున్న గుమాస్తాల మధ్య కులాసా కబుర్లు దొర్లిపోతున్నాయ్! ఆ మర్నాడే భోగి పండుగ అవటం వల్లా, సంక్రాంతి సెలవులు వరుసగా పని రోజుల్లో రావటంవల్లా, అంతా కొత్తగా వివాహాలయిన వాళ్ళే అవటం వల్లా వాళ్ళ ఆఫీసరు గుమాస్తాల కోరిక ప్రకారం కొంత మందికి, ఆ తరువాత ఒకటి రెండు రోజులకు సెలవు గ్రాంటు చేయటం వల్లా, అన్నిటికంటే ముఖ్యంగా ఆ గుమాస్తాలందరికీ రావలసిన ఎరియరు మొత్తాలు, జీతాలతో పాటు ఆ వేళే ముట్టడం వల్లా వాళ్ళంతా చాలా వుషారుగా వున్నారు.

కబుర్ల మధ్యలో:

'ఏరా శంకరరావూ! నువ్వు పండుగలకు వెడుతున్నావా లేదా?'-విశ్వనాధం అనే మిత్రుడడగ్గా,

'ఏమో! చెప్పలేను'-అన్నాడు శంకరరావు అయోమయ స్థితిలో!

'అదే మిత్రా? మీ మామగారు కానీ ఆహ్వానంపంపించ లేదా? లేకుంటే నువ్వు కోరుకున్న ప్రజంటుకోసం భీష్మించావా?'...విశ్వనాధం తిరిగి అడిగాడు! మిగిలిన మిత్రులు శంకరరావుకేసి చూశారు.

'ఆహ్వానమూ అందింది. వెడితే బహుమానమూ ముడుతుంటె...కానీ బహుమానం తీసుకోటం యిష్టలేకనే నేవూరుకుంటున్నాను''

'అదే మిత్రా'...మిత్రులంతా ఒక్కసారి నవ్వారు.

'అవునర్రా! మా మామగారు మీ అందరి మామగార్ల వంటివాడూ కాదు...చాలా మంచివాడు. ఆయనంత విశాల మైన అభిప్రాయాలుకల వాళ్ళను నేయింతవరకూ చూడలేదు. మా అత్తగారూ అంతే! నేవెడితే ఆయనతప్పకుండా అప్పో సప్పో చేసి నాకోరిక తీరుస్తారు. నాకోరిక నెరవేర్చుకొని ఆయన్ను యిబ్బంది పెట్టడం యిష్టంలేకనే...నేనాగిపోదామనుకొంటున్నాను''

అక్కడ చేరిన మిత్రులంతా శంకరరావు వయిపు తిరిగి విచిత్రంగా చూశారు.

'ఇటువంటి తమాషా వ్యక్తుల్ని నేయెక్కడాచూడలేదు' శ్రీశైలరావనే గుమాస్తా అనగా,

'అత్తమామల దగ్గరనుంచి యేదోవిధంగా నాలుగు డబ్బులు గుంజుకోవటమే వివేకులలక్షణం'-అన్నాడు రాఘవ రావు.

'నువ్వు అల్లుళ్ళ మధ్య ఓ చీడపురుగువి'..విశ్వనాధం మాటలు చాలా కోపంతో నిండివున్నాయ్!

'మన శంకరరావులాంటి అల్లుళ్ళుండటం-మన అల్లుళ్ళ వర్గానికే కళంకం...మామల కష్టసుఖాలు మనకెందుకూ?'— సుబ్బారావనే స్నేహితుడీ మాటలనగా, శ్రీశైలరావు తిరిగి అన్నాడు!' అల్లుళ్ళమయిన మనం దక్కినంతా దక్కించుకుంటుండాలి! మనమంతా శంకరరావులా తయారవుతే-మామలే మనమీద స్వారీలు చేస్తారు'-అని...

ఆ తరువాత యింకా సంభాషణ సాగినా-అప్పటికి శంకరలావు తలంపులో మార్పురాలేదు.

* * *

ఆ మర్నాటి వుదయం-అంటే భోగినాటి వుదయం... అక్కదుర్గ భర్తతో అభ్యంగనం, టిఫిన్ కాఫీలు పూర్తిచేసుకొన్న శంకరరావు-గత దినం అందిన లెఖ్ఖంతా జేబులో వుంచుకొని బజారుకు బయలుదేరాడు! పండుగకు వెడతాడనుకొన్న తమ్ముడు, వెళ్ళకపోవటం దుర్గ కాశ్చర్యం కలిగించింది..

'అల్లుడిగారికిప్పటికి అలుక వచ్చిందేమో'-అందామె తల్లితో తమాషాగా! కానీ శంకరలావు వాళ్ళనసలు పట్టించుకోనే లేదు!

మార్గమధ్యంలో శంకరరావుకు పోస్టుమేన్ కనిపించి 'బాబూ! మీరత్తవారి వూరికి వెళ్ళలేదేమండీ-' అంటూ ఒక కార్డూ, రెండుకవర్లూ యిచ్చి నిష్క్రమించాడు.

శంకరరావు కవర్లమీద చిరునామా వ్రాతలూ పోస్టు ముద్రలూ పరిశీలిస్తూ: "అరే ఈ రెండూ నిన్న అందవల సినవి...ఈ వేళ వచ్చాయి...ఈ కవరు యీ వేళ అందాల్సిందే'-అనుకుంటూ, ముందుగా కార్డీలా చదువుకొన్నాడు:

విశాఖపట్టణం,
10-1-59.

నాయనా శంకరరావూ!

నీ వుత్తరం అందింది. నువ్వు నాకు పూర్వజన్మంలో చేసుకొన్న అదృష్టం కొద్దీ అల్లుడిగా లభించావు. అందుకే నేయెంతో సంతోషిస్తున్నాను. ఏది యేలాగున్నా-నువ్వు పండుగపూటా మా యింట-మా అమ్మాయితోపాటు మా కళ్ళపడకపోతే-తల్లితండ్రులుగా మాకు తృప్తి వుండదు. ప్రాధేయపూర్వకంగా కోరుతున్న నా కోరిక మన్నించు. ఇంతవరకూ బయలుదేరకుంటే, వెంటనే బయలుదేరు.

ఇట్లు నీ మామ,
వెంకట్రామయ్య

'మ్చు...మామగారెంత అమాయకులు'--అనుకుంటూ, మరో వుత్తరం చించాడు శంకరరావు అది అతడి భార్య వ్రాసిన వుత్తరం.

శంకరరావు మందహాసంతో, ఆ వుత్తరం కేసి చూసి, యీలా చదువుకొన్నాడు:

విశాఖపట్టణం
10-1-59

ప్రియమైన శంకరరావు బావగార్కి,

మీ అర్ధాంగి శారద నమస్కరించి వ్రాసేది:

నే అక్కడనుంచి వచ్చింతరువాత, మీనుంచి వుత్తరం వస్తుందని ఆశతో యెదురుచూసి, నిరాశపొంది యిప్పుడే వుత్తరం వ్రాస్తున్నాను. ఆడదాన్నయిపుట్టడంవల్ల యెంత చదువుకొన్నా-సిగ్గువల్ల యింతవరకూ వుపేక్ష చేశాను; నన్ను మన్నించండి.

మీరు నాన్నగారికి వ్రాసిన వుత్తరం చూశాను. పండగకు రాకుండా తప్పించుకోటంకోసం-మీరు యెత్తువేసినట్లుగా మా వాళ్ళంతా అనుకుంటున్నారు. మీ మనస్సు ఎటువంటిదో మా వాళ్ళందరికీ తెలుసు. మీలాంటి కష్టసుఖాలు తెలిసి, సర్దుకుపోయే మనుషులు దొరికినందుకు-మావాళ్లు చాలా సంతోషిస్తున్నారు. ఏమైనా ప్రస్తుత పరిస్థితులు మ్చు...

మనం ఒకళ్ళముఖాలు, మరొకళ్ళం చూసుకొని అప్పుడే చాలారోజులైంది. మీకేలా వుంటోందో కానీ-నామనస్సులో అనేకరకాల తీపి, తీపి ఆలోచనలూ, కోర్కెలూ బయలు దేరుతున్నాయి. ఇంత దీర్ఘ వ్యవధి మనం విడిగా-నే కాపురాని కొచ్చినతరువాత వున్నది లేదుకదా! ఇంతకంటె విడమర్చి నేయేం వ్రాయగలను చెప్పండి?

ఏమైనా-మీరు పేక్ష చేయకండి...తప్పకుండా వచ్చి తీరాలి.

ఇట్లు మీ ప్రియ
శారద

శంకరరావు, ముసి ముసి నవ్వుకుంటూ మూడో కవరు తీసాడు:

అది సంక్రాంతి శుభకాంక్షల వుత్తరం: రాజమండ్రంలో రేడియో షాపు నడుపుతున్న అతడి స్నేహితుడు రెడ్డి పంపించాడీపండుగ సందర్భంలో:

"ఓ...మారెడ్డి రాజమండ్రంలో రేడియో షాపు పెట్టాడుగా!

సమయానికీ వుత్తరం చక్కగా జ్ఞాపకం చేసింది..., ఇకనేం... నేచాలా అదృష్టవంతుడ్ని"-అనుకుంటూ శంకరరావు వెనకకు తిరిగి వడిగా యింటికి నడిచాడు.

* * *

అప్పటికి ఉదయం తొమ్మిదిన్నర గంటలయివుంటుంది.. సరిగ్గా మరో పావుగంటకు, విశాఖపట్టణం వయిపు వెళ్ళే ప్యాసింజరుండటంవల్ల,శంకరరావు-హడావిడిగా తన గదిలో ప్రవేశించి, ఒ పెట్టిలో తన బట్టలు సర్దుకుంటున్నాడు,

అతడి హడావిడి యెందుకో అర్థంగాక కాబోలు, యింట్లో ఆ సమయానికి వున్నవాళ్ళంతా అక్కడికి వచ్చి అతడికేసి చూశారు. "ఎక్కడికి ప్రయాణం" శంకరరావును తండ్రి ప్రశ్నించాడు.

తండ్రంటే శంకరరావుకు మంచి గౌరవం వుంది: ఆయన కొడుకు స్వేచ్ఛ కెప్పుడూ అడ్డు రాడు. "ఎవరి

యిష్ట ప్రకారం వాళ్లు నడుచుకు పోతూండాలి'' అంటూంటా డాయన.

''మామగారు రావలసిందని తిరిగి వుత్తరం వ్రాశారు నాన్నా! ఆయన మనస్సుకు కష్టం కల్గించటం యిష్టం లేక యిప్పుడు బయలుదేరుతున్నాను'' అన్నాడు శంకరరావు.

''బాగుంది'' అంటూ ఆయ నక్కడినుంచి నిష్క్రమించాడు. ఇంక అక్కడ మిగిలింది ముగ్గురు.

''మామయ్యగారంత ప్రేమగా వుత్తరం వ్రాశారంటే నిజంగా నువ్వు ఎంత అదృష్టవంతుడవోయ్ బావా!'' తన బావగారనగా, ''ఏం'' అన్నాడు శంకరరావు, పెట్టికి తాళం వేస్తూ!

''ఏం... ఏమిటీ! బ్రతిమాలే మామగారు ప్రతీవాళ్ళకూ దొరుకుతారా; ఏమండోయ్! ఈ పట్టు మీ బావమఱది... రేడియో తీసుకురావటం కరక్టు. పనిలో పని... రికార్డు ప్లేయరూ; నాలుగు రికార్డులూకూడా తీసుకు రమ్మంటున్నా'' అంది దుర్గ వ్యంగ్యంగా నవ్వుతూ!

''ఇప్పటికి ఈ ఆహ్వానం వచ్చిందా... ఇక రేడియో'' తల్లి విసురుగా అంటూంటే,

''రేడియో తప్పకుండా రికార్డు ప్లేయరుతో, రికార్డులతోనే తెస్తా కానీ బావా... ఈలోగా నువ్వు మాత్రం అక్కయ్యతో కలిసి డాన్సు చేయటం నేర్చుకో'' ఈలా తమాషాగా అంటూ,

ఆ దంపతులు నిర్ఘాంతపోతూండగా, శంకరరావు బయటకు పెట్టెతో వచ్చేశాడు.

* * *

పెద్ద పండుగ నాటి ఉదయం...

సంక్రాంతి పండుగ కళ కళలు ప్రతీ యింట్లోనూ కనిపించుతూండగా, ప్రతీ వీధి మధ్య భాగంలోనూ పెద్దపెద్ద భోగి మంటలు యింకా మండుతూండగా, హరిదాసులు ''హరిలో రంగా హరి'' అంటూ భజనలు చేస్తూ, పరుగుల్తీస్తూండంగా, గంగిరెద్దుల వాళ్లు ఎద్ల నాడిస్తూ, సన్నాయి ఆలాపిస్తూండగా, వీధుల్లోని పెద్ద పెద్ద ముగ్గులు ఆంధ్రిత్వాన్ని ఋజువు చేస్తూండగా, ఆ ముగ్గుల మధ్య కన్నె పిల్లలు గొబ్బి పూజలు జరుపుతూండగా ఏడు గంటల వేళ విశాఖ పట్టణంలో వెంకట్రామయ్యగారి యింటి ముందు ఓ జట్కా ఆగింది.

''సుబ్బీ గొబ్బెమ్మా... సుబ్బడ్నివ్వవే''
''చామంతి పువ్వంటీ... చెల్లెల్నివ్వావే''
తమ్మిపూవంటీ,...,తమ్ముడ్నివ్వావే''
''మొగలీ పూవంటీ.,..మొగుడ్నివ్వావే''...ఈలా ఎనిమిది సంవత్సరాల రాధ. గొబ్బెమ్మల చుట్టూ ప్రదక్షిణం చేస్తూ, పాడుతూ, జట్కారాకతో ఆగి, దాంట్లోకి తొంగి చూసి, ముఖం ఆనందంతో పెద్దది చేసుకొని; ''అక్క యోయ్! బావ వచ్చాడేవ్!''-అంటూయెక్కడ వస్తువులక్కడ వదిలి యింట్లోకి వడిగా పరుగెత్తింది,

అప్పుడే జట్కా దిగిన శంకరరావు, వీధి అరుగు యెక్కాడు. అతడి వెనకనే జట్కా మనిషి—ఓమామూలు పెట్టె, మరో పెద్ద అట్ట పెట్టె తెచ్చి అరుగుమీద వుంచాడు. శంకరరావు అతడికి కూలి యిచ్చి-పంపించేలోగా-యింట్లో వాళ్ళందరూ ఒక్కసారి అక్కడికి వచ్చారు. ఇంత వరకూ-యేదో లోటుతో, వెల, వెల బోతున్నట్లుగా కనిపించిన ఆ యిల్లు శంకరరావు రాకతో ''పండుగలకు యిళ్ళకు అల్లుళ్ళందం''- అనే ధోరణిలో కల కల లాడింది. ''కులాసా ఆ..నాయనా?''అని యోగక్షేమంచేస్తూ,అత్త రాజేశ్వరమ్మ అక్కడికివచ్చి, శంకరరావుకుకాళ్ళు కడుక్కోటానికి నీళ్ళు యిచ్చింది. ''వచ్చావా నాయనా! నామాటదక్కించావ్''-వెంకట్రామయ్యగారు ఆనందం ప్రదర్శిస్తూ లోపలిగదిలోంచి, పడక కుర్చీ తెచ్చి వీధి అరుగు మీద వేసి కూర్చోమన్నాడు!

నడవగుమ్మంలోంచి-మాట్లాడటానికి, ఆ సమయంలో మాటలు లేనందు వల్ల కాబోలు-శారద మందహాసంతో భర్త కేసి మధ్య, మధ్య అరుగు మీద వున్న వస్తువులకేసి చూస్తోంది. బావ మఱదులూ, మఱదళ్ళూ, శంకరరావు కేసి ఆపేక్షగా చూస్తూ, ''బావ వచ్చాడు''-అంటున్నారు వుల్లాసంతో!

కాళ్ళూ, చేతులూ కడుక్కొన్న శంకరరావు కుర్చీలో కూర్చుంటూ, ''మామగారు అర్థంలేని శ్రమపడుతున్నా ర''న్నాడు.

''శ్రమకేంవుంది నాయనా! నే తిరిగి వ్రాసిన వుత్తరం అందే వుంటుంది! అందుకనే యీ వేళ వచ్చావ్! మొన్న దసరా పండుగలకు వచ్చాంకదా....అని నువ్వు అశ్రద్ధ చేస్తావేమోనని నే నీళ్ళు కారిపోయాను. నిన్న పండుగ

రోజయినా-నువ్వు లేకపోవటం వల్ల కళ లేకుండా పోయింది''-అన్నాడు వేంకట్రామయ్యగారు ప్రేమతో! అతడి అత్త రాజేశ్వరమ్మ గూడా, ''అంతే నాయనా! ఏ సమయానికి ఆ అందం జరుపుకోవాలి! డబ్బు శాశ్వతమా''-అంటూ యింట్లోకి నడిచింది.

శంకరరావు, యింకా బాధతో అంటున్నాడు ''ఏదో పెద్ద వారు! మీరాలెండో వుత్తరంలో అంత యిదిగా రాయటం వల్ల-మీ మాట తీసి వేయలేకనే వచ్చాను కానీ మామగారూ! రెండు పండుగలకు నేవచ్చాను కదా-మీరింకా బాధ పడితే యెట్లా చెప్పండి? మీ అమ్మా యంటే తప్పదు; ఈ రోజులు అల్లుళ్ళను పిలిచి అందలం యెక్కించేలాగున్నాయా?...,''

వెంకట్రామయ్యగారు, ముసి, ముసి నవ్వి అన్నాడు; ''నీ అంత విశాలహృదయం....నూతన భావాలూ అందరల్లుళ్ళలోనూ వుంటాయా నాయనా? మేం నిజంగా అదృష్టవంతులం ''ముందు కాలకృత్యాలు తీర్చుకొన్నావా?''

''కాఫీ, స్నానం మినహాగా అన్నీ అయ్యాయండి''....శంకరరావు తమాషాగా అనగా, వెంకట్రామయ్యగారు ఓ చిన్న స్టూలు తెచ్చి-అల్లుడి పడక కుర్చీముందు వుంచాడు...,శారద సిగ్గు పడుతూ, టిఫిన్ కాఫీలు తెచ్చి స్టూలు మీద వుంచింది, భార్య కేసి, మందహాసంతో చూసిన-శంకరరావు టిఫిన్ తినటాని కుపక్రమించాడు. శారద తిరిగి నడవగుమ్మంలో నిల్చుని-మామా అల్లుళ్ళ సంభాషణలు వింటోంది.

వెంకట్రామయ్యగారు, తిరిగి యేవో ప్రశ్నలు వేయబోతూంటే-చిన్న బావ మఱది సత్యం అంత వరకూ చూస్తున్న దృష్టిని మార్చుకొని; ''అది రేడియో...,ఆ....బావా'' అని అడిగాడు! ఇప్పుడందరిదృష్టీ ఆ పెద్ద అట్టపెట్టె మీదకు వెళ్ళింది.

''ఆ...,మన రేడియో రా బావా! నిన్న రాజమండ్రంలో కొన్నాను మామగారూ! దీని కోసం నిన్న నే రాజమండ్రంలో దిగటంవల్లనే, రాత్రికి రాలేక పోయాను. ఈవేళ మధ్యాహ్నం రెండు-మూడు గంటల మధ్య బాగుందటకాదూ?అప్పుడు పెద్దవారుమీరు దీన్నిఓపెన్ చేయాలి...'' శంకరరావు యీ మాటలు మంచి దృష్టిలో అని కాఫీ త్రాగటం పూర్తిచేశాడు. ఈ మాత్రానికే వెంకట్రామయ్యగారి వదనం యెందుకో వెల, వెలబోయింది. మానవుడెప్పుడూ పరిస్థితుల వారసుడు కదా! అయితే-

ఆయన తనలో బయలు దేరిన బాధ బయటకు ప్రదర్శించకుండా ''మంచిదే....దీని ఖరీదు యెంత?'' అని అడిగాడు. ''ఎంతయితేం లేండి''..,శంకరరావు ధర దాచబోయాడు. ''ఫరవా లేదు చెప్పు నాయనా!...,''

—శంకరరావు తన జేబులోంచి రసీదు చూపించాడు! అది మంచి కంపెనీ రేడియోయే! ఖరీదు-దుర్గావాంఛించే అయిదు వందలే! రాజమండ్రంలో రెడ్డి కొట్లో అతడు దీన్ని పుచ్చుకోటం జరిగింది. ''రెడ్డి నా స్నేహితుడు లెండి ....మీ మనస్సును కష్ట పెట్టడం యిష్టం లేకపోవటం చేతనూ, కొన్ని ప్రత్యేక సమస్యలను యెదుర్కోవటం కోసం,...

మా మిత్రుడి దగ్గరనే దీన్ని పుచ్చుకోవటం జరిగింది.'' -ఈలా శంకరరావు ఇంకా యేమిటో సర్దిచెప్ప బోయాడు. కానీ ముసలాయన కా మాటలు రుచించలేదు. ఏదోబాధతో-

''సరి....నువ్వు అభ్యంగన స్నానం చేయాలి'' నే మంగలిని పిల్చుకు వస్తాను''....అన్నాడాయన.

''నిన్ననే తల అంటుకున్నాను కదండీ....''

''అది మీ యిల్లు-ఇది మాయిల్లు....తెలిసిందా, తొందరగా తెములు...''అంటూ వెంకట్రామయ్యగారు నవ్వుతూ బయటకునిష్క్రమించాడు. తండ్రి ఆలా బయటకునిష్క్రమించటంతోటే, శారద వీధిలోకి వచ్చి, భర్తకేసి చూస్తూ ''మొత్తానికి అల్లుడుగారు....రేడియో కొనేశారు'' అంది తమాషాగా!

''ఆ...మీ నాన్నగారి మాట తీసేయలేకా,మావాళ్ళమధ్య నీబాధ భరించలేకానే దీన్ని పుచ్చుకోవటం జరిగింది''-శంకరరావు భార్యకేసి నవ్వుతూ చూశాడు.

''పోనీ లెండి... మీ అక్కయ్యగారి అయిదువందల రూపాయల రేడియో ముక్కవా తీర్చారు; మరినన్ను చెప్పటానికీ అవకాశం లేకుండా చేశారు.....మరి రేడియో యెక్కడ పెడతారూ?''

''రేడియో గొడవ మధ్యాహ్నం చూదాం.,ముందు:.వీటి

సంగతి చూడు"-శంకరరావు కుర్చీలోంచి లేచి, తన పెట్టె తెరచి, కొన్ని వస్తువులూ, గుడ్డలూ బయటపడేశాడు. భార్యా, మిగిలినపిల్లలూ వాటికేసి ఆశక్తితో చూస్తూంటే అతడు ఒక్కొక్క వస్తువే తీసి చూపిస్తూ అనటం సాగించాడు:..''సమయానికి నేరాజమండ్రంలో దిగటంవల్ల అన్ని వస్తువులూ అమిరాయి! జీతంతోబాటు ఎర్రియరు మొత్తం కలసి వచ్చింది ఖర్చులకు.., నువ్వు గంధం కలరు క్రేపు సిల్కు చీర నన్నొకసారి తెచ్చి పెట్టమన్నావ్ జ్ఞాపకం వుందా... అది యిదిగో! ఇది దానిమీదకు రవికలగుడ్డ! ఆ చీరమీదకు యీరంగయితేనే బాగుంటుంది...ఇది మా మరదలు రాధకు గుంటూరు కణువు గుడ్డ; పరికిణీ, జాకెట్టులకోసం, పనికట్టుకుతెచ్చాను.. ఈ ఫ్రాకు-వుయాల్లో వున్న మా బుల్లి మఱదలుకు! మా బావమరదులందరికీ చొక్కాలూ, లాగులూ తెద్దామని అభిలాష కలిగింది. కొలతలు కుదరవని గుడ్డలు కొనుక్కువచ్చాను. ఈపొట్లం... మనవాళ్ళందరికీ బిస్కత్తులు!అది చామంతి పువ్వులపొట్లం.. ఏంచేస్తేంకానీ...మీ అమ్మగారికీ, నాన్నగారికీ యేమీ తీసుకు రాలేదు. అదే నా బాధ...''

"చాలా బాగుందండీ...మీరు కష్టపడి తెస్తే, మట్టుకు వాళ్లు పుచ్చుకుంటారేమిటి? మీ అక్కగారన్నట్లుగా....వాళ్లు మీకు బహూకరించటం ధర్మంకానీ-మీరు వాళ్ళకివ్వటం కాదు...'' శారద ప్రేమతో, అంటూంటే, సరిగ్గా అదే సమయానికి, వీధి అరుగు యెక్కిన వెంకట్రామయ్యగారు నవ్వుతూ!' 'ఏమిటోయ్! రాజమండ్రం అంతా కొనుక్కువచ్చేసినట్లున్నావ్!'

ఊ...'ముందులే..అవతల వాడొచ్చాడు'-అన్నాడు. సిగ్గుపడుతూ. శారద అక్కడి వస్తువులు సర్దుతూండగా, శంకరరావు అభ్యంగన స్నానం చేయటానికి లేచాడు!

* * *

మధ్యాహ్నం పన్నెండు గంటలవేళ..ఆనందంతో నిండిన వేళాకోళపు కబుర్ల మధ్య-శంకరరావు మామా, బావమరదులతో కలసి భోజనం చేశాడు

అనంతరం-అతడు తన కేర్పాటు చేయబడిన గదిలో రేడియో ఏరియల్ వగైరాలు బిగించి, మంచి ముహూర్తకాలమైన రెండు గంటలకోసం యెదురుచూస్తూ, మంచం మీద నడ్డి వాల్చి భార్యతో మంచీ చెడ్డా మాట్లాడుతున్నాడు. భర్త తెచ్చిన చీర కట్టుకొని, అతడి కెదురుగావున్న బల్లమీద కూర్చొని-శారద యేమిటో చెబుతూ, మధ్యమధ్య నవ్వుతోంది.

కొత్త బట్టలు కట్టుకొన్న పిల్లలంతా-రేడియో వినటానికి గదిలోకి వచ్చి-దానికేసి కుతూహలంగా చూస్తూంటే...ఏలాగయితేనేం-రెండు గంటలయింది.

శంకరరావు మంచం మీద లేచి కూర్చుని-రేడియోవదలటానికి-మామగారికి కబురు పంపబోతూండగా ఆయనే దిగాలు ముఖంతో గుమ్మంలోకి వచ్చి నిల్చున్నాడు: 'ఓమారీలారావోయ్-'అంటూ! పెద్ద బావమఱది రామూ, ఆయన వెనకనే జామారు వగైరాలతో నిల్చుని బావకేసి చూస్తున్నాడు.

శారద సిగ్గుతో లేచి నిల్చొనగా-శంకరరావు మామగారున్న గదిలో ప్రవేశించి, మందహాసంతో: ''ఇవ్వరాబావా! నే యెంత చెప్పినా మీ నాన్నగారు నాకు బహుమానాలివ్వటం మానరు''-అని రామూ తాంబూలం, జామారూ, ఏదో కాగితం యివ్వగా పుచ్చుకొని 'ఈ కాగితం యేమిటి' అని అడిగాడు.

వెంకట్రామయ్యగారు అపరాధం చేసినట్లుగా "అదినోటు నాయనా! ఎంత ప్రయత్నించినా లెఖ్ఖ సర్దుబాటవలేదు.అందువల్ల...'-అనియేమిటో చెప్పబోయాడు.

శంకరరావు కిప్పుడు నిజంగా కోపం వచ్చేసింది. గదిలోంచి భార్యా, వంటగదిలోంచి అత్తగారూ, మిగిలిన పిల్లలూ విచిత్రంగా చూస్తూంటే అతడావేశంతో 'మామగారూ! పెద్దవారయివుండి మీరు నన్నిలా అర్థంచేసుకొన్నందుకు నేచాలా విచారిస్తున్నాను. నేను డబ్బుమనిషిని కాను. నాకు కష్టసుఖాలు బాగా తెలుసు. హృదయంకావాలి.. నే రేడియోకోసం మీ యింటికి రాలేదు. నే దాన్ని నా ఆనందంకోసం పుచ్చుకోలేదు కూడా! నాకుదానిమీద ఆసక్తి లేదు. రాజమండ్రంలో రెడ్డి అనే నా మిత్రుడు రేడియో షాపు పెట్టడంవల్ల నెలకు పాతిక రూపాయలు నాజీతం లోంచి చెల్లించే షరతు మీదనే దీన్ని పుచ్చుకొన్నాను. ఈ సంగతి మా యిద్దరి మధ్యే రహస్యంగా వుంటుంది.జరిగిందేదో జరిగింది...మీకు నిజంగా నామీద అభిమానంవుంటే.. ఈనోటు వెంటనే చించి పారేయండి. ఆ మొత్తం వాయిదాల్లో నన్నే చెల్లించుకోనివ్వండి...అవిధంగా నన్ను మీ సన్ని

హితుడ్ని చేసుకోండి'—అంటూ వెంకట్రామయ్యగారిచేతుల్లో ఆ నోటు నుంచాడు.

ఈ సంఘటన చూస్తున్న పిల్లలు విషయం అర్థంగాక, నిర్ఘాంతపోతూండగా-శారదా, రాజేశ్వరమ్మలకళ్లు ఆనందంతో చమర్చుతూండగా-

వెంకట్రామయ్యగారు చెమర్చిన కళ్లతు డచకఁటూ ఆ నోటునుచించేసి! "నాయనా! నీలాంటి ఔదార్యంగల అల్లుళ్ళు నూటికి ఒక్కళ్లున్నా...మామయ్యలస్థితి హీనమ ఎదు.... ముందునడు. . రేడియో పెడదాం-'' అంటూ, అల్లుడి వెనకనే గదిలోకి నడిచాడు!

మన సంస్కృతి, మన నాగరికత, మన స్వరాజ్యం — ఇవి మన జీవితావసరాలని ఎక్కువ చేసుకోవడం వల్ల కాపాడుకోలేము; అవసరాల్ని తగ్గించుకుని స్వార్థరహితమైన ప్రవర్తన అలవరచుకోవడం వల్ల కాపాడుకుంటాం.

— గాంధీజీ.

*　　*　　*

పండితులైన వారు దిగువందగ నుండఁగ నల్పుఁ డొక్కఁడు
ద్దండతఁ బీఠ మెక్కిన బుధప్రకరంబుల కేమి యెగ్గగున్
కొండొక కోఁతి చెట్టు కొన కొమ్మల నుండగఁ గ్రింద గండ భే
రుండ మదేభ సింహ నికురుంబము లుండవె చేరి భాస్కరా!

సంక్రాంతి హేల

— శ్రీ ఓలేటి శేషాచార్యులు

ఏ ఏటికాయేడు
కొంగ్రొత్త వెలుగుతో
పసుపు పూతల దివ్య
పారాణి పాదముల
భోగి మంటల. భాగ్య
పౌష్య లక్ష్మి. నేడు
నవ్యాంధ్ర తేజమ్ము
నలుదిశల వెలిగింప
వచ్చింది వచ్చింది
వచ్చింది సంక్రాంతి.

మండు ఎండలలోన
నిండు వర్షములోన
కండలను కరగించి
చెమటోడ్చిన ఫలము
బంగారు ధాన్యాల
వత్సరపుతొలి ఫలము
రైతు భాగ్యము దిద్దు
జీవితాశాలక్ష్మి
వచ్చింది వచ్చింది
వచ్చింది సంక్రాంతి.

తెల్గు వెలదికి నేడు
వెల్గు తిలకము అమరె
తెన్గు యువకుడి కనుల
నవ్య తేజము మెరసె
వెన్న పూసను బోలు
లేత కన్నియ మనసు
చివురించినను తీపి
కోర్కులూరించంగ
వచ్చింది వచ్చింది
వచ్చింది సంక్రాంతి.

తెల్గు తల్లికంఠ
దివ్య మణిమాలికలు
గోదావరీ కృష్ణ
నదులు చల్లగ చూడ
కళకళా లాడేటి
పచ్చపచ్చని పైరు
పుడమియే పులకించి
కిలకిలానవు నవ్వ
వచ్చింది వచ్చింది
వచ్చింది సంక్రాంతి.

ప్రకృతి ఒడిలో మెరయు
'హిమ బిందు' ముత్తెములు
చలిగాలి దెబ్బలకు
'చెలి' వేడి ఓదార్పు
'ముగ్ధాంగనల' ఓలె
ముద్ద బంతుల కులుకు
ప్రణయ బంధన 'ఖేల'
హేమంత ఋతుడోల,
వచ్చింది వచ్చింది
వచ్చింది సంక్రాంతి.

విశ్వ శాంతి ముక్త
మధుర గీతమ్ములను
'కవి' కోకిలలు కంఠ
ములు, ఎత్తి పాడంగ
సర్వాంధ్ర సామ్రాజ్య
సౌభాగ్య సౌధమున
పౌష్య 'కల్యాణి' హస్తముల
దీపాలు వెలిగింప
వచ్చింది వచ్చింది
వచ్చింది సంక్రాంతి.

ఏ వీధి చూచినా
రంగ వల్లుల ప్రభలు
ప్రతి ఇంటి గుమ్మాన
గొబ్బిళ్ల సౌరభం
ప్రతి తెనుగు వారింట
సంక్రాంతి నవశోభ
అఖిలాంధ్ర దేశమే
ఆనంద హేల
వచ్చింది వచ్చింది
వచ్చింది సంక్రాంతి.

ఆంధ్రప్రదేశ్‌లో

గాజు పరిశ్రమ

— శ్రీ ప్రతాప ప్రభాకరరావు

భారత దేశంలో గాజు పరిశ్రమ ఇప్పుడిప్పుడే అభివృద్ధి పొందుతున్నది. బెంగాలు, బొంబాయి, ఉత్తర ప్రదేశ్ రాష్ట్రాలలో ఈ పరిశ్రమ కొంత వరకు అభివృద్ధి గాంచినది. భవిష్యత్తులో ఇతోధికంగా పెంపొందే సూచనలు కనిపిస్తున్నవి. బీహారులో పలక గాజు (Sheet glass) పరిశ్రమ కొన్ని సంవత్సరాలుగా సాగుతున్నది. బెంగాలులోని దుర్గాపూరు వద్ద కండ్లద్దాల ఫ్యాక్టరీ స్థాపనకు ప్రయత్నాలు చురుకుగా జరుగుతున్నాయి. ఇవేకాక, మామూలు గాజు సామాను-ముఖ్యంగా సీసాలు, సీసపు చిమ్నీలు వగైరా-తయారు చేసే ఫ్యాక్టరీలు దాదాపు అన్ని రాష్ట్రాలలో ఇదివరకే నెలకొన్నాయి. ఆంధ్ర, మద్రాసు రాష్ట్రాలలో ఉన్న ఫ్యాక్టరీలలో కొన్ని మాత్రమే ప్రస్తుతం పని చేస్తున్నాయి. ఆర్థిక కారణాల వల్లనూ, సక్రమమైన యాజమాన్యంలోపించడం వల్లనూ, కార్మిక-యజమానుల సంఘర్షణల వల్లనూ కొన్ని కర్మాగారాలు మూతపడి ఉన్నాయి.

ఆంధ్ర ప్రదేశ్‌లో నాలుగు ఫ్యాక్టరీలున్నాయి. వీటిలో మూడు ఫ్యాక్టరీలు హైద్రాబాదు వద్ద, నాలుగవది నెల్లూరు జిల్లా గూడూరు వద్ద ఉన్నాయి. హైద్రాబాదు వద్ద ఉన్న మూసెంబిలో కోహినూరు గ్లాసు ఫ్యాక్టరీ ఒకటి మాత్రమే పని చేస్తున్నది. రకరకములైన గాజు కప్పులు, పళ్ళెములు, సీసాలు, చిమ్నీలు ఇక్కడ తయారౌతున్నాయి. ఇక్కడి సరుకు ఇతర రాష్ట్రాలకే గాక, సింహళం లాంటి ఇతర దేశాలకు కూడా ఎగుమతి చేయబడుచున్నది. ఆంధ్ర ప్రాంతంలో ప్రధానంగా సీసాలకు గిరాకి అధికంగా ఉన్నది. హైద్రాబాదులోనే కొంత పేరు ప్రఖ్యాతులు గడించిన 'తాజ్ గ్లాస్ వర్క్స్' అనునది కొన్ని సంవత్సరాల క్రిందట మూసివేయబడినది. ఆధునిక యంత్ర పరికరాలు సమృద్ధిగా నున్న ఈ ఫ్యాక్టరీలో పలక గాజు తయారు చేయాలనే ప్రయత్నం జరిగింది. కాని దురదృష్ట వశాత్తు, కారణాంతరాలచే కర్మాగారం మూసివేయబడింది. త్వరలో ఇది ప్రభుత్వ యాజమాన్యం క్రింద పునురుద్ధరింప బడుతోందని విశ్వసనీయంగా తెలుస్తున్నది. హైద్రాబాదు సమీపంలో లింగంపల్లి వద్ద మరొక గాజు ఫ్యాక్టరీ చాలాకాలం క్రిందనే మూతపడి ఉన్నది. గూడూరులోని ప్రభుత్వ గ్లాసు ఫ్యాక్టరీ ఇంకనూ ప్రారంభ దశయందే ఉన్నది. ఈ ఫ్యాక్టరీలో భారీయెత్తున ఉత్పత్తి సాగించడానికి నిపుణులు సమగ్రమైన పథకం రూపొందించుచున్నారు. గూడూరు ఫ్యాక్టరీలోను, చిత్తూరు జిల్లా పాపానాయుడిపేటలోను, అనంతపూర్ జిల్లా గుట్టూరులోను, విశాఖ పట్టణం జిల్లా సింహాచలంలోను గాజు పూసలు తయారు చేసే కేంద్రాలున్నవి. గూడూరు ఫ్యాక్టరీలో రకరకములైన గాజులు చేయుచుండిరి

గాజు పరిశ్రమకు అవసరమైన శిలాస్ఫటికము (quarts) భూస్ఫటికము (Frelspar), సున్నము (lime), ఇసుక (sand) మొదలగు ముడిపదార్థములు ఆంధ్ర ప్రదేశములో సమృద్ధిగా లభించగలవు. వీటిలో 'క్వార్ట్జు' ఫెల్స్పార్ అను ముడిద్రవ్యములు నెల్లూరు, హైద్రాబాదు ప్రాంతాలలో గనుల నుండి ఉత్పత్తియగుచున్నవి. గుంటూరు జిల్లాలో పుష్కలముగా సున్నము లభ్యము కాగలదని భూగర్భ శాస్త్రజ్ఞులు అంచనా వేసియుండిరి. గుంటూరు జిల్లా బాపట్ల వద్ద స్వచ్ఛమైన తెల్లని ఇసుక సమృద్ధిగా లభించును. గాజు

పరిశ్రమలలో ఉత్తమమైన సరుకును తయారు చేయుటకు ఈ తెల్లని ఇసుక అత్యంత ప్రయోజనకారి కాగలదని నిపుణుల అభిప్రాయము. ప్రస్తుతం మూసివేయబడి ఉన్న ఫ్యాక్టరీలు పునరుద్ధరింపబడినను, నూతనంగా నెలకొనినను, ఆంధ్ర దేశంలో ముడి పదార్థముల కొరత ఉండనే ఉండదు.

నిత్య జీవితములో గాజు వస్తువులు మానవునికి ఎంతో అవసరమై ఉన్నవి. గాజు సామాను ఆకర్షణీయమైనదే కాక, లోహపు వస్తువుల కంటె చౌకగా లభించును. పారిశుద్ధ్యమునకు, అలంకారమునకు గాజు సామాను పెట్టింది పేరు. గృహావసరములైన గాజు పాత్రలు. కిటికీలకు అమర్చబడిన గాజు పలకలు, ప్రతిబింబము చూపు అద్దములు వగైరా మాత్రమే కాక, సులోచనముల అవసరము నిత్యజీవితములో అధికముగా కన్పట్టుచున్నది. ఇంతేకాక విద్యా సంస్థల యందలి లేబరేటరీలలో టెస్ట్ ట్యూబులు, ద్రావకాలను, రసాయనిక పదార్థాలను భద్రపరచుటకు సీసాలు, ప్రయోగములు చేయుటకు, తదితర పరిశోధనలు కొనసాగించుటకు గాజు ఉపకరణములు (apparatus) అత్యావశ్యకములై యున్నవి. మోటారు కారులకు, విమానములకు సేఫ్టీ గ్లాసు పలకలు (safety glass sheets) అమర్చబడుచున్నవి. ఆఫీసులలో ధ్వని చొరవీలు కాకుండా (sound proof glass) గాజు పలకలు అమర్చుట నేటి నాగరిక లక్షణమైయున్నది. టెలిఫోను బూత్‌లలో గూడా ఇట్టివి అమర్చబడుచున్నవి.

ఇన్ని అవసరములు తీర్చుచున్న గాజు పదార్థమును ఆంధ్రలో అధికముగా ఉత్పత్తి చేయుటకు అవకాశములున్నవి. ఆంధ్ర రాష్ట్రములో గాజు పరిశ్రమను అభివృద్ధి చేయుటకు అవసరమైన పెట్టుబడి ధనము కావలసినంతగా దొరకగలదు. కాని ఏ కారణముననో ఇతర పరిశ్రమలపై చూపుచున్న శ్రద్ధాసక్తులు గాజు పరిశ్రమపై చూపుటలేదు, భారతదేశమందు పంచవర్ష ప్రణాళికలు అమలు జరుపు ప్రస్తుత కాలమున గాజు పరిశ్రమాభివృద్ధికి ఇటు ప్రభుత్వమును, అటు పెట్టుబడిదారులును ఇతోధికమైన కృషిజరుపవలయును. గాజుపరిశ్రమవలని ప్రయోజనములను ప్రభుత్వం ప్రచారము చేసి పెట్టుబడిదారులకు అన్ని విధముల ప్రోత్సాహ పర్చవలయును. ఈ పరిశ్రమకు సంబంధించిన సాంకేతిక నిపుణులు-పట్టభద్రులు, డిప్లొమా పొందినవారు-చాలినంతగా ఆంధ్రప్రదేశమందున్నారు. గాజు పరిశ్రమను అభివృద్ధిచేయుటకు ఈ నిపుణుల సహకారము ఎంతయో అవసరము.

ఆపదలందు ధైర్యగుణ, మంచిత సంపదలందుఁ దాల్మియున్
భూపసభాంతరాళమునఁ బుష్కల వాక్చతురత్వమాజి బా
హాపటు శక్తియున్, యశమునందనురక్తియు, విద్యయందు వాం
ఛాపరి వృద్ధియున్, బ్రకృతి సిద్ధ గుణంబులు సజ్జనాళికిన్

పల్లెలలో సంక్రాంతి

— శ్రీ ఉత్పల సత్యనారాయణాచార్య

రంగు రంగు పూలు రైతాంగపుంబూలు
పల్లె పిల్ల జడకు బంతి పూలు
స్నిగ్ధ పరిమళాలు ముగ్ధ సురభిళాలు
నడి వయసు పడతికి నవరసాలు !

దురధిగమమ్ములయ్యెడును
      ద్రోవలు చుక్కమెఱుంగు త్రోవలై
తరుణుల మోహ వాగురల
      తావులునై కడు నల్లిబిల్లి జుం
జుఱువల తీవలై మెఱసి
      చుక్కల ముగ్గులు పల్లెఁబల్లెఁ గ్రి
క్కిఱిసి సమైక్య భావమెఱిఁ
      గించెడు జాతికి జీవమిచ్చుచున్.

అడుగో ! వచ్చినాఁడు హరిదాసుఁడచటికి
చిట్టి తల్లి చిన్ని చేతులెత్తి
పెట్టుచుండె మురిసి బిచ్చమ్ము, నాతఁడు
వంగి వంగి కైకొనంగ వలసె.

గుమ్మడికాయ చెంబు తలకున్
      బిగియించియు ద్వాదశోర్ధ్వపుం
డ్రమ్ములు దిద్ది పచ్చడమునన్
      నడికట్టు బిగించి కట్టి హ
స్తమ్ములఁ ద్రిప్పుకొంచుఁ జిటి
      తాళములన్ "హరిరంగ హరి" గీ
తమ్ముల నాలపించు హరి
      దాసుఁడు నేఁడు ప్రసన్నుఁడయ్యెడున్.

నాటకం

కలిసి బ్రతుకుదాం

— శ్రీ రెడ్డి చిన వెంకటరెడ్డి

పాత్రలు

1.	చంద్రం	...	ఊరి జమీందారు
2.	శంకర్	...	ఇంకొక జమీందారు కొడుకు.
3.	కమల	...	ప్రాతిపదిక విద్యా ప్రచారకురాలు.
4.	లక్ష్మి	...	గ్రామ సేవిక
5.	ముత్తన్న	...	ఆ గ్రామ హరిజనుడు.
6.	లింగన్న	...	ఆ గ్రామ గొల్ల
7.	వెంటయ్య	...	శంకర్ దగ్గర ఉండే వాడు.
8.	కోటయ్య	...	చంద్రం బంటు.
9.	భూపయ్య	...	పోస్టు బంట్రోతు

మొదటి రంగం	......	రచ్చబండ.
రెండవ రంగం	......	యువజన పాఠశాల, ఒక కుర్చీ, నల్లబోర్డు. ఒక లాంతరు ఉంటాయి.
మూడవ రంగం	......	యువజన పాఠశాల, రెండు కుర్చీలు. ఒక లాంతరు, మద్దెల, డప్పు, హార్మణి ఉంటాయి. రెండు వంతలు.

బుర్రకథ

వినరా భారత భావి పౌరుడొక వింత గాధ నేడూ

దక్షిణ భారత మందు కలదు కామాక్షి పురంబొకటీ
ఆ పురంబునా రెండు మేడలూ అంతరిక్షమునకూ
అబ్బులు చాచుచు గర్వమ్మున అలరారుచున్నవండి
ఈ మేడల కామందు లిద్దరా ఊరికి కాపండి
ఆకలి చప్పుల యందు ప్రజల కాధారమె వీరండీ:

కథకుడు:— కానీ వీరిద్దరిలో భేదం ఉంది. ఒక మేడకు కామందుడు శంకరం ఎలాంటి వాడంటే ......

ఒకడు హాయిగ నుండ నందాన
ఇంకొకడు కులుకుచు నుండ నందాన
వేరొకడు దరాలకై నందాన
దేశ భాగ్యాన్ని జిమ్మగా నందాన
ఒకడు చాకిరి అంటూ నందాన
ఇంకొకడు ఆకలి యంటూ నందాన
వేరొకడు కష్టాలతో నందాన
అలుముకొని ఉండగా నందాన
కుములుతూ ఉండగా నందాన
దేశ మభివృద్ధి కాదంటాడూ
దేశ భావికే ఇది అడ్డ మంటాడూ
దేశమే మనదని నందాన
దేశ పౌరులము మనమని నందాన
అందరము చెమటోడ్చి నందాన
ఆనందముగ కూడి నందాన
మతకులా భేదాల నందాన
మటుమాయ మొనరిస్తే నందాన
అందులో నుంచుప్పవిస్తుందీ
ఆ శక్తి అభ్యుదయముకు నాందీ!

కథకుడు:— ఇంకొక మేడ కామందుడైన చందర్రాం ఎలాంటి వాడయ్యా అంటే ... ...

భళా నంటి భాయి తమ్ముడా
మేల్ భళానోయి దాదాన
అప్పు అనే వల త్రాడును సై
అందరి పైకి ఎప్పుడూ సై
ఆప్యాయతగా విసురును సై
చిక్కిన వాడు దక్కును సై
దక్కని వాడికి ఉచ్చును సై
వేసి ఉంచి కాపుండును సై
అప్పు కుప్పయ్యే వరకును సై
అడుగడు ఎప్పుడు ఎవరిని సై
అప్పు కుప్పగా పెరగగా
ఆస్తికి ముప్పే తెచ్చునూ
వాడి కొంపకుముప్పే తెచ్చునూ!

(అంటూ ఉండగానే తెర పడును)

(తెర లేవగానే, రచ్చబండ దృశ్యం అలంకరించబడి ఉంటుంది. ఇంతలో కోటయ్య ప్రవేశిస్తాడు. కోటయ్య వయస్సు ఇరవై అయిదు సంవత్సరాలు. ఎత్తుగా, బలంగా గుండాలాగా ఉంటాడు. చేతిలో కఱ్ఱ ఉంటుంది. కూని రాగంతో...)

పాట ... జానపద గేయం ... ఆదితాళం

రమ్మంటె రాదోయ్ ఓ పడుచు
దాని రంగు చీరపై నా మనసు
మదునూరెల్లిందో పడుచు
దాని ముద్దు మోముపై నా మనసు

(అంటూ రచ్చబండ మీద కూర్చోబోతుండగా, చేతిలో గొడ్డలి పట్టుకొని గొల్ల లింగయ్య వెడుతుంటాడు.....)

కోట:- (చుట్ట త్రాగుతూ) ఏందిరో లింగో! ఆదల బాదల ఎక్కడికో పోతుండవూ?

లింగ:- ఎంత నిమ్మలంగ అడుగుతుండవే! సేసి కూసున్న సీతరామ గోవిందా అని.

కోట:- నేనేం జేసిన? నన్నంటుండవు?

లింగ:- ఎంత ఎరగనట్లే మాట్లాడుతుండవే! సక్కదనంగ ఎయ్యి రూపాయలకు యిల్లు గొనుక్కోని, కొన్ని గొఱ్ఱె పిల్లల అమ్మి కడదామని అనుకుంటుంటే, నువ్వు గాదు-అడ్డమొచ్చి ఇప్పుడు అమ్మితే పైసలే మొస్తయి, నాలుగు దినాలు ఆగి అమ్ముకోరాదు. అందాన్క కావాలంటే శంద్రిమయ్యకాడ అప్పి ప్పిస్తనని తీసుక వోలేదు నువ్వు? అప్పు ఇప్పించి నందుకు ఓ గొఱ్ఱెపిల్లనుగూడ దింటివిగద, మరిసే పోయినావు?

కోట:- ఇది ఇంకా బాగుండది! అట్ట ఇప్పిచ్చుడు తప్పంటవా?

లింగ:- తప్పా తప్పున్నరా. ఇంగ దాని కింద, పాలిచ్చే బఱ్ఱె పాయె. ఉన్న గొఱ్ఱె పిల్లలు పాయె, కొను క్కన్న ఇల్లు బాయె. పైంగ నేనే జీతం ఉండాల్సి వచ్చె.

కోట:- అగ్గో, నోరి కాడ కుదిరితివి జీతం. చంద్రమయ్య కాడ కుదరక పోయినావు?

లింగ:- ఆ, ఇంగ కుదరిక కుదరక సెంద్రమయ్య కాడనే కుదరాలె. శంకరమయ్య కాడ తెచ్చుకున్న ఆ రొండొొందల బాకి నేను గాదు గద, నన్ను పుట్టి చ్చిన బ్రహ్మదేవుడు కూడా తీర్చలేడనుకో.

కోట:- మరి, ఇంతకు జీతం ఓరితాన ఉన్నట్టు?

లింగ:- ఇంకంత గతి పట్టలేదు. ఉన్నయిగద పోంగ సిక్కినయి రెండు గొఱ్ఱెపిల్లలు, ఈ రెండు అవు పెయ్యలు.

కోట:- మరి జీతం ఉన్న నంటివిగద?

లింగ:- నేను జీతం ఉండాలని ఉన్నదా ఏంది? అంత గతి వొచ్చెనని అన్నా.

కోట:- ఇంగో, నుల్ల నీ యిల్లు. గొఱ్ఱె పిల్లలు వచ్చే ఒక ఉపాయముండది, సెప్తరా.

లింగ:- నీ ఉపాయం నాకే మొద్దులే. పోంగ జిక్కిన ఆ రెండు గొఱ్ఱె పిల్లలు కూడ దక్కవు.

కోట:- అసలు ఇనకముందే అంటుండవేంది?

లింగ:- దెన పో. నీ వగలు నా తాన సాగుతాది. నిన్ను నమ్మినోడు ముందల బడ్డట్టే పో. (విసురుగా వెళ్లి పోవును)

కోట:- నీకేమొచ్చిందేమిరో?
(పాట తరంజులో) నమ్మి సెడినవాడు లేడు. నమ్మక సెడిపోతే పోతాడు.
(అని అంటూ ఉండగా చీటి చీర. చుక్కల రవిక తొడుక్కొని చేతిలో ఒక బ్యాగు పట్టుకోని వెళుతున్న కమలను చూచి. ..)

కోట:- (పాట) చీటూ రెల్లిందో పడుచు దీని చీటి చీరపై నా మనసు.చీ...టి..చీ...ర...పై..నా..మ..న..సు
(అంటూ రచ్చబండ మీద కూర్చోబోయేవాడల్లా లేచి, నోట్లో ఉన్న చుట్ట నేలకు కొట్టి, ముందుకు వచ్చి.)

కోట:- ఏముండీ మిమ్ముల్నే? మిమ్ముల్నే అ ం టు ం టె నేనెమో?

కమల:- —ఆగి —నన్నా!

కోట:- నిన్న గాకపోతే మొన్న.

కమల:- ఏమిటీ మాటలు

కోట:- ఆహఁ ఏమీలేదూ, మిమ్ముల్ని ఏడనో సూసి నట్టుండదీ అని.

కమల:- ఇప్పుడు సూస్తున్నావుగా.

కోట:- బలే బలే! ఇప్పుడు సూడక ఇడిసి పెడతాను. కాని, ఇంతకు ముందే మిమ్ముల్ని ఏన్నో........

కమల:- చూశానంటావు, అంతేనా?

కోట:- అనుదేంది-నిక్కచ్చిగా జూస్తె నేమో.

కమల:- అలాగా: బహుశా మా ఇంట్లో చూసుంటావు, అవునా?

కోట:- బలే బలే! చూస్తే మీ ఇంట్లనే చూసుండొచ్చు. కనీ, ఇంతకూ మీ ఇల్లు ఏ ఊళ్లెనో ఉండెనూ?

కమల:- ఏమిటిదీ? దారిలో వెళ్లేవారిని ఇలా మందలించడం?

కోట:- ఇది మా ఇంటి ఇలు వరుస, మా ఊరి తరీకలే.

కమల:- అలాగా! అయితే మీ ఊరు చాలా మంచి దన్నమాట.

కోట:- అన్నమాటేంది, ఉన్న మాటగూడ అంతే. నా మాట అబద్ధమైతే నాలుగు రోజులు ఉండి చూడరాదు ఊళ్లె.

కమల:- అలాగా! సరె చూస్తాగా,

కోట:- బలె బలె అయితే మా వూరికే వచ్చినవన్న మాట?

కమల:- మాటాలేదు, ముచ్చటాలేదు. వచ్చేశాను.

కోట:- నా సామిరంగా, మా వూరికే! మరి ఓరింటికి? తూర్పు బజార్న కుడిరో కున సందుల సింత పెట్టున్న ఇంటికి కాదుగద.

కమల:- కాదు, చింతచెట్టు క్రింద ఉన్న పెంకుటింటికి,

కోట:- (సంతోషంతో) బలే, బలే! అయితే, అది మా ఇల్లే. పోదాంపా, ఇంటికాడ మీ అత్త ఎదురు సూస్తుంటుంది.

కమల:- ఏమిటీ? అది మీ ఇల్లేనా? అయితే, నువ్వు గుండయ్య వన్నమాట.

కోట:- ఆఁ ఆఁ. అది సిన్నప్పటి పేరు. మరి నా పేరు నీకెట్ట దెలిసింది?

కమల:- నీ చేతల్ని బట్టి.

కోట:- (ఉలికి పడి)-సేతల్ని బట్టా! (తలఊపి,) బలే బలే! తెలివికల దానివే మరదలా, సరె పా ఇంటికి. ఇంటికాడ మీ అత్తా.....

కమల:- ఎదురు చూస్తుందంటావు?

కోట:- సూడదా మల్ల. పా, పోదాం.

కమల:- చూస్తుంటుంది. పద పోదాం. దుర్మార్గుడా!

—(అని లాగి చెంప మీద కొట్టి పోబోవును)

(కోటయ్యచెంప పట్టుకొని. ఆ మె వా రి కి అడ్డొచ్చి)........

కోట:- నిలబడు, నన్నె దొంగు బుచ్చుతున్నావు. ఇసుంటి దెబ్బలు కోటికి ఒక్క దెబ్బ తక్కువ తిన్ననను కో. అందుకనే కోటయ్య అని పేరు పెట్టుకుందామా, వద్దా అని అనుమానంతోనే పెట్టుకున్నా, కనీ, ఈ దెబ్బతోని, నిజంగ నిండ కోటయ్యనే అయిన. తెలిసిందా మరదలా! తెలియ జెప్త లే తొందరెందుకు.

(అని చెయ్యి పట్టుకో బోవును)

కమల:- జాగ్రత్త. అడుగు ముందుకు వేశావా..............

కోట:- పానం బోద్దంటవు ఇసుంటి బెదిరింపులకు ఈ కోటయ్య బెదుర్తడనుకొన్నావా ఎట్ట? సేతికి దొరికిన పిటను ఇడిసి పెట్టుడు. మా ఇంటా వంటా లేదంటేనమ్మ.-(పట్టుకో బోవును.)

(దూరంనుంచి. కోటయ్యా! కోటయ్యా! అని పిలుపు వినుపడుతుంది.)

కోట:- (బెదురుతు) ఆఁ పో పో! కుడి సేతి మీదంగ తిరిగి. ఎడమ సేతి సందులంగ. ముక్కుసూటిగ పోతే అదే ఇల్లు.

కమల:- ఉఁ, దుర్మార్గుడ. నీ సంగతి కనుక్కుంటానుండు. (వెళ్లి పోవును).

కోట:- (ఎక్కిరింపుగా)-అబ్బో! సూద్దాంలే పో! పోతే ఎంత లెక్కన బోతవు?

(ఇంతలో శంకరం వస్తాడు)

కోట:- (శంకరాన్ని చూసి)-పిలిసినారుండి నన్నూ?

శంకరం:-అబ్బే లేదే.

కోట:- ఇప్పుడు పిలిస్తిరిగదుండీ. కోటయ్యా, అని ఉసూరుమంటా వనంతా చెడగొడ్తిరే.

శంక:- నీ పని నేను చెడగొట్టానా? మా జీతగాడు కోట య్యను పిలిచాను. అంతే.

కోట:- ఒక్క తీరుగ ఆనికి నిన్న సెప్పొస్తి గదుండీ ఆ పేరు తీసేసుకోరా అని.

శంక:- ఏం? ఎందుకు తీసేసుకోవాలి?

కోట:- ఇద్దరికి ఒక్క పేరు ఏం బాగుందీ.

(ఇంతలో పెంటయ్య)

పెంట:- సిన బాబూ! సినబాబూ! చంద్రమయ్యగారు కంచల సెట్లన్ని కొట్టిస్తున్నడుండీ!

శంక:- వద్దనలేక పొయ్యావా?

పెంట:- నేను వద్దంటే ఊకుంటారుండీ.

శంక:- సరే కొట్టుకోనియ్యి.

పెంట:- అదేందుండీ, తూర్పు కంచె నాదేనంటే ఊకుం టిరి. బాయి మీద సెట్లన్ని కొడితే ఊకుంటిరి. ఇప్పుడు కంచల సెట్లు గూడా కొట్టుక పోతుంటే కొట్టుక పోనియ్య మంటుంటిరి. ఇట్ల చేస్తే ఎట్ల నుండి?

శంక:- తొందర పడితే పనులవుతాయా పెంటయ్యా, నేను చూసుకుంటాగా, నువ్వెళ్లి నీ పనిచూసుకో. అలాగే కోటయ్యను, నేను రమ్మన్నానని చెప్పు.

- (అని వెళ్లిపోతాడు) -

- పెంటయ్య మరో వైపుకు వెడుతుండగా, కోటయ్య, పెంటయ్య చొక్కాపట్టి లాగును.)-

పెంట:- ఆగెహ! అట్టా లాగుతవు!

కోట:- అంత తొందరేమొచ్చె. కూసోరాదు పోదువు.

పెంట:- దెస పో, నీ వోతుగ కూసుంటే ఎల్తాది పొట్టకు, పోవాలె పనుంది,

కోట:- అంత తీరిక లేకుండ పని జేస్తుండవు, శంక రమయ్య ఏం జీతమిస్తున్నడో చెప్పు వైతిపీ?

పెంట:- జీతమేంది జీతం! పేరుకు జీతం. అందరం గలిసి దున్నుకుంటుండం, పండినయి తింటుండం, కలిసి బతుకుతుండం.

కోట:- ఇదెన్నాల్ల సందే? మరి మీదాంట్లె నన్ను గూడ కలుపు కుంటరా?

పెంట:- నీ అసుంటి పుల్లె గండోల్లకు, మాదాంట్ల సోటుం డదు.

కోట:- ఏయ్ పెంటయ్యా! వల్లు దగ్గర బెట్టుకోని మాట్లాడు.

పెంట:- అంతేలే. ఉన్నదున్నట్లంటే, వోరికైనా మన్నె కైద్ది.

కోట:- కాదుమల్ల. మిమ్ములందర్ని ఆ సినబాబు దోంగున బుచ్చుతాంటే మీరంతా కుడుమిస్తే పండుగంటు న్నరు. ఆరి ఉపాయం మీకేమెరక?

పెంట:- నీకే ఎరుకలే. ఇప్పుడేమన్నవో అన్నవు గాని, మల్లెప్పుడు ఆ మాటనకు. మా సినబాబు దేము నసుంటోడు.

కోట:- ఇంక నయం, దేముడే అన్లేదు. అందుకనే సెంద్రమయ్యగారు గుడి కట్టిద్దామంటే ససేమిరా వద్దన్నాడు మీ సినబాబు.

పెంట:- ఎందుకే అబద్ధ మాడ్తవు. సినబాబు ఊల్లె పిల్ల లకు బడి గట్టిద్దామంటే, ఆ పనిగాకుంట సేసేం దుకు సెంద్రమయ్యగారు గుడి కట్టిద్దామన్నడు. నిజంగ గుడి కట్టిద్దామన్నడా ఎట్ట?

కోట:, మాటలు బాగ నేర్సినవే. అవి సరెగానీ అప్పు గావాల్నంటివి, ఏమాయె? వద్దా ఎట?

పెంట:- మా సినబాబు సల్లగుంటే, మా కెందుకే అప్పు?

కోట:- మీ సినబాబు అప్పు గూడా పెట్ట నేర్సిండా ఎట్ట?

పెంట:- ఆ లెక్క నీ కెందుకులే, పోత పనుండది.

కోట:- పోదువుగనీ, అయ్యాల కోడి పిల్ల నిస్తనంటివి. ఏమాయె? నీకు అప్పు గావాల్నంటే....

పెంట:- దెస పో. నీ వగలు నా కాడ సాగుతాది?

కోట:- పెంటయ్యా! ఏమో అని ఊకుంటుండ, వగలు గిగలు అంటే దొక్కచించి డోలు గడ్త. ఏమను కుంటుండవో?

పెంట:- మహ గట్టినవులే. దస పో. గిందికేనా ఆపింది. పనంత సెడిపాయె.

- (దురుసుగా వెళ్లిపోవును) -

కోట:- అమ్మా, నీ కెంత నీల్గుడెచ్చిందే! నీ అంతేందో నూస్త పో.

- (ఇంతలో చంద్రం) -

చంద్రం:- ఏమిటీ కోటయ్యా, ఏమిటి సంగతి?

కోట:- సంగతుల కేంది లేరి. సినబాబు దేముడంట, అడులేడుండి పెంటడు. ఆడంటడు. ఒక్క అనుడే అనుకున్నరా! సినబాబు కాడి కొచ్చి మీరు కం చెల సెట్లన్ని కొట్టిస్తుండరని సికాయతు చేస్తుండు.

చంద్ర:- ఊఁ వాడు చేయడం. వీడు వినడం; అయితే, శంకరం గాడు ఏమన్నాడురా ?

కోట:- ఏమంటడు ? పండ్లు కొరుక్కుంట. గుడ్లెల్లబెట్టి, "ఆ సంగతేందో నే ను జూసుకుంట"అను కుంట బోయిండు.

చంద్ర:- ఆఁ అంత మాటన్నాడా? నా అంతు చూసే వరకు వచ్చాడన్నమాట. ఇల్లరికం వచ్చినవాడు వచ్చాడు, వచ్చినవాడు చచ్చినట్టు పడుండాలె. అంతే గాని,...

కోట:- వచ్చింది ఈయన కాదు గదండీ ?

చంద్ర:- వీడు గాక పోతే వీని తండ్రి, వచ్చాడా లేదా?

కోట:-లేదని నేనట్టా అంటలేరి.

చంద్ర:—ఏదో పోనివ్వమని ఊర్కుంటుంటే తొండముదిరి ఊసరవెల్లి అయినట్లుంది. వీడి ఆటకట్టించకపోతే ఈ చంద్రం ఉండేమి, లేకేమి?

కోట:-మీ కాడి దాను కెందుకుండీ, నాకు జర సెలువు బెట్ట రాదురి! దొక్క జించి దోలు గట్టను, దెబ్బ గాల.

చంద్ర:- సమయం రావాలి కోటయ్యా, సమయం రావాలి!

కోట:- అదెప్పుడొస్తదో, ఎప్పుడు పోద్దో! అదును గను క్కొని సెప్పరాదురి.

చంద్ర:- నేను చెప్పినట్టు చేస్తూ ఉండు. వీళ్ళందర్నీ ఒక్క రేవున నీళ్ళు తాపకపోతానా? అది సరే గాని, ఆ రామి సంగతి ఏమైంది?

కోట:- ఏ రాముండీ? ఓసోసి, అదా, దాని ముచ్చట వది లెయ్యిరి. గప్పుడో పిట్టొచ్చింది ఊల్లెకు. ఉచ్చేసి ఎత్తుకొద్దమని అనుకుంటే, కుదరలె, సినబాబొచ్చి సెడగొట్టిండు. అయినా, యిప్పటికి మాత్రం మించి పోయిందా?

చంద్ర:- ఏమిటేమిటీ! చెప్పవేమిరా ఇంతసేపూ? చక్కం దేనా?

కోట:- సిన్న గుంటరేంది, సక్కదనమంత ఆమె మీదనే పిండి పోసినట్టుండదనుకోరి

చంద్ర:- చిక్కుద్దంటావా ఆ చిలుక?

కోట:- కోటయ్య బతికుండగ సిక్కకపోద్దా, మీకు దక్కక పోద్దా? ఆ పెద్ద బజార్న పోతుంటె. ఆ బజారుకే అందం రాలేదుండీ? బలేగుందిలేరి.

చంద్ర:- (ఆలోచిస్తూ)——ఏమిటి? పెద్దబజారుగుండా వెళ్ళిందా? అంటే, ఆమె చీటీ చీరె కట్టుకుందనుకుంటా.

కోట:- ఆఁ ఆఁ మీరు సూసిండార్రి ఎట్ట!

చంద్ర:- (ఆలోచిస్తూ)-చేతిలో........

కోట:—ఏదో సంచ సుంటిది ఉంది. గుండ్రం ముఖం. సెవులకు కమ్మలు....

చంద్ర:- చుక్కల రవిక, చేతికి ఉంగరం.

కోట:- ఆఁ ఆఁ గామేనుండీ. నా సామిరంగా, మీరు సూసింద్రన్నమాటె. బాగ లేదుండీ బాగలేందేంది, బంగారంబొమ్మ, ముద్దులగుమ్మ....

చంద్ర:- (ముఖం చిట్లించి)-చాలూరుకో.

కోట:- అదేందుండి అట్టంటరూ. మీకు సిక్కియ్యలేదనా. రేపియ్యాలకు మీ సేతుల........

చంద్ర:- కోటయ్యా! ఇంకేమీ మాట్లాడకు. వెధవ మాటలు, వెధవ పనులు.

కోట:- కోప్పడుకురి! ఏదో సెయ్యిజారిపోయింది. ఏడేడు లోకాలల్ల ఏడున్నా, గాలిచ్చుకరానుండీ. దెబ్బగాల. కోటయ్యంటే....

చంద్ర:- ఊరోక్కరా వెధవ. ఆమె ఎవరనుకున్నావు?

కోట:- ఎవరుండీ?

చంద్రా:- మా అన్నయ్య చాదుకున్న కూతురురా!

కోట- ఏదీ ఇక్కడ భూమంత అమ్ముకోని, బెజవాడలో నౌకరి సేసుకుంటున్న గోవిందయ్యగారి కూతురా?

చంద్ర:- అవునురా, ఆమే,

కోట;-ఎట్టెట్టా! మీ అన్న కూతురా! గింతమాత్రం మీ అన్న కూతుర్నని ముందుగాల్నె. సెవునెయ్యగూడ దుండీ? ఎంతపని జరిగిందుండీ? (చెంపలు వేసు కొనును).

చంద్రా:- జరిగిందేదో జరిగింది. ఈ విషయం బయట పడకుండ ఉండాలి.

కోట:- సర్లేరి గనుండి, ఎంతపని జరిగె నేముండీ? ఉసూరు మంటూ మీ అన్న కూతురాయెనే.

చంద్ర:- ఇంక వాగకు, నీ పని నువ్వు చూసుకో. అఁ అన్నట్టు ఆ రామయ్య బాకీ, వసూలు చేసుకొనిరా.

(వెళ్ళి పోతూ అంటాడు)-

కోట:- సర్లేరి....ఎంతపని జరిగింది ఎంతపని జరిగింది!
ఉసూరుమంటా చంద్రయ్యగారి కూతురై పోయెనే.
(తిరిగి రచ్చబండ మీద కూర్చుని. చుట్టవెలిగించి)-

-:పాట....తత్వం....మిశ్రజంపె తాళం:-

సిక్కినట్టే సిక్కెరా అది దక్కకుండా బాయెరా
సేతికందిన సిలక బాయె
సిలక కేసిన దండబాయె
దండకున్న మొగ్గబాయె
మొగ్గకున్న రంగుబాయె
సిక్కినట్టే సిక్కెరా అది దక్కకుండా బాయెరా,

(ఇంతలో లక్ష్మి పోతుంటుంది.) కోటయ్య పాటఆపి చుట్టనేలకు కొట్టి. లేచి నిల్బడి)....

కోట:- ఓరదీ, అట్టబొయ్యేది?

లక్ష్మి:- నేనే.

కోట:-నేనే అంటె ఎట్ట తెలుస్తది. నీ పేరు?

లక్ష్మి:-నా పేరా....లక్ష్మి.

కోట:- నా సామిరంగ సక్కదనాల పేరులే. ఏవూరికి పోతుండవు?

లక్ష్మి:-ఈ వూరికే.

కోట:- బలే బలే వోరింటికి?

లక్ష్మి:-నీ కెందుకదంతా. నీకు చెప్పాల్సిన అవుసరం లేదు;

కోట:- నీకు లేకున్నా అవుసరం నాకుంది. సెప్పవే సిలుక.

లక్ష్మి:-మాటలు జాగ్రత్తగా రానియ్. పండ్లూడ్తాయి.

కోట:- నా సామిరంగా, మాగడుసు దానివేలే.

(పటుకో బోవును.)

లక్ష్మి:-ఆగు: అడుగు ముందుకు వేశావా, మా గుండయ్య బావతో చెప్పి, నీ పండ్లూడ గొట్టించక పోతే నా పేరు లక్ష్మేకాదు. తెలిసిందా?

కోట:- (ఆశ్చర్యంతో) ఎట్టెట్టా! గుండయ్య నీకు బావనా? అంటె, బండకింది గుండయ్యనా?

లక్ష్మి:-అవును ఇపుడైనా తెలిసిందా, జాగ్రత్త.

కోట:-నువ్వు రాంపురం సింతల పుల్లయ్య బిడ్డవా ఏంది?

లక్ష్మి:-అవును. చిన్న బిడ్డను.

కోట:-అంటె రామి మీ అక్కన్నమాట.

లక్ష్మి:—అన్నమాటేంది. అక్కే.

కోట:-బాగుందా మీ అక్క.

లక్ష్మి:-మా అక్క సంగతి నీ కెందుకూ?

కోట:-ఎంత లేదన్నా పెండ్లామేగద. పెండ్లినాడు పంచాయితి వచ్చింది. ఇంగ అప్పటినుంచి ఒకరి మొఖం ఒకరం సూసుకోకుంటైనం. అప్పుడు నాకు కూడా సిన్నతనమే. నువ్వు మాత్రమెంతున్నవ్, గింతంత ఉన్నవు. (అని చేతితో చూపించును.)

లక్ష్మి:-ఏమిటి నువ్వు గుండయ్య బావవా నన్ను నమ్మించా లని చూస్తున్నావు. నీఎత్తు నాకు తెలుసు. నీపప్పులు నా దగ్గర ఉడకవు.

కోట:-లేదు లచ్చిమీ, నీతాన అబద్ధమాడ్తలేదు. అమ్మతోడు, సామితోడు.

లక్ష్మి:-అబ్బో: నీకు ఒట్లుగూడనా.

కోట:-నమ్ము లచ్చిమీ, ఇప్పుడు గాకపోతే ఇంకా సేపటి కైనా తెలవదా?

లక్ష్మి:- అయితే నువ్వు గుండయ్య బావవే నన్నమాట.

కోట:- అది సిన్ననాటి పేరులే. ఇప్పుడు కోటయ్యబావను.

లక్ష్మి:- ఛీ నీ మొఖం కూడా చూడకూడదు. కట్టుకున్న భార్యను విడిచిపెట్టి, యిలానేనా బజార్ల వెంట తిరగడం? నీదికూడా ఒక బ్రతుకే అనుకుంటున్నావా?

కోట:- నన్నేం చెయ్యమంటవు. మా అయ్య వున్నన్ని రోజులు ఆమాట ఎత్తితే పానం తీస్తనన్నడు. ఈ నడమ కనుక్కుందా మంటె యీలు జిక్కదాయె.

లక్ష్మి:- నీకు బజార్లో వున్న పని తీర్తేగా?

కోట:- ఆ మాటనకు లక్ష్మి. ఇప్పుడదంత ఎందుకు? ఇంటి కాడ అన్ని చెప్త పద.

లక్ష్మి:- ఇంటి దగ్గర చెప్తవా? ఛీ నీ కడపకూడా తొక్క కూడదు. (అని చరచర వెళ్లిపోవును)

కోట:- లక్ష్మి! లక్ష్మి! (తనలో) ఇయాల లేచినేల్ల మంచిది కాదు. ఎంత పని జరిగింది, ఎంతపని జరిగింది. ఊకే రాంగనే నేన్నీ మరదల్నని ఒక్క మాట చెప్తే ఎంత బాగుండేది? ఏందోలె. ఇయ్యాల వోరి ముఖం చూసిన్నోలే.

(ఇంతలో చంద్రం ప్రవేశం)

చంద్రం:-కోటయ్యా! ఇంకా యిక్కడే వున్నావా? ఆ రామయ్య బాకీ ఇచ్చాడా?

కోట:- ఆడు ఊల్లె ఉంటె కదనండి యిచ్చేటందుకు?

చంద్రం:-నువ్వు అనేది రామయ్య వూళ్లో లేడనేనా? ఒక ఘంట క్రితం కనపడ్డాడే?

కోట:- కనపడ్తె ఎందుకొ ఇడ్సిపెట్టినుర్రి అడుగక?

చంద్రం:-నేనే అడగాల్సివస్తే. ఇంకా నువ్వుంచి ఎందుకు?

కోట:- ఆ మాట నిజమేలేరిగనుండి. నేను ఊల్లెనే ఉన్న నని ఒక్క మాట సెప్పకూడదానుండి ఆడు?

చంద్రం:-చాలూరుకో. డబ్బిచ్చేవాడు నేనిక్కడే వున్నాను మీ డబ్బిస్తాను అంటాడా ఏమి?

కోట:- అంటే తప్పానుండి?

చంద్రం:-ఏడ్చావు గాని, అసలు రామయ్య ఊళ్లో లేడని నీ కెవ్వరు చెప్పారు?

కోట:- వోరెందుకు సెప్పాలె, నేనే అనుకున్న

చంద్రం:-అనుకున్నావేం? నాకీ పని చేతకాదని అనేస్తే పోతుందిగా?

కోట:- నా పానం ఉండంగా అమాటంటానుండి? ఇప్పుడే ఆని సంగతేందొ తేల్సుకొస్త. అట్ల కూసోరి.

(కర్ర తీసుకొని పోబోతుండగా)

చంద్రం:-ఇప్పుడు తొందరేం లేదులే కోటయ్యా, నీతో చెద్దామని మర్చేపోయాను. నేను వచ్చేప్పుడు, ఎదురుగా ఒక చిలుక వచ్చింది. ఆహా ఎంత చక్కగా వుంది. కొద్దిగా చదువుకున్న పిల్లలాగే కనపడింది. ఆ చిలుక ఎక్కడ్నుంచి వచ్చిందో ఎక్కడ వాలిందో తెలుసుకొచ్చావా? నీ రొట్టె విరిగి నేతిలో పడిందనుకో. జీతం అమాంతం ఐదు రూపాయలు పెంచేస్తాను. పెంచేస్తానంటే పెంచేస్తాను. అంతే.

కోట:- ఊకోరుండి.

చంద్రం:-(వికటంగా నవ్వి) ఈ చంద్రం కళ్ళల్లో పడ్డ ఆడ దాన్ని విడిచిపెట్టి ఊరుకోవడమనేది ఈ చంద్రం చరిత్రకే విరుద్ధం. ఏడేడు లోకాల్లో ఎక్కడవున్నా గాలించి, వెతికి తీసుకొస్తాను.

కోట:- దాని ముచ్చట ఇడిసి పెట్టుదురుండి.

చంద్రం:-దాన్నే కాదు, దాని ....

కోట:- మీకేనండి సెప్పేది, అమాట ఇడిసిపెట్ట మంటిగద. అది వోరనుకుంటుండరు.

చంద్రం:-ఎవరైతే ఏం? కొండమీద కోతైనా దిగి రావా ల్సిందే. (నవ్వుతాడు)

కోట:- (గట్టిగా) అగురుండి, మీకే సెప్పేది, అది వోరను కుంటుండరు?

చంద్రం:-(వుద్రేకాన్ని అణుచుకొని,) ఎవర్రా అది?

కోట:- నా మరదలుండి.

చంద్రం:-ఏమిటీ? నీ మరదలా? అంటే నీ మరదలే అన్న మాట.

కోట:- నిజంగా నా మరదలే, అమ్మతోడుండి.

చంద్రం:-అలాగా. (నిట్టూర్చి) ఎంతపని చేశావు కోటయ్యా ఎంత పని చేశావు.

కోట:- దీంట్ల నేను చేసిందేమున్నదండి? నేను దాన్ని నా మరదలు గమ్మన్ననా? అదే మరదలై య్యొచ్చె.

చంద్రం:-చంపేశావు కోటయ్యా, చంపేశావు.

కోట:- ఎవర్నుండీ?

చంద్రం:-ఇంకెవర్ని? నన్నే. నన్నే చంపేశావు.

(అంటూ వెళ్లిపోవును)

కోట:- (ప్రేక్షకుల వైపు చూస్తూ) దీంట్ల నేను చేసిన దేముండది? మీరన్న సెప్పురీ మనిసికి.

(వెళ్లిపోవును)

(ఇంతలో కమల, శంకరం ఎదురుగా వచ్చి ఒకరి ముఖం ఒకరు చూసుకొని)........-

శంక:- హల్లో, కమలా, ఇలా వచ్చావేం?

కమల:- మరి నువ్వెందు కొచ్చావు?

శంక:- నేను రావడ మేమిటీ! ఇది మా ఊరేగా.

కమల:- ఇది మీ ఊరా! నాకు తెలియదే.

శంక:- ఇప్పుడు తెలిసిందిగా.

కమల:- ఇంత స్పష్టంగా చెప్పినా తెలియదా ఏం?

శంక:- అది సరే. ఇలా వస్తున్నానని ఇంత ఉత్తరం ముక్కైనా రాయకూడదా కమలా.

కమల:- వచ్చింది మీ ఇంటికి కాదుగా. మా చంద్రం బాబాయి ఇంటికి.

శంక:- చంద్రంమామయ్యా నీకు బాబాయా? ఇదెక్కడి వరుస?

కమల:- కొత్త వరుసేం కాదు. పూర్వపు వరుసే, వారి అన్న కూతుర్ని.

శంక:- అంటే విజయవాడలో ఉంటున్న......

కమల:- గోవిందయ్యగారి కూతుర్ని.

శంక:- వారికి కూతురున్నట్లు విన్లేదే?

కమల:- వినకున్నా ఇప్పుడు చూశావుగా.

శంక:- అయితే తమరు చదువులో సున్నా చుట్టి ఇలా వచ్చాశారా ఏం?

కమల:- అంత తెలివిగల పని నేను చేయలేను. బి. ఏ. పూర్తిచేసుకుని ట్రైనింగు కూడా పూర్తిచేసుకొని బయలుదేరాను దేశం మీదికి, అంటే మీ ఊరే. ఇంతలో మా మామయ్యా, మా బాబాయి అయిన చంద్రంగారు మా ఊరికి వచ్చి పొమ్మని ఉత్తరం రాశారు. వచ్చాను. అదిసరే, తమరు ఇంటరు చదువుతూ. చదువుతూ ఇలా పారి పొయ్యొచ్చారేం. బెదరి పొయ్యారా?

శంక:- పరిస్థితులు అనుకూలించనప్పుడు ఏం చేస్తాం కమలా? మా నాన్న నా చిన్న తనంలోనే చని పోయారు. మా అమ్మ నన్ను పై చదువుకు పట్నం పంపించి, అష్టకష్టాలు పడుతూ, డబ్బు పంపిస్తుండేది. నేను ఇంటర్ సెకండియర్ చదువుతుండగా అమ్మ మరణశయ్య మీది నుండి పిలుపు వచ్చింది. అమాంతం రెక్కలు కట్టుకొని వ్రాలాను. నా తుదిసారి పిలుపు వినకుండానే అమ్మ కళ్లు మూసింది. వెంటనే వ్యవహారాలన్నీ మీదపడి నన్ను ఉక్కిరి బిక్కిరి చేసేశాయి.

కమల:- ఏదో వీలు చేసుకొని, ఇప్పటికైనా చదువచ్చుగా.

శంక:- అనే అనుకున్నాను. కానీ ఈ ఊరి పరిస్థితులు నన్ను ఇక్కడినుంచి పోకుండా చేస్తున్నాయి.

కమల:- ఇక్కడి పరిస్థితులు ఎలా ఉన్నాయేం?

శంక:- ఏలా ఉన్నాయని చెప్పను. ఇక్కడి భూవసతులు అంత అనుకూలమైనవి కావు. ఉన్న భూముల్లో పంటలు ఎలా పండించాలో ప్రజలకు తెలియదు, తెలిసిన భూమికి కావలసిన బలం పెట్టి భూమాతను సంతోషపెట్టి, పంటతీసే స్థోమత ప్రజలకు లేదు. ఉన్న భూమి కూడా ప్రజల సొంత భూమి కాదు. కౌలుదారి శాసనం వల్ల కొంత భూమి ప్రజలకు లభించినా, ఆర్థికంగా ప్రజలంతా మా దయా, దాక్షిణ్యాలపైన్నే బ్రతుకాల్సి వస్తోంది. ఈ అవకాశాన్ని మీ బాబాయి ఏమాత్రం జారవిడవకుండా దుర్వినియోగం చేస్తున్నాడు. అందువల్ల ఈ గ్రామంలో పుట్టి పెరిగిన నేను, ఈ గ్రామానికి ఏమైనా సేవ చేయగలుగుతానేమోనని, మాతృభూమి రుణం తీర్చుకో గలుగుతానేమోననే ప్రయత్నిస్తున్నాను.

కమల:- ఈ పిచ్చి ఇంకా వదల లేదన్న మాట.

శంక:- ఇది పిచ్చి అవుతేగా వదిలేది. తోటివారు కష్టపడుతూ ఉంటే చూస్తూ ఎలా ఊర్కోవడం. కనీసం కొంత సహాయపడడమైనా మానవుని కర్తవ్యం కదూ?

కమల:- కాదని ఎలా అంటాను. భూ సంస్కరణలు అమల్లోకి వస్తే కొంతైనా ప్రజలకు మేలు కలుగవచ్చు ననుకుంటాను.

శంక:- ప్రజలకు మేలు కలగాలంటేరెండే రెండు మార్గాలు. ఒకటి సహకార వ్యవసాయం, ఒకటి భూమిని గ్రామ పరం చేయడం. తరువాత కుటీర పరిశ్రమలను పెంచడం, అంతేకాని భూమిని చిన్నచిన్న ముక్కలుగా విడగొట్టి పంచడం వల్ల ఏదో మేలు జరుగుతుందని నేను అనుకోను. భూమి ముక్క ముక్కలుగా విభజించడం వల్ల పంటతక్కువవడమే కాక, పనీ, ఖర్చూఎక్కువవుతాయి. ఏదైనా ఆచరణలో చూపించాల్సి వుంటుంది. పరిస్థితులు అనుకూలిస్తే, సహకరించే వాళ్లుంటే, ఈ వూరును భూతల స్వర్గంగా చిత్రిస్తాను.

కమల:- మంచి కార్యం కొరకు గూడా ప్రజలు సహకరించరంటావా?

శంక:- ప్రజల మనస్తత్వం చాలా విచిత్రంగా వుంటుంది. వాళ్లలో లీనమై వాళ్ల మనస్తత్వాన్ని అర్థం చేసుకోవాలి, అలా చేయడంలో ఏ మాత్రం పొరపాటు జరిగినా వైకుంఠపాళిలో పెద్ద సర్పం మింగినట్లు మళ్లీ మొదటికే వస్తాం.

కమల:- శంకర్! ఈపిచ్చి ఆలోచనలు విడిచిపెట్టి, హాయిగా పట్నం వెళ్ళి చదువుకుని, పెళ్ళి చేసుకొని కాపరం కూడా అక్కడే పెట్టెయ్. హాయిగా ఉంటుంది.

శంక:- పొరబడుతున్నావు కమలా. పట్నంలోనే జీవించాలనీ, అక్కడేదో స్వర్గమున్నదని తలచే అభిప్రాయాన్ని మార్చుకొని, తమ తమ గ్రామాలని బాగు చేసుకునేందుకు యువకులంతా కంకణం కట్టుకోవాలి. అలా చేయనినాడు పన్నెండు పంచవర్ష ప్రణాళికలు తిరిగినా, ప్రణాళికలు తిరగడం తప్ప ఫలితం శూన్యం. అంతకంటే ప్రయోజనం శూన్యం. మార్చుకుంటే అన్ని సౌఖ్యాల్తో పల్లెల్లోనే జీవించవచ్చనే పరమసత్యాన్ని మాపెంటయ్య నాకు చూపించాడు. అదే నేను ఆచరించ దల్చుకున్నాను.

కమల: ఆ గురుపరేణ్యుడైన పెంటయ్య ఎవరు?

శంక:-అతను మా ఊరి మామూలు మనిషే. మీ బాబాయి దగ్గర అప్పు తీసుకొని, ఆ అప్పు క్రింద ఇల్లూ, వళ్లూ గుల్ల చేసుకొని పట్నంలో రిక్షానడిపిస్తూ, కొన్నిరోజులక్కడే వున్నాడు. అతని కూతురూ, కొడుకూ, ఇద్దరూ జబ్బున పడి అవస్థలో వుండగా, మందు యిప్పించలేని స్థితిలో వాళ్ళను పోగొట్టుకొని ఇప్పుడు నా దగ్గరే వుంటున్నాడు. అతని అనుభవమంతా చేర్చితే తేలిన సారాంశం పట్నంలోకంటే పల్లెల్లోనే జీవించే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి అని.

కమల:-నిజమే శంకర్. ప్రభుత్వం కూడా దేశానికి పట్టుగొమ్మలు పల్లెలే అని, పల్లెల్ని స్వయం పోషకత్వంగా మార్చిననాడే దేశం స్వయం పోషకత్వంగా తయారవుతుందని భావించి కృషినంతా పల్లెలపైపే కేంద్రీకరిస్తోంది.

శంక:- కేంద్రీకరించాల్సిన అవసరం ప్రభుత్వానికుంది. ఈ దారిద్ర్యమనే పిశాచం చాలా బలమైనది. ఒక వైపు నరుకుడుకు అది తెగుడు పడేది కాదు. రెండువైపులా నరకాల్సిన అవసరం వుంది. ప్రభుత్వం ఒకవైపు నరుకుతూ వుంటే, ప్రజలు ఇంకొకవైపు నరికినపుడే ఆపిశాచం ఆఖరిఊపిరి విడిచి, ప్రాణం వదుల్తుంది. అప్పుడే దేశం సౌభాగ్యవంతమౌతుంది.

కమల:-నీ అభిప్రాయంతో, నీ ఆలోచనలతో ఏకీభవిస్తూ, అన్ని విధాలా సహాయంగా ఉండేందుకు ఈకమల, ఈనాటినుంచి ఇక్కడే ఉండిపోతుంది.

శంక:- (ఆశ్చర్యంగా) నిజమా కమలా.

కమల:-చూస్తావుగా.

(ఇంతలో లక్ష్మి)

లక్ష్మి:- అక్కయ్యా ఇక్కడే ఉన్నావా? నీ కొరకు........

కమల:- ఊరంతా గాలించి వచ్చానంటావు. మరిచిపోయాను ఈమె మా స్నేహితురాలు లక్ష్మి. వీరు శంకర్, ఈ గ్రామానికి కామందు. నా స్నేహితులు.

శంక:- నమస్కారమండీ.

లక్ష్మి:- నమస్కారం.

కమల:- ఈ రోజునుండి మేమిద్దరం మీకు అండదండగా ఉంటాం. ఇక దారిద్ర్యమనే పిశాచాన్ని ఎక్కణ్ణించి నరుక్కొస్తారో నరుక్కురండి.

శంక:- చాలా సంతోషం. ప్రభుత్వం ఒకవైపు నుండి నరకడం మొదలు పెట్టింది. ఇక మిగిలింది మన వంతే, (ప్రేక్షకుల్ని చూస్తూ) ఏమంటారు? పదండి వెళ్లుదాం?

(పాట:- మార్చింగ్ సాంగ్ ....)

ఖదం ఖదం బడాయేజా కుషీకె గీత్ గాయేజా

(అంటూ వెళ్లిపోవుదురు.) - (ఇంతలో కోటయ్య)

కోట:- (పాట.... ఆది తాళం .... జానపద గేయం....)

అద్దశేరు బియ్యమిస్తా గుడ్లు బెట్టే కోడి నిస్తా
నా చెల్లెను నీ కిస్తా నీ పెండ్లికి నేనొస్త
నా పదము మరువయ్యో నా ముద్దుల బావయ్యా
అద్దశేరు బియ్యమొల్లా గుడ్లుబెట్టే కోడి నొల్లా
నీ చెల్లెలు నాకొద్దు నా పెండ్లికి రావద్దు
నీ పదము మరవనే నా ముద్దుల మరదలా.

(అంటూ రచ్చబండ మీద కుర్చొ బోవును....ఇంతలో చంద్రం వచ్చి.)

చంద్రం:- కోటయ్యా కూలోళ్లని తీసుకొని పొలం పొమ్మంటే ఇక్కడే కూర్చున్నావేం?

కోట:- ఏడ గూసున్ననండీ కూసుందామని అనుకునే టొరికే మీరొస్తిరి. అయినా ఊళ్లే ఒక్కలన్న

ఉన్నరా. అందరు సినబాబు పనికే పొయ్యింద్రంట.

చంద్రం:- ఏడ్చినట్టుంది.

కోట:- ఓరండీ?

చంద్రం:- నువ్వు, నేను.

కోట:- అట్టంటరేందుండీ. అయినా ఇప్పుడు కూలోల్లు వోరున్నరు. అందరు సినబాబు పొలానికి కామం దులే నైరి. మీరుగూడ అట్ట జేస్తే....

నక్షత్ర:-అలా చేసి నన్ను అడుక్క తినమంటున్నావా.

కోట:- ఆమాటకొస్తె సినబాబు అడుక్క తింటున్నాడులేరి.

చంద్రం:-చినబాబు. చినబాబు, అందరికీ చినబాబే, నువ్వు కూడా పోయి వాడి పార్టీలో కలువు.

కోట:-అంత కోప మెందుకుండీ. అనంగ అనంగ ఒక్క అరకపాలు మీ పొలంల పెట్టిస్తిరి. పేరుకే గని ఒక్కనాడన్న ఆ అరకపేరు మీద ఇంత బువ్వ దినలేదు. బాకి కిందికే బాయె. మల్లబాకిల ఇంతపడ్డి గూడ తగ్గించరైతిరి.

చంద్రం:-నీకు కావాలంటే ఆ తూర్పు గుడ్డెం ఇచ్చేస్తగాని బాకీలో ఒక్క నయాపైసా గూడా తగ్గించను.

కోట:- తగ్గించక పోతె తగ్గించకపోతిరి గని ఆ తూర్పు గుడ్డెం సెల్క....

చంద్రం:-ఇస్తానన్నానుగా.

కోట:- ఇంగ మీరు ఇస్తనన్నంక తప్పుతారు.

చంద్రం:-అది సరే గాని కోటయ్యా! మీ మరదలు లక్ష్మి, మా కమల ఆ శంకరం గాడి దగ్గరకు పోయా రటనే?

కోట:-మీ కమలమ్మగారు పోతే పొయ్యింద్రేమో గనీ, మా మరదలు మాత్రం పోదుండీ. అది మా సిన్నాయన ఇంటికి పోంగ నేను జూస్తిని.

చంద్రం:-నీ తెలివి తెల్లవారినట్లుంది. మా కమల స్నేహితు రాలే నీ మరదలు. ఆమే వచ్చేప్పుడు రమ్మని ఉత్తరం రాస్తేనే వచ్చిందట. ఆ యిద్దరూ కలిసే పోయారట.

కోట:- ఎట్టెట్టా మీ కమలమ్మకు మామరదలు స్నేహితు రాలా. ఈల్ల ఇద్దరికి ఎట్ట గలసెనో ఆ మెలక నాకు తెలువక పాయెనే.

చంద్రం:-దీంట్లో తెలియల్సిందేముంది. ఇద్దరూ ఒకే దగ్గర చదువుకున్నారేమో,

కోట:- అంటె మీ కమలమ్మ గోరితోని సదివిందంటరు. అంత పెద్ద సదువు ఎట సదివెనుండీ?

చంద్రం:-ఈరోజుల్లో చదివేందుకు చాలా అవకాశాలున్నా యితే. వెనుకబడ్డ తరగతులనే వాళ్ళకు ప్రభుత్వం ఏదో ఒకవిధంగా తోడ్పడుతూనే ఉంది.

కోట:- బలే బలే. మా మరదలు పెద్దసదువు సదివిందన్న మాటే. బలే మంచి మాట సెవునేసిండ్రు.

చంద్రం:-చదువుకున్నది కాబట్టే ఆ శంకరం గాడి తో నవ్వుతూ చేతులు, చేతులు కలుపుకుంటూ తిరుగు తూంచటగా.

కోట:- గామాటనకురి, ఎంతబీదోల్లమైనా మాకు మాన మరి యాదలు ఉన్నయనుకోరి.

చంద్రం:- నేనే అబద్ధమాడుతున్నా నంటావా?

కోట:- నిజమే నంటారా. నిజమె నైతే దెబ్బ గాల కోటయ్యంటే ఏమగునుకుంటుండరో ఏందో, డొక్కజించి డోలు గట్టనుంది.

(ఇంతలో ముత్తయ్యా భుజానికి డప్పు, నెత్తిమీద ముగ్గు తట్టతో ప్రవేశిస్తాడు)

కోట:- (ముత్తయ్యను చూచి) నెత్తిన తట్ట, సంకకు డప్పు, ఏమి సంగతిరో ముత్తిగా?

ముత్త:- (చంద్రం వైపు చూచి) దణ్ణం పెడతనుండి. మీకు తెలవదా ఎట్ట? ఊరు బయట శంకరమయ్యా గారి సెల్కల ఏందో బడంట, దవాఖనంట, యిం కేందొ సేతి పనుల ఇల్లంట, కర్తరంట ముగ్గు తీసుక పోతుండ.

కోట:- ఇట దెమ్మని సినబాబు సెప్పిండా?

ముత్త:-మల్ల సెప్పందె నేనెందుక తీసుకపొతున్న?

చంద్రం:- చెప్పాడేం? ఎవడబ్బ సొమ్మురా అది, శంకరం గాడి తల్లికి డబ్బిచ్చి కొన్నాను.

ముత్త:- అ డబ్బిచ్చిన కాడికి అమ్ముకున్నరేమొ కద భూమి?

చంద్రం:-ఎవడ్రా చెప్పింది నీకు? ఆ భూమి నాది, డబ్బిచ్చి కొన్నాను. ఆ భూమి మీద అడుగు పెట్టారా

కాళ్లు విరగ్గొడతాను. ఇలా అన్నానని మీ చిన బాబుతో సెప్పు.

ముత్త:- ఒక్కడుగొచ్చి మీరే సెప్పి పోరాదురి,

కోట:- అరేముత్తిగా; జాగ్రత్తగా మాట్లాడు, అరు జెప్ప మన్న మాట సెప్తవా లేదా? డొక్కచించి డోలు గడత.

ముత్త:- ఇదేంది నా యెంబడి దగిలిను్రి. ఏం సెప్పు కుంటరొ మీరే సెప్పుకోరి.

కోట:- అయితే నువ్వు చెప్పవన్న మాట.

ముత్త:-నా కేం బట్టిందుండి సెప్ప?

చంద్రం:-ఒరేయ్. చెప్పవేం! నా కివ్వాల్సిన బాకి ఇప్పుడే ఇక్కడ కక్కి పో! లేకుంటే డప్పు అక్కడ పెట్టి పో.

కోట:- ఇంక తమాసా చూస్తవేంది పెట్టక.

ముత్త:-బాకీకి దీనికి ఏమిదంటుండి. బాగుండదే దరువు. ఇస్తలే మీ లచ్చల బాకి.

(అనుకుంటూ వెళ్లిపోతుండగా, కోటయ్య కర్రలేపి కొట్టబోవగా. చంద్ర కర్రబట్టుకొని ఆపి....)

చంద్రం:-వీణ్ణికొడితే ఏం లాభం?

కోట:- ఇసుంటోలను గూడ ఇడిసి పెట్టగూడదు.

చంద్ర:-వీళ్లందరికీ శంకరంగాడో గురువయ్యాడు. అసలు శంకరంగాడి పొగరణిస్తే గాని వీళ్ల పొగరణగదు.

కోట:- మీరు సెలవు సెప్పరాదురి. దెబ్బగాల. నా తడాఖా చూపిస్త. ఇప్పుడా ముగ్గెయ్యాకుండ ఆపమంటరా బాయి.

చంద్రం:-ఆపమంటరా ఏమిటి. ఊఁ వెళ్లు. భూమిలో అడుగు పెట్టిన వాణ్ణి.....

కోట:- డొక్కడించి డోలు కట్టనుండి. కోటయ్య దెబ్బంటే ఊరంతా బొబ్బ

(మీసం దువ్వి. తొడ చరచుకొని, దురుసుగా వెళ్లిపోవును.)

చంద్రం:-(అటూ ఇటూ తిరిగుతూ) ముగ్గు పోస్తారట ముగ్గు. ఎవడబ్బ సొమ్మనుకున్నారో ఏమో? ఈ చంద్రమంటే ఏమను కుంటున్నారో? (అనిఅంటూ చరచరా వెళ్లిపోవును.)

(ఇంతలో ముత్తయ్య డప్పు కొట్టూ కేక వేస్తాడు.)

ముత్త:- ఇన్నోళ్లెవరో, ఇననోళ్లెవరో, ఊరి బయట బడి. దవాఖాన, చేతి పనులు నేర్చుకునే ఇల్లు కడ్తాను్రి. వోరికి సేతనైన సహాయ అరుసెయ్యాలె. ఇం టికో మనిషి రావాలయో హో హో. ..

(అని తిరిగి డప్పు కొట్టుకొంటూ వెళ్లి పోవును)

(స్టేజీ మీద అర నిమిషం చీకటి చేసి మళ్ళివెలుగు చేయాలి) (ఇంతలో కోటయ్య తలగాయంతో రక్తం కారుతుండగా చెయ్యి గాయంమీద నొక్కి పట్టి ప్రవేశిస్తాడు)

(వెంటనే లక్ష్మి ఒక గుడ్డ తీసుకొని వస్తుంది.)

లక్ష్మి:- బావా! నేను ఎంత వద్దన్నా విన్నావు కాదు. రక్తం పోకుండా కట్టు కడ్తాను, కూర్చో బావా.

కోట.- వచ్చినావు. నువ్వసలు ఆనితోని ఎందుకు తిరుగు తుండవో ముంగల ఆమాట సెప్పు.

లక్ష్మి:- తరువాత చెప్తా బావా, ముందు ఈ కట్టు గట్టుకో.

కోట:- కట్టంట కట్టు! అసలు నువ్వు నా ముందర నుంచి పో. ఆడితోని తిరగ నేర్సినావు. ఆని మీదికి మనుసు పోతుండాది.

లక్ష్మి:- ఏమిటీ మాటలు? అసలు నీతో మాట్లాడటమే తప్పు ఛీ (వెళ్ళిపోవును.)

కోట:- అంతేలే! పా పా, ఇంటికి బా సెప్తా.

(ఇంతలో చంద్రం హడావిడిగా ప్రవేశిస్తాడు.)

చంద్రం:-ఏమయింది కోటయ్యా! ఏమయింది?

కోట:- ఏమయింది లేరి, జర దెబ్బ తగిలింది.

చంద్రం:-గాయం పెద్దదేనే?

కోట:- అయితే అయిందిగనుండి. కర్రబడ్తే సినబాబే పట్టాలి. బలే ఒడుపుమీద కొడ్తడు లేరి దెబ్బ. ఇంత ఒడుపు మీద దెబ్బ కొట్టెటోళ్ళు ఈవూల్లెనె కనపల్లేదు. ఈవూరేంది ఈ సుట్టుపట్టున లేరంటె నమ్మురి. బలే ఒడుపు మీద బడ్తడు లేరి కర్రి.

చంద్రం:-ఏమిటి కోటయ్యా, వాడితో దెబ్బలు తిని వాడినే పొగుడ్తున్నావే?

కోట:- మీరు సూల్లేదు గానుండీ ఎంత సక్కదనంగ పడ్తాడనుకున్నరు కర్ర. ఆ దెబ్బకు ఉంకోడైతె ఆడెనే గిల గిల దన్నుకొని పానం ఒదులు. నేను గాబట్టి ఆగిన.

చంద్ర:-చాల్లే నీ వాగుడు. ఊఁ ఇప్పుడు దొరికాడు. ఈ దెబ్బతో వీడ్ని జైలుకు పంపించానన్నమాటే. ఇక మన రాస్తా సాఫ్. ఆఁ, పద పోలీస్ స్టేషన్‌కు, కోటయ్యా.

కోట:- ఏందీ? పోలీసోల్లతోని జెప్పాల్నా. నా పానం పోయినా సెప్తాను. అసుంటిపని నాసేత గాదుండి.

చంద్రం:-ఏమిటీ? పోలీసులకు రిపోర్టు చెయ్యనంటావా? రిపోర్టు చేస్తే వాణ్ణి పోలీసులు పట్టుకుపోతారు. వాణ్ణి పట్టుకుపోయారా. ఇక మనం ఆడిన ఆటకూ పాడిన పాటకూ అడ్డే లేదనుకో. ఈ సమయాన్ని విడ్చిపెట్టకూడదు.

కోట:- అది నిజమేగనుండీ, గసుంటి పని నేను సెయ్య లేనుండి. ఇద్దరం కొట్లాడినం, ఓరికో ఒరికి దెబ్బలు తలిగినై, శాతనైతే మల్ల దెబ్బకు దెబ్బ ఎదురుగొట్టలేగానీ. సీ సీ, పోలీసోల్లతోని సెప్పు కొవాల్నా దెబ్బలు తిన్ననని.

చంద్రం:-నీకు తెలియదు కోటయ్యా, నేను చెప్పినట్లు విను, నామాట విని పోలీసు స్టేషన్‌కు పద. నీకు తరువాత అన్నీ చెపుతాను.

కోట:- సెసిత్ ....మీరేమన్నా అనురుగని గామాటఅనకురి.

చంద్రం:-కోపంతో-ఊఁ....అయితే రావన్నమాట.తిన్నంత సేపు తెగతింటారు. సమయంవస్తే ఎదురు తిరుగు తారు. అసలు ఈలాంటి మెదడులేని మనుష్యుల్ని ఉంచుకోవడమేతప్పు. పుట్టాడు మొనగాడు, ఈ రోజు తలపగల గొట్టిన వాడు, రేపు ప్రాణం కూడా తీసేస్తాడు. చావు, నీ చావు నువ్వే చావు. చేసుకున్నంత కుడు, మహాదేవ అన్నట్టుంది వ్యవహారం.

(అంటూ కోపంతో వెళ్ళిపోవును)

కోట:- ఇదెక్కడి కథ. (ప్రేక్షకులవైపు చూస్తూ.) కొట్టినోడు ఆయన. దెబ్బలు తిన్నోన్ని నేను, మల్ల సేతనయిన్నాడు దెబ్బకు దెబ్బ బదులు తీసుకొనే టోన్ని నేనే కాని, నడమ యీయన కెందుకూ అంట ఈ తిప్పలు. పోలీసోల్లతోని జెప్పాలంట, పోలీసోల్లతోని. సెపీత్, నా పానం పోయిన అసుంటి పని సెస్తాను.

(అంటూ వెళ్ళిపోవును)

(తరువాతి భాగం వచ్చే సంచికలో)

మన హృదయమూ, మనస్సూ నిర్మలంగా ఉంటేనే ప్రపంచాన్ని పీడిస్తున్న భయ వాతావరణాన్ని ధైర్యంగా ఎదుర్కొగలం.

— ఐన్‌స్టీన్

ప్రశ్నోత్తరావళి

ప్రశ్న: 103

పోచంపాడు ప్రాజెక్టు పూర్తికావడానికి ఎంతకాలం పడుతుంది? ఈప్రాజెక్టుకు ఎంత ధనం కేటాయింపబడింది? ఈ ప్రాజెక్టువలన ఏయే జిల్లాలకు ప్రయోజనం కలుగుతున్నది, దీని నీరు ఎన్ని లక్షల ఎకరాలకు పారుదలకానున్నది దయచేసి తెలియజేయండి?

(శ్రీ టి. నరసింహారెడ్డి,
మెట్‌పల్లి, హుజూరాబాదు
తాలూకా, కరీంనగరం జిల్లా)

సమాధానం:–

గోదావరి నదికి అడ్డంగా ఆదిలాబాదు జిల్లాలో పోచంపాడు గ్రామ సమీపంలో నిర్మింపదలచిన పోచంపాడు ప్రాజెక్టును ద్వితీయ పంచవర్ష ప్రణాళికలో చేర్చడానికి తలపెట్టబడింది. ఈ పథకం తొలి ఘట్టానికి రూ. 15.25 లక్షల వ్యయం అంచనా వేయబడింది. దీనిని సుమారు అయిదు సంవత్సరాలలో ముగించడానికి కార్యక్రమం నిర్ణయింపబడింది. ఈ ప్రాజెక్టువలన నిజామాబాదు,కరీంనగరం జిల్లాలలోని 3.6 లక్షల ఎకరాలకు నీరు లభిస్తుంది.

ప్రశ్న 104:

ఆంధ్రప్రదేశ్‌లో 1958-59 లో ఎంతమంది నిరుద్యోగులుగా వున్నారు? వారిలో ఆంధ్రలో ఎంతమంది? తెలంగాణా ప్రాంతంలో ఎంతమంది వున్నారు? వారిలో మెట్రిక్యులేట్లు ఎందరు? ఉద్యోగ సాధక కేంద్రాల ద్వారా ఎంత కృషి జరిగింది?

(శ్రీ పి. డి. ఎ. మోహన్‌రాయ్,
జగ్గయ్యపేట, కృష్ణాజిల్లా)

సమాధానం:–

ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ఉద్యోగ సాధక కేంద్రాలలో ఉద్యోగం కొరకు తమపేర్లు నమోదుచేయించి, ఉద్యోగం లభించకుండా వున్నవారి సంఖ్య 1958-59 వ ఆర్థిక సంవత్సరం చివరకు అంటే 1959 మార్చి 31 వ తేదీ నాటికి, 82,354 వున్నది. వీరిలో మెట్రిక్యులేట్లు 22,173 మంది. 1958-59 వ సం. లో వివిధ ఉద్యోగ సాధక కేంద్రాల ద్వారా మెట్రిక్యులేట్లతో సహా 14,999 మందికి ఉద్యోగాలు చూపబడినవి.

ప్రశ్న: 105

నిర్మాణంలో నున్న రాజమండ్రి- భద్రాచలం రోడ్డును గురించి దయచేసి దిగువ విషయాలను తెలియజేయండి;

(1) నిర్మాణం యేదశలోనున్నది; (2) సుమారు ఏ తేదీకి పూర్తిచేయబడి రాకపోకలకై తెరువబడుతుంది; (3) ఈ రోడ్డు వైజాగ్ లేక కాకినాడ జిల్లా ముఖ్యకార్యస్థానంను ఏదైనా ఇతర రాష్ట్ర రహదారి ద్వారా కలుపుతుందా, అట్లయిన ఎచ్చట; (4) దీనికి కేటాయింపబడిన అంచనా వ్యయం ఎంత; ఇప్పటి (1958-59)వరకు ఎంత వ్యయం జరిగింది?

(శ్రీ టి. విశ్వనాధశాస్త్రి,
443, హార్డీకర్ బాగ్, హైద్రాబాదు)

4. రాజమండ్రి నుంచి భద్రాచలంకి వెళ్ళేరోడ్డు కాకినాడ జిల్లా హెడ్‌క్వార్టర్స్‌ను భద్రాచలంతో రాజమండ్రి ద్వారా కలుపుతుంది. ప్రస్తుతం రాజమండ్రి నుంచి మారేడుమిల్లి మై. 49-2 ఫర్లాంగులవరకు కంకరరోడ్డు వున్నది. భద్రాచలం నుంచి నెల్లిపాక వరకుగల కంకరరోడ్డు నిడివి 9 మైళ్ళ 4 ఫర్లాంగులు. మారేడు మిల్లి నల్లిపాక రోడ్డు (65 మై.) పని జరుగుతున్నది.

(1) రోడ్డు నిర్మాణం జరుగుతున్నది. కంకరవేయడం, సి. డి. పనులు, పెద్ద వంతెనల నిర్మాణం చేపట్టబడవలసి వున్నది. (2) పని పూర్తికావడానికి 3 మొదలు 4 సంవత్సరాల వరకు పట్టవచ్చు. సి. డి. పనులు, పెద్ద వంతెనల నిర్మాణం ముగిసిన తరువాత రాకపోకలకై రోడ్డు తెరవబడుతుంది. (3) ఈ రోడ్డు కాకినాడ జిల్లా హెడ్‌క్వార్టర్స్‌ను ఎం. డి. ఆర్. సామర్లకోట-గోకవరం రోడ్డు ద్వారా రాజమండ్రి-మారేడుమిల్లి రోడ్డుపై 19/3 వద్ద కలుపుతుంది. (4) నిర్మాణానికి రూ. 21.06 లక్షల అంచనా వ్యయం మంజూరు చేయబడింది. ఇప్పటివరకు రూ.13,73.327/-ల వ్యయం జరిగింది.

యంత్రంలో ఒక పరికరంగా బ్రతకటం మానవుడి ప్రతిష్టకు భంగకరం. ప్రతి మనిషి సంఘంలో సంపూర్ణ సభ్యుడుగా అభివృద్ధి చెందాలని ఆకాంక్ష.

— మహాత్మా గాంధీ.

* * *

కలిమిగల లోభి కన్నను
విలసితముగఁ బేదమేలు వితరణి యైనన్
జలి చెలమ మేలుగాదా
కులనిధి యంభోధికన్న గువ్వల చెన్నా!

వచ్చె సంక్రాంతి

— శ్రీ అన్నాప్రగడ శ్రీరామమూర్తి.

పల్లియలలో రంగ
వల్లికలలో నిండు
సింగారములు చూచి
ఒయ్యారములు చూచి
కవి మనసు మురిసిందహో !
రవి పదవి కెగసిందహో !

ప్రత్యూష వేళలో
ప్రత్యేక శోభతో
ప్రాంగణమ్ముల ముందు
గోమయముతో నున్న
గొబ్బెమ్మలవిగవిగో !
ఒక గొబ్బిలో నున్న
చేమంతి విరిసింది
హేమంత ఋతువులో
సీమంత వెలిగింది
సిరిదేవి చిన్నారి
పకపకా నవ్వింది.!

వచ్చింది సంక్రాంతి !
వచ్చింది సంక్రాంతి !
పట్టణమ్ముల కేమి
తెచ్చింది సంక్రాంతి?
నిన్నటికి నేటికీ

ఉన్న మార్పే లేదు.
పత్రికలలో దప్ప
పట్నాలలో లేదు.
వచ్చింది సంక్రాంతి
వచ్చింది సంక్రాంతి
నగరవాసుల కెల్ల
నామ మాత్రము గానె
నడిచింది సంక్రాంతి

కదలిపోతున్నది
కదలిపోతున్నది
గ్రామ సీమలలోనె
కనిపించి సంక్రాంతి
వచ్చెనదె ! సంక్రాంతి
విచ్చెను తమః క్రాంతి
వచ్చెనే సంక్రాంతి
ఇచ్చునా విక్రాంతి
ఆంధ్ర జనముల కెల్ల
అందునా సంపత్తి
కవి మనసు మురిసిందహో !
రవి పదవి కెగసిందహో !

యూరప్ దేశస్థుడు అమెరికా వెళ్ళితే భవిష్యత్తు చూడవచ్చు. ఆసియా ఖండం అనంతమైన పురా వైభవోజ్జ్వల మానవ నాగరికతకు చిహ్నంగా నిలుస్తుంది.

— బెర్ట్రాండ్ రసెల్.

హాస్య రచన:

వలపుల తలపుల మలుపులు

— శ్రీ యస్వీ. సీతారామ మూర్తి

ఆనాడు ఆదివారం.

ఉద్యోగస్థుల పాలిటి ఆనందవారం.

ఉదయం పది గంటల నుండి సాయంత్రం అయిదు గంటల వరకూ ఆఫీసు కాగితాల కౌగలింతల్లో ఊపిరి సల పక ఉక్కిరి బిక్కిరవుతున్న ఉద్యోగస్థుల పాలిటి ఆహ్లాద వారం. ఆదివారం రాగానే ఉదయం పెందరాళే లేవక పోవ డం, మధ్యాహ్నం కనీసం రెండు గంటలయి నానిద్రా దేవిని ఆరాధించడం, లేచీ లేవడంతోటే టిప్ టాప్‌గా టాయిలెట్ అయి కాస్త మంచి గాలి పీల్చుకోడానికి ఆలా ఆలా, కొంత దూరం షికారుకి పోవడం లాంటివి ఉద్యోగస్థులకు బాగా అలవాటయిన అలవాట్లే!

సుబ్బారావు టిప్ టాప్‌గా తయారయి చేతి గడియారం చూసుకున్నాడు.

'అప్పుడే నాలుగున్నరయిందే!' అనుకున్నాడు.

'హర్రి అప్' అంటూ హుషారిచ్చింది హృదయం. గదికి తాళం వేశి రోడ్డు వైపు దారి తీశాడు.

కథకు ఉపక్రమించే ముందు సుబ్బారావు గురించి రెండు ముక్కలు చెప్పడం అప్రస్తుంకాదనుకుంటాను. సుబ్బా రావు అవివాహితుడు.

నాలుగేళ్ల కాలేజీ కృషి ఫలితంగా యూనివర్శిటీ వారు ఊటీ వలనే 'బి.ఎ' అనే రెండక్షరాలను ప్రసాదించేరు. ఆడిగ్రీని జేబులో వేసుకుని సరాసరి రాజధానికి వస్తే పబ్లిక్ సర్వీస్ కమీషన్ పుణ్యమా అంటూ శెక్రటేరియట్‌లో ఒక 'ఎల్.డి.సి.'ఉద్యోగంలభించింది.అదేమహాప్రసాదంగా స్వీక రించి,తెలుగు వాళ్లరాజధానిలో ఉంటున్నాననే ధీమాతో మన కథా నాయకుడు ఒంటరిగా, ఏకాంతంగా, ఓ రూములో కాలక్షేపం చేస్తున్నాడు. ప్రతి ఆదివారం సాయింత్రం పబ్లిక్ గార్డెన్స్‌కు వెళ్ల కుండా ఉండలేడు. తాను ఉద్యోగంలో చేరి రెండు నెలలేఅయినా హైద్రాబాద్ వాతావరణానికి బాగా అలవాటు పడ్డాడు. రిక్షావాడు రూపాయిన్నర అడిగితే ఉత్తి 'చారణా'కే బేరమాడాలనీ, ఎవర్ని దబాయించినా తురకంలో దబాయిస్తే ఎక్కువ సౌకర్యం ఉంటుందనీ, తెలుసు కున్నవాడై, తనకు వచ్చీరాని హిందీ మాటల్ని ఉర్దూకి జోడించి తన భాషా చాతుర్యాన్ని ప్రతి వాళ్ల మీదా వెదజల్లేస్తూ ఉంటాడు.

సుబ్బారావు కాళ్లీడ్చుకుంటూ పబ్లిక్ గార్డెన్సు చేరు కుని ఒక చోట పీఠం వేశాడు.

ఒక ప్రక్క హెల్తుమ్యూజియం, ఒక ప్రక్క అజంతా పెవిలియన్, వేరొక ప్రక్క కౌన్సిల్‌హాలు, మధ్యలో విశాలమైన ప్రదేశం, ఎందరోవ్యక్తులు విశ్రాంతికోసం ఆ ప్రదేశానికి వచ్చిపోతూ ఉంటారు. గుంపులు గుంపులుగా కూర్చుని పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ ఉంటారు. కొందరు పిల్లల్ని ఆడించడానికని ప్రత్యేకంగా పని కట్టుకుని వచ్చి ఆసంతతన్మయత్వంతో తాము పిల్లలతో ఆడుకుంటూ ఉంటారు. మరికొందరు ఆనరసనే ఉన్న 'జూ'లో వింత మృగాల్ని తిలకిస్తూ ఆనందిస్తూ ఉంటారు. మరి కొందరు టిఫెన్లు వగైరా తెచ్చుకుని తింటూంటారు.

భార్య భర్తలు, స్నేహితులు, ఒకరేమిటి? అనేక రకాల వారు పబ్లిక్ గార్డెన్స్‌లో కూర్చుని ఆకాస్సేపూ స్వర్గ లోకంలో ఉన్నట్టు ఫీలవుతూ ఉంటారు.

సుబ్బారావు ఏకాంతంగా కూర్చున్నాడు వచ్చీ పోతున్న వాళ్లను చూస్తూ.

సుబ్బారావు దృష్టి కాస్త దూరంలో కూర్చున్న ఒక జవ్వని వైపు ప్రసరించిది.

'Just see and enjoy' అన్నాడు షేక్స్పియరు. కనుక ఉత్తి చూడడంలో తప్పేమీ లేదనే తత్వంలోని మనిషి సుబ్బారావు.

ఇంతలో ఒక నవనాగరిక జంట చేతులు పట్టుకుని నడుస్తూ తన కెదురుగా, కాస్త ఎడంగా, వచ్చి కూర్చున్నారు.

రెండు జడల అమ్మాయి టకప్‌లో ఉన్న అబ్బాయి.

'హతోస్మి' అనుకున్నాడు సుబ్బారావు.

కాస్త సిగ్గు పడ్డాడు తనలో తాను.

"ఎంత భార్యా భర్తలయితే మాత్రం చేతులు పట్టుకుని మరీనడవాలా? అవును మరి! యిది రాజధానికదూ? యిక్కడంతా ఫేషన్‌గా, మోడ్రేట్‌గా, అప్‌టుడేట్‌గా ఉండాలి. అదొక రకమైన సివిలిజేషన్' అనుకున్నాడు పెళ్లి కాని సుబ్బారావు.

ఒకే శాల్తీని ఎంత సేపని చూస్తాడు?

వెంటనే దృష్టివేరొక మగువ వైపు మళ్లించేడు.

మరొక జంట కాస్త పుష్టిగా ఉన్న జంటే. సుబ్బారావు ప్రక్కనుండే నడిచి పోతున్నారు.

ముందు ఆమె వైపు చూశాడు.

తరువాత ఆయన వైపు చూశాడు.

ఆయన మరో 'ఒకామె' వైపు రెప్ప వాల్చకుండాచూస్తున్నట్టు సుబ్బారావు యిట్టే పశికట్టేశాడు.

''ఛా! అదేం బుద్ధి వాడికి! తనలాంటి బ్రహ్మచారి చూసినా అంత ఫర్వా లేదుగానీ పెళ్ళయినవాడూ, శ్రీమతితో షికారుకి వచ్చినవాడూ, వేరొక మగువవైపు చూడ్డం సంఘం ఒప్పుకుంటుందా?' అనుకున్నాడు.

ఆయనగారి వక్రచూపులు భార్యా మణి కనిపెట్టినట్టుంది.

'త్వరగా ఇంటికి చేరుకుంటే మంచిదేమో!' అన్నట్టు ఆయన వైపు తీక్షణంగా చూసింది.

"అవును మరి! భర్త పరస్త్రీవైపు చూస్తుంటే ఏ స్త్రీ సహించగలదు?" అనుకున్నాడు సుబ్బారావు, ఆజంట సుబ్బారావు స్క్రీన్ నుండి ఫేడౌట్ అయిపోయింది.

సుబ్బారావు నయనాలు మరో సీనును సెలక్టు చేసుకోడానికి తీవ్ర కృషి చేస్తున్నాయి.

తన వెనుక వైపు నాలుగైదు గజాల దూరంలో ఒక యువతి. ఒక యువకుడు కూర్చున్నట్టు సుబ్బారావు గమనించాడు. ఆ యువతి బెదురు చూపులు చూస్తూసిగ్గుపడుతోంది.

ఆయన ఆమెవైపు చూస్తూ నవ్వుతున్నాడు.

ఆవిడ ఆయనవంక సిగ్గుతో చూస్తోంది.

అదీ సిసలైన దాంపత్యం అనుకున్నాడు సుబ్బారావు. వాళ్ళేదో టిఫెన్ తెచ్చుకున్నట్టున్నారు. పొట్లం యిద్దరి మధ్యనాఉంది. యింకా ఎవ్వరూ తినడానికి ఉపక్రమించడం లేదు. "వారు తింటేనే కానీ నేనెట్లా తినను?" అనుకుంటోంది కాబోలు ఆమె! ''గాజుల చేతులు అందిస్తేనే కానీ నేనెట్లా తినను?'' అనుకుంటున్నాడు కాబోలు ఆయన! చివరకు ఆమే ధైర్యంచేసి రెండుస్వీట్లు ఆయన చేతికి అందించింది. యిద్దరూ తింటున్నారు.

ఎందుచేతనో సుబ్బారావుకి నోరూరింది.

తనకూ పెళ్ళయి ఉంటే,

తనూ శ్రీమతితో పబ్లిక్‌గార్డెన్స్‌కి షికారుకి వచ్చిఉంటే,

తన భార్య కూడా తనకు రెండుస్వీట్లు అందించిఉంటే,

''ఆహా! ఆ స్వీట్లు ఎంత తీయనా ఉన్నయి? అంటూ తినేవాడినికదా!" అంటూ రెండు నిమిషాలు ఒక మధురాతిమధురమైన కల కనేశాడు.

కనేలోగా ఆజంట వేరొక చోటికి ఉడాయించింది.

సుబ్బారావు నిరుత్సాహపడలేదు.

వేరొక జంటను చూశాడు.

అది మామూలు జంట కాదు.

జంటకు మరో రెండు ఉప జంటలు.

'హతోస్మి' అనుకున్నాడు సుబ్బారావు.

ఆవిడ ఒక పిల్లాణ్ణి ఎత్తుకుంది.

మరో పిల్ల కొంగు పట్టుకుని నడుస్తోంది.

ఆయన మరో పిల్లను ఎత్తుకున్నారు.

సరసనే కుర్రాడు నడుస్తున్నాడు.

''రామూ? నాన్నగారి చేయిపట్టుకోరా?'' అని హెచ్చరిస్తోంది తల్లి.

''అంత లేత వయస్సులోనే నలుగురు పిల్లలా, పాపము శమించుగాక!'' అనుకున్నాడు సుబ్బారావు. తనకూ అటువంటి పరి (దు) స్థితి ఏర్పడితే?

ఒక్కసారి కళ్లు మూసుకున్నాడు.

తన ఒడిలో ఒక పిల్ల.

వెనుక నుండి జుట్టు పీకుతూ మరో కుఱ్ఱాడు!

'నాన్నా అమ్మ పిలుస్తోంది!' అంటూ మరో కుఱ్ఱాడు!

తల దిమ్మెక్కి పోయింది సుబ్బారావుకి.

అబ్బా! తనకూ పెళ్ళయితే,

తనకూ నలుగురైదుగురు పిల్లలు కలిగితే,

తనకు వచ్చే యీ స్వల్ప జీతంతో ఎట్లా గడవడం? ఛా! పిల్లలు పుట్టకూడదు. పుడితే జీవిత మంతా నరక మవుతుంది. సుబ్బారావుకు కళ్ళలో నీళ్లు గిఱ్ఱున తిరిగినై.

ఇంతలో ఒక ముష్టి వాడు.

"బాబూ? ఒక కాని"

జేబులో ఒక నయాపైసా ఉంటే తీసి యిచ్చేడు. ఆ పైస నందుకుని ముష్టి వాడు ముందుకు సాగిపోతున్నాడు. "తాతా? నీ కెంత మంది పిల్లలు?" ముందుకు పోతున్న ముష్టివాణ్ణి పిలిచి అడిగేడు.

''నాకా బాబూ? యిద్దరమ్మాయిలూ, ముగ్గురబ్బాయిలూ'' అంటూ మరో రెండడుగులు ముందుకు వేశాడు.

ఒక ముష్టివాడు భార్యనూ, అయిదుగురు పిల్లల్ని పోషించుకో గలుగుతున్నాడు. తాను పెంచలేడా? తాను పొరపాటు పడ్డాడు. తన అభిప్రాయాన్ని మార్చుకున్నాడు.

ఎదురుగా మరొక జంట.

మరీ దగ్గరగా కూర్చున్నారు.

ఏవేవో కబుర్లు చెప్పుకుంటూ నవ్వుకుంటున్నారు. ''చలిగా ఉంది ఇంటికి పోదాం నడవండీ?" అంది ఆమె.

సుబ్బారావుకి కూడా చలేశింది.

ఇంతవరకూ చలిగా ఉన్నా అంత చలిగా ఉన్నట్టు ఫీలవ లేదు. కానీ ''యింటికి నడవండీ? చలిగా ఉంది'' అని అనడం వినడం తోటే తనకూ చలేశింది.

సంసార జీవితంలో ఎంత ఆనందం ఉంటుందో? ఎంత హాయి ఉంటుందో? ఎంత సుఖం ఉంటుందో?

అవివాహితుడైన ప్రతి వ్యక్తీ యీ విధంగానే తల పోస్తుంటాడు కాబోలు!

సుబ్బారావుకూడా అవివాహితుడేగా!

అందుకనే ఒక నిర్ణయానికి వచ్చేశాడు.

తాను త్వరలో వివాహం చేసుకోవడం అవసరం అని. తనకూ యుక్త వయస్సు వచ్చింది.

పాతిక సంవత్సరాలు యింకో రెండు నెలల్లో నిండబో తున్నాయి.

అయినా 'నాకు పెళ్లి చెయ్యండి నాన్నా'అని అడుగుతాడా మరి!

సుబ్బారావు ఆలోచనా తరంగాలు తన పరిణయంగురించి అంతరిక్షంలోని స్పుట్నిక్‌లా పరుగులు తీశినై.

ఇంతలో,

ఓ అందాల అప్సరస సుబ్బారావు దృష్టికి దృగ్గోచర మైంది. పదిహేను పదహారు సంవత్సరాలు ఉండ వచ్చునేమో!

రెండు జడలు వేసుకుంది.

నిమ్మ తొనల్లాంటి పెదిమలు, మల్లిమొగ్గల్లాంటి బుగ్గలు, దానిమ్మ గింజల్లాంటి పళ్లు, చిలిపిగా ఉండే కళ్లు, సన్నని నడుము

సుబ్బారావు యింకా యింకా వర్ణించేస్తున్నాడు.

ఆ అమ్మాయి ఎంత అందంగా ఉంది. ఎంత ఆకర్షణీయంగా ఉంది! ఎంత ఆహ్లాదంగా ఉంది! ఎంత అయోమయంగా ఉంది!

ఛాఛా! కవిత్వం దెబ్బతింది.—

ఎంత అమోఘంగా ఉంది!

ఎంత అద్వితీయంగా ఉంది!

అంత అందంగా ఉన్న అమ్మాయినే తానూ పెళ్లి చేసుకోవాలి. తాను పెళ్లి చేసుకునే అమ్మాయి

ఎఱ్ఱగా, నాజూగ్గా ఉండాలి,

అంత లావుగా ఉండరాదు.

కనీస విద్యార్హత స్కూలు ఫైనలు.

తప్పని సరిగా రెండు జడలు వేయాలి.

బాటా కంపెనీ బూటు తొడుక్కోనిదే వీధిలోనికి రారాదు.

సినిమాకు వెళ్లినా, షికారుకి వెళ్లినా తనను తప్పక అనుసరించాలి.

మహిళా సంఘాలలో చేరరాదు.

ఒకరు, అత్యవసర, అనివార్య పరిస్థితులలో యిద్దరు

తప్ప ఎక్కువ మంది పిల్లల్ని కనరాదు. వారు పురుష జాతికి చెంది ఉండడం ఎంతైనా అవసరం. అన్ని క్వాలిఫికేషన్సు ఉన్న పిల్లనే పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు సుబ్బారావు.

ఆ లక్షణాలన్నీ ఎదురుగా ఉన్న అమ్మాయిలో ఉన్నట్టు ఊహించుకున్నాడు.

"అటువంటి అమ్మాయి తనకూ లభించాలి"

ఇంకా అనేక రకాల ఆలోచనలతో ఆ అమ్మాయికి అనేక రకాల పోజులు యిచ్చేస్తున్నాడు.

ఇంతలో.

"యిక్కడున్నావా లక్ష్మీ? రా యింటికి పోదాం" అంటూ ఓ ఉలెన్ షూట్‌వాలా ఆమె దగ్గరకు వచ్చేరు.

"చచ్చిరి సోదరుల్ సుతుల్"

సుబ్బారావు గుండె బేజారెత్తి పోయింది.

తన పక్కకు తిప్పుకున్నాడు.

వళ్ళంతా ఒక్కసారి వేడెక్కి పోయింది.

చచ్చేం పో! తన డిపార్టుమెంటు పెద్ద ఆఫీసరు గారి అమ్మాయా యీవిడ!

ఆ ఆఫీసరూ, అమ్మాయి వెళ్ళిపోయారు.

యింకా నయం!

తన వాలకం అంతా చూసి పశికట్టేరు కాదు!

తన పెళ్ళి మాట దేముడెరుగు!

తన కాన్ఫిడెన్షియల్ రిపోర్టు అంతా షరాబు అయ్యేది.

ఈసారి పెళ్ళి మాట మర్చిపోయి దిక్కులు చూడకుండా యింటికి దారి తీశాడు సుబ్బారావు.

———:*:———

నీ చెడు ప్రవర్తన యితరులకు సులువుగా అంటుకుంటుంది. ఆలాగే మంచి అలవాట్లు కూడా. బాల బార్యుని లేత కిరణాల వేడితో లోకం చలి తీర్చుకున్నట్లు, చిరునవ్వుతో పలకరించే సజ్జన దర్శనంతో మనలోని చీకటు పటాపంచ లవుతాయి.

— ఎ. జి. గార్డినర్.

విన్నపం

— "మురారి"

చేయి చేయి కలుప
వేయి పనులు స్వల్పం
ఒక్కొక్కరు చేయ
ఒక్కపనే భారం
గడ్డి పోచ పట్ట లేదు
గంతు చీమ నొక్కదాన్ని
పదులు తృణము లేకమైన
పట్టు మదపు టేనుగునే
పదిమందీ ఏకమైన
పాషాణం మెత్తబడును
చేయి చేయి కలుపు
సహకారం నెరపు.

* * *

రాయి రాయి కలియ రాజిల్లు సౌధమ్ము
నీటి బొట్లు చాల - నీరధులగు
చేయి చేయి కలుప చెన్నొందు పథకాలు
కలిసి చేతలోని ఘనత చూడు.

ప్రణాళికలో వున్నది
ప్రగతి పథం అన్నది
నీకు, నాకు, అందరికీ
మన పిల్లల ముందడుగు
ప్రతి రోజొక పండుగగా
పరమానందము కురియ
ప్రణాళికా విజయమ్మును
కాంక్షించుము కృషి చేయుము.

ఆంధ్ర ప్రదేశ్

ప్రగతి వచ్చు మనము ప్లానుకు తోడ్పడ
ప్రగతిలోనె మనకు బ్రతుకు మంచి
ప్రగతి లేని బ్రతుకు ప్రాముఖ్య హీనమ్ము
ప్రగతి సుగతి కాద పరమ హితుడ!

* * *

అదుపుచేసి వ్యయమును
పథకమ్ములకిమ్ము సొమ్ము
ప్రభుతకు చేయూత నిమ్ము
నీ—నా— జీవన పరిమాణమ్ము
త్వరితమ్ముగ పెరుగనిమ్ము
మన పిల్లల "రేపు" లు
దిద్దుకోనిమ్ము రూపులు

రూపు దిద్దు కొనును రేపటి బ్రతుకులు
పొదుపు, "ప్లాను" కొరకు మదుపు పెట్టి
స్వార్థ హీనమైన త్యాగమ్ము చేయగా
'ప్లాను' జయము కొరకు పాటు పడుము.

అపాయం మనకు గురువు. దాని దోఫ ఏసి అనేకం నేర్చుకుంటాం. అలాగే అవమానం, అపజయం, అపహేళన, అపహాస్యం కూడా.

— విలియం హాజ్లిట్

పాలు పితకడం పాపమనుకునే గిరిజనులు

విశాఖపట్నం జిల్లాలోని హుకుమ్‌పేట(ఇప్పుడుపాడేరు) బహుళార్థ సాధక ప్రాజెక్టు తొలుత జాతీయ విస్తరణ సేవా కేంద్రంగా 5-2-1956 తేదీన ప్రారంభింపబడింది. అప్పుడు జిల్లా కలెక్టరు దీనికి ప్రారంభోత్సవం చేశారు. ఆ తరువాత 2-10-1956 తేదీ నుంచి ఇది బహుళార్థ సాధక పైలట్ ప్రాజెక్టు క్రింద మార్చబడింది. బ్లాకు డెవలప్‌మెంటు అధికారి పదవి గెజిటెడ్ హోదాకు పెంచబడి ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ అధికారిగా మార్చబడింది.

స్వాభావిక పరిస్థితులు

ఈ ప్రాజెక్టు 97 గ్రామాలు, 377 శివార్లతో 240 చ. మైళ్ళ విస్తీర్ణంలో వ్యాపించి వుంది. ఈ ప్రాంతమంతటా వివిధ రకాల అడవులున్నాయి.

ఈ ప్రాజెక్టు జనాభా 32,951. వీరిలో 2,598 మంది వ్యవసాయ కూలీలు, 6,425 మంది వ్యవసాయదార్లు, 112 మంది వృత్తి పనివారలు, ఇతర వృత్తులలో వున్నవారు 231 మంది. ఈ ప్రాంతంలో నివసిస్తున్న గిరిజనులలో భగటాలు, కొండకాపులు, గదపాలు, రెడ్లు, దొరలు, వాల్మీకులు, కమ్మరలు, సామంతులు (వీరినే కొదులు అని కూడా అంటారు) ముఖ్యులు. గిరిజనులలో ఎక్కువమంది వ్యవసాయ వృత్తులను అవలంబించారు. వీరు చాలా వెనుకబడినవారు. దారిద్ర్యంతో వీరు బాధపడుతున్నారు. నిరక్షరాస్యత వీరిలో ప్రబలంగా వుంది. గిరిజనులకు కాలానుగుణ్యంగా తమ ఆచార వ్యవహారాలనూ, పద్ధతులను మార్చుకోవడమంటే గిట్టదు. మార్పు వల్ల వారి సామాజిక పరిస్థితీ, ఆర్థిక పరిస్థితి చక్కబడే అవకాశమున్నాసరే మార్పు జెందటానికి వారు సులభంగా అంగీకరించారు.

ప్రాజెక్టు పరిస్థితులు

ఈ ప్రాజెక్టు రూ. 15 లక్షల కేంద్ర గ్రాంటులతోనూ, రూ. 12 లక్షల సమూజాభివృద్ధి నిధులతోను నిర్వహింపబడుతున్నది. ప్రాజెక్టు కార్యకలాపాలు వ్యవసాయం, నీటివనరులు, బంజరు భూములను సాగుకు లాయకు చేయడం, పశుపోషణ, రహదారి సౌకర్యాలు, సహకారం, విద్య, సాంఘిక విద్య, ఆరోగ్యం, గ్రామీణ పారిశుద్ధ్యపు రంగాలలో ముఖ్యంగా జరుగుతాయి. అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణకై సమగ్రమైనట్టి ఏకీకృతమైన పథకాలను రూపొందించడానికీ, వివిధ కార్యకలాపాల మధ్య సమన్వయాన్ని సాధించడానికి వివిధశాఖల అధికార్లు విస్తరణాధికార్లుగా నియమించ బడినారు. వీరు ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ అధికారి అజమాయిషీ క్రింద పనిచేస్తున్నారు. వ్యవసాయం, పశుపోషణ, సహకారం, విద్య, సాంఘిక సంక్షేమం, ఆరోగ్యం, పారిశుద్ధ్యం ఇత్యాధి రంగాలలో ప్రతిదానిలోనూ ఒక్కొక్క సంవత్సరంలో సాధించవలసిన అభివృద్ధికి లక్ష్యాలు ఏర్పర్చబడతాయి.

వ్యవసాయం

ఈ ప్రాంతంలో వ్యవసాయం పాత పద్ధతులలో జరుగుతుంది. దీనికి తోడు ఈ ప్రాంతపు భూములు నాణ్యమయినవి కూడా కావు. ఇచ్చట సమూజాభివృద్ధి కార్యక్రమం మొదలుపెట్టబడిన తరువాతనుంచి ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టటానికీ, రసాయనిక ఎరువులు, మేలిరకం విత్తనాల వాడకాన్ని ప్రోత్సహించడానికి ప్రయత్నాలు చేయబడినవి. వ్యవసాయోత్పత్తిని రెంట్టింపు చేయడానికై పెట్టుకున్న లక్ష్యాన్ని సాధించడానికి ఆధునిక

వ్యవసాయ పద్ధతులను విస్తృతంగా ప్రచారం చేయడంతో పాటు వ్యవసాయ క్షేత్రాలలో ప్రత్యక్ష ప్రదర్శనలు కూడా ఏర్పాటు చేయబడుతున్నవి.

1957 డిసెంబర్ ఆఖరు వరకు వివిధ గ్రామాలలో 647½ మణువుల మేలిరకం విత్తనాలు పంచిపెట్టబడినది, 70 ఎకరాల విత్తనాల క్షేత్రాలు ఏర్పాటుచేయబడినవి, 3572 ఎరువు కుప్పలు పోయబడినవి. 2,198 ఎరువు గుంటలు త్రవ్వబడినవి. 321 మణుగుల రసాయనిక, తదితర ఎరువులు,224 మేలిరకం వ్యవసాయ పనిముట్లు పంచిపెటబడినవి. 2,390 ప్రత్యక్ష ప్రదర్శనలు. 5921 వ్యవసాయ సాంస్కృతిక ప్రదర్శనలు. 417 వ్యవసాయ చౌచౌ ప్రదర్శనలు 3700 ఎరువు ప్రదర్శనలు జరుపబడినవి.

జపాను పద్ధతి వరిసాగులో సుమారు 300 ఎకరాల విస్తీర్ణంలో 547 ప్రత్యక్ష ప్రదర్శనలు జరుపబడినవి. 13,758 పండ్ల మొక్కలు, 98,959 ఇతర మొక్కలు నాటబడినవి,2014 పెరటితోటలు వేయబడినవి.50 సందర్భాలలో పంట దిగుబడి పోటీలు జరుపబడినవి.

మేలిరకం విత్తనాల వాడకాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతోనూ, కొత్తరకం మొక్కలను ప్రవేశపెట్టే తలంపుతోను పాడెం, హుకుంపేట, మినుములూరు, సూకూరు కొట్నపల్లి గ్రామాలలో మొక్కల సంరక్షణ కేంద్రాలనీ, విత్తనాల అభివృద్ధి ప్లాటులనీ నెలకొల్పడానికి కార్యక్రమం రూపొందింపబడింది. ఈ పథకంక్రింద పాడెం, హుకుంపేట గ్రామాలలో వ్యవసాయ క్షేత్రాలలో కాఫీ మొక్కలు నాటబడినవి. కోసుకూర, కోసుపువ్వు మొదలైన ఇంగ్లీషు కూరగాయల నర్సరీలు స్థాపింపబడినవి. గిరిజనులు వీటి పట్ల ఆసక్తి చూప నారంభిస్తున్నారు. వీటివలన కలుగు ఆర్థిక ప్రయోజనాలను వారుఇప్పుడిప్పుడే గ్రహించ కలుగుతున్నారు. మిగతా మూడు ప్రదేశాలలో ఇటువంటి ప్లాట్లు త్వరలో తెరువబడుతాయి.

మేలిరకం వరి విత్తనాల వాడకాన్ని ప్రోత్సహించే నిమిత్తం 75 బస్తాల (150 మణుగులు) మేలిరకం వరి విత్తనాలు వివిధ రకాల విత్తనాల బ్యాంకు ఏర్పాటుక్రింద పంచిపెట్టబడినవి. క్రిమి సంహారక ఔషధములు, తెవుళ్ళ నివారణ మందులు పంచిపెట బడినవి.

120 ఎకరాల మేరకు వరిపొలాలలో తెవుళ్ళను నిర్మూలించడానికి చర్యలు తీసుకోబడినవి.

పశుపోషణ

బ్లాకు స్థాపించినప్పటి నుంచి 1957 సంవత్సరాంతం వరకు రోగాలు వచ్చిన 2,628 పశువులకు చికిత్సచేయబడింది. 21,387 పశువులకు టీకాలు వేయబడినవి. 1,241 పశువులకు విత్తులు కొట్టబడినవి. ఈ ప్రాంతపు పశువులు చాలావరకు నాసిరకపువి. తమ పశు సంపదను అభివృద్ధి చేసుకోవాలన్న ఆసక్తి కూడా గిరిజనులకు లేదు వున్న దానితోనే సరిపుచ్చుకొని వారు జీవితం వెళ్ళబుచ్చుతారు. దైవేచ్ఛానుసారంగానే అంతా జరుగుతుందని వారి నమ్మిక. పాడి పశువులను వుంచుకోవడానికి వారు ఇష్టపడరు. పాలు పితకడం ఒకమహాపాపమన్న మూఢవిశ్వాసం వారికివుంది. వారి ఈ విశ్వాసాన్ని తొలగించడానికి ప్రచారం చేయబడుతున్నది. మేలిజాతి పశువుల ఉత్పత్తి జరగడానికి వీలుగా సింధీజాతి కోడెలు మూడు ప్రదేశాలలో వుంచబడినవి.పాల ఉపయోగాన్ని ప్రోత్సహించడానికై సింధ్జాతి ఆవులను, ముర్రా జాతి గేదెలను ఈ ప్రాంతానికి తెప్పించడానికి తలపెట్టబడింది. మండ్యాజాతివి 3 పొట్టేళ్ళు, 2 గొర్రెలు పంచిపెట్టబడినవి. కోళ్ళ జాతిని అభివృద్ధి పరచడానికై 350 మేలిజాతి పక్షులూ, 446 మేలిరకం గ్రుడ్లు సరఫరా చేయబడినవి. మునుములూరు, కొత్తపాడెం, లజిసిపల్లి, హుకుంపేట, సుకునూరు, గడుగుబిల్లి, సంధెరి, గురుపల్లి, జంగంపుట్టు, వర్ట్నపల్లిలలో ఆర్. ఐ. ఆర్. పక్షులతో సబ్సిడీ పద్ధతిపై కోళ్ళ పెంపకం యూనిట్లు తెరవబడినవి. వీటిలో ఒక్కొక్క యూనిటుకు రూ. 50-ల చొప్పున గ్రామస్థులు విరాళంగా ఇచ్చారు. 1,374 ప్రత్యక్ష ప్రదర్శనలూ, 768 ప్రచార సమావేశాలు జరిగినవి.

సహకారం

గిరిజనుల ఆర్థిక స్థితిని చక్కబరిచి వడ్డీ వ్యాపారుల బెడదనుంచి వారిని విముక్తిపరచడానికై పాడేరు, హుకుంపేటలలో రెండు ఏజెన్సీ ఉత్పత్తుల సహకారమార్కెటింగ్ సంఘాలు నెలకొల్పబడినవి. వీటిద్వారా గిరిజనులకు ఋణ సౌకర్యం కల్పించడమే కాకుండా వారు పండించిన వ్యవసాయ ఉత్పత్తిని సమంజసమైన ధరకు విక్రయించడానికి అవకాశాలు కూడా కల్పింపబడతాయి. ఈ సంఘాల మేనే

ఊర్‌గా సహకార సంఘాల సబ్ రిజిస్ట్రారు ఒకరు నియమింపబడినారు.

సహకార సంఘాల సభ్యులుగా 2102 మంది చేర్చబడ్డారు. సభ్యులలో పొదుపరి తనాన్ని ప్రోత్సహించటానికై 754 హుండి డబ్బాలు పంచిపెట్టబడినవి, 114 పొదుపు దినాలు జరుపబడినవి. పొదుపు ఉద్యమం క్రింద గిరిజనుల నుంచి మొత్తం రూ. 1, 849.02 న. పై. లు వసూలైనవి. రూ. 1/- మొదలు, రూ. 5/-వరకు వీరు పెట్టుబడి పెట్టారు.

రహదారి సౌకర్యాలు

వివిధ అభివృద్ధి కార్యక్రమాలు విజయ వంతంగా అమలు జరగడానికి రహదారి సౌకర్యాలు బాగా వుండటం చాలా అవసరం. అయితే ఈ ప్రాంతంలో రహదార్ల పరిస్థితి చాలా అధ్వాన్నంగావుంది. కాబట్టి ప్రాజెక్టు కార్యక్రమంలో వీటి అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వబడింది.

ఈ ప్రాంతంలో మినుములూరు-ఘాట్ అనే పేరుతో ఒక పక్కా రోడ్డు వుంది. ఇది మాడుగుల జంక్షన్ నుంచి పాడేరు వరకు ఉన్నది. ఈ ఏజెన్సీ ప్రాంతానికి ఈ రోడ్డు ఇతర ప్రదేశాలతో రాకపోకల సౌకర్యాలు కల్పిస్తున్నది.

ఈ రోడ్డును రాష్ట్ర రహదార శాఖా మంత్రి ప్రారంభించారు. మొత్తం రోడ్డు పొడవు 25 మైళ్లు అయితే ప్రాజెక్టు ప్రాంతంలో నిడివి 17 మైళ్ళు వుంది.

రాష్ట్ర రహదార్ల శాఖకు సంబంధించిన ఈ క్రింది రెవెన్యూరోడు ఈ ప్రాజెక్టు ప్రాంతంలో వున్నాయి:-

రోడ్డు పేరు	బ్లాకుప్రాంతంలో వున్న రోడ్డు పొడవు
1. పాడేరు నుంచి అరకు కు వెళ్లే రోడ్డు	$14\frac{1}{2}$ మైళ్ళు
2. పాడేరు నుంచి జి. మాడుగులకు వెళ్లే రోడ్డు	6 "
3. హుకుంపేట నుంచి పాడేరుకు వెళ్లే రోడ్డు	9 "
4. పాడేరు నుంచి సుజన కోటకు వెళ్లే రోడ్డు	9 "

పై వాటిలో పాడేరు నుంచి అరకుకూ, పాడేరు నుంచి సుజనకోటకు వెళ్లే రోడ్డులపై మాత్రమే జీపులు వెళ్లటానికి అనుకూలంగా వుంటుంది. ఈ ప్రాజెక్టు ప్రాంతంలో రహదార్ల నిర్మాణానికి అమలు పరచబడుతున్న కార్యక్రమంలో ముఖ్యమైన రోడ్డులను కలుపుతూ వేసే అడ్డరోడ్ల నిర్మాణానికీ, గ్రామాల నుంచి ఊర బావుల వరకు వేసే రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇవ్వబడుతున్నది. సమాజాభివృద్ధి కార్యక్రమం ఆరంభమైనప్పటి నుంచీ వివిధ గ్రామాలలో మొత్తం $25\frac{1}{2}$ మైళ్ళ పొడువుగల కచ్చా రోడ్డులు నిర్మింపబడినవి. వీటిలో చాలా రోడ్డులను గ్రామస్థులే స్వయంగా శ్రమదానంద్వారా నిర్మించారు.

విద్య

గిరి జనులలో అక్షరాస్యులు చాలా తక్కువ. వారి ఆర్థిక దుస్థితే దీనికి ముఖ్య కారణం. ప్రాజెక్టు ఆరంభంకాక పూర్వం ఈ ప్రాంతంలో నివసిస్తున్న 19,045 మంది వయోజనుల్లోనూ 67మంది మాత్రమే అక్షరాస్యులు. ఇచ్చట నాలుగు ప్రభుత్వ ఎలిమెంటరీ పాఠశాలలు, పది ఎయిడెడ్ ఎలమెంటరీ పాఠశాలలు వున్నాయి. ఇవిగాక లజిపల్లిలో ప్రభుత్వ హయ్యర్ ఎలిమెంటరీ పాఠశాల ఒకటి వుంది. గిరిజన విద్యార్థుల కొరకు ఒక వసతి గృహం కూడా దీనికి సంబంధించి వున్నది. ప్రాజెక్టు వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో మొత్తం 15 ఎలిమెంటరీ పాఠశాలలు, పాడేరులో ఒక విద్యార్థి వసతి గృహం నెలకొల్పబడినవి. ఈ వసతి గృహంలో 25 మంది గిరిజన విద్యార్థులకు వసతి, భోజన సౌకర్యాలు వున్నాయి. సర్వెంట్స్ అఫ్ ఇండియా సొసైటీ వారు హుకుంపేటలో "గ్విన్ గురుకులం" పేరుతో ఒక రెసిడెన్షియల్ పాఠశాలను తెరిచారు. దీనిలో 50 మంది గిరిజన విద్యార్థులకు ఉచిత భోజన, వసతి సౌకర్యాలు వున్నాయి. ప్రస్తుతం పని చేస్తున్న 17 పాఠశాలలను అభివృద్ధి పరచడంతో పాటు 4 సాధారణ పాఠశాలలు ప్రాతిపదిక పాఠశాలల క్రింద మార్చ బడినవి. 20 వయోజన శిక్షణ కేంద్రాలు తెరువబడగా వాటిలో 552 మంది శిక్షణ పొందారు.

సాంఘిక విద్యా కార్యక్రమాల క్రింద 1083 సామాజిక వినోద కార్యక్రమాలు నిర్వహింపబడినవి. యువజనక్లబ్బుల వంటి ప్రజా సంస్థలు 212 స్థాపించబడినవి. సామాజిక వినోద కాలక్షేప కేంద్రాలతో సహా 42 సామాజిక కేంద్రాలు తెరువబడినవి. 7 పిల్లల పార్కులు స్థాపించబడినవి.

గిరిజనులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులు మొదలైన వాటిని గురించి తెలియజేసే నిమిత్తం ఒక మేలా జరుప

బడింది. మైదానప్రదేశాలలోని సమాజాభివృద్ధి, జాతీయ విస్తరణ సేవాబ్లాకులనూ, దర్శనీయమైన స్థలాలను సందర్శించడానికి బయలు దేరిన బృందములలో గిరిజనులుకూడా వున్నారు.

ఆరోగ్యం, పారిశుద్ధ్యం

పాడేరులో ఒక వైద్యాధికారితో ఒక ప్రభుత్వ ఆసుపత్రి పని చేస్తున్నది. హుకుంపేటలో 23-12-1957 వ తేదీన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఒకటి తెరువబడింది. ఈ కేంద్రంలో ఒక వైద్యాధికారి, ఒక కాంపౌండరు, ఒక లేడీ హెల్త్ విజిటరు పని చేస్తున్నారు. వైద్యాధికారి, లేడీ హెల్త్ విజిటరు గ్రామాలకు కూడా వెళ్లి అచ్చటి గిరిజనులకు వైద్య సదుపాయాలు కల్పిస్తూ, ప్రజారోగ్యం, పారిశుద్ధ్యాలను గురించి ప్రచారం చేస్తూవుంటారు. 1. కొత్తపాడెం, 2. సమ్సరి, 3, ఉప్ప, 4. గత్తుంలలో నాలుగు ప్రసూతి కేంద్రాలు తెరవబడినవి. వీటిలో ఒక్కొక్క దానిలో ఒక మెటర్నిటీ అసిస్టెంటు చొప్పున నియమింపబడినారు. గిరిజన స్త్రీలు సనాతన అలవాట్లు కలవారు. ప్రసూతి సమయాలలో సుశిక్షితులైన మెటర్నిటీ అసిస్టెంట్ల సహాయం పొందటానికి వారు సాధారణంగా అంగీకరించరు ఇటువంటి ఇబ్బందులను ఎదుర్కొంటూ మెటర్నిటీ అసిస్టెంట్లు మొదట ప్రసూతి పూర్వపు కేసులను చూటడం ఆరంభించారు. అట్లా వారు గిరిజన స్త్రీల విశ్వాసాన్ని చూరగొని తక్కువే అయినప్పటికీ కొన్ని ప్రసూతి అనంతరపు కేసులను కూడా చూడ కలుగుతున్నారు. యు.ఎన్.ఐ. సి. ఇ. ఎఫ్. వారు సరఫరాచేసిన పాలపొడిని శిశువులకూ, గర్భిణీ స్త్రీలకు పంచి పెట్టే పనిని కూడా మెటర్నిటీ అసిస్టెంటు చేస్తున్నారు.

పాడేరు రేంజి హెల్త్ ఇనస్పెక్టరు తన సిబ్బందితో కలిసి పాడేరు రేంజిలో సాధారణ ఆరోగ్య విధులను నిర్వహిస్తున్నారు. గిరిజనులు తమ నివాస గృహాలను సాధారణంగా పరిశుభ్రంగానే వుంచుకుంటారు. అయితే వాటిలో వెలుతురు సరిగా వుండదు. వారు గృహాలంకరణలో ఆసక్తి చూపుతారు. కాని తమ దేహ పరిశుభ్రత విషయంలో మాత్రం ఎక్కువ శ్రద్ధ తీసుకోరు. కాబట్టి ఏజెన్సీ ప్రాంతంలో ఆరోగ్యాభివృద్ధికై ప్రాజెక్టు కార్యక్రమంలో గ్రామీణ ఆరోగ్య, పారిశుద్ధ్యపు కార్యక్రమానికి ప్రాధాన్యత యివ్వబడింది. ఈ కార్యక్రమ నిర్వహణకై ఈ ప్రాజెక్టుకు ఇద్దరు హెల్త్ ఇనస్పెక్టర్లు కేటాయింపబడినారు.

1957 డిసెంబర్ నెలాఖరు వరకు 20 బావులు, 181 ప్రైవేటు మరుగుదొడ్లు, 1427 సోకేజి గుంటలు, 237 పొగరాని పొయ్యిలు తయారు చేయబడినవి. 11209 అ. పొడవు కచ్చా మురుగు కాలువలు త్రవ్వబడినవి. 1741 మురుగు గుంటలు మూసివేయబడినవి. 1762 చెత్త కుప్పలు ఎత్తిపోయబడినవి. 7257 మంది వ్యక్తులకు టీకాలు వేయబడినవి. 703 సార్లు పారిశుద్ధ్యపు ప్రచారం జరుపబడింది. తమ గృహాలను పరిశుభ్రంగా, చక్కగా వుంచుకోవడానికి అవలంబించవలసిన పద్ధతులను గురించి గిరిజన ప్రజలకు తెలియజెప్పడ మవుతున్నది.

వృత్తి పనులు

ఈ బ్లాకుకి మంజూరు చేయబడిన రూ. 27 లక్షల మొత్తంలో గ్రామీణ కళలు, వృత్తి పనుల అభివృద్ధికి రూ. 2 లక్షలు కేటాయింపబడినవి. (1) నాలుగు సంచార అడ్డాకుల కుట్టు కేంద్రాలను నిర్వహించటానికి (2) చెరుగుడు పంఖాల వినియోగాన్ని ప్రోత్సహించడానికి (3) వడ్రంగంలో శిక్షణ కేంద్రాన్ని తెరవటానికి, (4) కమ్మరపనిలో శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించటానికి, (5) కుమ్మరిపనిలో శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పటానికి ఐదు పథకాలు రూపొందింపబడినవి. వీటిలో మొదటి పథకానికీ, అయిదవ పథకానికి వరుసగా రూ. 6,000/— లు, రూ. 47,400/-ల మొత్తం మంజూరు చేయబడింది. అడ్డాకుల కుట్టు కేంద్రాల స్థాపన పథకం క్రింద (1) పాడేరు, (2) హుకుంపేట, (3) బకెదు, (4) ఘట్టుంలో నాలుగు ఉపకేంద్రాలు నెలకొల్పబడినవి. ఈ కేంద్రాలకు చెందిన శిక్షకురాండ్రు ఆ చుట్టుప్రక్కల గ్రామాలకు వెళ్ళి గిరిజన స్త్రీలకు అడ్డాకులను కుట్టడం నేర్పుతున్నారు. కుమ్మరి పని శిక్షణ కేంద్రానికై వర్కు షెడ్డులతోపాటు నివాస షెడ్డులను కూడా నిర్మించడానికి ఏర్పాట్లు చేయబడినవి. సాంఘిక సంక్షేమ శాఖ నిధులతో పాడేరులో బుట్టల అల్లకం కేంద్రం కూడా ఒకటి తెరవబడింది.

ప్రత్యేక కార్యక్రమాలు

ఏజెన్సీ ప్రాంతంలో అడ్డాకులు పుష్కలంగా దొరుకుతాయి. మైదాన ప్రాంతాల ప్రజలలో వీటికి మంచి గిరాకీ వుంది. వీటితో చేసిన విస్తళ్లు బాగా వుపయోగకరంగా వుంటాయి. మంచి ధర పెట్టి కొంటారుకూడా. అయితే గిరిజనులకు విస్తళ్లు కుట్టటం చేతకాదు. అందువల్ల ఆకుల రూపంలోనే సంతకు తీసుకెళ్ళి వాటిని చౌక ధరలకు అమ్ముకుంటారు. యీ పని వారికి నేర్పించి వారిని ఆర్థికంగా మెరుగుపరచడానికై విస్తళ్ళ కుట్టు ప్రదర్శన-శిక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయటం జరిగింది. యిద్దరు స్త్రీలు గ్రామాలు తిరిగి కుట్టు నేర్పటానికి ఉపాధ్యాయినులుగా నియమించబడ్డారు. ఈ పనిలో 407 మంది గిరిజనులకు శిక్షణ యివ్వబడింది. దీనికోసం అయిన ఖర్చు కలెక్టరు యిష్టాపూర్వకంగా యివ్వదగిన గ్రాంట్ల నుండి పెట్టబడింది. 1957 డిసెంబర్ వరకు యింకా నాలుగు కేంద్రాలు స్థాపించి యీ పరిశ్రమను ప్రోత్సహించి, సమర్థవంతంగా నిర్వహించటానికి ప్రభుత్వం పథకాలు మంజూరు చేసింది. నలుగురు ఉపాధ్యాయినులు నియమించబడ్డారు.

గ్రామ నాయకుల శిక్షణ శిబిరాలు

వివిధ అభివృద్ధి కార్యక్రమాల నిర్వహణలో గ్రామీణులకు శిక్షణ యిచ్చుటకై గ్రామ నాయకుల శిక్షణ శిబిరాలు ఏర్పాటుచేసి, వాటిద్వారా గిరిజనులకు స్వయం కృషి, వ్యవసాయంలో అధునాతన పద్ధతులు, పశుపోషణ, సహకారం మొదలగు విషయాలలో శిక్షణ యివ్వబడింది.

కొద్ది సంఖ్యలోనైనా పురుషులతోపాటు, గిరిజనస్త్రీలు కూడా యీ శిబిరాల శిక్షణలో పాల్గొనటం ఒక ప్రత్యేక విశేషం. గిరిజన స్త్రీలకు మామూలుగా బిడియం ఎక్కువ. పనిలో కూడా పురుషులతో కలిసి ముందుకు రావటానికి జంకుతారు. అందువల్ల యీ శిబిరాలలో శిక్షణ పొందే విషయంలో వారికి నచ్చచెప్పటం చాలా కష్టసాధ్యమైనపని. శిబిరాలు విజయవంతంగా, ఆకర్షణీయంగా సాగటానికై వాటిలో గ్రామీణక్రీడలు, జానపద నృత్యాలవంటి మనోల్లాసదాయకములైన కార్యక్రమాలు కూడా చేర్చబడినవి. వీటిలో స్త్రీ పురుషులు ఉత్సాహంతో పాల్గొంటుంటారు. మొత్తం యీ కేంద్రాలలో 327 మంది గ్రామనాయకులు శిక్షణ పొందారు. వీరిలో 19 మంది స్త్రీలు.

సర్వెంట్స్ ఆఫ్ ఇండియా సొసైటీ

ఈ సంఘంవారు హుకుంపేటలో ఒక పాఠశాల నడుపుతున్నారు. యిందులో 50 మంది గిరిజన విద్యార్థులకు వసతి, భోజన సౌకర్యాలు సమకూర్చబడినవి. విద్యార్థులు ఎప్పుడూ అక్కడే చదువుకుంటారు. యిద్దరు ఉపాధ్యాయులు, ఒక వార్డెన్ వున్న యీ పాఠశాలలో 5 వ తరగతి వరకు వుంది. ఖర్చులో 25 శాతం యీ సంఘంవారు భరిస్తారు. మిగిలిన 75 శాతం కేంద్ర ప్రభుత్వం యిచ్చేగ్రాంట్ల నుండి ఖర్చు జరుగుతుంది.

మహిళా సంక్షేమ శాఖ

మహిళా సంక్షేమ శాఖ అధ్వర్యాన పాడేరులో ఒక సంక్షేమ కేంద్రం ఏర్పాటు అయింది. కొత్త పాడేరు, గుడివాడలో దీనికి రెండు ఉపకేంద్రాలు కూడా వున్నాయి. వీటిలో స్త్రీలకు కుట్టు వగైరా పనులు నేర్పుతారు. క్రమంగా గిరిజన మహిళలు యీ కేంద్రాలకు ఆకర్షితులవుతున్నారు.

ప్రాథమిక దశ

మొదట్లో యీ వివిధ పథకాలను అమలు పరచటంలో ప్రభుత్వ సిబ్బంది అనేక యిబ్బందులకు గురి కావలసి వచ్చింది. అధికారులంటే గిరిజనులకు వుండే బెదురు, మైదానప్రాంత ప్రజలయెడల వారికిగల అనుమానాలవల్లనూ, అన్ని విధాల వెనుకబడివున్న కారణంచేతనూ ఆ విధంగా జరిగింది. అక్కడి అతిశీతల వాతావరణానికి సరియైన గృహవసతి లేమికి, పాలు, కూరగాయలు లభించక మొదట్లో సిబ్బంది చాలా యిబ్బందిపడ్డారు. హుకుంపేటకు సరిఅయిన రాకపోకల సౌకర్యాలు ఏర్పడక ముందే బ్లాకు ప్రారంభించబడింది. హైవేస్ శాఖ వారు అరకు—పాడేరు మట్టిరోడ్డు నిర్మించారు. సంవత్సరంలో సగభాగం వుండే వానాకాలంలో రోడ్డు ప్రయాణాలకు యోగ్యంగా వుండదు. ఆసమయంలో దాదాపు రాకపోకలన్నీ నిలిచిపోతాయి. ఏజెన్సీ ప్రాంత ప్రజలకు మిగతా ప్రపంచంతో పూర్తిగా సంబంధాలు తెగిపోతాయి.

తమ అజ్ఞానం, నిరక్షరాస్యతలవల్ల గిరిజనులు మామూలుగా ముఠాదార్ల పెత్తనానికిలోబడి జీవిస్తుంటారు. ముఠా

దార్లే ఆయా ప్రాంతాలకు మకుటంలేని రాజులుగా చెలామణి అవుతుంటారు. పోతే మైదాన ప్రాంతాల నుండి వచ్చే వర్తకుల పెత్తనం కూడా గిరిజనుల మీద సాగుతుంటుంది. అనాదిగా యీ వర్తకులు గిరిజనులను దోచుకుతింటున్నారు, యిప్పుడు సమాజాభివృద్ధి కార్యక్రమాలు జరుగుతుంటే యీ వర్తకులకు అంత యిష్టంగా లేదు. ఎందుకంటే, ప్రాజెక్టు కార్యక్రమం పూర్తిగా కొనసాగితే, ఏజెన్సీ వస్తువుల వ్యాపార రంగం నుండి తాము తప్పుకోవలసి వస్తుందని వారికి తెలుసు. ప్రారంభ దశలో వీరుచేసే వ్యతిరేక ప్రచారం కూడా ఎదుర్కోవలసి వచ్చింది. ప్రాజెక్టు సిబ్బంది తమకు మిత్రవర్గంలోని వారని గుర్తించి క్రమంగా గిరిజనులు ప్రాజెక్టు ప్రయోజనాలను గురించి తెలుసుకుంటున్నారు.

వివిధ రీతులుగా, వివిధ విషయాలను గురించి ప్రాజెక్టు అధికారులు తీవ్రస్థాయిలో ప్రచారం కొనసాగిస్తున్నారు. అభివృద్ధి కార్యక్రమాలవైపుకు గిరిజనుల మనస్సుక్రమంగా మొగ్గుతున్నది, ప్రాజెక్టు స్వరూపం గిరిజనులకు అర్థం అయ్యేటట్లు చేయటానికీ. వారిలో దీనియెడల విశ్వాసం కల్గించటానికీ వీలైన చోట్ల గిరిజనులకే ఉద్యోగాలు యిచ్చి పనిలోకి తీసుకోవటం జరిగింది. బంట్రోతులుగా, 'సేవక్' లుగా, గైడ్లుగా కొంత మంది గిరిజనులను నియమించారు. ప్రస్తుతం వారికి గల అర్హతల దృష్ట్యా యిటువంటి ఉద్యోగాలకు మాత్రమే వారుపనికి వస్తారు. కొంత మంది గిరిజనులకు కంట్రాక్టు పద్ధతి మీద జరిగే పనులు అప్పగించటం జరిగింది. వారు వాటిని తమకున్న పరిమిత అవకాశాలతోనే సంతృప్తికరంగా నిర్వహించగలుగుతున్నారు.

గిరిజనుల జీవిత విధానం

గిరిజనుల జీవిత విధానాలను పరిశీలిస్తే అవి మనకు తెలియటం అనే ప్రయోజనం అటుంచి, అసలువారి మానసిక లక్షణాలకు, వారు ఏర్పరచుకున్న సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక వ్యవస్థకు పునాదులైన కొన్ని ముఖ్యాంశాలు మనం చూడవచ్చు. సహజంగా గిరిజనులు హాయిగా, ఖులాసాగా, ఆనందంగా జీవితం గడిపే అలవాటు కలవారు. నీతి నిజాయితీలు వున్నవారు. నిరాడంబరులు. దేనినైనా త్వరగా గ్రహిస్తారు. ప్రతిదానికి త్వరగా చలిస్తారు. అనుమానాలు ఎక్కువ, మొత్తంమీద విశ్వాస పాత్రులు. సంతృప్తికరమైన జీవితం సాగిస్తారు. త్రాగటం, నృత్యం చేయటం, సంగీతం పాడటం, అన్నీ సామూహికంగా నిర్వహిస్తారు.

గిరిజనుల గృహ నిర్మాణ పద్ధతులు కూడా వారి సంస్కృతి, వ్యవహారాలకు అనుగుణంగానే వుంటాయి. బొంగులు, మట్టి కలిపి గోడలు పెడతారు. మామూలుగా యీ కుటీరాలలో ఒకేఒక హాలు వుంటుంది. ఇండ్లను అలంకరించటంలోనూ, శుభ్రంగా వుంచుకోవటంలోనూ, నేలమీద, గోడలమీద కొద్దిగాఅలంకారాలు చేయటంలోనూ గిరిజనులు చాలా శ్రద్ధతీసుకుంటారు. అయితే అనేక గ్రామాలలో ఒక క్రమబద్ధమైన పద్ధతి అంటూ వుండదు. యిది సాధ్యంకాదుకూడా. ఎందుకంటే యిక్కడినేలంతా రాళ్లు, గుట్టలు, మిట్టపల్లాలతో నిండివుంటుంది. అందువల్ల కొండ చరియల క్రిందుగా గ్రామాలు ఏర్పాటుచేసుకోవలసిన అవసరం కలుగుతుంది. లేక ఎత్తైన భూభాగాలలో చింత, మర్రి వగైరా చెట్లనీడల క్రిందనైనా నిర్మించుకోవాలి.

ప్రతి గ్రామంలో తప్పనిసరిగా ఒక కూడలి స్థానం వుంటుంది. అదే గ్రామచావడి. లేదా దానిని 'రామకోవిల' భజన మందిరం అని కూడా అంటారు. గ్రామ దేవతను ప్రతిష్ఠించుకోటానికి పెద్ద పెద్ద బండలతో ఎత్తైన వేదిక కూడా అమర్చబడి వుంటుంది.

ఆర్థిక వ్యవస్థ

గిరిజనులకు నవీన నాగరికత గాలిసోకడంతో యీ అనాది సాంఘిక వ్యవస్థా రీతులలో చాలా మార్పులు వచ్చాయి. నాగరికతా వేగంలో ప్రకృతి మాత తొలి సంతానమైన గిరిజనుల ఆర్థిక వ్యవహారాలు, అలవాట్లు తప్పనిసరిగా కొట్టుకుపోవలసి వచ్చింది. అయినా యింకా వారి ఆర్థిక వ్యవస్థ అవశేషాలు, వారి ఆర్థిక సూత్రాలు, ఉత్పత్తి పంపిణీ పద్ధతులు, ఆర్థికంగా వుండే వివిధ స్థాయిలు మొదలైనవి కనిపిస్తూనే వుంటాయి. వారి ఆర్థిక వ్యవస్థలో సహకారం, సంఘ క్షేమము ప్రధానమైన ప్రాతిపదిక సూత్రాలు. లాభార్జన దృష్టితోకాని, ఇతరులను దోచుకునే పద్ధతిలోగానీ సంపాదనచేయటం వారికిఅలవాటు లేదు. ఒక తెగ మొత్తం అవసరాలకు అనుగుణంగా సంపాదనా రీతులు రూపొందించబడినవి.

పెండ్లిండ్లు

గిరిజన కుటుంబాలలో పెండ్లిండ్లు చాలా సులభంగా, అట్టహాసంలేకుండా జరుగుతాయి.మామూలుగా వధూవరులు పరస్పరం యిష్టపడిన ఫలితంగా వివాహం జరుగుతుంది. సాధారణంగా ఈడువచ్చిన వారే పెండ్లిచేసుకుంటారు. వివాహ విధులు మాత్రం తెగ తెగకూ మారుతుంటాయి. ఒక భార్యనే చేసుకోవటం, బహుభార్యాత్వంకూడా అమల్లో వున్నాయి. షెడ్యూలు జాతుల విషయంలోబహుభార్యాత్వం ఎక్కువగా కనిపిస్తుంది. సంబంధాలు కుదుర్చుకునే విషయంలో కొన్ని సంప్రదాయాలు అనాదిగా ఏర్పడి వున్నాయి. తల్లిదండ్రులు కుదిర్చిన సంబంధాలు,వధూవరుల యిష్టం మీద జరిగే వివాహాలు, పిల్లను కొనుక్కోవటం, ఎత్తుకుపోవటం,.బందీ చేయటం, సేవకా వృత్తి మొదలగు అనేక రకాలుగా పెండ్లిండ్లు జరుగుతాయి. చాలామంది కొండ జాతి ప్రజల్లో ఒక ఆచారం వుంది; అన్నగారు చనిపోతే, తమ్ముడు వదినగారిని పెండ్లి చేసుకునే హక్కు కలిగి వుంటాడు. గడబలు, భగతలు అనే తెగలలో యీ ఆచారం ఎక్కువగా అమల్లో వుంది.

గిరిజనుల మత విశ్వాసాలు

దేవుళ్ళను, భూతాలను కొలవడం, మనుష్యులు చనిపోయినప్పటి కర్మకాండలు, శ్రాద్ధ కర్మలు-యీ మూడు గిరిజనుల మత సిద్ధాంతాలలో ముఖ్యమైన విభాగాలు.

మరణానంతరం కూడా ఆత్మనిలిచి వుంటుందనే విశ్వాసం గిరిజనులకు వున్నది. ఈ విశ్వాసం వల్లనే వారు తమ పూర్వీకులను పూజిస్తుంటారు. చనిపోయిన వారి ప్రేతాత్మలు బ్రతికివున్న వారి చేష్టలను నిరంతరం కనిపెడుతూ వుంటాయని కూడా వారు నమ్ముతారు. బ్రతికి వున్నవారికి అవి సలహాలు యిస్తుంటాయనీ, మనిషి రూపంలోనో, మరో రూపంలోనో అప్పుడప్పుడు దర్శనమిస్తుంటాయని కూడా వారు విశ్వసిస్తారు. యీ విశ్వాసాలవల్లనే వారు సాధారణంగా పండుగ పబ్బాలలో దేవతలకు, భూతాలకూ జంతు బలులు యిస్తుంటారు. వీరిలో ప్రతి తెగవారికి వేర్వేరుగా దేవుళ్లున్నారు, దయ్యాలు భూతాలకు సంబంధించిన విజ్ఞాన సంప్రదాయం కూడా వేరుగానే వుంటుంది. తమ ఉనికిని, బ్రతుకు తెరువును, భయపెడుతున్న ప్రకృతి శక్తులకు రూపకల్పనచేసి వారు ఆరాధిస్తారు, జ్వరం, రోగం, చిన్నతరహా మశూచి, వాతరోగం, మానసిక రుగ్మత, మరణం మొదలగు అనేక యిబ్బందులకు అధి దేవతలుగా వివిధభూతాలు, దేవతలను వారు కల్పించుకుంటారు.

ఆహారపు అలవాట్లు

గిరిజనుల జీవితంలాగానే వారి ఆహారపు అలవాట్లుకూడా నిరాడంబరంగావుంటాయి. రాగి గంజి వారికి ముఖ్య ఆహారం. మాంసము మొదలైన ఆహార పదార్థాలను వారిలో చాలామంది తింటారు. చేపలంటే వారికి మహాప్రీతి. అడవులలో దొరికే దుంపలు, ఆకు కూరలు, మామిడి కాయలు, చింతగింజల గంజి మొదలగు వాటిని కూడా సేవిస్తారు.

త్రాగుడు

సారా, నల్ల మందు, గంజాయి వగైరా నిషా పదార్థాలకు గిరిజనులు బాగా అలవాటు పడ్డారు. వారు వివిధ రకాల సారా తాగుతారు. తాటికల్లు, జీలుగు కల్లు విపరీతంగా తాగుతారు. జీలుగు చెట్లు ఎన్ని వుంటే, ఆ వ్యక్తి అంత ధనవంతుడుగా పరిగణింపబడుతాడు. కల్లు బాగా లభ్యమయ్యే కాలంలో అంటే డిసెంబర్ నుండి జూన్ నెల వరకు గిరిజనులకు ఏదైనా పని చేద్దామనే ధ్యాసే వుండదు. తప్ప తాగి తిరుగుతుంటారు.

ఈ ప్రాంతాలలో 'యిటికల పండుగ' చేస్తారు. యిది యుగయుగాలుగా వస్తున్న సంప్రదాయం. ఈ వుత్సవం 15 నుండి 20 రోజులవరకు జరుపుతారు. దీనిలో స్త్రీలు ఎక్కువగా పాల్గొని ప్రధాన పాత్ర వహిస్తారు. ఈ పండుగ రోజుల్లో గిరిజనులు ఆనందంగా కాలం గడుపుతారు.

గిరిజన ప్రాంతాలలో వ్యవసాయపు పనులు అందరూ కలిసి సమష్టిగా చేసుకుంటారు. ''నేస్తవర్గాలు'' గా విభాగమై పోయే అలవాటు గిరిజనుల్లో వుంది. వర్గంలోని ప్రతి ఒక్కరు మిగిలిన వారికి సహాయపడుతూ పనిచేస్తారు. ఈ విధంగా వ్యవసాయపు పనులు చేసుకుంటారు. 'వర్గ పెద్ద' ఏదైనాపని తలపెడితే, అందరూ అతన్ని అనుసరించి పనిచేస్తారు.

ఏజెన్సీ ప్రాతంపు సంతలంటే గిరిజనులకు మహాయిష్టం. స్త్రీలు, పురుషులుకూడా విశేషంగా అక్కడికి ఆకర్షితులవుతారు, అటవీవస్తువులు, వ్యవసాయపు వస్తువులు అమ్ముకోటానికి మాత్రమే గాకుండా, యితర గ్రామాల ప్రజలను

చూడటానికికూడా సంతలకు తరచుగా వెళ్ళుతూ వుండటం గిరిజనులకు బాగా అలవాటయింది. అందు వల్ల ప్రాజెక్టు సిబ్బంది తమ కార్యక్రమాలను ప్రచారం చేసుకోటానికి ఈ సంతల సందర్భాలను చక్కగా వుపయోగించుకొన్నారు.

మామూలుగా గిరిజనులు వస్తువుల మార్పిడి పద్ధతుల పైనే వ్యవహారం జరుపుకుంటారుగాని డబ్బంటే వాళ్ళకు అంతగా తెలియదు. వస్తు రూపేణా మార్చుకోవటమే వారికి యిష్టం. దీనిని ఆసరాగా తీసుకొని మైదాన ప్రాంతాల నుండి వచ్చిన వ్యాపారస్తులు, వారికి ఉప్పు, కిరసనాయిలు, గుడ్డలు, ఎండు చేపలు మొదలైనవి యిచ్చి వారి వద్ద గల ఖరీదైన సరుకు నంతా తీసుకు వెళ్తుంటారు.

ఈ ప్రాంతంలో 'దింసా' లేక 'థుమ్మి' నృత్యం బాగా ప్రచారంలో వుంది. స్త్రీ, పురుషులు కలిసి యీ నృత్యంలో పాల్గొని ఆనందిస్తారు. పండుగ సందర్భాలలో వీధి భాగవతాలు, నాటకాలు, భజనలు వుంటాయి. వీధి భాగవతాలంటే గిరిజనులకు మంచి యిష్టం. ప్రతి గ్రామంలోనూ ఒక వీధి భాగవతుల బృందం వుంటుంది.

సామూహిక జీవితానికి అలవాటు పడిన గిరిజనుల్లో, వారిలోని లోపాలు, గుణాలు పరిశీలించుకుంటూ తదను గుణంగా ప్రవర్తిస్తూ, ప్రాజెక్టు సిబ్బంది పని చేస్తుంటుంది. దోపిడి నుండి వారిని విముక్తి చేయటానికి, నవజీవిత విధా నాలనే విత్తనాలు నాటుతూ, విజ్ఞానాభివృద్ధి, భౌతిక అవసర సమృద్ధి వైపులకు వారిని నడిపిస్తూ, వారిలో నవ్యజీవన చైతన్యం కలుగజేస్తూ ప్రాజెక్టు సిబ్బంది అవిరళంగా కృషి చేస్తోంది.

వ్యక్తి స్వాతంత్ర్యం లేని సామ్యవాదం బానిసత్వం; సామాజిక నియమబద్ధం కాని వ్యక్తి స్వాతంత్ర్యం అరాజకం.

—హెచ్. జి. వెల్సు.

* * *

లోకు లేమనుకుంటారో అని గాక కర్తవ్య నిర్వహణ దృష్టితో ఏ పనినైనా చెయ్యాలి.

—మహాత్మా గాంధి.

ప్రపంచ వ్యవసాయ ప్రదర్శన

రాష్ట్రపతి డా. రాజేంద్ర ప్రసాద్ 1959 డిసెంబర్ 11న ఢిల్లీలో ప్రపంచ వ్యవసాయ ప్రదర్శనను ప్రారంభించారు. ప్రపంచ వ్యవసాయ ప్రగతికి దర్పణమైన యిట్టి ప్రదర్శన యిదే ప్రప్రథమమయినది. ఇది భారతీయ రైతును అద్భుత ప్రపంచంలో అడుగిడజేసినది. అమెరికా ప్రదర్శనశాలను అదే రోజున అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్ తెరిచారు.

ఈ ప్రదర్శన సుప్రసిద్ధమయిన ఢిల్లీ ప్రదర్శన స్థలంలో జరుగుతున్నది. చరిత్రాత్మక మయిన పురాణ కిల్లాకు ఉత్తరాన, భారతదేశ సుప్రీం కోర్టుకు తూర్పునగల యీ ప్రదర్శన ఒక చిన్న పట్టణంవలె ఉన్నది. అక్కడ దక్షిణ భారత దేవాలయ గోపురాలు, స్తూపాలు, గుమ్మటాలు, శిఖరాలు, రాకెట్లు దిగే కేంద్రాలు, రంగుల రాట్నాలు, యాత దొరువులు, థియేటర్లు మొదలైన హంగులన్నీ సమకూరి వున్నవి.

ప్రదర్శన స్థలం వైశాల్యం 52,00,000 చ. అ.లు. ఇది కొన్ని విభాగాలుగా అనగా జాతీయ విభాగం, రాష్ట్రాల విభాగం, అంతర్జాతీయ విభాగం, గ్రామ పరిశ్రమల విభాగం, వస్తు క్రయ విభాగం, వినోద కాలక్షేప విభాగం అని కొన్ని విభాగాలుగా విభజించబడింది. పధ్నాలుగు దేశాలు, రెండు అంతర్జాతీయ సంస్థలు యీ ప్రదర్శనలో పాల్గొంటున్నవి.

"అమ్రికా మేలా", రష్యా ప్రదర్శనశాల, చైనా ప్రదర్శనశాలలు అంతర్జాతీయ విభాగంలో ప్రముఖమయినవిగా వున్నవి.

సుందరతమమయిన శిల్పాలు కొన్ని రాష్ట్ర విభాగంలో ఉన్నాయి.

ప్రతినిత్యం ప్రదర్శనను తిలకించే రైతులకు సగటున 2,000—3,000 మందికి వసతి సౌకర్యం కల్పించటానికి ప్రదర్శన అధికారులు యేర్పాటు చేశారు. దేశం అన్ని ప్రాంతాల నుంచీ వచ్చే రైతులు ప్రదర్శనను చూసి ఢిల్లీలో రెండు మూడు రోజులు వుండటానికి సౌకర్యం కల్పించబడింది.

అమెరికా ప్రదర్శనశాల

"కుటుంబం, ఆహారం, మైత్రి, స్వతంత్రం" ఇవి 25 లక్షల డాలర్ల ఖర్చుతో నిర్మించబడిన అమ్రికా మేలా నినాదాలుగా వున్నవి. ఈ ప్రదర్శనశాలలో అడుగు పెట్టేసరికి కళ్లు జిగేలుమనే 32 భారీ ప్రీకాస్ట్ కాంక్రీటు గోల్డెన్ డోమ్‌ల కాంతిలో వివిధ రకాల అమెరికన్ పొలాలను చూపే మట్టి మోడలు కనబడుతుంది. గోధుమ, మొక్కజొన్న పంటలలో అధికతమ పంటకు కారణభూతమయిన అధునాతన పద్ధతులు చూపబడినవి.

కోళ్ల పెంపకం విభాగం తరువాత అణుశక్తి విభాగం వస్తుంది. ఇది 17,000 చ. అ. స్థలంలో వుంది. వ్యవసాయాభివృద్ధిలో అణువు పాత్ర, అణుశక్తితో చీడల నిర్మూలన విధానం ప్రదర్శించబడినవి. అక్కడ ప్రత్యక్షంగా పని చేసే అణుశక్తి సాధనాలు పెక్కు వున్నవి.

అమెరికా సంయుక్త రాష్ట్రాల మేలాలో ఉన్నవి సంక్షిప్తంగా యివి:- తోటలు, డోమ్‌లు; అమెరికా పొలాలు.... నిన్న, రేపు; భూమి, దాని వనరులు; విజ్ఞాన శాస్త్రం కర్షకునికి తోడ్పడే విధానం; గోధుమ, మొక్కజొన్న, పశుగణం, కోళ్ళ పెంపకాలలో కొత్త పద్ధతులు; కొత్త ఆహార పదార్థాలు, రసాయన యెరువులు; విజ్ఞాన శాస్త్రజ్ఞానం పొలాలకు చేరే పద్ధతి; కర్షకులు వైజ్ఞానిక పరికరాలను వాడే విధానం; గృహ కళలు—కుట్టు, వంట, నిలవ, పాడి యావులు; బ్యాటరీ పౌల్ట్రీ వేయింగ్ హౌస్; అమెరి

కాకు ఆసియా బహుమానం: సోయా చిక్కుడు; అమెరికా సంయుక్త రాష్ట్రాల మేలా: యావత్తు కుటుంబానికీ కాలక్షేపం; వ్యవసాయ వస్తువుల విక్రయం; కర్షక సమాజంలో జీవితం; అమెరికా సహకార సంస్థలు; అభివృద్ధికి కర్షకులు పెట్టుబడి పెట్టే విధానం; అమెరికా—ఇండియా : అభివృద్ధిలో భాగ స్వాములు; వ్యవసాయ వస్తువులు కరువును నివారించే విధానం; మేలా చలనచిత్ర థియేటర్, పొలంలో అణువు.

రష్యా ప్రదర్శనశాల

సోవియెట్ రష్యా సంయుక్త రాష్ట్రాల ప్రదర్శనశాలకు బయట సోవియెట్ మూడవ స్పేస్ రాకెట్టును సూచించే లోహపు నిర్మాణం ఒకటి వుంది. 15 పతాక స్తంభాల నుంచి జాతీయ పతాకాలూ, సోవియెట్ రష్యా సంయుక్త రాష్ట్రాల 15 యూనియన్ రిపబ్లిక్కుల యొక్క కోటీ ఆఫ్ ఆరమ్సూ యెగురుతుంటాయి. ముందు హాలులో విద్యుద్దీకృతమయిన పెద్ద "మాట్లాడే పటం" పారిశ్రామిక వస్తూత్పత్తి రంగంలో సాధించిన ఫలితాలను సూచిస్తూ వుంటుంది.

అటామిక్ రియాక్టర్, నిర్మూలన ప్రయోజనాల కుద్దేశించబడిన కోబాల్టు గమ్మా—రే ఇనస్టలేషన్, లెనిన్ అటామిక్ ఐస్—బ్రేకరీల నమూనాలు ముందు హాలులో ప్రదర్శించబడినవి. స్పుత్నిక్కులు, సోవియెట్ స్పేస్ రాకెట్ చంద్రుని ఉపరితలాన స్థాపించిన ధ్వజం నమూనాలు కూడా ఉన్నాయి.

చిన్న పెద్ద అన్ని రకాల ట్రాక్టర్లు, వ్యవసాయంలో ఉపయోగింపబడే అనేక యితర యంత్రాలు ప్రదర్శింపబడి ఆ విధంగా రష్యాలో యాంత్రిక వ్యవసాయం అభివృద్ధి వివరింపబడింది.

చైనా ప్రదర్శన శాల

చైనా ప్రదర్శనశాలలో చైనా ప్రజల రిపబ్లిక్ యేర్పడిన గత పది సంవత్సరాలలోను వ్యవసాయోత్పత్తిలో సాధించిన ఫలితాలు, గణించిన అనుభవాలు చూపబడినవి.

కమ్యూన్ల అభివృద్ధి, కమ్యూన్‌లచే నడుపబడే పరిశ్రమలు, వాటి వస్తువుల అభివృద్ధి, నీటి నిలవలో సాధించిన ఫలితాలు, వివిధ రకాల వ్యవసాయ యంత్రాలు, నీటి పారుదల, మురుగు యంత్రాలు, ఆధునిక వ్యవసాయ పరికరాలు ప్రదర్శింప బడినవి.

ప్రధాన ప్రదర్శనశాలతో పాటు ఆరు బయలు సినీమా కూడా వుంది. అక్కడ ప్రకృతి దృశ్యాలు, వ్యవసాయోత్పత్తి పెంపుకు తీసుకునే చర్యలు, కార్టూన్ ఫిల్ములు చూపబడతాయి.

తూర్పు జర్మనీ ప్రదర్శనశాలలు

జర్మనీ ప్రజా స్వామిక రిపబ్లిక్ ప్రదర్శనశాలలు రెండిటిలో ఒక దానిలో "హెయ్‌దీ" గాజు ఆవు ప్రదర్శించబడింది. ఇది జనా కర్షకంగా వుంది. దీని తయారీకి డ్రెస్డన్ హైజీన్ మ్యూజియంలో నిపుణులయిన పని వారికి 6000 పని గంటలు పట్టింది.

ప్రదర్శనశాలల నిర్మాణంలో విశేషమేమంటే వాటి గోడలు ఉత్తమ రకం ప్లాస్టిక్కులతో తయారు చేయబడినవి.

ఒక ప్రదర్శనశాల మధ్యలో తూర్పు జర్మనీ ఉత్తరాన గల ట్రిన్విల్లేర్‌షాగన్ అనే గ్రామం యొక్క పెద్ద నమూనా ఒకటివుంది. ఇది 1945 నుంచి నేటి వరకు గ్రామాలు అభివృద్ధి చెందిన తీరును వివరిస్తుంది. 300 చిన్న మోటార్లు, 200 బల్బులు, 22,000 గజాల తీగలు, కేబుల్సు గల యీ నమూనా ఒక చిన్న విద్యుచ్ఛక్తి కర్మాగారంలా వుంది.

వ్యవసాయాభివృద్ధిని సూచించే వస్తువులు కూడా ప్రదర్శించ బడినవి.

చిన్న శాలలో ఆరుబయలు సినీమా, ఉపన్యాస సావడి, వ్యవయం అర్థిక, సాంఘిక అంశాలపై ఒక ప్రదర్శన ఉన్నాయి.

పోలెండు

ఈ ప్రదర్శనశాలలో ముఖ్యంగా యంత్రాలు ప్రదర్శింపబడ్డాయి. సమగ్రమయిన మిల్లింగు యూనిట్లు యీస్టాలు విశేషం.

రాష్ట్రాల ప్రదర్శన శాలలు

రాష్ట్రాల విభాగంలో భారతీయ వ్యవసాయ రీతులు ప్రదర్శింప బడినవి. చిన్న పెద్ద నీటి పారుదల ప్రాజెక్టులు, ఉత్తమ విత్తనాలు, ఉత్తమ ఎరువులు, కొత్త పనిముట్లు, ఉత్తమ పశువులు ప్రదర్శింప బడినవి.

అండమాన్‌లు, నికోబార్

ఈ ప్రదర్శన శాలలో అండమానులలో దొరికే కొయ్య సామాను వగైరా ప్రదర్శింపబడినవి.

ఆంధ్ర ప్రదేశ్

ఆంధ్రప్రదేశ్ ప్రదర్శనశాలను 11-12-59 న రాష్ట్ర వ్యవసాయ మంత్రి శ్రీ పి. తిమ్మారెడ్డి ప్రారంభించారు. ఇది 20,000 చ.అ. ప్రదేశంలో గంభీరమయిన వరంగల్ గేటు నమూనాలో గల సింహ ద్వారంతో నిర్మించబడింది. ఈ సింహ ద్వారం కాకతీయుల నిర్మాణాల విశిష్టతను చాటుతున్నది. వారు 13 వ శతాబ్దంలోనే పెద్ద పెద్ద నీటి పారుదల వసరులను నిర్మించి వ్యవసాయాన్ని అభివృద్ధి చేశారు. దాదాపు యావత్తు ఆధునిక ఆంధ్రను మద్రాసు రాష్ట్రంలోవి చెంగల్పట్టు జిల్లాలో కొన్ని భాగాలను రమారమి రెండు శతాబ్దాల పాటు పరిపాలించారు.

ఈ ప్రదర్శనశాలలో వ్యవసాయం ప్రదాన స్థానాన్ని ఆక్రమించింది. అదీ గాక నీటి పారుదల, అడవులు, పశు పోషణ, మత్స్య సంపద, ప్రజారోగ్యం, చేతిపనులు, కుటీర పరిశ్రమలు, చేనేత వస్తువులు, టౌన్ ప్లానింగ్, సమాచారం పౌర సంబంధాల గురించి మరి తొమ్మిది విభాగాలున్నాయి. ఇవన్నీ ఆహారం, నీటి పారుదల, అరణ్య వస్తువులు, పశువులు, ఖనిజాలు, కళలు, వృత్తుల విషయంలో ఆంధ్ర సంపదను సమగ్రంగా చిత్రిస్తున్నాయి. మన రాష్ట్రం దక్షిణ భారతానికి అన్నపూర్ణ. బియ్యం, వర్జీనియా పొగాకు, మిరప, పంచదార, నూలు, ఆముదాలు, వేరుసెనగ, మామిడి, నిమ్మ జాతి, జీడిమామిడి, పసుపు వగైరాల విషయంలో మిగుల ప్రదేశం. వర్జీనియా పొగాకు మన రాష్ట్రం సొమ్ము. మొత్తం భారతదేశం ఉత్పత్తిలో 100 కి 95 వంతులు యిక్కడ దొరుకుతుంది.

ఆంధ్ర రైతుల దృక్పథం నవీన మయినది. యెరువుల వాడకం గురించి వారికి తెలుసు. ఇదే ఆంధ్ర మిగులు ప్రదేశం కావటానికి ప్రధాన కారణం. రైతు-కామందుల క్రింద గల భూమిలో మూడోవంతు ప్రదేశంలో వ్యవసాయ శాఖ సరఫరా చేసే ఉత్తమ విత్తనాలు వాడబడతాయి. ఈ విషయాలు చక్కగా ప్రదర్శింపబడినవి. సువాసన గల బియ్యం రకాలూ, హెచ్చు పంటకు (యెకరానికి 12,000 పౌనులు) బహుమతి పొందిన ఎమ్.టి.-19, నీటి పారుదల లేని ప్రదేశంలో పెరిగే మెట్ట ధాన్యం ప్రదర్శింపబడినవి. ధాన్యపు కుచ్చులు వరి విభాగం అందాన్ని ద్విగుణీకృతం చేస్తున్నాయి.

ఈ ప్రదర్శనశాలలో చెప్పుకొనదగినది ఫల ప్రదర్శన విభాగం. ఇక్కడ 9 అ. పొడుగు వుండి 325 పళ్ళు గల అరటి గెల, 80 కాయలు గల కొబ్బరి గెల చూపరులకు అద్భుతం కలిగిస్తున్నవి. పెద్ద పెద్ద బ్రెజిరియన్ పుచ్చకాయలు, వాటితో పోటీ పడలేనని సిగ్గు పడుతున్నట్టున్న ద్రాక్ష తీగె, 55 రకాల మామిళ్ళు యిక్కడి విశేషం.

ఆంధ్ర నదుల ప్రదేశం. కాబట్టి పూర్తి అయిన లేక జరుగుతున్న భారీ నీటి పారుదల ప్రాజెక్టుల విశేషాలు నమూనాలలో ప్రదర్శింపబడనవి. ప్రజలకు అవి యెలా ఉపయోగిస్తాయో కూడా వివరించబడింది. నాగార్జునసాగర్ నమూనా స్టాలులో సగానికి పైగా ఆక్రమించుకుంది. ఇప్పుడు నిర్మాణంలో నున్న యీ భారీ ప్రాజెక్టు పూర్తి అయినప్పుడు ఏర్పడే సరస్సు భారతదేశంలో మానవ నిర్మితమయిన సరస్సులలో కెల్లా పెద్దదిగా వుండగలదు.

నిర్మల్ చిత్రాలు, కొండపల్లి, నిర్మల్, ఏటి కొప్పాక, తిరుపతి బొమ్మలు, ఏలూరు, వరంగల్లుల తివాసీలు, బిద్రీ వస్తువులు ప్రేక్షకులకు కన్నుల పండువు చేస్తున్నవి.

వేప, మామిడి, జీడిమామిడి, చింతచెట్ల నుంచి తీసిన తేనె ప్రదర్శింపబడింది.

టౌన్ ప్లానింగ్ సెక్షన్‌లో పెక్కు నమూనాలు, ఛాయాచిత్రాలు, రేఖా చిత్రాలు, చార్టుల ద్వారా సమాజాభివృద్ధి కార్యక్రమం, గ్రామ గృహవసతి పథకాల క్రింద జరిగే వివిధ కార్యకలాపాలు వివరించబడ్డాయి.

ఆరోగ్యకరమయిన పరిసరాలతో, పరిశుభ్రమయిన గృహాలతో, సామాజిక కట్టడాలతో రైతులకై కొత్తగా అభివృద్ధి చేయబడిన గ్రామాల నమూనాలు, ప్రస్తుత పరిస్థితులు, అభివృద్ధి పిమ్మట పరిస్థితుల మధ్య వ్యత్యాసాన్ని చూపే గ్రామాల నమూనాలు కూడా ప్రదర్శింపబడినవి. గ్రామాల ప్లానులు, రైతులు, వివిధ తరగతుల గ్రామ వృత్తి పని వారి యిళ్ళ నమూనాలు రేఖా చిత్రాలలో చూపబడినవి. రెండు మూడు అంచెలలో కట్టదగు రైతు యిల్లు నమూనా

చాల బాగున్నది. ఈ గ్రామాల ప్లానులు, యిళ్ళ నమూనాలు సమాజంలో అధిక సంఖ్యాకుల రాబడి స్థాయికి అనుగుణంగా వుండే విధంగా రూపొందించబడినవి.

రైతులను, గ్రామ సమాజంలో తదితరులను స్థిరపరచే నిమిత్తం కొత్తగా అభివృద్ధి పరచబడిన గ్రామాల వివిధ దృశ్యాలు ఆకర్షణీయమయిన రంగులలో ప్రదర్శించబడినవి.

ఆంధ్ర ప్రదేశ్ పటం, గ్రామ గృహ వసతి ప్రాజెక్టులు, గ్రామ మాస్టర్ ప్లాన్‌ల క్రింద జరిగే కార్యకలాపాలను సూచించే చార్టులు వగైరా కూడా ప్రదర్శింపబడినవి.

సమాచార, పౌర సంబంధాల శాఖ కూడా యీ ప్రదర్శనలో పాల్గొంటున్నది. వేద వాఙ్మయములో పాదులు గొని సుదీర్ఘము, మరుచిరము అయిన ఆంధ్రుల చరిత్రలో ముఖ్య ఘట్టాలను యీ శాఖ వరుస క్రమమయిన చిత్రాల ద్వారా వివరిస్తున్నది. ఇక్కడ ప్రత్యేక విభాగంలో ప్రదర్శితమయిన ఛాయాచిత్రాలు, పటాల ద్వారా దర్శనీయమయిన స్థలాలను దిఙ్మాత్రంగా దర్శించ వచ్చు.

ఆంధ్ర ప్రదేశ్ యేర్పడి మూడు సంవత్సరాలే అయినా పంచవర్ష ప్రణాళికా కార్యక్రమాల అమలులో అది గమనార్హమయిన ఫలితాలను సాధించినది. సమాజాభివృద్ధి రంగంలో, ప్రజాస్వామ్య వికేంద్రీకరణ సూత్రాన్ని అమలు పరచి, అన్ని జిల్లాలోను పంచాయతీ సమితులు, జిల్లా పరిషత్తుల యేర్పాటు ద్వారా అది అగ్రగామిగా వున్నది. ఇక్కడ ప్రదర్శింపబడిన చిత్రాలు, నమూనాలు, వాఙ్మయాలు యీ విషయాన్నీ, రాష్ట్రంలో జరిగే నిర్మాణాత్మక కృషి యితర అంశాలనూ కూడా వివరిస్తాయి.

ప్రపంచ వ్యవసాయ ప్రదర్శనలో పాల్గొనటానికి చిహ్నంగా ప్రభుత్వం ఒక ప్రత్యేక సంచికను ప్రచురించింది.

అస్సాం

ఇక్కడ రాష్ట్రీ ఫల సంపదకు ప్రాధాన్యమివ్వబడింది. ఇక్కడ 60 రకాల నిమ్మజాతి చెట్లు పెంచబడతాయి. ఇక్కడి మరొక విశేషం తేయాకు తోట. కొండ సానువులపై తోట, తట్టలు పట్టుకుని తేయాకును కోసే స్త్రీలూ ప్రదర్శింపబడ్డారు. ఆకులను ప్యాక్టరీకి, యెండబెట్టే షెడ్డుకి తీసుకు వెళ్ళే వరకూ అన్ని దశలలోను "రెండు ఆకులు, ఒక మొగ్గ" కథ వివరింపబడింది.

ఖడ్గమృగాలు, ఏనుగులు, అడవి దున్నలు, పెద్ద పులులు, లేళ్ళు సమృద్ధిగాగల కాఝిరంగా వన్య మృగ రక్షణ స్థావరం నమూనా చాలా బాగుంది.

బీహారు

బీహారు ప్రదర్శనశాల మౌర్యుల కాలం పద్ధతిలో నిర్మించబడింది. ఆల్గే యెరువు ద్వారా వరి పంటలో 50 శాతం హెచ్చించిన విషయం దీపాలంకృతమయిన నమూనాలలో ప్రదర్శించబడింది. ఒకే పొలంలో మత్స్య పరిశ్రమను, వరి పంటను సాధించే విధానం చూపబడింది.

ఆధునిక చెరకు సాగు పద్ధతులు, పూసా సంస్థలో సాధించిన ఉత్తమ రకాలు ప్రదర్శించబడినవి.

బొంబాయి

ఈ ప్రదర్శన ఒక అరణ్యం నమూనాతో ఆరంభమవుతుంది. గట్లకు, భూసార పరిరక్షణకు ప్రాధాన్యమిచ్చే వ్యవసాయ విభాగంలో యీ పనికి మొత్తం గ్రామాలు యెలా పూనుకున్నాయో చూపుతుంది. పంటను 25శాతం హెచ్చించే బొంబాయి మెట్ట వ్యవసాయపద్ధతుల్ని యిక్కడ దిఙ్మాత్రంగా చూడవచ్చు.

ప్రపంచంలోకెల్లా మిక్కిలి పెద్దపాడి పరిశ్రమ కేంద్రం ఆరే పాల కాలనీ-నమూనా పాలు, వెన్న సీసాలతో ప్రదర్శింపబడింది.

మత్స్య సంపద విభాగం 88 అ. పొడవు, 26 అ. యెత్తు గల పెద్ద చేప నిర్మాణంలో ఉంది.

ఢిల్లీ

ఈ ప్రదర్శనలో గ్రాఫ్‌లు, చార్టులు, గుడ్లను తరగతివారీగా విభజించే యంత్రం, రూ 75 ఖరీదు గలిగి 50 కోడిగుడ్లకు పెంపుడు తల్లిగా పనిచేసే యంత్రం వున్నాయి.

నారింజ పళ్ళను పండించే లంపూరులో గల ఆధునిక తోటల పటం ఒకటీ, ఆరవల్లి కొండలలో 4,200 యెకరాలలో తుమ్మ అడవుల పెంపకాన్ని చూపే నమూనా ఒకటీ వున్నాయి.

హిమాచల్ ప్రదేశ్

కొండ కుటీరం రకం ప్రదర్శనశాలలో అరణ్యాలు,

సరస్సులతో కూడిన కొండ ప్రదేశాన్ని చూపే ఛాయా చిత్రాలు యేర్పాటు చేయబడ్డాయి. ఇక్కడ పిల్లలు చమరీ మృగంపై యెక్కడానికి అవకాశం వుంది. ఈ ప్రదర్శన శాల ఆకర్షణలలో యిది ఒకటి.

జమ్మూ, కాశ్మీరు

ప్రదర్శనశాల కృత్రిమమయిన మంచు కొండలు, డాలీ సరస్సుల మధ్య వున్నది. సిల్కు బట్టలు, పట్టు పురుగులు గల గాజు పెట్టెలు ప్రదర్శింపబడినవి. కాశ్మీరు లోయలో ఆపిల్, బేరీ ఫలాల పెంపకం ప్రదర్శించబడింది. దాదాపు 35 రకాల బాదం, అక్రోటు, స్పానిష్ చెస్ట్‌నట్‌లు గాజు జాడీలలో ప్రదర్శింపబడినవి.

ప్రదర్శనశాల ముందు గల మైదానాలలో ఐరోపా కాయగూరలు, పువ్వులు పెంచబడుతున్నాయి. వీటి విత్తనాలను కాశ్మీరు మిగిలిన భారతదేశానికీ, బర్మా, ఇరాక్, ఇరాన్, సింహళ దేశాలకీ సరఫరా చేస్తుంది.

కేరళ

కొబ్బరి, జీడిమామిడి, కథాకళి ప్రదర్శనలో ప్రముఖంగా వున్నాయి. ఈరాష్ట్రం సుగంధ ద్రవ్యాలు-ఏలకులు, దాల్చిన చెక్క, మిరియాలు, అల్లం-పనస, అనానవంటి ఉష్ణ మండల ఫలాలు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో వాటి ప్రాముఖ్యం యీ వస్తువుల సాంపిల్సు ద్వారా వివరించబడినది. కేరళలో 90 శాతం పెంచబడే వాణిజ్య పంటలు ముఖ్యంగా కాఫీ, రబ్బరు పంటలు తోటల నమూనాలలో ప్రత్యేక శ్రద్ధతో ప్రదర్శింపబడినవి.

12 అ. × 7 అ. నమూనా ఒకటి సముద్రపు నీటిలో మునిగిన ప్రదేశంలో హాలెండు పద్ధతి "పుంచ"వరిసాగును ప్రదర్శిస్తున్నది.

మధ్యప్రదేశ్

మధ్యప్రదేశ్ ప్రదర్శనశాలలో సాంచీ స్థూపం లక్షలాది ప్రేక్షకులకు దర్శనమిస్తున్నది. ఈ ప్రదర్శనశాలలో సాంచీ డోమ్ ప్రముఖమయిన శిల్పంగా వున్నది.

ఇక్కడ ప్రదర్శింపబడిన "ఒక గింజ పండే చోట రెండు గింజలు పండించు" అన్న దానిద్వారా యీ రాష్ట్రం తన కృషిని సంక్షేపంగా వివరించింది.

'కీస్టు'కి తట్టుకొనే గోధుమ నెం. హెచ్. వై. 65 ప్రమి

ప్రశామ బర్మా బియ్యం, మొక్కల అంటుకట్టే ప్రయోగాలు పశుసంపద నమూనాలు, మృగాల నమోనాలు, ఫ్లడ్ ఇరిగేషన్ సిహోరా రెగ్యులేటర్ సిస్టం, అడవి, ఆదివాసి వృత్తుల సాంపిల్సు యిక్కడి మరికొన్ని ఆకర్షణలు.

అయితే తెల్ల పులి పిల్ల ప్రధానాకర్షణ అని చెప్పాలి. ఇది యీ రాష్ట్రంలోని రేవా అడవులలో తప్ప ప్రపంచంలోనే యెక్కడా లేదు.

మద్రాసు

ప్రదర్శనశాల ముందుభాగంలో రామేశ్వరం దేవాలయం నమూనాలో 63 అడుగుల యెత్తు ద్వారం నిర్మించబడింది. మొత్తం ప్రదర్శనలో యిదే మిక్కిలి యెత్తైనది.

వర్ణకుడ్య చిత్రాలు, బొమ్మలు, మద్రాసులో అవలంబించే ఆధునిక వ్యవసాయ పద్ధతులను సూచించే నమూనాలు, అధికాహారోత్పత్తి, గ్రామాలలో, సామాజిక పెరళ్ళలో పెంటయెరువు తయారీలో పంచాయతీలు పాల్గొనడం. యిది ఆ రాష్ట్రంలో జరిగే అద్భుత ప్రయోగం, పెక్కురకాల వరి, మద్రాసు ఫల సంపదకు మూల కందమయిన నీలగిరి కొండల నమూనా, తిరువూరు దేవాలయ రథాన్ని సూచించే వరి రథం యిక్కడ ప్రదర్శింపబడ్డాయి.

మైసూరు

ఆనకట్ట రోజుల నుంచి యీ రాష్ట్రంలో ప్రోత్సాహించబడిన చిన్న నీటి వనరులు దీపాలంకృతమయిన నమూనాలలో చూపబడినవి. మైసూరు రాష్ట్రంలో మంగుళూరు, కార్వారీలలో రెండు బోటు నిర్మాణ కేంద్రాలు యేర్పరచబడ్డాయి. ఇక్కడ జాలరి యువకులకు యాంత్రిక వ్యవసాయంలో శిక్షణ యివ్వబడుతుంది. అరేబియా సముద్ర నీలి జలాలలో పయనించేబోటు నమూనా, ఫిషింగ్‌హార్బరు నమూనా కూడా వున్నాయి.

సిమెంటుతో చేసిన అమృతహాలీ యెద్దు ప్రదర్శింపబడింది. మంచిగంధపు మాను క్రింద మైసూరు మంచి గంధపు సామాను ప్రత్యేక ప్రదర్శన ఒకటి యేర్పాటు చేయబడింది.

మైసూరు ప్రదర్శనశాల ఆ రాష్ట్ర శాసనసభా మందిరం విధాన సౌధం నమూనాలో నిర్మించబడింది.

ఒరిస్సా

రైతు జీవితం, వ్యవసాయాలలో అభివృద్ధిని సూచించటానికి కోణార్క దేవాలయం రథ చక్రాలు వినియోగించబడినవి.

జపాను పద్ధతి వరి సాగు ప్రదర్శింపబడింది. మత్స్య పరిశ్రమ విభాగంలో సముద్రరేవులు, తదితర రేవుల అభివృద్ధి చూపబడింది.

ప్రాచీన కాలంనుంచి నేటి వరకు యీ రాష్ట్ర చరిత్రకు సంబంధించిన విషయాలను తెలిపే మట్టి నమూనాలుగల స్టాళ్లు వున్నాయి.

పంజాబు

ప్రదర్శనశాల 42,000 చ. అ. ప్రదేశంలో చండీఘర్ పద్ధతిలో ఆధునికంగా నిర్మించిన 60 అ. గోపురంతో అలరారుతున్నది. రాష్ట్రప్రభుత్వ వివిధ శాఖలకు సంబంధించిన వస్తువులతో దాదాపు 20 స్టాళ్లు వున్నాయి. ప్రాచీన కాలంలో వ్రాతకు భూర్జర పత్రాలు వుపయోగింపబడేవి. ఇక్కడ ఒక భూర్జర పత్రం ప్రదర్శింపబడింది. ఇది ఈ ప్రదర్శనలో అపురూపవస్తువు. ఇవి ఒక్క పంజాబు అడవులలోనే దొరుకుతాయి. ఇక్కడ భక్రానంగల్ నమూనా కూడా వుంది.

వేర్వేరు పంటలతో కూడిన పెద్ద పెద్ద తట్టలు, ట్రేలు, గాజుపెట్టెలు ఆకర్షణీయంగావున్నాయి, పంటస్టాళ్ళలో కర్షకులకు సలహా యివ్వబడింది.

పంజాబు కనిపెట్టే యితర రాష్ట్రాల రైతులకు కావలసిన కొత్త విషయాలు ప్రదర్శించబడినవి. రూ. 3,000 ఖరీదు చేసే విద్యుచ్ఛక్తితో నడిచే గోధుమ నూర్పు—ఎగరు బోత యంత్రం, రూ. 350 ఖరీదు చేసే మరొక నూర్పు యంత్రం వీటిలో వున్నాయి. రాష్ట్ర సాంస్కృతిక జీవితానికి సంబంధించిన విషయాలు కూడా ప్రదర్శించబడినవి.

రాజస్థాన్

ప్రదర్శనశాల నిర్మాణంలో జయపూర్ ఛాయలు, రాజస్థాన్ జాలి పని దర్శనమిస్తాయి.

ఒక గాజు గదిలో యెడారుల ప్రగతి నమూనా వుంది. ఇసుక దిబ్బలు అతి త్వరితంగా యెలా యేర్పడుతాయో, యిసుక యెగిరి వచ్చి ఆరవల్లి పర్వతాలను దాటి సారవంతమయిన భూములను యెలా ఆక్రమించుకుంటుందో వివరించబడింది. ఇది చాల బాగుంది. మరొక పెద్ద నమూనాలో, యీ యెడారిని అదుపులో పెట్టి, కొత్త పంట పద్ధతులను యివ్వగల రాజస్థాన్ కాలవ చూపబడింది

ఉత్తర ప్రదేశ్

ప్రదర్శనశాల లక్నో శిల్పం చాతురికి ప్రతిబింబంగా ఉన్నది.

రాష్ట్రం ఆహార లక్ష్యాలు, వాటిని సాధించగల సాధనాలు చార్టుల ద్వారా వివరింపబడ్డాయి.

భారతదేశంలో మిక్కిలి పెద్ద రాష్ట్ర క్షేత్రం—టెరాయ్ యిక్కడ ప్రదర్శించబడింది.

ఇర్రాడియేటెడ్ గోధుమ, మిశ్రమ మొక్కజొన్నలపై డా. బోషిసేన్ అల్మోరా లేబొరేటరీలో జరిపిన ప్రయోగాలు ఒక విభాగంలో ప్రదర్శింపబడ్డాయి. గోధుమ ఊడ్పులు (నాట్లు) నమూనాలలో చూపబడినవి.

పశ్చిమ బెంగాల్

కలకత్తా ఉప్పునీటి సరస్సు ప్రాంతాన్ని వ్యవసాయానికై బాగుచేయటం దీపాలంకృతమయిన నమూనాలో చూపబడింది. ఇది చాలా ఆకర్షణీయంగా వుంది. హరింఘాట పాల కాలనీ నమూనా కూడా యిక్కడ వుంది.

జనపనార వస్తువులుకూడా ప్రదర్శింపబడినవి. డార్జిలింగు, సింకోనా నర్సరీ చూపబడింది. ఇది కొయినాను తయారు చేస్తున్నది. ప్రదర్శన తోట మైదానంలో డార్జిలింగు నుంచి తెచ్చిన తేయాకు పొదలు వున్నాయి.

నేటి భారతదేశం

నేటి భారతదేశం పదర్శనశాలను కేంద్ర ప్రభుత్వ సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రకటన, దృశ్య ప్రచార డైరెక్టరు కార్యాలయం యేర్పరచింది. ఇందులో 350 చైతన్య స్ఫూర్తిగల ఛాయాచిత్రాలు, నమూనాలు, ప్రదర్శన వస్తువులు, భారతదేశంలో తయారయిన వస్తువులు ఉన్నాయి. ప్రజాస్వామ్య పథక నిర్మాణం ద్వారా అభ్యుదయ భారత నిర్మాణంలో జాతీయ కృషికి సరయిన మార్గదర్శిగా ఒప్పారుతున్నది యీ ప్రదర్శనశాల. ఇక్కడ

పరిశ్రమలకు ప్రాధాన్యమివ్వబడింది. ఈ శాల ఆర్థిక, సాంస్కృతిక జీవితం అన్ని అంశాలనుకూడా ప్రదర్శించింది. వ్యవసాయం, సమాజాభివృద్ధి. సహకారాలకు న్యాయంగా యివ్వవలసిన ప్రత్యేక ప్రాముఖ్యం యివ్వబడింది.

పశు ప్రదర్శనశాల

భారతీయ రైతాంగాన్ని అమితంగా ఆకర్షించేది జాతీయ పశు ప్రదర్శనశాల. ఇక్కడ 144 జంతువులు. 85 పశులు ఉన్నాయి. బహుమతి పొందిన భారతీయ పశువులు' గొఱ్ఱెలు, మేకలు, చమరీ మృగాలు, గుఱ్ఱాలు, ఒంటెలు, కుక్కలు యిక్కడ వున్నాయి.

''న్యూఢిల్లీలో జరిగే ప్రపంచ వ్యవసాయ ప్రదర్శనకు ప్రపంచ ప్రాముఖ్యమున్నది. అది వ్యవసాయం సర్వ వ్యాపకతనే కాక యితర దిశల అభివృద్ధికి ఆహారాదుల ఉత్పత్తి ప్రాథమికావసరమనే విషయాన్నికూడా నొక్కి చెబుతుంది."

గ్రంథ సమీక్ష

"నాటికల పేటిక'':— రచయిత:— శిరోమణి నూకల సత్యనారాయణ శాస్త్రి;

మూల్యం:— రూ. 1=13 న. పై; ప్రతులు రచయితల వద్ద,

(గద్వాల హౌసు, నాంపల్లి, హైదరాబాదు)—దొరుకును.

ఈ "పేటిక"లో పది చిన్న హాస్య నాటికలున్నవి. ఇవి ముఖ్యంగా బాల బాలికలు వినోదంగా ప్రదర్శించుకోడానికి వ్రాయబడ్డవి. చదువుకొని కూడా ఆనందించ వచ్చు. వీటిలో కొన్ని చదువుతుంటే పెద్ద వాళ్ళకు కూడా నవ్వు వస్తుంది. అన్నిటిలో రచయిత నీతిదాయకములైన సామెతలు అనువైన చోట్లల్లా చేర్చారు. కాని ఒక సామెతను వాక్యంలో చెప్పి, వెంటనే దాన్నే పద్యంలోగూడా చెప్పటం అనవసరమైన పునరుక్తి. ఈ పద్యాలు రెండో ముద్రణలో తీసివేస్తే మంచిది. ముద్రణ బాగుంది.

జిల్లాల వార్తలు

ఆదిలాబాదు


జిల్లా పరిషత్తు :- ఆదిలాబాదు జిల్లా పరిషత్తును జిల్లా కలెక్టరు 1-12-1959 వ తేదీన ప్రారంభిస్తూ నవ సమాజ నిర్మాణానికై సాంఘికమైన మార్పును తీసుకురావడమే వికేంద్రీకరణ ముఖ్యోద్దేశమని అన్నారు.

సహకార వారోత్సవం :- సహకార వారోత్సవానికి 8-11-1959 వ తేదీన ఆదిలాబాదులో జిల్లా కలెక్టరు ప్రారంభోత్సవం జరిపారు. స్థానిక ఆర్ట్సు, సైన్సు కళాశాల ప్రిన్సిపాలు, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సహకార వ్యవసాయం వలన కలుగగల ప్రయోజనాలను గురించి చెప్పారు.

పిల్లల పార్కులు :- రాంపూర్, బోచెర గ్రామాలలో 14-11-1959 వ తేదీన రెండు పిల్లల పార్కులను జిల్లా కలెక్టరు తెరిచారు. ప్రధాన మంత్రి జన్మదిన కానుకలుగా ఈ పార్కులు బహూకరింపబడినవి.

అనంతపురం

జిల్లా పరిషత్తు :- జిల్లా పరిషత్తును ముఖ్యమంత్రి 2-12-'59 తేదీన ప్రారంభోత్సవం చేశారు. శా.స. సభ్యుడు



గడిచిన అక్టోబరు నెలలో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం డబ్ల్యు.జి.బి. కాలేజీలో జాతీయ పరిశోధనా దినోత్సవం జరుపబడ్డ సందర్భంలో ఏర్పాటు చేయబడ్డ కళలు, చేతి పరిశ్రమల ప్రదర్శనాన్ని కాలేజీ ప్రిన్సిపాలు ప్రారంభించారు.

శ్రీ కె. సుబ్బారావు ఉత్సవానికి అధ్యక్షత వహించారు. పరిషత్తు అధ్యక్షుడు శ్రీ ఏ. చిదంబరరెడ్డి సదస్యులకు స్వాగతం చెప్పారు. ప్రజల అభ్యుదయానికి నిష్కల్మష మైన కృషి చేయవలసిందిగా ముఖ్యమంత్రి పరిషత్తు సభ్యులను కోరారు.

మార్కెటుయార్డు :- ముఖ్యమంత్రి రాయదుర్గంలో 3-12-'59 తేదీన మార్కెటు యార్డుకి శంఖు స్థాపన చేశారు. ఇటువంటివి ఈ జిల్లాలో మూడు కలవు. మిగతా రెండు గుంటకల్, తాడిపత్రిలలో వున్నాయి.

తరువాత ముఖ్యమంత్రి కొనెకల్‌లో వ్యవసాయ గిడ్డంగిని తెరిచారు. గ్రామ పంచాయతీ కార్యాలయ భవనానికి కూడా శంఖుస్థాపన చేశారు.

చిత్తూరు

జిల్లా పరిషత్తు:- రాష్ట్ర ముఖ్యమంత్రి 1-12-1959వ తేదీన జిల్లా పరిషత్తును ప్రారంభించారు. లోక్‌సభ సభ్యుడు శ్రీ ఎం. ఎ. అయ్యంగార్, ముఖ్యమంత్రి శ్రీ ఎన్. సంజీవరెడ్డి, వ్యవసాయమంత్రి శ్రీ పి. తిమ్మా రెడ్డి, శా.స. సభ్యుడు శ్రీ ఆర్.బి. రామకృష్ణరాజు, శ్రీ వెంక టేశ్వర విశ్వ విద్యాలయ ఉపాధ్యక్షుడు డా. ఎస్. గోవింద రాజులు వంటి ప్రసిద్ధ వ్యక్తులు ఈ పరిషత్తు సభ్యులుగా ఉన్నారు. ముఖ్యమంత్రి తమ ప్రసంగంలో జిల్లా అభి వృద్ధికై అంచెలవారీ కార్యక్రమాన్నొకదానిని రూపొందించ డానికి జిల్లా పరిషత్తుకు సూచనలు చేశారు.

మత్స్య సంపద అభివృద్ధి:- బ్లాకు ప్రాంతాలలో చేపల ఉత్పత్తిని పెంపొందించడానికై యూనియన్ ప్రభుత్వం సహాయంతో రాష్ట్ర మత్స్య శాఖ ప్రవేశపెట్టిన పైలట్ పథకానికి వాయల్పాడు పంచాయతీ సమితిలో 20-11-59 వ తేదీన ప్రారంభోత్సవం చేయబడింది. ఈ సందర్భంలో ఏర్పాటుచేయబడిన ప్రదర్శనంలో వివిధ రకాల చేపలు, మత్స్య శాఖ కార్యకలాపాలను తెలుపు పటాలు మొద లైనవి ప్రదర్శించారు. చేపలపై ఒక చలన చిత్రం కూడా చూపబడింది,

కడప

ప్రాథమిక ఆరోగ్యకేంద్రం :- రాష్ట్ర వ్యవసాయ



చిత్తూరు జిల్లా పల్లిపట్టు బోర్డు హైస్కూలు ఎ.సి.సి. కేడెట్లు శ్రమదానం - పంచవర్ష ప్రణాళిక ప్రచార వారోత్సవాల సందర్భంలో పల్లిపట్టు బ్లాకు సిబ్బంది, గ్రామస్తులు శ్రమదానంలో పాల్గొన్నారు.

మంత్రి సిద్ధవటం సమితిలోని మాధవరంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభిస్తూ ఆ కేంద్రాన్ని తెరవ డానికై కృషి చేసిన పద్మశాలి ప్రజలను అభినందించారు.

సహకార సప్తాహం :- సిద్ధవటం సమితిలోని ఉప్పరపల్లి గ్రామీణ బ్యాంకు అధ్వర్యాన సహకార సప్తాహం జరుప బడింది. గ్రామాలలో అధిక సంఖ్యలో సహకార సంఘాలు స్థాపింపబడటానికి ప్రోత్సాహ మివ్వవలసిందిగా అనేక మంది అధికార్లు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తిరుపతి ఔత్సా హిక నాటక బృందం వారు శ్రీ బందా కనక లింగేశ్వర రావు రచించిన ఒక నాటకాన్ని ప్రదర్శించారు.

హైద్రాబాదు

శిక్షణ శిబిరం :- చేవెళ్ళ మొదటి అంచె బ్లాకు అధ్వ ర్యాన రేగడ ఘనపురం గ్రామంలో 28-11-59 వ తేదీన గ్రామ నాయకుల శిక్షణ శిబిరం నిర్వహింపబడింది. శిక్షణ కాలంలో వివిధ అభివృద్ధి కార్యకలాపాలపై ఉపన్యాసాలు ఇవ్వబడినవి. శ్రమదానం చేయబడింది. ఆటల పోటీలు, సాంస్కృతిక ప్రదర్శనలు కూడా జరుపబడినవి.

ఖమ్మం

రబీ ఉద్యమం:- జొన్న పంట రబీ ఉద్యమం బాగా

విజయవంతమైనది. ఖరీఫ్ సందర్భంలో స్వల్పకాలిక ఋణాల క్రింద వ్యవసాయ దార్లకు చెల్లింపబడిన రూ. 75,000 ల మొత్తం కాక ఈ సంవత్సరం రబీసందర్భంలో ఋణాల క్రింద రూ. 25,000 ల మొత్తం చెల్లింప బడింది.

గోసంవర్ధన వారం:- జిల్లా అంతటా గోసంవర్ధనవారం జరుపబడింది. తిరుమలాయపాలెంలో జరిగిన జిల్లా పశు ప్రదర్శనానికి 8 ఒంగోలు గిత్తలతో సహా 60 జతల ఎడ్లు వచ్చాయి. జలటడ్లపల్లి గ్రామ కాపురస్తుడైన భద్రయ్యకి చెందిన ఎద్దు ఉత్తమమైనదిగా ఎన్నిక చేయబడి జిల్లా కలెక్టరు బహుమతి పొందింది.

జిల్లా పరిషత్తు:- రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి జిల్లా పరిషత్తుకి ప్రారంభోత్సవం చేశారు.

కృష్ణా

ఎ.సి.సి. శిబిరం:- జిల్లా కలెక్టరు ఎ.సి.సి. కార్మిక, సాంఘిక సేవా శిబిరానికి గూడూరులో 15-11-59 తేదీన ప్రారంభోత్సవం జరిపారు.

గ్రామ సహాయకుల శిబిరం:- నూజివీడు బ్లాకులోని రేమళ్ళ గ్రామంలో 1959 నవంబరు 28 నుంచి 30 వ తేదీ వరకు వ్యవసాయ వర్గానికి సంబంధించిన విషయాలపై గ్రామ సహాయక శిబిరం ఒకటి నిర్వహింపబడింది.

ఇదే గ్రామంలో 30-11-59 న హరిజన దినం జరుప బడింది.

పంచాయతీ పార్కు:- పాగోలు గ్రామంలో 25-11-59 తేదీన పంచాయతీ పార్కు, రేడియో గది తెరుపబడినవి.

ఎలిమెంటరీ పాఠశాల:- మోటూరు పంచాయతీ సమితి లోని గుంజాల గ్రామంలో శ్రీ అట్లూరి జానకిరామయ్య బోర్డు ఎలిమెంటరీ పాఠశాలకి 14-11-59 తేదీన ప్రారంభో త్సవం చేయబడింది.

ఆదర్శగ్రామం:- గూడూరు పంచాయతీ సమితిలోని కోక నారాయణపాలెం "ఆదర్శ గ్రామంగా" అభివృద్ధి జెందుతున్నది. ఈ గ్రామంలో మద్యపాన నిషేధం అమలో వున్నది. సమిష్టి వ్యవసాయం ఆచరణలో వున్నది. అభి వృద్ధి పనులను అమలుపరచడానికై గ్రామ సేవా సంఘం స్థాపింపబడింది.

కర్నూలు

జిల్లా పరిషత్తు:- రాష్ట్ర ముఖ్యమంత్రి 4-12-59 వ తేదీన కర్నూలు జిల్లా పరిషత్తును ప్రారంభిస్తూ గ్రామీణులు తమ అవసరాలను తీర్చుకోవడంలో సాధ్యమైనంత తొంద రలో కృతకృత్యులు కావడానికి వీలుగా అధికారాలను వారి పరం చేయాలనే సంకల్పంతో నూతన వ్యవస్థ అయిన ప్రజాస్వామ్య వికేంద్రీకరణ విధానం ప్రవేశ పెట్టబడిం దన్నారు. సాంస్కృతిక కార్యక్రమాలు, "బలిదానం" అనే నాటికా ప్రదర్శనంతో ఉత్సవం సమాప్తమైనది.

హరిజన దినోత్సవం:- గోరట్ల బ్లాకులోని సింగారెడ్డి పల్లిలో 10-11-59 తేదీన హరిజన దినోత్సవం జరుప బడింది. హరిజనవాడ అంతటా పారిశుద్ధ్యం కార్యక్రమం జరుపబడింది. హరిజన బాలలకు తలంటు స్నానాలు పోయ బడినవి.

మహబూబ్‌నగరం

జిల్లా పరిషత్తు:- రాష్ట్ర హోంశాఖ మంత్రి 7-12-59 తేదీన మహబూబ్‌నగరం జిల్లా పరిషత్తుకు ప్రారంభోత్సవం చేస్తూ శాంతి, అభ్యుదయాల సాధనకు అనుగుణ్యంగా తమ దృక్పథాలను మార్చుకోవాలని అధికార్లకూ, అనధి కార్లకు ఉద్బోధించారు.


పరిషత్తు అధ్యక్షుడు జిల్లా అభివృద్ధికై ప్రణాళికలను రూపొందించి అవన్నీ సక్రమంగా అమలు జరుగునట్లు చూడాలని ఆయన అన్నారు.

శిక్షణ శిబిరం:- అమనగల్ బ్లాకులోని బ్రహ్మపూర్‌లో 25-11-59 నుంచి 27-11-59 వరకు గ్రామ సహాయకుల శిక్షణ శిబిరం ఒకటి నిర్వహింపబడింది.

పంట తెవుళ్ళ నిర్మూలన కార్యక్రమం:- ఈ జిల్లాలో ఆముదం పంటకు తగిలిన తెవుళ్ళను నిర్మూలించడానికై మందు చల్లే కార్యక్రమం డిసెంబర్ మొదటి వారంలో పెద్ద ఎత్తున నిర్వహింపబడింది. ఇందుకు 50 స్ప్రేయర్లు రెండు పవర్ స్ప్రేయర్లు ఉపయోగింపబడినవి.

అంబర్ విద్యాలయం:- అంబర్ విద్యాలయం శిక్షి తుల మూడవ జట్టుకి మహబూబ్‌నగరంలో 30-11-59 తేదీన రాష్ట్ర రెవెన్యూ మంత్రి ప్రారంభోత్సవం చేశారు.

గ్రామదాన ఖాదీ భండార్:- రాష్ట్ర కార్మిక శాఖా



పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి బ్లాకు పంచాయతీ సమితి సభ్యుల గ్రూపు ఫోటో

మంత్రి మహబూబ్‌నగరంలో 25-11-59 తేదీన గ్రామదాన ఖాదీ భండార్‌ని ప్రారంభించారు.

షాద్‌నగర్-శాంతాపూర్ రోడ్డు:- షాద్‌నగర్ నుంచి శాంతాపూర్ వరకు చట్టర్‌పల్లి డొక్కల్, బుక్కిగూడ, వెల్జెర్ల ఎక్లషన్‌పేట, అల్వాల్, కొత్తపేటలను కలుపుతూ 15 మైళ్ల పొడవున ఒక రోడ్డు వేయబడింది. గ్రామస్థులు రెండు నెలల స్వల్ప కాలంలో ఆరుమైళ్ళ మట్టి పనిని పూర్తి చేశారు.

చేతి వస్తువుల ప్రదర్శనం:- మహబూబ్‌నగరంలో 6-12-59 తేదీన చేతి వస్తువుల ప్రదర్శనను ప్రారంభిస్తూ గద్వాల చీరలు, వినుగొండ చాపల పరిశ్రమ, నారాయణ పేట నేత పరిశ్రమ బాగా గణ్యత నొందినవని జిల్లా కలెక్టర్ అన్నారు.

మెదక్

జిల్లా పరిషత్తు:- మెదక్ జిల్లా పరిషత్తుకి 1-12-59 తేదీన సంగారెడ్డిలో రాష్ట్ర సహకార, గృహ నిర్మాణముల శాఖా మంత్రి ప్రారంభోత్సవం చేశారు. జిల్లా ప్రయోజనాల దృష్ట్యా పరిషత్తు సభ్యులు సమైక్యంగా మెలగాలని ఆయన హితవు చెప్పారు.

పారిశ్రామిక ప్రదర్శనం:- దుబ్బాక యువకులు కొందరు 14-11-59 తేదీన ఒక పారిశ్రామిక ప్రదర్శనని ఏర్పాటు చేశారు, దానిలో బ్లాకు ప్రాంతంలోని 13 పారిశ్రామిక సహకార సంఘాలు, కొన్ని ప్రభుత్వ శాఖలు పాల్గొన్నాయి.

వారం రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శనంలో సాంస్కృతిక కార్యక్రమాలు, బహుమతి ప్రదానోత్సవాల వంటి ఇతర ఆకర్షణలు కూడా చేర్చబడ్డాయి.

ఆరోగ్య వారం :- పటంచెరు బ్లాకులోని ముత్తంగి గ్రామంలో 14-11-59 తేదీన ఆరోగ్య వారం జరుపబడింది. బహుమతి గెలిచిన శిశువుల తలిదండ్రులకు బహుమానాలు పంచిపెట్టబడినవి.

జాతర సందర్భంలో ప్రదర్శనం :- కంది గ్రామంలో శ్రీ పాండురంగ స్వామి జాతర సందర్భంగా జిల్లాలోని వివిధ శాఖలు కలిసి ఏర్పాటుచేసిన ప్రదర్శనాన్ని 23-11-59 తేదీన జిల్లా కలెక్టరు ప్రారంభించారు.

రెడ్‌క్రాస్ :- సంగారెడ్డిలో 7-11-59 తేదీన జరిగిన జూనియర్ రెడ్‌క్రాస్ కౌన్సిలర్ల శిక్షణ శిబిరానికి భారత రెడ్‌క్రాస్ సంస్థ ఆంధ్రప్రదేశ్ శాఖ కార్యదర్శి ప్రారంభోత్సవం చేశారు.

నల్గొండ

జిల్లా పరిషత్తు :- నల్గొండ జిల్లా పరిషత్తును 1-12-59 తేదీన రాష్ట్ర రెవిన్యూ మంత్రి ప్రారంభించారు. ఆయన ఈ సందర్భంలో ప్రసంగిస్తూ వికేంద్రీకరణ పథకాన్ని విజయవంతం చేయటానికై అంతా కలిసికట్టుగా కృషి చేయాలని పరిషత్తు సభ్యులకు హితవు చెప్పారు.

ప్రణాళికా గోష్ఠి :- నల్గొండలోని నాగార్జున కళాశాలలో 2-12-59 తేదీన ప్రణాళికపై ఒక గోష్ఠి ఏర్పాటు చేయబడింది.

జిల్లా పరిషత్తు అధ్యక్షుడి అధ్యక్షతన జరిగిన ఈ గోష్ఠిలో పాల్గొన్న పెక్కురు వక్తలు విద్యార్థులలో ప్రణాళికా చైతన్యం కలిగించవలసిన ఆవశ్యకతను నొక్కి చెప్పారు.

సాంఘిక విద్యా దినం :- నల్గొండలో 2-12-59 తేదీన సాంఘిక విద్యా దినం జరుపబడింది. పుర వీధుల గుండా పెద్ద ఊరేగింపు జరిగింది. అందరినీ జిల్లా కేంద్ర గ్రంధాలయం వద్ద సమావేశపరచారు.

ప్రణాళికపై పుస్తకాలు :- పంచవర్ష ప్రణాళికలు, సమాజాభివృద్ధి కార్యక్రమాలపై పుస్తకాలు తదితర సాహిత్యంతో కూడుకున్న ప్రణాళికా విభాగం ఒకటి నాగార్జున కళాశాల గ్రంధాలయంలో 2-12-59 తేదీన తెరువబడింది.

సంగీత, నాటకాలపై గోష్ఠి :— నల్గొండలో జిల్లా స్థాయిలో సంగీత, నాటకాలపై జరిగిన గోష్ఠికి రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభోత్సవం చేశారు. 13-11-'59 తేదీన ఆరంభమైన ఈ గోష్ఠి 16-11-'59 తేదీన సమాప్తమైనది. చివరిరోజు జరిగిన బహుమాన ప్రదానోత్సవానికి జిల్లా కలెక్టరు అధ్యక్షత వహించారు. ఈ గోష్ఠి జరిగిన కాలంలో అభివృద్ధి కార్యక్రమాలపై జరిగిన నాటికలను దాదాపు 20 వేల ప్రజలు చూశారు.

మూడవ జిల్లా స్థాయి గోష్ఠి :- రాష్ట్ర ముఖ్యమంత్రి మూడవ జిల్లా స్థాయి అభివృద్ధి గోష్ఠికి 13-11-'59 తేదీన ప్రారంభోత్సవం చేస్తూ వచ్చే అయిదు సంవత్సరాలలో ప్రతి

గ్రామానికి ఒక రోడ్డు, ఒక పాఠశాల, ఇంకా ఇతర సదుపాయాలు ఏర్పడడానికి వీలుగా ఒక ప్రణాళికను రూపొందించవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు.

సర్వీసు రిజర్వాయరు :- నల్గొండ పట్టణం నీటి సరఫరా పథకం రిజర్వాయరుకి రాష్ట్ర ముఖ్యమంత్రి శంఖుస్థాపన చేశారు. ఈ పథకానికి రూ. 15 లక్షల వ్యయం అంచనా వేయబడింది.


నిజామాబాదు

గ్రామోదయ సంఘం :- వర్నిలో 26-11-'59 తేదీన గ్రామోదయ సంఘానికి ప్రారంభోత్సవం చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి దారిద్ర్యం, నిరుద్యోగ సమస్యలను నిర్మూలించడానికై పారిశ్రామికంగా అభివృద్ధిజెందవలసిన ఆవశ్యకత ఎంతైనా వున్నదని అన్నారు. తరువాత ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పునాది రాయి వేశారు.

విశాఖపట్నం

గిరిజన సంక్షేమం :- పదేరు లోయలోని బహుళార్థ సాధక ప్రాజెక్టును సందర్శించిన డా. వెర్రియర్ ఎల్విన్, గిరిజనుల ఆర్థికాభివృద్ధి విషయాలలో గమనార్హమైన అభివృద్ధి సాధింపబడిందని అన్నారు. డా. ఎల్విన్ నేఫా గిరిజన సంక్షేమ వ్యవహారాలలో ప్రభుత్వానికి సలహాదారుగా వున్నారు. తాను సందర్శించిన అతి ఉత్తమ ప్రాజెక్టులలో పదేరు ఒకటని ఆయన చెప్పారు. గిరిజనుల పరిశుభ్రమైన నివాస గృహాలనీ, ప్రాజెక్టు సిబ్బంది అచ్చట అమలు జరుపుతున్న పనిని ఆయన మెచ్చుకున్నారు.

చిన్న మొత్తాల పొదుపు వసూళ్లు :- జిల్లా ప్రణాళిక, అభివృద్ధి సంఘం క్రిందటి సమావేశంలో జిల్లా కలెక్టరు చిన్న మొత్తాల పొదుపు పథకం క్రింద జరిగిన వసూళ్ళ



పశ్చిమ గోదావరి జిల్లా చింతలపూడి బ్లాకు పంచాయతీ సమితి సభ్యులు

వివరాలను అందజేస్తూ ఈ జిల్లాకి రూ. 60లక్షలు లక్ష్యంగా నిర్ణయింపబడగా 28-10-1959 తేదీ నాటికి రూ. 21-97 లక్షలు సేకరింపబడినవన్నారు.

వరంగల్

జిల్లా పరిషత్తు :- వరంగల్ జిల్లా పరిషత్తును 2-12-59 తేదీన ప్రారంభిస్తూ రాష్ట్ర సహకార శాఖ మంత్రి ప్రాచీన మైనట్టి వికేంద్రీకృత పరిపాలనా పద్ధతిని పునరుద్ధరింప జేయడంలో భారతదేశంలో ఆంధ్ర ప్రదేశ్ మొట్టమొదటి రాష్ట్రమన్నారు. ప్రారంభోత్సవానికి హాజరైన రాష్ట్ర రెవెన్యూ మంత్రి ప్రసంగిస్తూ నూతన పరిపాలనా వ్యవస్థలో తమకుగల హక్కులను, బాధ్యతలను గుర్తించుకోవలసిందని అధికార్లకు, అనధికార్లకు విజ్ఞప్తి చేశారు.

గ్రామస్థుల రేడియో గోష్ఠి :- ములుగు గ్రామస్థుల రేడియో గోష్ఠిని 17-11-1959 ములుగు సర్ పంచ్ ప్రారంభించారు. అందరు ఎక్స్‌టెన్‌షన్ అధికార్లు, బి. డి. ఓ. లు ఈ సందర్భంలో హాజరైనారు. ఆ సాయంత్రం మొదటి కార్యక్రమాన్ని విన్న తరువాత చర్చలు జరిగినవి.

వ్యవసాయ, పారిశ్రామిక ప్రదర్శనం :- వరంగల్‌లో 26-11-59 తేదీన వ్యవసాయ, పారిశ్రామిక ప్రదర్శనాన్ని ప్రారంభిస్తూ రాష్ట్ర రెవెన్యూ మంత్రి అభివృద్ధికరమైన వ్యవసాయ, పారిశ్రామిక పద్ధతులను ప్రజలకు తెలియజేయడంలో ఇటువంటి ప్రదర్శనలు బాగా ఉపయోగపడగలవన్నారు. దేశాభివృద్ధి అంటే కేవలం రోడ్డులనూ, వంతెనలను నిర్మించడమే కాదనీ, ప్రజల జీవన ప్రమాణాన్ని పెంపొందించడం కూడా నని ఆయన అన్నారు.

ప్రభుత్వ భీమా పథకం :- కార్మికుల ప్రభుత్వ భీమా పథకం 15-11-59 తేదీ నుంచి వరంగల్‌కు విస్తరింపబడింది. ఈ పథకం వలన సుమారు 6,500 పారిశ్రామిక కార్మికులకూ, 25,000 మంది వారి కుటుంబ సభ్యులకు ప్రయోజనం చేకూరుతుంది. గిర్మాజీపేట, కరీమాబాదు, పారిశ్రామిక కాలనీలలో మూడు చికిత్సాలయాలు తెరువబడినవి.

పశ్చిమ గోదావరి

జిల్లా పరిషత్తు :- రాష్ట్ర న్యాయ శాఖా మంత్రి ప. గోదావరి జిల్లా పరిషత్తుకి 1-12-59 తేదీన ప్రారంభోత్సవం చేశారు. పరిషత్తు విధులను గురించి జిల్లా కలెక్టరు వివరించి చెప్పారు.

జిల్లా పరిషత్తు ప్రారంభోత్సవం సందర్భంగా ఏలూరు సెయింట్ థెరసా కళాశాలలో ప్రణాళికా గోష్ఠి సమావేశాలు జరుపబడినవి. జిల్లా పరిషత్తు అధ్యక్షుడు కళాశాల విద్యార్థుల సమావేశంలో ప్రసంగించారు. భీమవరం డబ్ల్యు.జి.బి. కళాశాల ప్రణాళికా గోష్ఠి నిర్వాహకుల అధ్వర్యాన 29-11-59 తేదీన విద్యార్థుల పాదయాత్ర జరుపబడింది. భీమవరం, కుముదవల్లి, పాలకోడేరులకు విద్యార్థులు నడిచి వెళ్లారు.

డా. పి. చలపతిరాజు, డా. ఎం. రంగనాథరాజు గారలు కార్మిక తరగతుల వారి వైద్య పరీక్ష జరిపారు. సాంఘిక సేవా బృందం వారు వీధులను శుభ్రం చేయటం, పారిశుద్ధ్యం, బీద పిల్లలకు పాలపొడి, ఔషధాలను పంచిపెట్టడం వంటి కార్యక్రమాన్ని నిర్వహించారు. న్యాయ శాఖా మంత్రి సాయంత్రం పూట విద్యార్థులతో, గ్రామస్థులతో కొంతకాలం గడిపారు.

శ్రీకాకుళం

జిల్లా పరిషత్తు :- రాష్ట్ర ఆర్థిక, ప్రణాళికా శాఖా మంత్రి శ్రీకాకుళం జిల్లా పరిషత్తుకి 2-12-59 తేదీన ప్రారంభోత్సవం చేశారు. మంత్రి గారు ఈ సందర్భంలో ప్రసంగిస్తూ ప్రజాస్వామ్యం యొక్క విజయం ఇప్పుడు నూతనంగా అనుభవంలోనికి వస్తున్న వికేంద్రీకృత పరిపాలనా విధానంపైననే ఆధారపడివుందన్నారు.

పంచాయతీ సమితులపై ఒక నాటిక ప్రదర్శింపబడటంతో నాటి కార్యక్రమం సమాప్తమైనది.

ఆంధ్ర మహా విష్ణువు

శ్రీ జూలూరి హనుమంతరావు

శ్రీ మంతమై సౌఖ్య జీవనంబౌచు
భూమిలో నొక స్వర్గ భూభాగమౌచు
స్వాదు నీరా పూర్ణవాహిని యౌచు
పాదుకొల్పిన పచ్చ బంగారమౌచు
నభిరామమై యుండు నాంధ్రమాగాణి
సుభగమై పెంపారు సురుచిర భూమి
నీతి మార్గైక సంచిత పుణ్యసీమ
ఖ్యాతిగా ధర్మ స్వభావాభిరామ
వీర విక్రమ కళావిస్తార శక్తి
మారుచూడని ప్రజా మాతృభూభక్తి
గడివోని సామ్రాజ్య గాఢానురక్తి
కడిదియే యాంధ్ర మాగాణి జీవులకు!
నాల్గు పాదములందు నటియాడు ధర్మ
మెల్గెత్తి చాటించునెనరుసత్కర్మ
వరదయాగుణ శౌర్య భరితుడాంధ్రుండు
స్థిరభావ సంకల్ప సిద్ధుడాంధ్రుండు
దుష్ట శిక్షణ సల్పు దోర్బలుండెవడు!
శిష్ట తోషణ సల్పు శ్రితకల్పుదెవడు!
ధర్మైక విద్యా విధాతృ డాంధ్రుండ
శర్మైక మార్గ సంచరితు డాంధ్రుండ
గౌతమీకృష్ణా పగాదివ్య జలము
పూతమ్ము నొనరించుఁ బుణ్యాంధ్ర భువినిఁ
గల గానయాన మంగళ సుప్రసన్న
విలసిత మధుజల విపులమనోజ్ఞ

ప్రజలకు ముంగొంగు పసిడి కోటారు
నిజ రూపలావణ్య నిధులతోఁ దేరు
మందాకినీ భవ్య మహనీయ గుణము
క్రిందుగా నొనరించు కృష్ణ వేణమ్మ
కృష్ణవేణీ తరంగిణి పారు చోట
కృష్ణవంశ శ్రుతుల్ కెరలునే పూట
వర కృష్ణవేణీ ప్రభాస కూలమున
సిరులతో విలసిలు శ్రీకాకుళమ్ము

మణులు పచ్చల పంట మలచికోనవ్వ
నణువైన నటయ శస్సంపు దౌదవ్వ
వీర ప్రతాప గంభీర శౌర్యములు
దారతా కరుణ శాంత ప్రసాదములు
తోరముల్ సుగుణ విధుల్ పుట్టు విద్దె
లారాజధానీ ప్రజావళికనిన
శ్రీకాకుళాధిప శ్రీ ఆంధ్ర విష్ణు
శ్రీకంబు లివియంచుఁ జెప్పఁగావలెనె!
ఆంధ్ర దేశ శ్రీల కవధి లేనట్టు
లాంధ్ర జాత్యౌన్నత్యమావహిలునట్టు
లాంధ్ర వీర పతాక కడ్డులేనట్టు
లాంధ్ర కీర్తి జ్యోత్స్న లలరారునట్లు
తనయశశ్శ్రీల నిత్యము పంపుచుండు
తన ప్రజాక్షేమ పద్ధతి పెంచుచుండు
తన దోర్బలమును వింతగ జూపుచుండు
తనయాంధ్ర భూకళా తతిపెంచుచుండు
సాధు ప్రజాబాధ సహియింపడెపుడు
మాధురీ గుణములన్ మరువబోడెపుడు
సర్వహితా చార సరణుడాతండు
సర్వ ప్రజా చిత్త చరితుడాతండు
శ్రీకాకుళము స్వర్గ సీమగాఁదాను
నాకాధిపతి యౌచు నడపు రాజ్యమ్ము
శ్రీ యాంధ్రవిష్ణు రాజిత భూరి గుణని
కాయముల్ గణియింప గలరె యేరైన ?

* * *

ఆంధ్ర రాజ్యరమా జయశ్రీలతోడ
నాంధ్ర సంహిత మార్గమరయగాగోరి
నెనరుగానొకనాట నిండు కొల్వుండ
వినిచె నీరీతిగా విజ్ఞుఁడౌమంత్రి
"తృప్తిలేని ద్విజుండు తృప్తుడౌరాజు
నాప్తవర్గములేని యట్టి మానవుడు
చెడిపోదురను మాటఁ జేసి రాజునకు
విడువక నిజరాజ్య విస్తృతి సేత
బలము గూర్చునుయశః ఫలము చేకూర్చు
నల రాజ్య భాగ్యంబులధికమైతనరు
నరిజయమ్మనరాదు యశము రాజునకు
పోరు పొచ్చములు లేని పొలుపు వహింప
నింగితమ్మెఱిగి వర్తింపగావలయు
హంగులన్నియు రాజ్యమందుంపవలయు
ప్రజలన్యాయమ్ముగా బాలింపవలయు
ప్రజల భావమెఱింగి రాజుండవలయు
ప్రజలకు హితకార్య భావనల్ సేసి
నిజరాజ్య శక్తి గణింపగా వలయు
తలమున్కలౌ కష్టముల గూర్పరాదు
తలలోని నాల్కగాఁదగు రాజ్య జనత
సర్వ ప్రజా శక్తి సంఘటింపంగ
పర్వమౌ రాజ్యాన ప్రజకు రాజునకు
రాణించు సతతమ్ము రాచఱికమ్ము
ప్రాణమై ప్రజలు సంపదల దూగుదురు"
అని చెప్పు సమయమందరు దెంచి యొకడు
వినిచె సేవకుఁడుతా విభునకీరీతి:
'జయము శ్రీకాకుళేశ్వర ! ధీగభీర !
జయమునిత్యోల్లాస సంతోష వీర !
గోదావరీ నదీకూల సంవాసు
లౌ దుఃఖులౌమును లరుదెంచినారు
కావ రోమమ్మను గాంక్షతోతారు
దేవర దర్శనా దేశము కొఱకు

నిలిచినా'రని పల్కినిలుచు సేవకుడు
పిలువుము సభకునా విభునాజ్ఞ జేసి
గౌత మీమునుల వేగమే తోడితేఁగ
యాత నాభారులా యవనీశు మ్రోల
కరములు ముకుళించి కరము సంభ్రమము
వెరవు దోపఁగ విన్నవించి రీరీతి
"శ్రీకాకుళాధిపా ! శ్రితజనోద్ధార !
రాకాకళాయశో రాజితా నంద !
అవధారు దేవ మమ్మార్తుల గావ
నెవరింక యోపు దురీవ కాకుండ
గౌతమీది వ్యాపగా తరంగముల
చేతముల్ వికసింపఁ జెలఁగు వారలము
రాజనమ్ములు ఫల రాజి వృక్షములు
రాజిల్లు చేలపరంజి చేలన్న
పూతమ్ము లౌనీరపూరాల గ్రాలు
గౌతమీ మహిమ వక్కాణింప గలమె
ప్రతి తరంగమ్మొక్క ప్రాణమ్ము మాకు
ప్రతి నీరకణ మంత రంగమ్ము మాకు
గోదావరీ నదీ కూలముల్ మాకు
వేద మందిరములై విలసిల్లు నెపుడు
పరిసరారణ్య భూభాగంబులన్న
నిరవులు సౌమ్య భావేప్సితమ్ములకు
జడదారులము మేము సద్గతుల్గాక
పెడదారులవి యేల విహరింపమాకు
భూ ప్రజాక్షేమ సంబుద్ధిచేఁ దపము
నప్రమేయమ్ముగా నాచరించెదము
దైవ భక్తియకాక తలపమేమొండు
భావముల్ దైవ సంబంధముల్ మాకు
నొరుల కెగ్గొనరింప నోపము మేము
పరులపై నాధారపడము మేమెపుడు
తల సూపు కష్ట సంతతి విన్నవింప
వలగొన్న బాధార్త భావముల్ దెలుప

దైవమ్మునకెగాదె తగునేరికైన
దైవమే మన కొప్పిదము గూర్చు గాదె
ఇల ప్రాణి హిత మార్గ మెఱిగిన రాజు
తలపగాఁ బ్రత్యక్ష దైవంబు కాగ
సవరింప బాధ్య మీ చక్క నిల్చితిమి
అవధారు దేవ మా యార్తనాదముల
గౌతమీ తీరానగల రాజ్యమునకు
నేత నిశుంభుడు నిశ్శుంభుడౌచు
నాస్తికుడై దైవ నామమ్ము సలుపు
నాస్తికులకు ప్రాణహాని చేకూర్చు
గోదావరీ ప్రజకు గొంతులో పుండు
వేదనాకరుడు గర్వియు దానవుండు
మునుల పాలిటి మృత్యు ముఖము సజ్జనుల
యునికి పాలిటి భూత ముర్వికి బరువు
చండశాసనుడు వితండ వాదనుడు
చండుడు జడమతి శఠుడు కూౄరుండు
నతి నిరంకుశుడైన యతని రాజ్యమున
వెతలుగా కింకేమి ప్రియమొనగూరు
దినదినగండమై తిరుగనోపుదురె
మనుజులు దానవావనిలోన నెందు
సుజన పోషణ! యలసులు కాక వినుడు
ప్రజలేక కంఠమై పలికిన మాట
యజరామరమ్ము మహా విష్ణు యశము
నిజము శౌర్యమ్ము నిర్నిద్ర మూర్జితము
దేవమీ పాలన దెమ్ము మాకెపుడు
కావవే మమ్ము రక్కసు బారి నుండి
రమ్మి నిశుంభవర్తన మాపుజేయ
తెమ్మాంధ్ర కీర్తి వర్ధితమౌ పతాక
మా ప్రజాబలము సామ్రాజ్య సంపదల
నృపతి వీరుఁడవై గ్రహియింపు
మో మహావిష్ణు రాజోత్తమా! కీర్తి

సీమ సీమల విలసింప జేయంగ
చనుము నిశుంభుని సమరాన గెల్వ
కొనుము గోదావరీ కూల రాజ్యమ్ము
నీ యశస్సు కళావి నిర్మలత్వమ్ము
మాయ జేయకరమ్ము మమ్ము బ్రోవంగ"
నని పల్కు మునుల వాక్యము లాలకించి
వినిచె నీ విధి మహావిష్ణు భూధవుడు
"మునులార చని నిశుంభుని యుక్కుదిగిచి
జనులఁగాచెద ప్రజా సంతోషమెలయ
నిర్భయమ్ముగఁ బొందు నిజ దేశమునకు
దుర్భరమె నిశుంభ దుష్టుఁజెండాత
ప్రజలకు నిర్భయ వాక్యముల్ దెలిపి
నిజ కార్యములను గణించుకొండింక"
అనమునులరుగఁ గార్యాలోచనమున
మునిగిన నిజ మంత్రి ముఖ్యుడిట్లనియె
"ఆడబోయిన తీర్థ మైనది యెదురు
పాడి నిశుంభునిఁ బరిమార్ప మనకు
దేవ! సామ్రాజ్య విస్తీర్ణమే గాక
పావన గౌతమీ ప్రభుతయే గాక
రాకా కళాయశోరమణయే గాక
చేకూరు ప్రిజకు వాంఛిత సౌఖ్య పథము
సల్పు మహాంధ్ర రాజ్య స్థాపనమ్ము
నిల్పాంధ్ర జాతి పెంచిన కీర్తివల్లి
ప్రజలకు వ్యతిరేక పరిపాలనమ్ము
నిజముగా నొక పూట నిల్వబోదెందు
శ్రీకాకుళాంధ్ర సంచిత శౌర్య గుణము
రేకెత్తు కనుసన్న లేశమాత్రమున
తిరుగని ధైర్యమ్ము చెరుగని కీర్తి
తరుగని ధీశక్తి విరుగని గరిమ
దీపించు నాంధ్ర జాతికి నెల్ల ప్రొద్దు
మాపు రేపును శివ మహిమ కాపాడు

నీ యాంధ్ర జాతిని నెవరడ్డగలరు?
గేయమానముగాఁ గీర్తింప వలదె
శ్రీకాకుళేశ్వరార్జిత దిగ్విజయము
శ్రీకాకుళాంధ్ర సాంద్రీకృత బలము"
నని పల్కు మంత్రి వాక్యము లందికొనుచు
ననియె మహా విష్ణు "వాంధ్ర శౌర్యమ్ము
పొంగులెత్తుచు వైరి పోడిమి చలము
క్రుంగదీయఁగ సమకూరె కాలమ్ము
విలసిల్లు నాంధ్రుల విజయ పతాక
యలరారుగాత మిన్నంటి శౌర్యమున"

అని యుద్ధ సన్నద్ధులై యుండు నంత
కనులలో క్రోధాగ్ని కణకణ మండ
నావేదనల్ ప్రళయమ్ముగా మూగ
భావమ్ము లగ్ని పర్వత పంక్తిగాగ
తివిరి నిశుంభ ప్రతీకార చర్య
నవరింప గౌతమీ జనరుద్ర సైన్య
మెదురు చూచెడి వేళ నింతింత లౌచు
నదురగ పుడమి పెల్లఱచు సైన్యముల
నడచి వచ్చెడు నాంధ్ర నాయకుఁజూచి
తడవులేకుండ గోదావరీ వాసు
లంత రంగమ్ములా హవమాడ గోర
సంతోషమున బొంగు సంద్రమౌనాంధ్ర
సేనలోగలియు సంస్థితి జూచికొన్న
యా నిశుంభుడు క్రుద్ధుడై మహావిష్ణు
నెదురించు రీతి గర్జించి సైన్యముల
పదపదమని యగ్నిఁబడు శలభముల
వలెపోయి వీరాంధ్ర బలము కన్గనక
బలము లౌనాంధ్ర సేనల జొరబార
నసి చాలనములు క్రోధాగ్నితళ్తళలు
ముసల ప్రహారముల్ విసరు శౌర్యాంశు
లాహవ భూమి ప్రేతావని గాగ

మోహరించెడు వేళ్ళ ముందు ముందునకు
దూకుచు నాంధ్ర యోధులు పోరు సల్పి
శ్రీకాకుళేశుండు చెంగున దూకు
సింహమౌచు నిశుంభు జెండాడ బోవ
రంహాగతి నిశుంభ రాక్షస రాజు
క్రుద్ధుడై తా కెతాకున మహావిష్ణు
వుద్ధతుడై వాని యుక్కార్చి ఖడ్గ
ధారకు బలివెట్టె-తోరమ్ము గాగ
వీరుల కంఠాల విజయ నాదమ్ము
చెలరేగె మిన్నంట నలరారె నాంధ్ర
బల విజయ పతాక పరువమ్ము సూపి
గోదావరీ ప్రజల్ మోద సంపుల్ల
నా దమ్ములో నాంధ్ర నాయకు మోళ్లిల
హృదయాలు వెన్నెల లీన జై జైని
నదములతోఁ బూజనము నేసి యనిరి:

"బ్రతుకులు తెలతెల్ల వాఱిన విపుడు
నత శౌర్య తేజాంధ్ర నాయకు రాక
కంటకుడైన రక్కసు బారి నుండి
కంటికి ఱెప్పగా గాచితిమమ్మ
తిరుగుదుమేమాంధ్ర తేజః పతాక
వరయ శచ్ఛాయల బట్టి యెల్లపుడు
దేవ సంభావనల్ దీపించు గాత
దేవుడౌ రాజు మాదె సకాచు చుండ
సప్త గోదావరీ సామ్రాజ్య మందు
నాప్త దేవుండు భీమాహ్వాయ శివుడు
రక్షించు గాత మాంధ్రక్ష మావిభుని
శిక్షిత దానవు శ్రిత జనహితుని
భీమేశ్వరమె కాక వెలయు మహేంద్ర
భూమీ ధర మ్మాంధ్ర భూమిలో గలియ
ముదము గూర్చును సుసంపదల జేకూర్చు
విదితమ్ముగా నాంధ్ర విఖ్యాతి కలుగు
నచటి రక్కసు మూకహాత మార్చు నేత

రచియించు భూప్రజా రక్షణ బలము
వికసితాంధ్రముగ దిగ్విజయమ్ము సేయ
నొక చోటనేకాదు వికసించు యశము
దిక్కు దిక్కుల సర్వదీనుల యెదల
చెక్కు చెదరనివి నిర్జిత సీమలందు''
నని పల్కు ప్రజల వాక్యములందు శ్రద్ధ
గొని రక్కసుల పిండు గూల్చు భావమున
భీమేశ్వరమ్మునఁ బెన్నిధి నీశు
ప్రేమతో బూజించి శ్రీ మహావిష్ణు
వీశుని కారుణ్యమే పార నడచి
యీశాన్య దిశన మహేంద్ర పర్వతము
నచటి రాజు జయించి యాక్రమింపంగ
సుచలదాంధ్ర పతాక సోయగమ్ములను
దిలకించు నాంధ్ర వీరుల గర్వ రేఖ
విలసించె నినదించు విజయ నాదముల
దిగ్విజయారంభ తేజోత్సవముల
స్రగ్వలయములతో శర్వు బూజించి
దక్షిణాశకు బోటు దండును నడపి
అక్షీణుడై విజయధ్వజమెత్తి
కాళేశ్వరమ్ము నాక్రమణమ్ము గొంచు
వ్యాళ భూషణుబూల హారాల దన్పి
వీరాంధ్ర యోధులు పెల్లు రేగంగ
దూరుపు దెసకేగి తోరమ్ము గాగ
వీరుల విజయ నాదారంభ మందు
శ్రీ రమ్య సీమయౌ శ్రీ శైల భూమి
స్వాధీనమును గొని స్వాంతముప్పొంగ
నాధీరుడైన మహావిష్ణు యశుడు
సహ వీరులకు జోహార్ సల్పిస్థాపించె
మహదాంధ్ర కీర్తి సామ్రాజ్య మండలము
మరలి శ్రీకాకుళ మండలమ్మునకు
దరలి వచ్చెడు నాంధ్ర ధాత్రీ ధవునకు
తన దిగ్విజయ మహోత్సవము పెంపార

జన సమూహములు జైజై నినాదములు
సలుపుచునెదురేగి స్వాగతమ్మిడిరి
తెలుగు చెక్కెములెత్తి వెలుగు టారతుల
శ్రీకాకుళము యశస్సీమగా జేసి
ప్రాకట విజయాంధ్ర రాజ్యమ్ము నిల్పి
తన దిగ్విజయ యాత్ర కనురూపమగుచు
దనరగ నొక దివ్య ధామమేర్పఱచి
యాంధ్ర నాయకు బేరహరుఁ బ్రతిష్ఠించి
యాంధ్ర రాజ్యేంది రాయశము తానొచు
నల రారు నాంధ్ర మహావిష విభుని
లలిత పాలనమందు రాణించు ప్రజలు
చేదోడు వాదోడుగాఁ దగునీతి
నాదరింపగ గాఁలు నాంధ్ర రాజ్యమున
నాల్గు దిక్కుల పశూనాంపతి నిర్పి
తెల్గు జాతిని తీర్చి దిద్దుచు బ్రోవ
సమకూరె న్యాయ రాజ్యాంగ సౌష్ఠవము
విమలాంధ్రపతి మహావిష్ణు రాజ్యమున
సూర్య చంద్రులగతుల్ సొంపారు దాక
ఆర్య సంసద్గతు లలరారు దాక
యొనగూడు గాత మాంధ్రోజ్జ్వల చరిత
తనరారు గాత మాంధ్ర ప్రతాపమ్ము
రాజిల్లు విమలాంధ్ర రమణీయ యశము
పూజింపఁ బడుగాత పుడమిలో సతము.

పరిపూర్ణతను సాధించడమే జీవిధర్మం కావాలి.

—**మహాత్మా గాంధి.**

చిన్న మొత్తాల పొదుపు ఉద్యమం


హైద్రాబాదులో సెక్రటేరియట్ కమిటీ రూమ్‌లో 1959 డిసెంబరు 12 న జరిగిన జాతీయ పొదుపు రాష్ట్ర సలహా సంఘం సమావేశంలో, చిన్న మొత్తాల పొదుపు ఉద్యమంలో చేసిన అమూల్యమైన కృషికి గాను ఇద్దరు అనధికారులకు కేంద్ర ఆర్థిక మంత్రి సంతకం గల ప్రశంసా పత్రాలు బహూకరించబడినవి. వాటిని రాష్ట్ర ముఖ్యమంత్రి యిచ్చారు. ఈ ప్రశంసాపత్రాల గ్రహీతలు వీరు:- అనంతపురం శ్రీ సాయిబాబా నేషనల్ హయ్యర్ సెకండరీ స్కూలు కరస్పాండెంటు శ్రీ ఎస్. ఆదినారాయణరావు. నెల్లూరు వ్యాపారస్థుడు శ్రీ ఎ.వి. దశరథరామరెడ్డి,

ఈ ఆర్థిక సంవత్సరంలో ఇంత వరకు జాతీయ పొదుపు కృషిలో జరిగిన అభివృద్ధి సమీక్షించబడింది. ఉద్యమాన్ని తీవ్రతరం చేయటానికి సంబంధించిన వివిధ సూచనలను పరిశీలించి నిర్ణయాలు తీసుకొనడం కూడా జరిగింది.

1959-60 లో ఇంతవరకు సాధించిన అభివృద్ధి ముఖ్యాంశాలు దిగువ ఇవ్వబడినవి.

జిల్లా లక్ష్యాలు: సాధించిన ఫలితాలు

జాతీయ పొదుపు రాష్ట్ర సలహా సంఘం 20-6-1959 సమావేశమైనప్పుడు 1959-60 లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సేకరణకై రూ. 9 కోట్లను లక్ష్యంగా నిర్ణయించింది. ఈ



ప్రశంసా పత్రాన్ని అందుకుంటూవున్న శ్రీ ఆదినారాయణరావు

లక్ష్యం జిల్లాలన్నిటికీ పంపిణీ చేయబడింది. దానిని మళ్లీ జిల్లాలోని వివిధ శాఖలకు కేటాయించమని కలక్టర్లు కోర బడ్డారు.

నిజామాబాదు జిల్లా కలక్టరు 28-11-59 నాటికి లక్ష్యాన్ని సాధించటమే కాక దానికి పైన రూ. 2 లక్షలను సేకరించ గలిగారు. 10-12-59 తేదీ గల ఆయన నివేదిక ప్రకారం, రూ. 24,89,940—110.3 శాతం-లను సాధించగలిగారు.

ప్రచారం

కరపత్రాలు, ఫోల్డర్లు, పోస్టర్లు, ప్రదర్శనలు పొదుపు పక్షాలు వగైరా మామూలు ప్రచార సాధనాలకు తోడు యీ సంవత్సరం దిగువ కొత్త అంశాలు కూడా ప్రవేశ పెట్టబడుతున్నవి.

గవర్నరు, ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళికల మంత్రుల సందేశాలను గ్రామఫోను రికార్డులుగా తీయటానికి చర్య గైకొనబడుతున్నది.

జాతీయ పొదుపుపై తెలుగు, ఉర్దూలలో రెండు పాటలు, రెండు భాషలలలోను సంభాషణలు టేపు రికార్డు చేయబడినవి. అవి కలకత్తా గ్రామఫోను కంపెనీచే గ్రామ ఫోను రికార్డులుగా చేయబడుతున్నాయి. ఇవి ప్రచారం నిమిత్తం వినియోగింపబడగలవు.

తెలుగు పాట రచించిన ప్రసిద్ధ తెలుగు కవి శ్రీ డి.వి. కృష్ణశాస్త్రి జాతీయ పొదుపుకి తమ సహాయంగా దీని రీ ప్రొడక్షన్ హక్కులను యిచ్చివేశారు. ఉర్దూ పాట కూడా అలాగే యిచ్చివేయబడింది. అది ప్రసిద్ధ రచయిత శ్రీ ఖుర్షీద్ అహమ్మద్ జామీచే రచించ బడింది. ఆలిండియా రేడియోకి చెందిన శ్రీ టి. గోపీచంద్ వ్రాసిన తెలుగు సంభాషణలు కూడా అంతే.

చలన చిత్రాలు

భారత ప్రభుత్వ చలనచిత్ర విభాగం ఎనిమిది 35 ఎం.ఎం. చలన చిత్రాలను సరఫరా చేసింది. వీటిని స్థానిక థియేటర్లలో వంతుల ప్రకారం ప్రదర్శింప జేయటానికి గాను 8 మంది జిల్లా కలెక్టర్లకు పంపించడ మైనది. ఇవి గాక నలభై అయిదు 16 ఎం. ఎం. సైజు చలనచిత్రాలు (40 తెలుగువి 5 ఇంగ్లీషువి) భారత ప్రభుత్వ చలన చిత్ర విభాగం నుంచి కొనబడినవి. ఇవి ప్రదర్శనార్థం జిల్లా కలెక్టర్లకు పంపించబడుతున్నవి.

రోడ్డు రవాణా కార్పొరేషన్‌కు చెందిన బస్సుల మీద జాతీయ పొదుపు ఉద్యమ ప్రచారంపై అనువైన నినాదాలను వ్రాయించడానికి చర్యలు తీసుకోబడుతున్నవి.

సహాయార్థక ప్రదర్శనలు

చిన్న మొత్తాల పొదుపుకి అధికంగా పెట్టుబళ్ళను సేకరించడానికి 1958-59 వ సం. లో జరుపబడిన సహాయార్థక ప్రదర్శనలు విజయవంతమైన ఫలితాల నిచ్చినవి. ఈ ప్రదర్శనలు, జాతీయ పొదుపు ఉద్యమం పట్ల ప్రజా దృష్టిని ఆకర్షింప జేయడంలో తోడ్పడ టమే గాకుండా విరివిగా పెట్టుబళ్లు వసూలు కావడానికి కూడా ఉపయోగ పడ్డాయి. ఇటువంటి ప్రదర్శనల వల్ల రూ. 65.5 లక్షల మొత్తం వసూలైంది. ఇది 1958-59 వ సం. లో 13 జిల్లాలలో జరిగిన మొత్తం వసూళ్ళలో 35.2 శాతం ఉంటుంది. ఈ సంవత్సరంలో కూడా ఇటువంటి ప్రదర్శనలను ఏర్పాటు చేయడానికి కొందరు కలెక్టర్లు ఉద్దే శిస్తున్నారు.

గ్రామాలలో ప్రచారం

గ్రామీణ ప్రాంతాలలో చిన్న మొత్తాల పొదుపుకై అధికంగా పెట్టుబళ్ళను రాబట్టడానికీ, వివిధ గ్రామాలలో పెట్టుబడి దార్ల నుంచి డబ్బు వసూలు చేసి అప్పటి కప్పుడే వారికి సర్టిఫికేట్లను ఇవ్వడానికి వీలుగా గ్రామ ప్రాంతాలలో పొదుపు ఉద్యమ ప్రచారానికి ఒక ప్రత్యేక పథకం యీ సంవత్సరానికై రూపొందింపబడింది. దీని ప్రకారం డిప్యూటీ తహశీల్దారు హోదాకు తక్కువ కాని ఒక రెవెన్యూ శాఖాధికారి, ఒక పోస్టల్ క్లర్కు, జాతీయ పొదుపు సంస్థకు చెందిన ఒక సభ్యుడు (సాధ్యమైతే) తో కలిసి నిర్ణీత కార్యక్రమాన్ననుసరించి కొన్ని గ్రామాలకు మోటారు కారులో వెడతారు.

వీరు ఆయా గ్రామాలకు వెళ్ళడానికి కొన్ని రోజుల పూర్వమే యీ ఉద్యమాన్ని గురించి స్థానిక ఉద్యోగులు, పంచాయతీ సభ్యులు, బ్లాకు ప్రణాళికలు, అభివృద్ధి సంఘం సభ్యులు, మరియు పాఠశాలల ఉపాధ్యాయుల సహకారంతో ఆ గ్రామాలలో విరివిగా ప్రచారం చేస్తారు. రెవెన్యూ అధి కారి జాతీయ పొదుపుకి డిపాజిట్లు చేయదలచిన వారి వద్ద నుంచి సొమ్ము తీసుకొని అప్పటి కప్పుడు వారికి సర్టిఫికేట్లు ఇవ్వడానికై ఏర్పాట్లు చేస్తాడు. చాలా మంది కలెక్టర్లు పోస్టల్ అధికారులతో సంప్రదించి తమ తమ కార్యక్రమా లను అప్పుడే రూపొందించుకున్నారు.

1959 ఏప్రిల్ నెల ఆడిట్ చేయబడిన అంకెలను బట్టి

చూస్తే యీ రంగంలో దక్షిణ రాష్ట్రాలన్నింటిలో మన రాష్ట్రం మంచి ఫలితాలను సాధించినట్లు తెలుస్తుంది. మన రాష్ట్రంలో నికరంగా రూ. 13.92 లక్షల మొత్తం వసూలు చేయబడింది.

జాతీయ పొదుపు పథకం క్రింద 28-11-1959 తో ముగిసే వారానికి జరిగిన వసూళ్లు (*గుర్తుగల ఏడు జిల్లాల విషయంలో 7-12-1959 వరకు జరిగిన వసూళ్ళ వివరాలు ఇవ్వడమైనది.)

జిల్లా పేరు	నిర్ణీత లక్ష్యం రూ. లక్షలలో	గడచిన వారాంతం వరకు జరిగిన వసూళ్లు	ఈ వారంలో జరిగిన వసూళ్లు	ఈ వారాంతం వరకు జరిగిన వసూళ్లు	లక్ష్యమునకు గాను సేకరింపబడిన శాతం	క్రిందటి సంవత్సరం ఇదే కాలం లో జరిగిన వసూళ్ళ శాతం
1	2	3	4	5	6	7
* నిజామాబాదు	22.5	21,07,190	3,82,750	24,89,940	110.3	39.20
ఆదిలాబాదు	10.0	8,99,873	8,119	9,07,992	90.7	43.0
ఖమ్మం	15.0	12,83,229	62,445	13,45,674	89.7	42.11
* కరీంనగరం	22.5	13,61,749	4,640	13,66,389	60.7	62.80
వరంగల్	25.0	13,02,480	22,870	13,25,350	53.01	45.69
విశాఖపట్నం	60.0	23,74,470	54,775	24,29,245	40.49	30.91
మెదక్	10.0	3,78,238	.. 262	3,78,500	37.82	43.25
మహబూబ్‌నగరం	20.0	6,13,156	71,725	6,84,881	34.4	45.31
* హైద్రాబాదు	100.0	31,67,175	2,88,330	34,35,505	34.35	35.80
నల్గొండ	25.0	6,46,585	9,680	6,56,265	26.5	22.45
తూర్పు గోదావరి	80.0	19,10,545	31,225	19,41,770	24.27	23.3
* గుంటూరు	100.0	18,66,578	44,480	19,11,058	19.11	19.5
అనంతపురం	30.0	5,33,800	23,785	5,57,585	18.58	21.16
పశ్చిమ గోదావరి	75.0	13,51,050	42,340	13,93,390	18.57	9.92
నెల్లూరు	60.0	8,73,135	19,399	8,92,534	14.88	27.39
శ్రీకాకుళం	40.0	5,70,755	6,585	5,77,340	14.43	43.25
* చిత్తూరు	30.0	3,84,539	36,096	4,20,535	14.0	21.7
* కృష్ణా	100.0	12,24,420	1,08,280	13,32,700	13.33	19.32
* కడప	30.0	3,41,189	32,680	3,73,320	12.44	37.35
కర్నూలు	45.0	3,74,466	15,231	3,89,697	8.7	15.12
మొత్తం	900.0	2,35,64,622	12,35,068	2,48,09,690	27.56	25.48

ముఖ్య వార్తలు

21-11-1959

భారత ప్రభుత్వ దేశీయ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు చెందిన బహుళార్థ సాధక గిరిజన ప్రాజెక్టుల పరిశీలనా సంఘం అధ్యక్షుడు డా. వెరియర్ ఎల్విన్ విశాఖపట్నం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాలలో పర్యటించిన తరువాత ఒక సందర్భంలో ముచ్చటిస్తూ తాము దర్శించిన 15 ప్రాజెక్టులలోను పాడేరు బహుళార్థ సాధక ప్రాజెక్టు ఉత్తమంగా వుందని ప్రశంసించారు.

22-11-1959

చైనా సరిహద్దు దాడుల దృష్ట్యా చైనా భారతదేశంలో భారీ పరిశ్రమలకు బలీయమైన పునాదులు వేయవలసిన అగత్యం ఎంతైనా వుందని ప్రధాన మంత్రి శ్రీ నెహ్రూ దేశస్థులను హెచ్చరించారు.

23-11-1959

పటాస్కర్ తీర్పుకు ఆమోదం తెలుపుతూ ప్రవేశపెట్టబడ్డ ఆంధ్రప్రదేశ్-మద్రాసు (సరిహద్దుల మార్పు) బిల్లును లోక్‌సభవారు ఆమోదించారు.

కొత్తగూడెంలో ఎరువుల ఫ్యాక్టరీ స్థాపనకు ప్లానింగ్ కమీషన్‌వారు ఆమోదం తెలిపారని ఒక పత్రికా వార్త తెలియజేసింది.

24-11-1959

రాష్ట్ర వ్యవసాయ మంత్రి పత్రికా విలేఖరులతో ముచ్చటిస్తూ రాష్ట్ర అవసరాల నిమిత్తమై ప్రభుత్వం లక్ష టన్నుల బియ్యం సేకరించడానికి నిశ్చయించిందని తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కొన్ని కొన్ని ప్రాంతాలలో కాఫీ పంట పండించడానికి వీలుందని కాఫీ బోర్డు అధ్యక్షుడు రాష్ట్ర ప్రభుత్వానికి సూచన చేసినట్లు లోక్‌సభలో యూనియన్ ప్రభుత్వ వాణిజ్య మంత్రి తెలియ జేసారు.

25-11-1959

రాష్ట్ర స్వల్ప పరిశ్రమల మంత్రి పంజాబు రాష్ట్రంలో పర్యటించి తిరిగి వచ్చిన తరువాత పత్రికా ప్రతినిధులతో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పనివారలకు చేతి పరిశ్రమల శిక్షణ సౌకర్యాలు కలిగించే విషయాన్ని శ్రద్ధగా పరిశీలిస్తామని పంజాబు రాష్ట్ర ప్రభుత్వం వాగ్దానం చేసిందని తెలియజేశారు.

26-11-1959

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఢిల్లీ నుంచి తిరిగి వచ్చిన తరువాత ఒక సందర్భంలో ముచ్చటిస్తూ రెండవ పంచవర్ష ప్రణాళిక చివరి సంవత్సరంలో ప్రణాళిక పథకాలను అమలు జరపడానికై రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి రూ 25 కోట్లకు పైగా ధన సహాయాన్ని కోరిందని తెలిపారు. వచ్చే సంవత్సరానికి ప్రణాళికకై నిర్ణయింపబడ్డ మొత్తం ఖర్చు రూ. 41 కోట్ల 4 లక్షలు.

27-11-1959

ఇండియా రిజర్వు బ్యాంకు డిప్యూటీ గవర్నరు శ్రీ బి. వెంకటప్పయ్య కాలికట్‌లో మలబారు కేంద్ర సహకారబ్యాంకు డైరెక్టర్ల, కో ఆపరేటర్ల సమావేశంలో ప్రసంగిస్తూ ఆంధ్రలో గ్రామీణ ఋణ విధానం సంతృప్తికరంగా అమలు జరుగుతూ వుందని అన్నారు.

28-11-1959

కనీస వేతనముల రాష్ట్ర సలహా సంఘంవారు వ్యవసాయం, తోళ్ళ పరిశ్రమలు, పిండి మిల్లులు, రోలర్‌ఫ్లోర్ మిల్లులు, తివాచీలు, ఉన్ని పరిశ్రమల విషయంలో కనీస వేతనాల కమిటీలు అందజేసిన నివేదికలను ఖాయపరిచారు.

29-11-1959

రాష్ట్ర పబ్లిక్ వర్క్సు మంత్రి ఆదిలాబాదులో ప్రసంగిస్తూ సోమేశ్వరం ప్రాజెక్టు సోమగుండం జలపాతం వద్ద నిర్మింపబడుతుందని తెలియజేసారు. ఈ ప్రాజెక్టుకు రూ. 180 లక్షలు ఖర్చు అవుతాయని అంచనా. దీనికి రెండు ఆనకట్టలుంటాయి. ఒకటి కడెం ఆనకట్ట. రెండవది గుండి వాగు ఆనకట్ట. ఈ ప్రాజెక్టు తృతీయ పంచవర్ష ప్రణాళికా కాలంలో పూర్తి అవుతుంది. దీనివల్ల 6500 ఎకరాలకు సాగు నీరు లభించడమే గాక 3380 కిలోవాట్ల విద్యుచ్ఛక్తి కూడా ఉత్పత్తి అవుతుంది.

30-11-1959

వేతన నిర్ణాయక సంఘంవారి నివేదికపై యూనియన్ ప్రభుత్వ నిర్ణయం ప్రకటింప బడింది. దీని వల్ల కేంద్ర ప్రభుత్వోద్యోగుల వేతనాలలోనూ, అలవెన్సులలోనూ జరిగే హెచ్చింపుల మూలకంగా సాలుకు అదనంగా రూ 16కోట్లు ఖర్చు కాగలవని అంచనా.

1-12-1959

ఆంధ్రప్రదేశ్ పంచాయతీ సమితులు, జిల్లా పరుషత్తుల చట్టము ననుసరించి రాష్ట్రంలో ఇరవై జిల్లా పరిషత్తులు ఏర్పడ్డాయి.

2-12-1959

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి పత్రికా విలేఖరులతో ముచ్చటిస్తూ ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా కార్పొరేషన్‌వారు పశ్చిమ గోదావరి జిల్లాలో 7 పథకాల క్రింద 1960 ఏప్రిల్ నుంచి బస్సు రూట్లను స్వాధీనపరచుకొన నిశ్చయించారని తెలియ జేసారు.

రాష్ట్ర ముఖ్య మంత్రి అనంతపురంలో ప్రసంగిస్తూ శ్రీశైలం ప్రాజెక్టును మూడవ పంచవర్ష ప్రణాళికలో చేర్చడానికి ప్లానింగ్ కమీషన్‌వారు అంగీకరించారనీ, ప్రాజెక్టుకు అవసరమైన రోడ్లు మొదలైనవి వేయడానికి గాను ఈ సంవత్సరానికి రూ. 15 లక్షలు మంజూరు చేశారనీ తెలియ జేశారు.

3-12-1959

ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డి అఖిల భారత కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఎన్నికైనట్లు ప్రకటింపబడింది.

1960-61 సంవత్సరంలో ప్రస్తుత సంవత్సరం కంటె పెద్ద మొత్తపు అభివృద్ధి ఋణాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రజల నుంచి తీసుకోవచ్చని రాష్ట్ర ఆర్థిక ప్రణాళికల మంత్రి సూచనగా చెప్పారు. ప్రస్తుత సంవత్సరం ప్రభుత్వం రూ. 6 కోట్ల ఋణం కోసం ప్రకటన చెయ్యగా మొదటి రోజే అంతకంటె ఎక్కువ డబ్బు వచ్చింది.

4-12-1959

రాష్ట్ర రెవెన్యూ మంత్రి వరంగలులో ప్రసంగిస్తూ ఆంధ్రప్రదేశ్‌లో వచ్చే సంవత్సరం భూసంస్కరణలు ప్రవేశ పెట్టబడగలవని అన్నారు.

సోవియట్ రష్యా ప్రభుత్వ అధ్యక్షుడు మిస్టర్ క్లెమెంటీ వారోషిలోవ్ జనవరి నెలలో ఢిల్లీ విచ్చేసి ఇక్కడి రిపబ్లిక్ దినోత్సవాలలో పాల్గొనగలరని ప్రకటింపబడింది.

5-12-1959

రాష్ట్ర ముఖ్యమంత్రి పత్రికా విలేఖరుల గోష్ఠిలో మాట్లాడుతూ గోదావరిపై పోచంపాడు ప్రాజెక్టు నిర్మాణం పని రెండవ పంచవర్ష ప్రణాళిక చివరి సంవత్సరంలో ఆరంభమయ్యే అవకాశాలు కలవని అన్నారు.

6-12-1959

సింగరేణి కాలరీస్ జనరల్ మేనేజరు శ్రీ యస్. కె. నర్గుండ్‌కర్ కొత్తగూడెమునకు 25 మైళ్ళ దూరంలో పద్రంపూరు దగ్గర ఒక కొత్త బొగ్గుగని త్రవ్వకానికి ప్రారంభోత్సవం జరిపారు.

7-12-1959

1958 సంవత్సరపు ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కమతాల గరిష్ఠ పరిమితి బిల్లుపై జాయింట్ సెలక్టు కమిటీ వారు నివేదిక దాఖలు చేయడానికి ఇవ్వబడ్డ గడువును 1960 మార్చి 31 దాకా పొడిగించడానికి ఆంధ్రప్రదేశ్ శాసనసభ అనుమతించింది.

8-12-1959

విశాఖపట్నంలో "ఫ్లోటింగ్ డాక్" ఏర్పాటు చేసే విషయం ప్రభుత్వ పరిశీలనలో వుందని యూనియన్ ప్రభుత్వ రవాణా శాఖ స్టేట్ మంత్రి శ్రీ రాజ్ బహదూర్ వెల్లడించారు.

9–12–1959

అమెరికా అధ్యక్షుడు ఐసెన్‌హోవర్‌కు క్రొత్త ఢిల్లీలో అపూర్వమైన స్వాగతమివ్వబడింది.

10–12–1959

ప్రభుత్వోద్యోగులలో అవినీతి, లంచగొండితనాన్ని నిర్మూలించడానికై రాజ్యాంగాన్ని సవరించే విషయాన్ని భారత ప్రభుత్వం పరిశీలిస్తూ వుందని రాష్ట్ర ముఖ్యమంత్రి శాసనసభలో తెలియజేశారు.

11–12–1959

భారత అధ్యక్షులు డా. రాజేంద్ర ప్రసాద్ క్రొత్త ఢిల్లీలో ప్రపంచ వ్యవసాయ ప్రదర్శనానికి ప్రారంభోత్సవం జరిపారు.

ఆంధ్ర ప్రదేశ్ శాసన సభ వారు పబ్లికు గ్రంథాలయాల బిల్లుకు తమ ఆమోదం తెలిపారు. దీనివల్ల రాష్ట్రంలోని పబ్లికు గ్రంథాలయాల నిర్వహణకై ప్రత్యేకంగా ఒక డైరెక్టొరేట్ ఏర్పడుతుంది.

12–12–1959

హైదరాబాదులోని ఫతేమైదాన్‌లో క్రీడారంగాన్ని నిర్మించే ప్రతిపాదనను ప్రభుత్వం పరిశీలిస్తూ వుందని రాష్ట్ర విద్యా మంత్రి శాసనసభలో తెలియజేశారు.

13–12–1959

క్రొత్తగా ఎన్నికైన జిల్లా పరిషత్తుల అధ్యక్ష ఉపాధ్యక్షుల సమావేశాన్ని ఏర్పాటుచేసి అందులో ప్రజాశ్రేయస్సుకై పరిషత్తుల కార్యకలాపాలను సమన్వయం చేసే విధానాన్ని వివరించవలెనని ప్రభుత్వం తలపెట్టినట్లుగా రాష్ట్ర ఆర్థిక ప్రణాళికల శాఖ మంత్రి తెలియజేశారు.

14–12–1959

రాష్ట్ర ఆర్థిక, ప్రణాళికల శాఖ మంత్రి ప్రవేశపెట్టిన ఆంధ్ర ప్రదేశ్ గ్రామ పంచాయతీల బిల్లును రాష్ట్ర శాసన సభ చర్చకు తీసుకుంది. మద్రాసు హైద్రాబాదు చట్టాలను విలీనం చేస్తూ ఈ బిల్లు సిద్ధం చేయబడింది.

15–12–1959

ఉపాధ్యాయులు మినహా ఇతర స్థానిక సంస్థల సిబ్బంది వేతనాల విషయమై పే కమిటీ వారు దాఖలుచేసిన రెండవ భాగం నివేదికపై రాష్ట్ర ఆర్థిక మంత్రి శాసనసభలో ఒక ప్రకటన చేశారు.

16–12–1959

రాష్ట్ర ముఖ్యమంత్రి భద్రాచలం వద్ద గోదావరిపై వంతెన నిర్మాణానికి శంఖుస్థాపన చేశారు. ఈ వంతెన రూ. 57 లక్షల ఖర్చుతో 1962 సంవత్సరాంతానికి పూర్తికాగలదు.

17–12–1959

ఆంధ్ర దేశ ప్రముఖ నాయకులలో ఒకరు అఖిల భారత కాంగ్రెసు మాజీ అధ్యక్షులు, మధ్యప్రదేశ్ మాజీ గవర్నరు అయిన డాక్టర్ భోగరాజు పట్టాభి సీతారామయ్య గారు హైదాబాదులో కాలధర్మం చెందారు.

18–12–1959

రాష్ట్ర పబ్లికు వర్క్సు మంత్రి శాసనసభలో ఒక సభ్యుని ప్రశ్నకు సమాధానం చెబుతూ నాగార్జున సాగర్ ప్రాజెక్టును ప్రథమ పంచవర్ష ప్రణాళిక కాలంలో ఖర్చుపెట్టిన రూ. 1 కోటి 7 లక్షలు గాక రెండవ ప్రణాళికలో రూ. 32 కోట్ల 30 లక్షలు కేటాయింపబడ్డవని తెలియజేశారు.

19–12–1959

రాష్ట్ర వ్యవసాయ మంత్రి శాసన మండలిలో ఒక ప్రశ్నకు సమాధానం చెబుతూ విజయవాడ పాల సరఫరా పథకం సాధ్యమైనంత త్వరలో అమలు జరుపబడగలదని తెలియజేశారు. విజయవాడలో నెలకొల్పదలచిన పాల సరఫరా—పౌడర్ ఫ్యాక్టరీకి అవసరమైన యంత్ర సామగ్రిని యునిసెఫ్ సంస్థ వారు ఉచితంగా ఇస్తామన్నారని కూడా మంత్రి తెలియజేశారు.

20–12–1959


యూనియన్ ప్రభుత్వ ఉక్కు గనులు, ఇంధనముల శాఖా మంత్రి సర్దార్ స్వరణ్ సింగ్ బొంబాయిలో మాట్లాడుతూ ఉక్కు సప్లయి విషయంలో భారతదేశం 1961 వరకల్లా స్వయం సమృద్ధం కాగలదని తెలియజేశారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం

వైశాల్యం	1,060,41 చదరపు మైళ్ళు
జనసంఖ్య	3,12,60,133
పురుషులు	1,576,42,912
స్త్రీలు	1,55,17,221
సగటు వర్షపాతం	35 65 "
ఆంధ్ర ప్రాంతం	34.6 అంగుళాలు
తెలంగాణా	36.7 ..
అరణ్య ప్రదేశం	1,40,26,000 ఎకరాలు
జిల్లాలు	20
తాలూకాలు	183
రెవిన్యూ సర్కిళ్లు	1,000
పట్టణాలు	293
గ్రామాలు	26,450
పంటలక్రింది ప్రదేశం	2 93,81,000 ఎకరాలు
కౌళ్ళ సంఖ్య	42,42,655
1958-59 లో నీటి పారుదలను పొందిన ప్రదేశం	68 లక్షల ఎకరాలు
1958-59 లో ఉత్పత్తి అయిన ఆహారధాన్యాలు	61.56 లక్షల టన్నులు
పాల ఉత్పత్తి	15.5 లక్షల గాలన్లు
రైలు మార్గాలు	2,902 మైళ్ళు
జాతీయ రహదార్లు	1,409 ..
రాష్ట్రీ రహదార్లు	2,072 ..
జిల్లా పెద్ద రోడ్లు	2,527 ..
జిల్లా ఇతర రోడ్లు	3,458 ..
పాఠశాలలు	28,000
కళాశాలలు	64
వృత్తి విద్యా కళాశాలలు	31
ద్వితీయ పంచ వర్ష ప్రణాళిక ప్రమాణం	రూ. 175.37 కోట్లు

1959–60 బడ్జెటు:

ఆదాయం	రూ. 71.29 కోట్లు
వ్యయం	71.66 ..
పెట్టుబడి ఖర్చు	28.30 ..



తిరుమలై కొండవద్ద పాపనాశనం జలపాతానికి వెళ్ళే రోడ్డు. నవంబరు 30 వ తేదీన ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి ఈ రోడ్డుకు ప్రారంభోత్సవం చేశారు.